

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 37

శనివారం 29-4-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

**జీవితానికి పరీక్షలు అందరికీ ఉంటాయి.
బతుకు పరీక్షాపత్రం అందరికీ ఒకలా ఉండదు.
ప్రతి ఒక్కరికీ ఒక్కో పత్రాన్ని నిర్దేశిస్తుంది
ఎవరి పరీక్ష వారిదే...
ఎవరి ఉత్తీర్ణత వారిదే.
ఆ పరీక్షలో పోశవ్వకి
నూటికి నూరు మార్కులు.
తన ఉత్తీర్ణతే కాదు...
తనలాంటి వారి ఉత్తీర్ణత కోసం...
ఆమె నిర్విరామంగా సాగిస్తున్న
దివ్యమైన సేవ ఇది.**

దివ్య సంకల్పం


పోశవ్వ

‘ఒకటే జననం... ఒకటే మరణం. ఒకటే గమనం... ఒకటే గమ్యం’ చింతల పోశవ్వ కోసం ఫోన్ చేస్తే ఆమె రింగ్‌టోన్ ఆమె జీవితలక్ష్యం ఎంత ఉన్నతంగా ఉందో చెబుతుంది. తెలంగాణ, కామారెడ్డి జిల్లా కేంద్రంలో నివసించే పోశవ్వ ఓ ధీర. జీవితం విసిరిన చాలెంజ్‌ని స్వీకరించింది. ‘అష్టావక్రుడు ఎనిమిది అవకరాలతో ఉండి కూడా ఏ మాత్రం ఆత్మస్థయిర్యం కోల్పోలేదు. పైగా రాజ్యాన్ని ఏలే చక్రవర్తికి గురువయ్యాడు. నాకున్నది ఒక్క వైకల్యమే. నేనెందుకు అనుకున్నది సాధించలేను’ అనుకుంది. ఇప్పుడామె తన కాళ్ల మీద తాను నిలబడడమే కాక, తనలాంటి వాళ్లకు ఉపాధికల్పిస్తోంది. పోరాటం చేస్తున్న వాళ్లకు ఆసరా అవుతోంది. తన జీవితాన్ని సమాజహితానికి అంకితం చేయాలనే సంకల్పంతో పని చేస్తున్న పోశవ్వ సాక్షితో తన జీవనగమనాన్ని పంచుకున్నది.

నాన్న వైద్యం... నానమ్మ మొక్కు!

“విధి నిర్ణయాన్ని మార్చలేమనుకుంటాను. ఎందుకంటే మా నాన్న ఆర్‌ఎంపీ డాక్టర్ అయి ఉండీ నేను పోలియో బారిన పడ్డాను. ఆ తర్వాత నాన్న ఆయుర్వేద వైద్యం నేర్చుకుని నాకు వైద్యం చేశారు. నానమ్మ నన్ను గ్రామ దేవత పోచమ్మ ఒడిలో పెట్టి ‘నీ పేరే పెట్టుకుంటా, బిడ్డను బాగు చేయ’మని మొక్కింది. మెడ కింద అచేతనంగా ఉండిపోయిన నాకు ఒక కాలు మినహా మిగిలిన దేహమంతా బాగయిపోయింది. కష్టంగానైనా నాకు నేనుగా నడవగలుగుతున్నాను. నాకు జీవితంలో ఒకరి మీద ఆధారపడే పరిస్థితి రాకూడదని ఎం.ఎ., బీఈడీ చదివించారు. చదువు పూర్తయిన తర్వాత మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ స్కీమ్‌లో అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం ఎక్కువ కాలం చేయలేదు. ఫీల్డు మీదకు వెళ్లాల్సిన ఉద్యోగం అది. నేను పనిని పరిశీలించడానికి పని జరిగే ప్రదేశానికి వెళ్లి తీరాలి. నేను వెళ్లడానికి సిద్ధమైనప్పటికీ కొన్ని చోట్లకు మామూలు మనుషులు వెళ్లడం కూడా కష్టమే. ఇతర అధికారులు, ఉద్యోగులు ‘మీరు రాకపోయినా ఫర్వాలేదు’ అంటారు. అయినా ఏదో అసంతృప్తి. ఉద్యోగాన్ని అలా చేయడం నాకు నచ్చలేదు. నెలకు ముప్పై వేల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేశాను. హైదరాబాద్‌లోని ఎన్‌ఐఆర్‌డీలో సర్ఫ్, ఫినాయిల్, ఫ్లోర్ క్లీనర్, సబీనా తయారీలో శిక్షణ, చిన్న ఇండస్ట్రీతో బతుకు పుస్తకంలో కొత్త పాఠం మొదలైంది.

కోవిడ్‌తో కొత్త మలుపు

నేను మార్కెట్‌లో నిలదొక్కుకునే లోపే కోవిడ్ వచ్చింది. మా ఉత్పత్తులు అలాగే ఉండిపోయాయి. దాంతోపాటు వాటి ఉత్పత్తి సమయంలో ఎదురైన సమస్యలు కూడా నన్ను పునరాలోచనలో పడేశాయి. క్లీనింగ్ మెటీరియల్ తయారీలో నీటి వృథా ఎక్కువ, అలాగే అవి జారుడు గుణం కలిగి ఉంటాయి కాబట్టి పని చేసేటప్పుడు దివ్యాంగులకు ప్రమాదాలు పొంచి ఉన్నట్లే. అందుకే నీటితో పని లేకుండా తయారు చేసే ఉత్పత్తుల వైపు కొత్త మలుపు తీసుకున్నాను. అవే ఎకో ఫ్రెండ్లీ రాఖీలు. ఆ ప్రయత్నం నేను ఊహించనంతగా విజయవంతం అయింది. ఆ తర్వాత గోమయ గణపతి నుంచి ఇప్పుడు పదకొండు రకాల ఉత్పత్తులను చేస్తున్నాం. అందరూ దివ్యాంగులే. ఇక మీదట ఒంటరి మహిళలకు కూడా అవకాశం కల్పించాలనుకుంటున్నాను.

కన్యాదాతనయ్యాను!

మా జిల్లాలో ఎవరికి వీల్ చైర్ కావాలన్నా, ట్రై సైకిల్, వినికిడి సాధనాలు, పెన్షన్ అందకపోవడం వంటి సమస్యల గురించి నాకే ఫోన్ చేస్తారు. ఎన్‌జీవోలు, డీఆర్‌డీఏ అధికారులను సంప్రదించి ఆ పనులు జరిగేటట్లు చూస్తున్నాను. దివ్యాంగులకు, మామూలు వాళ్లకు కలిపి మొత్తం పన్నెండు జంటలకు పెళ్లిళ్లు చేశాను. వాళ్లలో ఇద్దరికి మాత్రం అమ్మాయి తరఫున పెళ్లి పెద్ద బాధ్యత వహించాల్సి వచ్చింది. నాకు అమ్మాయిల్లేరు, ముగ్గురబ్బాయిలు. ఈ రకంగా అవకాశం వచ్చిందని సంతోషించాను.

సంకల్పం గొప్పది!

నేను నా ట్రస్ట్ ద్వారా సమాజానికి అందించిన సహాయం ఎంతో గొప్ప అని చెప్పను. ఎంతో మంది ఇంకా విస్తృతంగా చేస్తున్నారు. కానీ నాకు ఉన్నంతలో నేను చేయగలుగుతున్నాను. నా లక్ష్యం గొప్పదని మాత్రం ధీమాగా చెప్పగలను. ఆదాయం కోసం పర్యావరణానికి హాని కలిగించడానికి వెనుకాడని ఈ రోజుల్లో, పర్యావరణ హితమైన మార్గంలో ఉపాధిని వెతుక్కుంటున్న మా ప్రయత్నాన్ని ఎన్నో సంస్థలతోపాటు ప్రభుత్వం కూడా గుర్తించింది. నాకు గత ఏడాది మహిళాదినోత్సవం సందర్భంగా సత్కరించింది. నా కుటుంబ పోషణకు నా భర్త ఉద్యోగం ఉంది. నా దివ్యహస్తం ట్రస్ట్ ద్వారా చేస్తున్న సర్వీస్ అంతా పర్యావరణ పరిరక్షణ, సమాజహితం, దివ్యాంగుల ప్రయోజనం కోసమే’’ అన్నారు. ‘ఉన్నది ఒకటే జననం... అంటూ... గెలుపు పొందే వరకు... అలుపు లేదు మనకు. బ్రతుకు అంటే గెలుపు... గెలుపు కొరకే బతుకు’ అనేదే ఆమె తొలిమాట... మలిమాట కూడా.

– వాకా మంజులారెడ్డి

ఆదాయం కోసం పర్యావరణానికి హాని కలిగించడానికి వెనుకాడని ఈ రోజుల్లో, పర్యావరణ హితమైన మార్గంలో ఉపాధిని వెతుక్కుంటున్న మా ప్రయత్నాన్ని ఎన్నో సంస్థలతోపాటు ప్రభుత్వం కూడా గుర్తించింది.



డ్యాన్సింగ్ మామ్స్

ముహూర్తాలు చూసి సిజేరియన్లు చేయించుకుంటున్న ఈ రోజుల్లో డ్యాన్సింగ్ థెరపీ ద్వారా నార్మల్ డెలివరీలను ప్రోత్సహిస్తున్నారు హైదరాబాద్‌లో ఉంటున్న గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్పిరెడ్డి. మారిన జీవనశైలి కారణంగా పెరుగుతున్న సిజేరియన్ రేషియో తగ్గించడానికి ఏడేళ్లుగా ఈ డాక్టర్ చేస్తున్న కృషి ఎంతో మంది కాబోయే తల్లులకు వరదాయినిగా మారింది. ఈ విషయాల గురించి డాక్టర్ మరింతగా ఇలా వివరించారు.



‘ఈ మధ్య కాలంలో గర్భిణులు చేసే పనుల్లో ఫోర్స్ స్ట్రెంతెనింగ్, పెల్విక్ ఫ్లోర్ ఎక్సర్‌సైజులు బాగా తగ్గిపోయాయి. గతంలో నీళ్లు చేదడం, ముగ్గులు పెట్టడం, ఇండియన్ టాయిలెట్లు వాడటం, కూర్చొని బట్టలు ఉతకడం, దంచడం, రుబ్బడం, వంటలు చేయడం.. ఇలాంటి పనులన్నీ డెలివరీ అయ్యే దారిని అనువుగా మార్చేవి. ఇప్పుడు ఈ పనులన్నీ తగ్గిపోయాయి. ఫలితంగా డెలివరీ అయ్యే దారి ఇరుకుగా మారి ప్రసవం కష్టమైపోయింది. గర్భవతి అని తెలిసిన రోజు నుంచి ఆహారం బాగా తీసుకోవాలనే విధానం పెరిగింది. కూర్చొని వర్క్ చేసుకునే గ్యాడ్జెట్స్ పెరిగిపోయాయి. శారీరక శ్రమ తగ్గి, క్యాలరీలు పెరగడంతో లోపల బేబీ కూడా పెరుగుతుంది. ఇక ప్రసవ సమయానికి నొప్పి లేకుండా డెలివరీ అవ్వాలనుకుంటారు. ఎందుకంటే, ప్రసవం నొప్పి అనేసరికి ఒక విధమైన స్ట్రెస్ ఉంటుంది. దీని నుంచి బయటకు రాలేక ‘ఎందుకు రిస్క్...’ సిజేరియన్ అయితేనే బెటర్ అనుకుంటారు. సాధారణంగా వ్యాయామాలు, ఆహార నియమాలు గురించి చెబుతాం కానీ, ప్రసవ సమయానికి నొప్పి భయంతో కూడిన స్ట్రెస్ ఎక్కువ పెట్టేసుకుంటారు. ఈ వలయం నుంచి బయటకు తీసుకురావాలంటే ముందు నుంచీ భయం పోగొడుతూ వారి మనసును ఆహ్లాదంగా ఉంచాలి. అందుకే మంచి పాటలతో చిన్న చిన్న డ్యాన్సింగ్ మూమెంట్స్ చేయిస్తుంటాం. గర్భవతిగా ఉన్నన్ని రోజులూ దీనికి సంబంధించిన ప్రత్యేకమైన వ్యాయామాలు, జుంబా క్లాసులు కూడా ఉంటాయి. సహజ ప్రసవానికి అనుకూలంగా మార్చే ప్రక్రియ ఇది.

సిజేరియన్ల రేషియో పెరగడంతో నార్మల్ డెలివరీల వైపు ప్రభుత్వాలు కూడా మొగ్గు చూపుతున్నాయి. అందరిలోనూ సహజ ప్రసవాల విషయంలో ఆలోచనలు పెరిగాయి. దీంతో దీని వెనక ఉన్న కారణాలనూ కూడా అవగాహనలోకి తీసుకొని చేసిన ప్రోగ్రామ్ ఇది. ఈ ప్లానింగ్ అమల్లోకి రావాలంటే మంచి టీమ్, నిపుణులు అందుబాటులో ఉండాలి. ఎవరికి వారు సొంతంగా చేయలేరు. అలా చేస్తే, ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. నాలో పుట్టిన ప్లానింగ్ కాబట్టి ఎక్కడైనా సమస్య వస్తే దానిని ఎలా పరిష్కరించాలో కూడా నాకు తెలుసు. ఇక్కడ మా కడల్ హాస్పిటల్‌లో పెద్ద యోగా హాల్, ఫిజియోథెరపిస్టులు, ఎమర్జెన్సీ టీమ్, గైనకాలజిస్టులు .. ఈ సెటప్‌ను మాకు అనుగుణంగా మార్చుకున్నాం. దీనిని కాపీ చేయడం కూడా సులువు కాదు. నాలాగా చేయాలంటే సేమ్ సెటప్‌ను ఫాలో అవ్వాలి. ఈ ప్లానింగ్‌గా అమలు చేస్తే నాలుగైదేళ్లకు సక్సెస్ రావచ్చు. కోవిడ్ తర్వాత జనాల్లో చాలా మార్పు వచ్చింది. ముందు నుంచీ ప్లానింగ్ విషయంలో శ్రద్ధ పెరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి, గ్రామీణ స్థాయి నుంచి కూడా మా సేవలు పొందడానికి వస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా కావల్సిన సేవలు అందిస్తున్నాం’ అని వివరించారు ఈ డాక్టర్.

– నిర్మలారెడ్డి


గర్భవతితో డ్యాన్స్ చేయిస్తూ..

రోజువారీ పనులు

అధిక ఆహారం తీసుకోకుండా, ఆర్గానిక్ ఫుడ్, మిల్లెట్ ఫుడ్ ఏ విధంగా తీసుకోవాలి, బామ్మల కాలం నాటి బలవర్ధకమైన ఆహారం తయారీ, చేయాల్సిన రోజువారీ పనులు.. ఇలాంటివన్నీ కలిపి ఒక ప్రోగ్రామ్ చేశాం. ఈ ప్లాన్‌ను పూర్తిగా ఫాలో అయితే ప్రసవానికి వచ్చినప్పుడు భయమనేది లేకుండా గర్భిణిలో ఒక నిశ్చింత కలుగుతుంది.

ఏడేళ్లుగా చేస్తున్న కృషి

క్రమం తప్పకుండా ఏడేళ్లుగా చేయడంతో మంచి స్పందన వస్తోంది. గతంలో నోటి మాట ద్వారా వచ్చిన వారే ఎక్కువ. సోషల్‌మీడియా ద్వారా రెండేళ్లుగా చాలా మందిలోకి వెళ్లింది. మనకు వచ్చిన ఆలోచనను సరిగ్గా అమల్లో పెట్టినప్పుడు ‘ఎవరో నవ్వుతారు. ఏదో అంటారు’ అని దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదు. అప్పుడే సరైన ఫలితాలు పొందుతాం. ఈ ప్లానింగ్ విషయంలో జరిగినది అదే. గర్భవతి అని తెలిసినప్పుడు ఆమె ఎప్పుడు డెలివరీకి వస్తుందో తెలిసిపోతుంది. అయితే, కొంతమంది మాత్రం మంచి ముహూర్తం అని చెప్పిన టైమ్‌కి సిజేరియన్ చేయమని అడుగుతుంటారు. ఇది సరైనది కాదని, నార్మల్ డెలివరీయే మేలైనదని చెబుతాం. సమాజంలో ఒక చిన్నమార్పు రావడానికి చేస్తున్న కృషి ఇది.

బ్యూటిప్స్

పెసర ప్యాక్‌లు



- పొడి చర్మంతో బాధపడుతుంటే... రెండు టీ స్పూన్‌ల పెసర పప్పును రాత్రి నానబెట్టి ఉదయం గ్రైండ్ చేసి ముఖానికి, మెడకు పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వేసవిలో వారానికి మూడుసార్లు ఈ ప్యాక్ వేస్తుంటే చర్మం తేమగా నిగారించడంతోపాటు ఎండ వేడి నుంచి రక్షణ కలుగుతుంది.
- టేబుల్ స్పూన్ పొట్టుతో కూడిన పెసలను రాత్రంతా నానబెట్టి ఉదయం గ్రైండ్ చేసి అందులో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ బాదం నూనె కలిపి ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు పట్టించాలి. బాగా ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఈ ప్యాక్‌ను రోజు మార్చి రోజు వేస్తుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. క్రమంగా తెల్లదనం సంతరించుకుంటుంది.
- ఎండలో ఎక్కువ సమయం గడిపినప్పుడు చర్మం నల్లగా పోతుంది. ఆ ట్యాన్ వదలాలంటే... పావు కప్పు పెసలు లేదా పెసర పప్పును రాత్రంతా నానబెట్టి ఉదయం గ్రైండ్ చేయాలి. అందులో రెండు టేబుల్ స్పూన్‌ల పెరుగు కలిపి ముఖం, మెడ, చేతులతోపాటు ఎండకు కమిలిన చోట్ల రాయాలి. ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇలా రోజూ చేస్తుంటే కమిలిన చర్మం తిరిగి సొంత రంగును సంతరించుకుంటుంది.



● రూట్స్

సేవే శక్తి!



**ఉత్సాహం నుంచి శక్తి జనిస్తుంది.
మరి ఆ ఉత్సాహం ఎలా వస్తుంది?
ఎవరి మాట ఎలా ఉన్నా...
విట, జలజ్ దాని దంపతులకు మాత్రం ఆ ఉత్సాహం స్వచ్ఛంద సేవాకార్యక్రమాల ద్వారా వస్తుంది.
పారిశ్రామికవేత్తల కుటుంబానికి చెందిన ఈ దంపతులు తన ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
‘ఒక మంచి పని చేసి చూడండి. అందులో నుంచి వచ్చే శక్తి ఏమిటో మీకే తెలుస్తుంది’ అంటున్నారు...**

ముందుకు వెళ్లడం మంచిదేగానీ వెనక్కి తిరిగి చూసుకోవడం కూడా మంచిదే. విటల్, జలజ్ దాని దంపతులు అదే చేశారు. వారి తాత స్వస్థలం గుజరాత్‌లోని చారిత్రక పట్టణం కపడ్ వంజ్. ఆయన రకరకాల సేవాకార్యక్రమాల్లో పాల్గొనేవాడు.

ఒకసారి ఆయన సేవాకార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ఆ స్ఫూర్తితో ఎనభై సంవత్సరాల నుంచి కొనసాగుతున్న ‘కపడ్‌వంజ్ కెలవాని మండల్’ (కెకెఎం) అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేయడం మొదలుపెట్టారు. ఈ సంస్థ పరిధిలో పదమూడు విద్యాసంస్థలు ఉన్నాయి.

‘కెకెఎం’తో కలిసి పనిచేయడం విట, జలజ్ దంపతులలో కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది.

కొన్ని సంవత్సరాల తరువాత...

తమ సేవాకార్యక్రమాలను విస్తృతం చేయడం కోసం ‘దాని ఫౌండేషన్’ పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ‘కెకెఎం’తో పాటు అన్నమిత్ర ట్రస్ట్, ఈఎల్‌ఎంఎస్ స్పోర్ట్స్ ఫౌండేషన్... మొదలైన సంస్థలతో కలిసి పనిచేస్తుంది.

‘అన్నమిత్ర’తో కలిసి దేశంలోని 6,500 పాఠశాలలో పిల్లల కోసం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు.

‘బాలకార్మిక వ్యవస్థ పోవాలంటే ముందు పిల్లలకు కడుపు నిండా తిండి దొరకాలి. ఆ భోజనమే వారిని విద్యకు దగ్గర చేస్తుంది. అభివృద్ధిపథంలోకి నడిపిస్తుంది’ అంటుంది విట.

‘ప్రథమ్’ అనే స్వచ్ఛందసంస్థతో కలిసి అట్టడుగు వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే కార్యక్రమాలలో పాలుపంచుకుంటుంది దాని ఫౌండేషన్.

సేవా కార్యక్రమాలే కాకుండా తమ కుమారుడు, ప్రొఫెషనల్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ ముదిత్ కోరిక మేరకు ఆటలపై కూడా దృష్టి సారించారు. ఈఎల్‌ఎంఎస్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌తో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి క్రీడా నైపుణ్యాలు మెరుగుపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ఆటలకు ప్రాచుర్యాన్ని తీసుకువస్తున్నారు. పాఠశాలలో క్రీడాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రొఫెషనల్ లెవెల్లో పిల్లలను క్రీడల్లో తీర్చిదిద్దడానికి హై-పెర్‌ఫార్మెన్స్ ప్లాన్స్, హై-పెర్‌ఫార్మెన్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్స్‌కు రూపకల్పన చేశారు.

గతంతో పోల్చితే విద్యార్థులు ఆటలపై ఎక్కువ ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ఇదొక శుభపరిణామంగా చెప్పుకోవాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇలా అంటుంది విట...

‘ఆటలో ఉత్సాహం ఉంటుంది. వినోదం ఉంటుంది. గెలుపు కోసం చేసే పథక రచన ఉంటుంది. లైఫ్ స్కిల్స్‌ను పిల్లలు ఆటల్లో నుంచే నేర్చుకోవడం మొదలు పెడతారు. మన దేశంలో కోట్ల జనాభా ఉంది. ఇలాంటి దేశంలో మనం ఛాంపియన్‌లను తయారు చేయలేమా!’


‘క్రీడలపై వారి అనురక్తి, అంకితభావాన్ని దగ్గరి నుంచే చూసే అవకాశం వచ్చింది. క్రీడారంగంపై వారు చేపడుతున్న కార్యక్రమాల ప్రభావం తప్పకుండా ఉంటుంది’ అంటున్నాడు ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత అభినవ్ బింద్రా.

గతకాలం మాట ఎలా ఉన్నా విట ప్రస్తుతం తమ ఫౌండేషన్‌కు సంబంధించిన కార్యక్రమాల్లో ఎక్కువ సమయం గడుపుతుంది.

‘అడ్‌వర్బ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్’ చైర్మన్ జలజ్ కంపెనీ పనుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తమ ఫౌండేషన్‌కు సంబంధించిన కార్యక్రమాలకు తగిన సమయం కేటాయిస్తుంటాడు.

విట దృష్టిలో స్వచ్ఛంద సేవ అంటే చెక్ మీద సంతకం చేయడం కాదు.

యాంత్రికంగా చేసే పని కాదు. మనసుతో చేసే మంచిపని. ప్రజలతో కలిసి పోయి చేసే ఉత్తేజకరమైన పని.



‘ఆటలో ఉత్సాహం ఉంటుంది. వినోదం ఉంటుంది. గెలుపు కోసం చేసే పథక రచన ఉంటుంది. లైఫ్ స్కిల్స్‌ను పిల్లలు ఆటల్లో నుంచే నేర్చుకోవడం మొదలు పెడతారు.

– విట,
దాని ఫౌండేషన్

ఇంటర్నేషనల్ జాజ్ డే: ఏప్రిల్ 30

జాజ్ జాజిమల్లి

**జాజ్ జాజిమల్లికి కొత్త అందాన్ని తీసుకువస్తోంది ముంబైకి చెందిన ఆల్–ఉమెన్ జాజ్ టీమ్.
పాశ్చాత్య కళకు దేశీయత జత చేసి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది.
జాజ్ డ్యాన్స్‌లో అద్భుతమైన ప్రతిభ చూపుతోంది.**

ముంబైలోని ఆల్–ఉమెన్ జాజ్ టీమ్‌లో శ్వేతన్ కన్వర్, రాధిక మాయాదేవ్, రోషిణి నాయర్, వేదిక అగర్వాల్, దీక్ష, రియా సూద్ అనే డ్యాన్సర్‌లు ఉన్నారు.

‘స్టీరియోటైప్‌ను బ్రేక్ చేయడానికి జాజ్ టీమ్ ప్రారంభించాం’ అంటుంది ఫౌండర్ శ్వేతన్ కన్వర్.

డెహ్రాడూన్‌కు చెందిన శ్వేతన్ ఫ్యాషన్ మార్కెటింగ్ స్టూడెంట్.

ఒకప్పుడు హాబీగా మాత్రమే ఉన్న జాజ్ డ్యాన్స్ ఇప్పుడు తన కెరీర్‌గా మారుతుందని ఆమె ఊహించలేదు.

‘జాజ్ డ్యాన్స్ అనేది అందరూ అనుకునేంత సులువైన విద్య కాదు. ఎంతో సాధన చేస్తే తప్ప ఆ విద్య మన సొంతం కాదు’ అంటుంది శ్వేతన్.

రాధిక మాయదేవ్ పదహారు సంవత్సరాల వయసు నుంచే జాజ్ డ్యాన్స్ చేయడం ప్రారంభించింది. అయితే తన అభిరుచినే కెరీర్‌గా ఎంచుకోవాలనుకున్నప్పుడు మాత్రం ముందు తల్లిదండ్రులు అడ్డుచెప్పినప్పటికీ కూతురు ఉత్సాహాన్ని గమనించి ఆ తరువాత వారు ఆమోదించారు.

కూతురికి లభించిన గుర్తింపుకు సంతోషిస్తున్నారు.

కామర్స్ స్టూడెంట్ అయిన రోహిణి నాయర్ మొదట భరతనాట్యం చేసేది. ఆ తరువాత జాజ్ డ్యాన్స్‌లోకి వచ్చింది. ఇది వారి తల్లిదండ్రులకు నచ్చలేదు. అయితే వారిని తన మాటలతో మెప్పించింది.

‘మా అమ్మాయి జాజ్ డ్యాన్సర్’ అని గర్వంగా చెప్పుకునేలా చేసింది రోహిణి.

‘ప్రయోగాలతోనే ఏ కళ అయినా వృద్ధి చెందుతుంది. కళ ఎప్పుడూ నిలవనీరులా ఉండకూడదు’ అంటున్న వేదిక అగర్వాల్ జాజ్‌కు దేశీయ సొగసును జత చేయడానికి పలు రకాలుగా ఆలోచిస్తుంది.

సాధారణంగా జాజ్ డ్యాన్స్ అనగానే శాక్స్‌ఫోన్ శబ్దాలు, ఇంగ్లీష్ పాటల లిరిక్స్ వినిపిస్తాయి.

‘అలా మాత్రమే ఎందుకు!’ అంటూ ఈ టీమ్ జాజ్ డ్యాన్స్‌కు కొత్త లుక్ తీసుకువచ్చింది.

ప్రసిద్ధ బాలివుడ్ పాటలతో జాజ్ డ్యాన్స్ చేయడం ప్రారంభిచారు.

‘మొదట ఆశ్చర్యంగా చూస్తారు. ఆ తరువాత ఆనందిస్తారు. ఆ తరువాత ఆమోదిస్తారు’ అనే మాట ఈ టీమ్ విషయంలో నిజమైంది.

‘జాజ్ డ్యాన్స్‌లో బాలీవుడ్ పాటలు ఏమిటి!’ అని ఆశ్చర్య పోయినవారే వారి ప్రదర్శన చూసిన తరువాత ‘ఆహా! అద్భుతం’ అని మెచ్చుకున్నారు.

‘హిందీ సినిమా పాటలకే కాదు సౌత్ ఇండియన్ మ్యూజిక్‌కు కూడా జాజ్ డ్యాన్స్ జత చేయనున్నాం’ అంటుంది రోహిణి నాయర్.

‘మీరు చూస్తే లావుగా కనిపిస్తారు. ఇంత చక్కగా ఎలా డ్యాన్స్ చేయగలుగుతున్నారు!’ అని చాలామంది రాధిక మాయదేవ్‌ను అడుగుతుంటారు.

ఆమె ఆ సందేహానికి చెప్పే సమాధానం...

‘ప్రతి బాడీకి తనదైన ప్రత్యేకత ఉంటుంది. రిథమ్ ఉంటుంది. ప్రతి బాడీకి డ్యాన్స్ చేసే సామర్థ్యం ఉంటుంది. అందుకు అవసరమైనది సాధన మాత్రమే’

జాజ్ డ్యాన్స్‌లో కంటెంపరరీ, ఫంక్, స్ట్రీట్ స్టైల్, లిరికల్ అండ్ కమర్షియల్...అంటూ రకరకాల స్టైల్స్ ఉన్నాయి. వీటన్నిటిలోనూ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తూ అభినందనలు అందుకుంటోంది ఆల్–ఉమెన్ జాజ్ టీమ్.


ఆల్ ఉమన్ జాజ్ టీమ్ సభ్యులు

కిచెన్‌టిప్స్



- బిర్యానీ, ఫ్రై డ్లైస్, పుదీనా రైస్ వంటివి రుచి, వాసనతో కొత్తదనం కావాలంటే బియ్యాన్ని ముందుగా వేయించాలి.
- గారెల పిండి నూనెలో వేయగానే విడిపోతుంటే పిండిలో ఒక టేబుల్ స్పూను నెయ్యి కలపాలి.
- పులుసు పలచనయితే బియ్యపిండి లేదా సెనగ పిండిని కాస్త నీటిలో కలిపి అందులో పోసి ఉడక పెట్టుకోవాలి.
- కూరగాయలు తరిగేటప్పుడు చేతులు తెగితే వెంటనే గాయానికి పసుపు అద్దితే త్వరగా మానటమే కాక సెప్టిక్ అవదు.
- ఫ్రెష్ బ్రెడ్ మెత్తగా ఉండి ముక్కలుగా కోయటం కష్టమైనప్పుడు చాకును మంట దగ్గరిగా పెట్టి వేడి చేసి వాడితే పని తొందరగా అవుతుంది.






'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 37

శనివారం 29-4-2023



లక్నో పరుగుల సునామీ

పంజాబ్ కింగ్స్ జట్టుపై 56 పరుగుల తేడాతో ఘనవిజయం. - 16లో



అయిదో రోజూ లాభాలే

రెండు నెలల గరిష్టానికి సూచీలు 61 వేలపైకి సెన్సెక్స్. - 17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సోనియా గాంధీ విషకన్య

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ సోనియాను విషకన్యగా, చైనా, పాక్‌ల ఏజెంట్‌గా అభివర్ణించారు.

- వివరాలు 6లో



సాంకేతిక ప్రజాస్వామ్యం దిశగా

సాంకేతిక ప్రజాస్వామీకరణ కోసం పనిచేస్తున్నామని 91 ఎఫ్‌ఎం ట్రాన్స్‌మిటర్ల ప్రారంభోత్సవంలో ప్రధాని పేర్కొన్నారు.


- వివరాలు 6లో



ఉగ్రవాదాన్ని పెకిలిద్దాం

ఉగ్రవాద నిర్మూలనలో షాంఘై కో–అపరేషన్ ఆర్గనైజేషన్ సభ్యదేశాలు కలసి పనిచేయాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు.

- వివరాలు 6లో



ఊరేగింపుగా ఎందుకు తీసుకెళ్లారు?

గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతని సోదరుడు పోలీసుల కళ్లెదుటే హత్యకు గురైన ఘటనపై సుప్రీంకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

టెక్స్‌టైల్ పార్కుల పనుల్లో వేగం పెంచండి



గుండ్ల పోచంపల్లి అప్పారెల్ పార్క్, గద్వాల్ హ్యాండ్లూమ్ పార్కుల్లో పెండింగ్ పనులుంటే వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు.

- వివరాలు 8లో

జూనియర్ పీఆర్ కార్యదర్శుల సమ్మె



రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా తమ సర్వీసు క్రమబద్ధీకరణ వెంటనే చేయాలన్న డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ సెక్రటరీలు సమ్మెకు దిగారు.

- వివరాలు 15లో

విశాఖలో రూ. 21,844 కోట్లతో అదానీ డేటా సెంటర్



ఏపీలోని విశాఖపట్నం మధురవాడ సమీపంలో డేటా సెంటర్, ఐటీ పార్కుల అభివృద్ధికి అదానీ గ్రూపు రూ. 21,844 కోట్ల భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది.

- వివరాలు 12లో

అవినాశ్ పిటిషన్ జూన్ 5కు వాయిదా




వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ ఎంపీ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో వేసిన పిటిషన్ జూన్ 5కు వాయిదా పడింది.

- వివరాలు 12లో

ఖజానా కళ పెంచండి

ఏ ఒక్క అవకాశాన్నీ వదిలిపెట్టొద్దు

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు సజావుగా జరగాలి
- ఈ మేరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి
- అధికార యంత్రాంగానికి రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం సూచన
- భూముల అమ్మకాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టండి
- నోటరీ స్థలాలు, నిర్మాణాల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టండి
- 58, 59 జీవోల సంబంధిత దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్న మంత్రులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను నింపేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్నీ వదిలిపెట్టొద్దని, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం సూచించింది. భూముల అమ్మకాలతో పాటు నోటరీల క్రమబద్ధీకరణ, పన్నుల ఆదాయం పెంపు తదితర మార్గాల ద్వారా ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని ఆదేశించింది. ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సమావేశమైంది. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్, ఆర్థిక, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై ఆ శాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వివిధ శాఖల రాబడులు, బకాయిలకు సంబంధించిన వివరాలను మంత్రులకు వివరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నిధుల సమీకరణకు సంబంధించిన పలు అంశాలపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించి పలు సూచనలు చేసినట్టు తెలిసింది.

పన్ను ఆదాయం మరింత పెంచండి

రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన భూముల అమ్మకాల ప్రక్రియను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించింది. మూడు ప్రధాన పారిశ్రామిక వాడల అమ్మకాలతో పాటు హైదరాబాద్ పరిసరాల్లో ఉన్న విలువైన ప్రభుత్వ భూములను అటు ప్రజా ప్రయోజనార్థం వినియోగించుకోవడంతో పాటు ఖజానా కు ఊతమిచ్చే విధంగా ఎలా వినియోగించుకోవాలన్న దానిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పనిచేయాలని మంత్రివర్గం సూచించింది. అదేవిధంగా నోటరీల ద్వారా క్రయ విక్రయ లావాదేవీలు జరిగిన

మిగతా 2వ పేజీలో ▶

పేదలకు ఇళ్ల స్థలాలపై సీసీఎల్‌కు ఆదేశాలు

పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ ప్రక్రియపై కూడా ఉపసంఘం చర్చించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఏయే జిల్లాల్లో ఎన్ని పట్టాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయో గుర్తించి జాబితాను సిద్ధం చేయాలని సీసీఎల్ఏను ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు అందేలా చూడాలని, జిల్లాల కలెక్టర్లు రోజువారీగా సమీక్షలు నిర్వహించి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేసింది. దరఖాస్తు చేసుకున్న పేదలకు హక్కులు కల్పించి వారి జీవితాల్లో ఆనందం నింపాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని, ఆ దిశగా అధికారులు కృషి చేసి అర్హులైన వారికి ప్రభుత్వం అందించే ప్రయోజనాన్ని కలిగించాలని సూచించింది.

మే 10 తర్వాత బిహార్‌లో విపక్షాల కీలక సమావేశం

కేసీఆర్‌తో నితీశ్ భేటీ!



ప్రతిపక్షాలను కూడగట్టే పనిలో నిమగ్నమైన బిహార్ ముఖ్యమంత్రి

'బీజేపీ ముక్త్ భారత్' లక్ష్యంగా వివిధ పార్టీలకు ఆహ్వానం



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రంలో అధికార భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, ఉమ్మడి కార్యాచరణను సిద్ధం చేయడానికి బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ శరవేగంగా పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా ఆయన త్వరలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'బీజేపీ ముక్త్ భారత్'కోసం కలిసికట్టుగా ఉద్యమించడమే లక్ష్యంగా నితీశ్ ఇప్పటికే వివిధ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. తన ప్రణాళికను వారికి వివరించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే విపక్ష నేతల సమావేశాన్ని బిహార్‌లో నిర్వహించేందుకు నితీశ్ సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే నెల 10వ తేదీ తర్వాత జరిగే ఈ భేటీకి కాంగ్రెస్ అగ్రనేతలతోపాటు ప్రాంతీయ పార్టీల నాయకులను ఆహ్వానించారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌ను సైతం ఆహ్వానించబోతున్నట్లు సమాచారం.

బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా

నితీశ్‌కుమార్ తన సొంత రాష్ట్రం బిహార్‌లో బీజేపీతో బంధాన్ని తెంచుకొని, ఆర్జేడీతో పొత్తు పెట్టుకున్నారు. మహాఘట్‌బంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ విధానాలపై నిరసన గళం వినిపిస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించుతామని ఇప్పటికే ప్రతిజ్ఞ చేశారు. మోదీ సర్కారు విధానాలకు వ్యతిరేకంగా ఉమ్మడిగా పోరాడేలా వివిధ రాజకీయ

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ అండగా నిలుస్తుందని..

బీజేపీపై పోరులో బీఆర్‌ఎస్‌ని కలుపుకొని వెళ్తామని జేడీ(యూ) నేతలు సంకేతాలిచ్చారు. విపక్షాలను కూడగట్టే క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, తమిళనాడు సీఎం స్టాలిన్, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌లను సంప్రదించే అవకాశం ఉందని జేడీ(యూ) అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. వచ్చే నెలలో విపక్షాల భేటీని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అంతకంటే ముందే ఢిల్లీలో కేసీఆర్‌తో నితీశ్ భేటీ ఉండొచ్చని తెలుస్తోంది. అదానీ వివాదం, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, రాహుల్‌పై అనర్హత వేటు వంటి అంశాలపై పార్లమెంట్‌లో విపక్షాల నిరసనల్లో బీఆర్‌ఎస్ కూడా పాల్గొందని ఆర్జేడీ నేత ఒకరు గుర్తుచేశారు. ఇకపై బీజేపీపై జరిగే పోరాటంలో బీఆర్‌ఎస్ సైతం విపక్షాలతో కలిసి నడుస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. నితీశ్ ఏర్పాటు చేసే భేటీకి బీఆర్‌ఎస్ హాజరవుతుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

శుక్రవారం రాత్రి నల్లగొండలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన సభకు హాజరైన ప్రజలు. (ఇన్‌సెట్)లో కోమటిరెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్‌లతో కలసి రేవంత్ సంఘీభావం



వాళ్ల ఉద్యోగాలు ఊడితేనే | మనకు ఉద్యోగాలు

అందుకు నల్లగొండ బిడ్డలు నడుం బిగించాలి

- నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న అసమర్థ ప్రభుత్వాన్ని బండకేసి కొట్టాలి
- నిరుద్యోగ నిరసన సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2 లక్షల ఉద్యోగాల భర్తీ

15లో

నేనూ పాదయాత్ర చేస్తా

అధిష్టానం అనుమతి కోరిన జగ్గారెడ్డి

- వివరాలు 15లో

తెలంగాణ యూనివర్సిటీ వీసీ

అక్రమాలపై విచారణ

వర్సిటీ బ్యాంకు ఖాతా వివరాలను తీసుకున్న కమిటీ సభ్యులు

తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి.రవీందర్ పాల్పడిన అక్రమ చెల్లింపులు, నిధుల దుర్వినియోగం వంటి అంశాలపై ఐదుగురు సభ్యుల కమిటీ విచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగా శుక్రవారం కమిటీ సభ్యులు గంగాధర్‌గౌడ్, వసుంధరదేవి, ప్రవీణ్‌కుమార్ వర్సిటీని సందర్శించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని కలిసి 2021 నవంబర్ నుంచి 2023 ఏప్రిల్ 18 వరకు వర్సిటీ బ్యాంక్ అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఆ మధ్యకాలంలో జరిపిన చెల్లింపులపై విచారణ జరపనున్నారు. వర్సిటీకి విచారణ కమిటీ రాక సందర్భంగా విద్యార్థులు 'థాంక్యూ సాక్షి'అంటూ క్యాంపస్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 'తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చిన 'సాక్షి'పత్రికకు ధన్యవాదములు'అంటూ ఫ్లెక్సీలో పేర్కొన్నారు. ఫ్లెక్సీల ఏర్పాటు సోషల్ మీడియాలో వైరలైంది. వర్సిటీలో కూడా ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నెల 19న


మిగతా 5వ పేజీలో ▶

● 'థాంక్యూ సాక్షి'



యూనివర్సిటీలో అవినీతి, అక్రమాలపై 'సాక్షి' ప్రచురించిన వరుస కథనాలను 'థాంక్యూ సాక్షి' పేరిట ఫ్లెక్సీగా ముద్రించి క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థులు

ఇదండీ సంగతి



ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్‌ఐఆర్'



భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు స్పందించారు. సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్ఐఆర్' నమోదు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చారు. బ్రిజ్ భూషణ్‌పై కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మైనర్ రెజ్లర్ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుంటూ 'పోక్సో యాక్ట్' ప్రకారం ఒక ఎఫ్ఐఆర్... ఇతర రెజ్లర్లు చేసిన ఫిర్యాదులపై మరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. - 16లో

మూడొంతులు గల్లంతు!

కబ్జాలో 57,423.91 ఎకరాల వక్ఫ్ భూములు

- అడ్డూఅదుపూ లేకుండా మింగేస్తున్న భూబకాసురులు
- రెవెన్యూ భూముల పేరిట సర్కారు ధారాదత్తం
- ముందుగా లీజులు.. ఆ తర్వాత భూములపై హక్కులు
- ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో అత్యధిక శాతం ఆక్రమణలు

ఐదేళ్లుగా రికార్డుల గదికి తాళం .. కోర్టుల్లో వీగుతున్న కేసులు

ఆక్రమణదారులకు నోటీసులతో సరి..ముందుకు కదలని టాస్క్‌ఫోర్స్

■ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగర కుర్దులో సయ్యద్ శారాజ్ ఖత్తాల్ హుస్సేన్ దర్గాకు సుమారు 500 ఎకరాల భూమి ఉంది. చాలావరకు భూమి సాగులో ఉంది. 2008లో వక్ఫ్‌బోర్డు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో కొందరు రైతులు కోర్టును ఆశ్రయించి స్టే పొందారు. ఇలావుండగా సర్వే నంబర్ 82/అ/1/1లోని ఆరు ఎకరాలకు సంబంధించి ఒక రైతు పేరిట 2018లో పట్టాదారు పాస్‌బుక్ జారీ అయింది. తర్వాత తప్పిదాన్ని గుర్తించిన రెవెన్యూ అధికారులు 2021లో పాస్‌బుక్‌ను రద్దు చేశారు. అయితే అప్పటికే సదరు రైతు నుంచి భూమిని కొనుగోలు చేసిన రియల్టర్లు రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించగా నిషేధిత జాబితా కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. మరోవైపు హెచ్ఎండీఏ అధికారులు అవగాహన రాహిత్యంతో భూమికి లే అవుట్ పర్మిషన్(ఎల్పీ) నంబర్ జారీ చేయడంతో, ఫైనల్ లే అవుట్ అప్రూవల్ కోసం సదరు రియల్టర్లు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వక్ఫ్ భూములు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికే వేలాది ఎకరాలు కబ్జాలో ఉన్నాయి. వక్ఫ్‌బోర్డు సిబ్బందే స్థిరాస్తి వ్యాపారులతో కుమ్మక్కై రికార్డులు తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు ఉండగా, ప్రభుత్వం కూడా వీటిని రెవెన్యూ భూములుగా పేర్కొంటూ అడ్డగోలుగా ధారాదత్తం చేస్తోందనే విమర్శలున్నాయి. మరోవైపు లీజులకు ఇచ్చిన భూములు సైతం క్రమంగా చేజారిపోతున్నాయి. నిజాం కాలం నుంచి వక్ఫ్ ఆస్తుల రికార్డులు ఉర్దూ, పార్శీ భాషల్లో ఉండగా, భద్రపరచాల్సిన వారే చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. రిటైర్డైన

మిగతా 15వ పేజీలో ▶

జూన్ 5లోగా స్టేటస్ రిపోర్టు

సమర్పించండి



- టీఎస్‌పీఎస్సీ కేసులో సిట్‌కు హైకోర్టు ఆదేశం
- విచారణ సంతృప్తికరం.. అయితే నెమ్మదిగా సాగుతోందన్న న్యాయస్థానం
- తదుపరి విచారణ జూన్ 5కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ సంతృప్తికరంగానే ఉన్నా.. నత్తనడకన సాగుతోందని హైకోర్టు అభిప్రాయపడింది. నెలన్నర గడిచినా నిందితుల వాంగ్మూలం నమోదు చేయడం తప్ప.. ఎలాంటి ఫలితాన్ని రాబట్టలేదని పేర్కొంది. ప్రస్తుతానికి ఈ కేసులో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. దర్యాప్తు పూర్తి చేయడానికి ఇంకా ఎంత సమయం కావాలని సిట్‌ను ప్రశ్నించింది. జూన్ 5 లోగా స్టేటస్ రిపోర్టు అందజేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది. పేపర్ లీకేజీ కేసును సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేయలేదని, సీబీఐతో

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

4 నుంచి ఢిల్లీలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని గోల్‌మార్కెట్ సమీపంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మే 4 నుంచి 12 వరకు వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. కరోనా కేసులు పెరుగుతున్నందున కోవిడ్ నిబంధనలు పాటిస్తూ బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు టీటీడీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్థానిక సలహా మండలి సభ్యులు చంద్రశేఖర్, మదన్‌మోహన్, జయకుమార్ సహా ఇతర సభ్యులతో కలిసి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మీడియాతో మాట్లాడారు. మే 3న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, మే 8న కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 3 నుంచి 8 మధ్య జమ్మూలో టీటీడీ నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రారంభోత్సవం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తున్నామని తెలిపారు.


సీతమ్మ సాగర్‌కు ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సిందే

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ చెన్నై బెంచ్ ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులను ప్రత్యేకంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ చెన్నై బెంచ్ సూచించింది. అప్పటి వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టరాదని ఆదేశించింది. ఒకవేళ ప్రాజెక్టును హడావిడిగా నిర్మించాలనుకుంటే మాత్రం వివిధ శాఖల అనుమతులు, క్లియరెన్స్ సర్టిఫికెట్లు పొందిన తర్వాతే ప్రారంభించాలని జస్టిస్ పుష్ప సత్యనారాయణ, ఎక్స్‌పర్ట్ మెంబర్ డా.కొర్లపాటి సత్యగోపాల్ ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగమని, దీనికి పర్యావరణ అనుమతులు ఇప్పటికే ఉన్నాయని ప్రభుత్వం తరుపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాగా, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ప్రత్యేకంగా అవసరమని ఎన్జీటీ తేల్చిచెప్పింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు అవకాశమిస్తూ కేసును మే 23కు వాయిదా వేసింది.

కాళేశ్వరం ముంపుపై హైకోర్టును ఆశ్రయించండి

ప్రొఫెసర్ కోదండరాం పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ముంపు అంశంపై హైకోర్టును ఆశ్రయించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు సుప్రీంకోర్టు సూచించింది. గోదావరి నదికి ఏటా వచ్చే వరదలతో కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టుల పరిధిలో వాటిల్లిన నష్టంపై కోదండరాం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం విచారించింది. శుక్రవారం పిటిషన్‌ను కొట్టేసింది. గతేడాది వరదలతో కాళేశ్వరం ప్రాజెక్టు పంపుహౌస్‌లు మునిగిపోవడం, మోటార్లు దెబ్బతినడంతో పాటు కాళేశ్వరం, పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందని కోదండరాం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై ఆయన తరపు న్యాయవాది శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. గోదావరి నది వరదలతో ప్రతి యేటా నష్టం వాటిల్లుతోందని న్యాయవాది శ్రవణ్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే చాలా కాలం తర్వాత సుప్రీంకోర్టుకు రావడం సరికాదని.. హైకోర్టును ఆశ్రయించాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచించారు. గతేడాది వరదలపైనే తాము పిటిషన్ వేశామని న్యాయవాది తెలపగా, జూలైలో వరదలు వస్తే ఇంతకాలం ఎందుకు పట్టిందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని వ్యాఖ్యానించిన జస్టిస్... సంబంధిత హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు అవకాశం ఇస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు.

సూడాన్ నుంచి ఢిల్లీకి చేరిన తెలంగాణ వాసులు

సాక్షి, న్యూఢిల్లీ: 'ఆపరేషన్ కావేరి'లో భాగంగా సూడాన్‌లో చిక్కుకుపోయిన 17 మంది తెలంగాణవాసులు సురక్షితంగా ఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం ఢిల్లీలోని పాలం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్న వారిని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ వ్యక్తిగతంగా కలిశారు. వారిని ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వ్యవసాయ ఎమర్జెన్సీని ప్రకటించండి

ఏఐసీసీ కిసాన్ సెల్ నేత ఎం.కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ అత్యవసర పరిస్థితిని ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి డిమాండ్ చేశారు. గత 50 ఏళ్లలో రాష్ట్రంలో ఏరోజూ ఇలాంటి పరిస్థితి లేదని, వడగండ్ల వానలు ఇప్పుడు భారీ స్థాయిలో పడుతుండటం రైతాంగాన్ని నష్టాల పాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ ఎస్.అన్వేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలిమలతో కలిసి ఆయన మాట్లాడారు.

నర్సుల సంఖ్యలో మన స్థానం 14

టాప్ త్రీలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్

- ఏపీలో 2.62 లక్షల మంది... తెలంగాణలో 53,314 మంది
- ఏఎన్‌ఎంల సంఖ్యలో ఏపీ టాప్... తెలంగాణ 19వ స్థానం
- 4,980 బీఎస్సీ నర్సింగ్ సీట్లతో తొమ్మిదో స్థానంలో రాష్ట్రం
- బీఎస్సీ నర్సింగ్ కాలేజీలు ఏపీలో 152, తెలంగాణలో 87

ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నివేదిక వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఆస్పత్రుల్లో రోగులకు సేవలందించడంలో, వైద్య సంబంధిత విధుల్లో నర్సులు, ఏఎన్‌ఎంలది కీలకపాత్ర. ఇలాంటి నర్సులు, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎంల సంఖ్యలో.. సంబంధిత విద్యలో తెలంగాణ వెనుకబడి ఉందని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తేల్చి చెప్పింది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలు ముందున్నాయి. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తమ వార్షిక నివేదిక-2021-22ను విడుదల చేసింది. దాని ప్రకారం.. దేశవ్యాప్తంగా రిజిస్టర్డ్ ఏఎన్‌ఎంలు 9.82 లక్షల మంది ఉన్నారు. అత్యధికంగా 1.39 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత రాజస్తాన్ 1.10 లక్షల మందితో రెండో స్థానంలో ఉంది. ఇక 10,219 మందితో తెలంగాణ 19వ స్థానంలో ఉంది. రిజిస్టర్డ్ నర్సులు దేశవ్యాప్తంగా 24.71 లక్షల మంది ఉన్నారు. అత్యధికంగా 3.32 లక్షల మందితో తమిళనాడు మొదటి స్థానంలో ఉంది. కేరళ రెండో స్థానం (3.15 లక్షల మంది)లో, ఆంధ్రప్రదేశ్ మూడో స్థానం (2.62 లక్షల మంది)లో ఉన్నాయి. తెలంగాణ 53,314 మందితో 14వ స్థానంలో నిలిచింది.

నర్సింగ్ సీట్లలో కర్ణాటక నం.1

2022 మార్చి నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కాలేజీల్లో బీఎస్సీ నర్సింగ్ సీట్ల సంఖ్యలో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో 19,860 సీట్లున్నాయి. ఆంధ్రప్రదేశ్ 8,030 బీఎస్సీ సీట్లతో ఐదో స్థానంలో ఉండగా, తెలంగాణ 4,980 సీట్లతో దేశంలో తొమ్మిదో స్థానంలో ఉంది. ఎంఎస్సీ నర్సింగ్‌లో తెలంగాణ 493 సీట్లతో దేశంలో పదో స్థానంలో ఉండగా, ఏపీ ఏడో స్థానంలో ఉంది. 3,360 సీట్లతో కర్ణాటక ఎంఎస్సీ నర్సింగ్‌లోనూ మొదటి స్థానంలో నిలిచింది.

కొత్త కోర్సులు..సెమిస్టర్ విధానం..

నర్సింగ్ విద్యలో కౌన్సిల్ అనేక మార్పులు చేసింది. వైద్య రంగంలో వస్తున్న ఆధునీకరణల నేపథ్యంలో సిలబస్‌లో సవరణలు చేసింది. బీఎస్సీ నర్సింగ్ విద్యలో ఇప్పుడు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ సంవత్సరమే ఇది అమల్లోకి వచ్చింది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి

నర్సింగ్ కౌన్సిల్ కొన్ని సూచనలు కూడా చేసింది. 'హెల్త్ కేర్ రంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. రోగి విషయంలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. వ్యక్తిగత పనితీరుతో రోగికి ఎలాంటి ప్రమాదం కలిగించకుండా వ్యవహరించాలి. స్కిల్ ల్యాబ్, క్లినికల్ లెర్నింగ్ పద్ధతులపై దృష్టి సారించాలి..' అని సూచించింది.

మరోవైపు డాక్టర్ ఆఫ్ నర్సింగ్ ప్రోగ్రాంను, ఈ-లెర్నింగ్ కోర్సులను తీసుకొచ్చింది. ఫౌండేషన్, కోర్, ఎలక్టివ్ కోర్సులు ప్రవేశపెట్టింది. గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో పేషెంట్ సెంటర్డ్ కేర్‌ను తీసుకొచ్చింది. ఇందులో రోగి వ్యక్తిగత ప్రాధాన్యతలు, అవసరాలను గుర్తించి సంపూర్ణమైన సేవలు అందించాలి.

ఏఎన్‌ఎం సీట్లలో ఆంధ్రప్రదేశ్ టాప్..



ఏఎన్‌ఎం (ఆక్సిలరీ నర్సింగ్ మిడ్‌వైఫరీ) సీట్లలో తెలంగాణ దేశంలో 17వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో మొత్తం 455 ఏఎన్‌ఎం సీట్లు ఉన్నాయి. అత్యధికంగా 12,015 సీట్లతో మహారాష్ట్ర దేశంలో మొదటి స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 910 సీట్లతో 12వ స్థానంలో నిలిచింది. జీఎన్‌ఎం (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ) సీట్లు తెలంగాణలో 3,962 ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 7,125 ఉన్నాయి. దేశంలో అత్యధికంగా కర్ణాటకలో 24,731 సీట్లున్నాయి. ఏఎన్‌ఎం స్కూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 31 ఉండగా, తెలంగాణలో 16 ఉన్నాయి. దేశంలో అత్యధికంగా మహారాష్ట్రలో 545 స్కూళ్లు ఉన్నాయి. ఈ విషయంలో తెలంగాణ 18వ స్థానంలో ఉంది. జీఎన్‌ఎం స్కూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 163 ఉండగా, తెలంగాణలో 88 ఉన్నాయి. దేశంలో అత్యధికంగా కర్ణాటకలో 520 ఉన్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఖజానా కళ పెంచండి

▶ మొదటి పేజీ తరువాయి

స్థలాలు, నిర్మాణాల క్రమబద్ధీకరణ ప్రక్రియపై సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటన చేసినందున అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పన్ను వసూళ్ల విషయంలో పకడ్బందీగా వ్యవహరించడం ద్వారా ఆదాయం పెరుగుతున్నప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ పన్ను ఎగవేత జరగకుండా అవసరమైన చర్యలన్నింటినీ తీసుకోవాలని స్పష్టం చేసింది. పన్ను ఆదాయం పెంచడం ద్వారా రెవెన్యూ శాఖలు ప్రభుత్వ మనుగడ సజావుగా సాగేట్టు చూడాలని ఉపసంఘం ఆదేశించింది. పన్నుల ఆదాయం ఇప్పటికే ఆశించిన విధంగా ఉన్నప్పటికీ మరింత పెరిగేలా కృషి చేయాలని కోరింది.

వారం రోజుల్లో 58, 59 జీవోల సంబంధిత పట్టాలు

మంత్రివర్గ ఉపసంఘం సమావేశానికి సంబంధించిన వివరాలను ప్రభుత్వం వెల్లడించింది. వాటి ప్రకారం.. జీవో 58, 59లకు (ప్రభుత్వ స్థలాల్లో అనుమతుల్లేని నిర్మాణాల క్రమబద్ధీకరణ సంబంధిత జీవోలు) సంబంధించి వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. ఇప్పటికే డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేసి ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది.

విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ అమలు

ట్రాన్స్‌కో సీఎండీ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులకు 7 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ వర్తింపజేస్తూ తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 5 ఏళ్లలోపు సర్వీసుకు ఒక ఇంక్రిమెంట్, 5-15 ఏళ్లలోపు సర్వీసుకి 2 ఇంక్రిమెంట్లు, 15 ఏళ్లపై సర్వీసుకి 3 ఇంక్రిమెంట్లను వర్తింపజేస్తున్నట్టు ప్రకటించారు. 2022 ఏప్రిల్ నుంచి కొత్త పీఆర్సీ అమల్లోకి రానుందని, నాటి నుంచి 2023 ఏప్రిల్ వరకు రావాల్సిన పీఆర్సీ బకాయిలను మే నెల నుంచి 13 సమవాయిదాల్లో చెల్లించనున్నట్టు తెలిపారు. హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ అలవెన్స్‌లకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య లోపాయికారీ ఒప్పందం

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్

సాక్షి బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త ఎన్నికల ప్రచారం కోసం కర్ణాటక రాష్ట్రాన్ని ఏటీఎంలాగా వాడుకోవాలని ప్లాన్ చేస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. దేశంలో సహా ఎక్కడా అధికారంలో లేని కాంగ్రెస్ పార్టీ కర్ణాటక రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని.. ఈ ఎన్నికల్లో రెండు పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. జేడీఎస్ బలంగా ఉన్న చోట్ల కాంగ్రెస్ బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టిందని, అదే విధంగా కాంగ్రెస్ బలంగా ఉన్న



కోలార్ వద్ద ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బండి సంజయ్, స్థానిక నేతలు

చోట జేడీఎస్ బలహీనులను నిలబెట్టిందన్నారు. కర్ణాటకలో అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముళబాగిల అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో కోలార్ ఎంపీ మునిస్వామి, స్థానిక బీజేపీ అభ్యర్థి సుందర్‌తో కలిసి బండి సంజయ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ హైదరాబాద్ పాతబస్తీలో పచ్చ జెండాలను పీకించి కాషాయ జెండాను ఎగరేసిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. కాంగ్రెస్, జేడీఎస్ రెండు పార్టీల కేసీఆర్ ఆర్థికంగా సాయం చేస్తున్నాడని ఆరోపించారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఇదే సమయం

- రాష్ట్రంలో ఐదు విప్లవాలు ప్రజల జీవనస్థితిని మార్చాయి
- డబ్ల్యుఐటీటీసీ ఐటీటీసీ శంకుస్థాపన సందర్భంగా మంత్రి కేటీఆర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్, బంజారాహిల్స్: పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఇదే ఉత్తమ సమయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఇంటర్‌ప్రెనర్స్ ఆఫ్ ఇండియా (ఎలీప్) ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగామ వద్ద కేటాయించిన ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ టెక్నాలజీ సెంటర్ (డబ్ల్యుఐటీటీసీ) కేంద్రానికి మంత్రి కల్వకుంట్ల తారక రామారావు బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఏకకాలంలో ఐదు విప్లవాలు హరిత విప్లవం, నీలి విప్లవం, గులాబీ విప్లవం, శ్వేత విప్లవం, పసుపు విప్లవంతో తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు పారిశ్రామిక ప్రగతికి అత్యధికంగా వనరులున్నాయన్నారు. వీటిని పారిశ్రామికవేత్తలు అందిపుచ్చుకొని గ్రామీణ స్థాయిలో అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వం సహకారం ఉంటుందన్నారు. నగరాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరిగితేనే సమతుల్యత సాధించగలమన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటుచేసుకొని వాటిని సాధించేందుకు కృషి చేస్తే అద్భుతాలు సాధ్యమన్నారు. ఎలీప్ అధ్యక్షురాలు రమాదేవి కన్నెగంటి మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం కేవలం 5 మంది పారిశ్రామికవేత్తలతో ప్రారంభమైన అలీప్‌లో ఇప్పుడు 10వేల మందికి పైగా మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, టీఎస్ఐఐసీ చైర్మన్ జి.బాలమల్లు, డబ్ల్యుఐటీటీసీ వైస్ చైర్‌పర్సన్ జ్యోతి, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి: కేటీఆర్

లైంగిక వేధింపులకు నిరసనగా ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న దీక్షకు రాష్ట్ర పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు మద్దతు తెలిపారు. రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్‌పై విచారణ జరిపి, వారికి న్యాయం చేయాలని శుక్రవారం ఆయన ట్విట్టర్ వేదికగా డిమాండ్ చేశారు. 'ఒలంపిక్స్‌లో పతకాలు సాధించి వారు దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చినప్పుడు మనం ఉత్సవాలు జరుపుకొన్నాం. ప్రస్తుతం వారు న్యాయం కోసం చేస్తున్న పోరాటానికీ సంఘీభావం తెలుపుదాం. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్‌పై నిష్పాక్షిక విచారణ జరిపి, రెజ్లర్లకు న్యాయం అందించాలి' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

రెజ్లర్ల సమస్యను పరిష్కరించాలి: కవిత

రెజ్లర్లకు మద్దతుగా ఎమ్మెల్సీ కవిత కూడా ట్వీట్ చేశారు. 'అంతర్జాతీయ వేదికలపై మన అథ్లెట్లు కనపరిచిన ప్రతిభను చూసి ఉత్సవాలు చేసుకున్నాం. మన అథ్లెట్లు గ్లోబల్ ఐకాన్స్. వారు మనను ఎంతో ప్రభావితం చేస్తున్నారు. మన అథ్లెట్లు చెబుతున్న సమస్యను విని, దేశ భవిష్యత్ దృష్ట్యా వారి సమస్యను పరిష్కరించాలి' అని ఆమె శుక్రవారం ట్విట్టర్లో పేర్కొన్నారు.

రామగుండంలో ఎఫ్‌ఎం ప్రసారాలు

ట్రాన్స్‌మీటర్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ



రేడియో రిలే కేంద్రంలో కలెక్టర్ సంగీత, అధికారులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రజలకు ఎఫ్‌ఎం రేడియో ప్రసారాలు అందుబాటులోకొచ్చాయి. 100 వాట్ల ఎఫ్‌ఎం ట్రాన్స్‌మీటర్ రేడియో ప్రసారాలకోసం ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని దూరదర్శన్ రిలే కేంద్రాన్ని ప్రధాని మోదీ, కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 85 జిల్లాల్లో 2 కోట్ల మంది ప్రజలు ప్రసారాలను వినేలా 91 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విభిన్నమైన సంస్కృతులు, అపార మేధో సంపద, సాంకేతిక ప్రగతిని ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంలో ఇదో భాగమని చెప్పారు. రేడియో కార్యక్రమాలు మారుమూల ప్రాంతాల శ్రోతలకూ చేర్చాలని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ప్రసార భారతి ఈ ఎఫ్‌ఎం ట్రాన్స్‌మీటర్‌లు ప్రారంభించిందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సంగీత తెలిపారు. కార్యక్రమంలో రామగుండం మునిసిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎస్.సత్యనారాయణ, కార్పొరేటర్ కొలిపాక సుజాత, ఆకాశవాణి డైరెక్టర్ మణి మంజరీదేవి, సిబ్బంది శ్రీనివాస్, రమణారెడ్డి, శివశంకర్, నరేష్, రమణ, సోమయ్య, అనిల్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంతోమంది జీవితాల్లో 'మన్ కీ బాత్' వెలుగులు

ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్



ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో మన్ కీ బాత్‌పై తయారు చేసిన కథనాలను విడుదల చేస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్/ఏజీ వర్సిటీ: 'మన్ కీ బాత్'ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపిందని ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ జి.నరేంద్రకుమార్ అన్నారు. ఇప్పటి వరకు 99 మన్ కీ బాత్ ఎపిసోడ్‌లతో భారీమార్పు వచ్చిందని వెల్లడించారు. ప్రజల జీవితాల్లో ఇది ఒక పంచతంత్రంలా పనిచేస్తోందని కొనియాడారు. పీఎం మోదీ ప్రతిష్టాత్మక రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'వందో ఎపిసోడ్‌ను పురస్కరించుకుని జాతీయ గ్రామాణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయక బృందాలు, అమృత్ సరోవర్ మిషన్‌లపై 'మన్ కీ బాత్' కార్యక్రమ ప్రభావం గురించి 'ది మన్ కీ బాత్'స్టోరీస్ అనే శీర్షికతో రూపొందించిన నివేదికను అదనపు డైరెక్టర్ శ్రుతిపాటిల్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ముఖ్య ఆర్థిక సలహాదారు ప్రవీణ్ మహతో సమక్షంలో నరేంద్రకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు స్వయం సహాయక సంఘాల సామాజిక, ఆర్థిక లాభాలలో 'మన్ కీ బాత్'ప్రస్తావనల తర్వాత గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. దేశంలో జరుగుతున్న సానుకూల అభివృద్ధి కథనాలపై మీడియా మరింత దృష్టి సారించాలని కోరారు. స్వయం సహాయకసంఘాలపై నిర్వహించిన ఆరు కేస్ స్టడీల గురించి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వాణిశ్రీ జోసెఫ్, అమృత్ సరోవర్ మిషన్‌పై నిర్వహించిన 4 కేస్ స్టడీల గురించి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ధీరజ వివరించారు. అధ్యయనం ఫలితాలను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారు ప్రవీణ్ మహతో అభినందించారు. విధానపరమైన విషయాలలో మంత్రిత్వ శాఖకు సహాయం చేయడానికి ఇటువంటి అధ్యయనాలను కొనసాగించాలని ఎన్ఐఆర్‌డీపీఆర్‌ని కోరారు.

అధ్యయనంలో ఇలా..

ఎన్ఐఆర్‌డీపీఆర్ బృందం అధ్యయనం చేసిన ఆరు స్వయం సహాయక సంఘాలలో- బొమ్మలు, హస్తకళల తయారీలో ప్రత్యేకత కలిగిన తమిళనాడులోని తంజావూరుకు చెందిన స్వయం సహాయకబృందాలు; అస్సాంలోని భలూకి వెదురు క్లస్టర్; ఒడిశాకు చెందిన కమలా మొహరానా నేతృత్వంలోని స్వయం సహాయక బృందం, పద్మశ్రీ అవార్డు గ్రహీత 'కిసాన్ చాచి' రాజకుమారిదేవి నేతృత్వంలోని స్వయం సహాయక బృందం, మధ్యప్రదేశ్‌లోని చిచ్‌గావ్‌కు చెందిన యోగ్యత అజీవిక స్వయం సహాయక బృందం, ఉత్తరప్రదేశ్‌లోని కడిపూర్‌కు చెందిన స్వయం సహాయక బృందం ఉన్నాయి. ఈ అధ్యయనంలో ఉత్తరప్రదేశ్‌లోని లలిత్ పూర్‌లోని అమృత్ సరోవర్లు, మధ్యప్రదేశ్‌లోని మాండ్లా, తెలంగాణలోని వరంగల్, కర్ణాటకలోని బగల్కోటే కూడా ఉన్నాయి.

'మన్‌కీ బాత్ -100'ను విజయవంతం చేయండి

బీజేపీ శ్రేణులకు బండి సంజయ్ పిలుపు

- ప్రతీ నియోజకవర్గంలో వంద కేంద్రాలు.. ఒక్కో చోట కనీసం వందమంది
- విస్తృతంగా ప్రచారం చేయాలని సూచన

సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతినెలా రేడియోలో నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమం వందవ ఎపిసోడ్‌ను అందరికీ గుర్తుండిపోయేలా విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో వంద కేంద్రాల్లో ఒక్కోచోట కనీసం వంద మంది హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల మదిలో నిలిచేలా మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ చరిత్ర సృష్టించబోతోందని వ్యాఖ్యానించారు. కర్ణాటక ఎన్నికల్లో భాగంగా బెంగళూరులో ప్రచారం చేస్తున్న బండి సంజయ్.. శుక్రవారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలతోపాటు వివిధ మోర్చాలకు చెందిన నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారం ప్రధానమంత్రి మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు, ప్రజలు వీక్షించడానికి వీలుగా స్క్రీన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆ వివరాలను ఫొటోలతో సహా నమో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గురించి ప్రజలకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ఈ విషయంలో తెలంగాణ అగ్ర స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని నాయకులకు చెప్పారు. అంతిమంగా మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను అత్యధిక మంది చూసేలా కృషి చేయాలని సూచించారు.

కేసీఆర్‌తో నితీశ్ భేటీ!

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీలతో సంప్రదింపులు సాగిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తోపాటు కమ్యూనిస్ట్ పార్టీల అగ్రనేతలతో వరుసగా భేటీలు నిర్వహించారు. విపక్షాలను ఉమ్మడి వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఇతర పార్టీల నాయకులను సైతం కలుస్తానని ప్రకటించారు. నితీశ్‌కు మమతా బెనర్జీ ఓ ప్రతిపాదన చేశారు. 1974లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సోషలిస్ట్ నేత జయప్రకాష్ నారాయణ్ బిహార్ నుంచి ఉద్యమం లేవనెత్తారని, ఇప్పుడు బీజేపీపై పోరాటానికి బిహార్ నుంచే నాంది పలకాలని కోరారు. బిహార్‌లో విపక్ష నేతల సమావేశం నిర్వహించి, కార్యాచరణ సిద్ధం చేద్దామని సూచించారు. ఈ నేపథ్యంలో బిహార్‌లో విపక్షాల భేటీని వచ్చే నెల రెండో వారంలో నిర్వహించే అవకాశాలున్నాయని జేడీ(యూ) జాతీయ అధ్యక్షుడు లలన్‌సింగ్ ప్రకటించారు. విపక్షాల సమావేశం పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా స్పందించింది.

రాష్ట్రంలో తగ్గనున్న పగటి ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గనున్నాయి. ప్రస్తుత సీజన్‌లో నమోదయ్యే సాధారణ ఉష్ణోగ్రతల కంటే 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కొన్నిచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదు కావచ్చని సూచించింది. రాష్ట్రానికి దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి గాలులు తక్కువ ఎత్తు నుంచి బలంగా వీస్తున్నట్లు వివరించింది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల వడగండ్ల వర్షాలు సైతం కురుస్తాయని హెచ్చరించింది. శుక్రవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే, గరిష్ట ఉష్ణోగ్రత నల్లగొండలో 38.0 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 21.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	26.5
రెంటచింతల	40.8	26.4
కడప	39.8	26.5
విజయవాడ	38.0	27.0
నల్లగొండ	38.0	22.0
కర్నూలు	37.8	26.5
భద్రాచలం	37.4	27.0
ఆదిలాబాద్	36.7	21.4
ఖమ్మం	36.6	26.0
మహబూబ్‌నగర్	35.0	25.3
హనుమకొండ	34.0	24.5
మెదక్	33.8	21.0
హైదరాబాద్	32.8	25.0
రామగుండం	32.6	23.0
హకీంపేట్	32.0	24.3
దుండిగల్	32.0	22.6
నిజామాబాద్	30.4	21.9

పేదింటి పెళ్లికి.. ఊరంతా ఒక్కటై..

భైంసా టౌన్: పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఊరంతా ఒక్కటయ్యారు. తలా కొంత కలేసి జమ చేసిన డబ్బును కుటుంబానికి అందించి మానవత్వం చాటుకున్నారు నిర్మల్ జిల్లా బాసర మండలం కిర్గుల్ (బి) వాసులు. వివరాల్లోకి వెళితే.. కిర్గుల్(బి)కు చెందిన కరాండె గోదావరి, గంగన్న దంపతులకు నలుగురు సంతానం. ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. గంగన్న గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గోదావరి కూలీ పనులకు వెళ్తుంది. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. ఇటీవల పెద్ద కూతురు వివాహం కుదిరింది. మే 7న వివాహ ముహూర్తం నిశ్చయించారు. ఉన్నంతలో ఘనంగా వివాహం చేద్దామనుకున్నారు. తెలిసిన వారి వద్ద అప్పుచేసి బంగారం, పెళ్లి సామగ్రి కొని ఇంట్లో సిద్ధంగా పెట్టుకున్నారు. రోజులాగానే బుధవారం రాత్రి భోజనం చేసి, ఓ గదిలో అందరూ నిద్రపోయారు. అర్ధరాత్రి ఇంట్లో చొరబడిన దొంగలు వారు పడుకున్న గదికి గడియపెట్టి మరో గదిలోని బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారం, 20 తులాల వెండి ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇల్లు గుల్లయింది. పది రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా నగదు, సొమ్ము దొంగలు ఎత్తుకెళ్లడంతో గంగన్న, గోదావరి దంపతులు బోరున విలపిస్తున్నారు. వీరి దీనస్థితి అర్థం చేసుకున్న గ్రామస్తులు తామున్నామని అండగా నిలిచారు. యువకులు ఇంటింటికీ తిరిగి రూ.1,01,000 సేకరించి బాధిత కుటుంబానికి అందించారు. వీడీసీ ఆధ్వర్యంలో చైర్మన్ పోతారెడ్డి రూ.20 వేలు, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి రూ.20 వేలు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. దీంతో గంగన్న, గోదావరి దంపతులు గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు.


జమచేసిన డబ్బును గంగన్నకు అందిస్తున్న గ్రామస్తులు, యువకులు


పల్లె ప్రగతి పనులకు తెచ్చిన రూ.6 లక్షల బిల్లు మంజూరు కాక.. అప్పు తీర్చే మార్గం లేక.. భర్త కుమార్‌తో కలిసి కూలి పనులు చేస్తున్న జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం లక్ష్మీతండా శివారు రామచంద్రగూడెం సర్పంచ్ పయ్యావుల లావణ్య

క్లుప్తంగా...

మే 1 నుంచి హైకోర్టుకు వేసవి సెలవులు

శని, ఆదివారంతో కలిపి జూన్ 4 వరకు

సాక్షి, హైదరాబాద్: మే 1 నుంచి జూన్ 2 వరకు హైకోర్టుకు వేసవి సెలవులు ప్రకటించారు. అయితే జూన్ 3, జూన్ 4..శని, ఆదివారాలు ఉండటంతో జూన్ 5 నుంచి ఉన్నత న్యాయస్థానం విచారణలు పునఃప్రారంభం కానున్నాయి. దాదాపు నెల రోజుల సమయంలో అత్యవసర కేసుల విచారణకు ప్రతి గురువారం వెకేషన్ బెంచ్‌లు అందుబాటులో ఉంటాయని రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు.

అత్యవసర కేసులకు అందుబాటులో ఉండే బెంచ్‌లు ఇవే..

- **మే 4న:** జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ ఎ.సంతోశ్‌రెడ్డి ద్విసభ్య ధర్మాసనంతో పాటు జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ బెంచ్
- **మే 11న:** జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి ద్విసభ్య ధర్మాసనం, ముమ్మినేని సుధీర్‌కుమార్ బెంచ్
- **మే 18న:** జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ పుల్ల కార్తీక్ ద్విసభ్యధర్మాసనం, జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ బెంచ్
- **మే 25న:** జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పుల్ల కార్తీక్ ద్వి సభ్య ధర్మాసనం, జస్టిస్ సాంబశివరావు నాయుడు బెంచ్
- **జూన్ 1న:** జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ద్వి సభ్య ధర్మాసనం, జస్టిస్ కె.శరత్ బెంచ్

(ప్రతి మంగళవారం ఫైల్ చేసిన కేసులపై గురువారం ఈ బెంచ్‌లు విచారణ జరుపుతాయి)

సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌గా అశోక్‌రెడ్డి

పలువురు ఐఏఎస్‌ల బదిలీ..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్, ఎక్స్‌అఫీషియో స్పెషల్ సెక్రటరీగా కె.అశోక్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి టి.హరీశ్‌రావుకు ఓఎస్డీగా ఉన్నారు. ఈ మేరకు పలువురు ఐఏఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమాచార, ప్రజాసంబంధాల శాఖ అదనపు బాధ్యతల నుంచి అరవింద్ కుమార్‌ను ప్రభుత్వం తప్పించింది. వెయిటింగ్‌లో ఉన్న బి.గోపీని సీసీఎల్ఏ కార్యదర్శిగా నియమించింది. ప్రస్తుత సీసీఎల్ఏ కార్యదర్శి కె.హైమావతిని తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన విభాగానికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. వనపర్తి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఆశిష్ సాంగ్వాన్‌ను సీసీఎల్ఏలో ప్రత్యేక అధికారిగా బదిలీ చేసింది. ఆ పోస్టులో పనిచేస్తున్న ఎం.సత్యశారదాదేవిని తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన విభాగానికి రిపోర్టు చేయాలని పేర్కొంది.

మొదట డైరెక్టర్‌గా.. తర్వాత స్పెషల్ కమిషనర్‌గా..

మంత్రి హరీశ్‌రావు ఓఎస్డీ కె.అశోక్‌రెడ్డిని తొలుత సమాచార, ప్రజాసంబంధాల శాఖ డైరెక్టర్‌గా, ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం కొద్దిసేపటికి ఆయన హోదాను స్పెషల్ కమిషనర్‌గా, ఎక్స్‌అఫీషియో స్పెషల్ సెక్రటరీగా సవరిస్తూ మరో ఉత్తర్వులు జారీచేశారు.

రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- ఈ సీజన్‌లో 5.16 ఎల్ఎంటీ ధాన్యం సేకరణ
- నిరంతరం యాసంగి ధాన్యం సేకరణకు చర్యలు
- ధాన్యం సేకరణపై మంత్రి గంగుల కమలాకర్ ఉన్నత స్థాయి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం కొనుగోళ్లు నిరంతరం సాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గతేడాది ఇదే సమయానికన్నా రెట్టింపును మించి కొనుగోళ్లు జరిగాయని చెప్పారు. ప్రకృతి వైపరీత్యంతో అల్లాడుతున్న రైతులకు పూర్తిస్థాయిలో అండగా ఉండాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, సంస్థ జీఎం రాజారెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో మౌలిక సదుపాయాల అంశంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలు, వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంత ధాన్యం వచ్చినా కొనుగోలు చేసేందుకు వీలుగా 7,142 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే వీటిలో 4 వేల కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. గతేడాది ఇదేరోజు 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి రెండున్నర రెట్లు అధికంగా 5.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు.

రోజుకు 90 వేల మెట్రిక్ టన్నుల సేకరణ

రోజుకు 90 వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని సేకరించే ప్రక్రియ చురుగ్గా సాగుతోందని మంత్రి గంగుల చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షాల నుంచి రక్షణగా కోటి మెట్రిక్ టన్నుల ధాన్యానికి సరిపడా 1,45,163 టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు సైతం 6,055, వెయింగ్ మిషన్లు 12,671 అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ ఆపత్కాలలో కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి రాజకీయం చేయడం సరికాదని, రైతులకు భరోసా కల్పించి కేంద్రం నుంచి బాయిల్డ్ రైస్‌కు సానుకూలంగా నిర్ణయం ఇప్పించాలని ప్రతిపక్షాలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం సేకరణలో నిర్దేశించిన కనీస నాణ్యతాప్రమాణాల మేరకే ధాన్యం సేకరించవలసి వస్తుందని అన్నారు. అయినప్పటికీ అకాలవర్షాలతో తడిసిన ధాన్యం విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబోసి కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని గంగుల పేర్కొన్నారు.

ధాన్యం రాశిపై కుప్పకూలి..

వడదెబ్బతో రైతు మృతి


ఎర్ర భూపాల్‌రెడ్డి (ఫైల్)

అడ్డగూడూర్: వడదెబ్బకు గురైన ఒక రైతు ధాన్యం రాశిపై కుప్పకూలి మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన ఈ విషాద సంఘటన వివరాలివి. అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన ఎర్ర భూపాల్‌రెడ్డి (53) రెండు ఎకరాల్లో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు పది రోజుల క్రితం కోటమర్తి గ్రామ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. కాగా, ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడవడంతో శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వాటిని ఆరబెట్టి ఇంటికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ధాన్యాన్ని కుప్పనూర్చే క్రమంలో భూపాల్‌రెడ్డి అకస్మాత్తుగా ధాన్యం రాశిలోనే కుప్పకూలాడు. స్థానిక రైతులు గమనించి అతన్ని ఓ ప్రైవేట్ వాహనంలో తిరుమలగిరి మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గీత వృత్తి ఆధునీకరణపై దృష్టి సారించాలి

అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచన



సాక్షి, హైదరాబాద్: గీత వృత్తి ఆధునీకరణపై దృష్టి సారించాలని అధికారులకు ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. గీత వృత్తిలో ప్రమాదాలపై శుక్రవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గీత వృత్తిలో కార్మికుల మరణాలు, ప్రమాదాల నివారణకు ప్రపంచంలోనే మెరుగైన 'సులభతరమైన సేఫ్టీ యంత్రాలను'కార్మికులకు అందించాలని స్పష్టం చేశారు. గీత వృత్తి ఇంకా సంప్రదాయ పద్ధతిలో కొనసాగడం వల్ల ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకొస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, సహాయ కమిషనర్ చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల మరణాలను నివారించండి

కాచిగూడ (హైదరాబాద్): గీత కార్మికుల మరణాలను నివారించేందుకు ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కురెళ్ల వేములయ్య గౌడ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం మంత్రులు కేటీఆర్, వి.శ్రీనివాస్ గౌడ్‌లను కలిసి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వేములయ్య గౌడ్ మాట్లాడుతూ వందలాది మంది గీత కార్మికులు నిరంతరం ప్రమాదాలతో మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

'అధిక పెన్షన్'పై తొలగని సందేహాలు!

- అధిక పెన్షన్ ఖరారు ఫార్ములాను ఇప్పటికీ వెల్లడించని ఈపీఎఫ్ఓ
- మరో ఐదు రోజుల్లో ముగియనున్న ఉమ్మడి ఆప్షన్ ప్రక్రియ
- ఆలోపే వివరాలు, ఆధారాలను సమర్పించాల్సిన పరిస్థితి
- 'అధిక పెన్షన్'కోసం చెల్లించాల్సిన అధిక చందా, కలిగే లబ్ధిపైనా అస్పష్టత

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) అధిక పెన్షన్ పథకం కోసం ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చినా.. దీనిపై చందాదారులు, పెన్షనర్లలో సందేహాలు వీడటం లేదు. ఫిబ్రవరి 20న అధిక పెన్షన్ దరఖాస్తులకు ఉత్తర్వులను వెలువరించగా.. దరఖాస్తు ప్రక్రియ, ఉమ్మడి ఆప్షన్ నమోదు గడువు మరో ఐదు రోజుల్లో ముగియనుంది. కానీ ఇప్పటికీ ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, లబ్ధి, ఇతర అంశాలపై అయోమయం వీడటం లేదు. అధిక పెన్షన్ లెక్కించే ఫార్ములాను ఈపీఎఫ్ఓ ఇంకా వెల్లడించలేదని.. దీనికి ఎంపికైతే జరిగే లబ్ధిపై ఎలాంటి స్పష్టత లేదని చందాదారులు వాపోతున్నారు.

ఈపీఎఫ్ఓ ప్రస్తుత నిబంధనల ప్రకారం రూ.15 వేల గరిష్ట వేతనాన్ని పెన్షన్ కోసం పరిగణనలోకి తీసుకుంటారు. ఈ వేతన పరిధిలోని వారికి పదవీ విరమణ పొందిన తర్వాత సాధారణ పెన్షన్ మాత్రమే అందుతుంది. ఈ నిబంధనను అమల్లోకి తీసుకురావడానికి ముందు నుంచీ ఉన్న చందాదారులకు కూడా దీన్ని వర్తింపజేశారు. దీంతో అధిక వేతనమున్న వారికి అధిక పెన్షన్ పొందే అవకాశం ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో కేసు నమోదైంది. ఈ క్రమంలో.. ఈ నిబంధన అమల్లోకి రాకముందే అధిక వేతనం పొందుతున్న చందాదారులు, పెన్షనర్లకు ఎక్కువ పెన్షన్ అందే అవకాశం ఇవ్వాలని కోర్టు ఈపీఎఫ్ఓను ఆదేశించింది. దీనితో ఈపీఎఫ్ఓ అధిక పెన్షన్‌కు ఆప్షన్ ఇచ్చింది. గరిష్ట వేతనంపై అటు చందాదారుడు, ఇటు యాజమాన్యం చెరో 12శాతం చొప్పున చందా చెల్లిస్తే.. అధిక పెన్షన్‌కు అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ అంశంలో పలు సందేహాలున్నాయి. కొన్ని కంపెనీలు ఈపీఎఫ్ఓ వేతన పరిమితికి లోబడి జీతాల చెల్లింపులు చేస్తూ వచ్చాయి. అలాంటి వారికి అధిక వేతనంపై చెల్లింపులు చేసే అంశంపై స్పష్టత లేదు. ఇక అధిక వేతనం పొందుతున్న చందాదారులకు ప్రభుత్వం వాటా 1.12 శాతాన్ని ఈపీఎఫ్‌లో జమచేసే అంశంపైనా స్పష్టత లేదు. ప్రభుత్వం జమచేయని పక్షంలో ఆ మొత్తాన్ని ఏవిధంగా సర్దుబాటు చేస్తారనే ప్రశ్నకు ఈపీఎఫ్ఓ దగ్గర సమాధానం లేదు.

'అధిక పెన్షన్'ఫార్ములా ఇంకెప్పుడు?

సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం అధిక పెన్షన్‌కోసం ఈపీఎఫ్ఓ ఆన్‌లైన్ లింకు ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు.. చందాకు సంబంధించి యాజమాన్యంతో కలసి ఉమ్మడి ఆప్షన్ ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం పూర్తిస్థాయి ఆధారాలను సమర్పించాలి. దీనికి మే 3వ తేదీవరకే గడువు ఉంది. ఇలా సమయం దగ్గరపడుతున్నా.. అధిక పెన్షన్ లెక్కింపునకు సంబంధించిన సూత్రాన్ని (ఫార్ములా) ఈపీఎఫ్ఓ ఇప్పటికీ వెల్లడించలేదు. దీంతో అధిక పెన్షన్ అర్హతలు, ఎంపికైతే వచ్చే లబ్ధిపై చందాదారులకు ఇప్పటికీ స్పష్టత లేదు. కొన్ని సంస్థల యాజమాన్యాలు ఉద్యోగులకు అధిక వేతనంపై ఈపీఎఫ్ జమ చేస్తున్నా.. అధిక పెన్షన్ ఆప్షన్ ఇవ్వలేదు. ఇలాంటి సందేహాలను ఈపీఎఫ్ఓ అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నా.. ఎలాంటి స్పందన లేదని చందాదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

అపేక్ష లేనివాడు, శుచియైన వాడు, దక్షత కలవాడు,
ఉదాసీనుడు, వ్యథలు నశించిన వాడు, అన్ని విధాలైన కార్యాలలో
నేను చేస్తున్నాననే భావం లేనివాడు నాకు ప్రియుడు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, ఏప్రిల్, 29

నెత్తురు చిందిన బస్తర్

చెప్పుకోదగ్గ హింసాత్మక ఘటనలు లేకుండా కనీసం రెండేళ్లనుంచి ప్రశాంతంగా కనబడుతున్న ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం నక్సలైట్లు ఐఈడీ పేల్చి మినీ బస్సులో వెళ్తున్న పదిమంది జిల్లా రిజర్వ్ గార్డ్(డీఆర్‌జీ) పోలీసులనూ, ఒక డ్రైవర్‌నూ హతమార్చిన ఉదంతం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ఆ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా పల్నార్–అరణ్‌పూర్ మధ్యలో ఇటీవలే నిర్మించిన రహదారిపై ఈ ఐఈడీని అమర్చారనీ, అది కూడా రెండు మూడురోజుల క్రితమేననీ వస్తున్న కథనాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఆదివాసీల హక్కుల కోసం తుపాకులు పట్టామని చెబుతున్న మావోయిస్టుల్లోగానీ, వారిని ఎదుర్కొంటున్న భద్రతా బలగాల తీరులోగానీ ఏ మార్పూ రాలేదని తాజా ఘటన చెబుతోంది. ఒకప్పుడు దేశంలోని చాలా రాష్ట్రాల్లో ప్రభావవంతంగా ఉన్న వామపక్ష తీవ్ర వాదం చాన్నాళ్లుగా తగ్గుముఖం పట్టింది. 2000కు ముందు పది రాష్ట్రాల్లోని 200 జిల్లాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తిస్తే ఆ సంఖ్య 2021 నాటికి 41కి పడిపోయిందంటున్నారు. ఇప్పుడది 25 జిల్లాలకు మాత్రమే పరిమితమైందనీ, గత ఎనిమిదేళ్లలో నక్సల్ సంబంధిత హింసాత్మక ఘటనలు 55 శాతం తగ్గాయనీ, మరణాలు కూడా 63 శాతం తగ్గాయనీ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నాలుగు నెలల క్రితం విడుదల చేసిన నివేదిక తెలిపింది. హింసను కట్టడి చేయటానికి అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటూనే అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న పర్యవసానంగా మావోయిస్టుల లొంగుబాట్లు కూడా అధికంగానే ఉన్నాయని ఆ నివేదిక వివరించింది.

అయితే ఇలాంటి విజయాలే పోలీసు బలగాల్లో ఒక రకమైన నిర్లక్ష్యానికి దారితీశాయా అన్నది ఆలోచించుకోవాలి. తాజా ఉదంతాన్నే తీసుకుంటే అరణ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టుల కదలికలున్నాయని అందిన సమాచారంతో డీఆర్‌జీ పోలీసులు అక్కడికి వెళ్లారు. వెళ్లేముందూ, తిరిగొచ్చేటప్పుడూ ఒకే మార్గాన్ని ఉపయోగించకూడదన్న నిబంధన ఉంది. ఒకవేళ తప్పనిసరైతే రెండుసార్లూ బలగాల కన్నా ముందు ఒక ప్రత్యేక టీం వెళ్లి ఆ దారిలో మందుపాతరలు, ఇతరత్రా బాంబులు లేవని నిర్ధారించాలి. పైగా ఈమధ్యకాలంలో మావోయిస్టుల వైపునుంచి ఐఈడీల వినియోగం బాగా ఎక్కువైందని తెలుస్తూనే ఉంది. గత నాలుగు నెలల్లో ఐఈడీలు గుర్తించి వెలికితీసిన ఉదంతాలు 34 వరకూ ఉన్నాయని వార్తలు వెలువడ్డాయి. గతంలో భారీయెత్తున ఆదివాసీలను సమీకరించి పోలీసు బలగాలపై విరుచుకుపడిన మావోయిస్టులు ఇటీవల తక్కువమందితో బృందాలను ఏర్పాటుచేసి దాడులకు దిగుతున్నారని ఒక మీడియా కథనం తెలిపింది. పైగా లోగడ కేవలం అయిదారు కేజీల ఐఈడీని పేలుళ్లకు వినియోగిస్తే ఇప్పుడది 30, 40 కేజీలవరకూ ఉంటోంది. అందువల్ల ప్రాణనష్టం అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. దీన్ని గమనించి అయినా అరణ్‌పూర్ వెళ్లిన డీఆర్‌జీ పోలీసులు తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాల్సింది. ఒకప్పుడు లొంగిపోయిన ఆదివాసీలతో సల్వాజుడుం పేరుతో ప్రైవేటు దళాలను ఏర్పాటుచేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలతో వాటిని రద్దుచేయక తప్పలేదు. ఆ తర్వాతే ఛత్తీస్‌గఢ్ పోలీసు విభాగంలో డీఆర్‌జీ పేరుతో ప్రత్యేక దళం ఏర్పాటయింది. ఇందులో కూడా అత్యధికులు లొంగిపోయిన మావోయిస్టులు. వారంతా ఆదివాసీలు. కనుక మావోయిస్టులకు వారిపై గురి ఉంటుంది. అటువంటప్పుడు ఎంత అప్రమత్తంగా ఉండాలి? ఘటన జరిగిన ప్రాంతంలో ఒకప్పుడు మావోయిస్టులు బలంగా ఉండేవారనీ, ఇప్పుడు వారి ప్రభావం పూర్తిగా పోయిందనీ మీడియా కథనాలు చెబుతున్నాయి. డీఆర్‌జీ పోలీసుల్లో నిర్లక్ష్యానికి అది కూడా కారణమైవుండొచ్చు.

ఒకప్పుడు మధ్య, తూర్పు భారత ప్రాంతాల్లో ఎంతో బలంగా ఉన్న తాము ఎందువల్ల బలహీనపడవలసి వచ్చిందన్న ఆత్మవిమర్శ మావోయిస్టుల్లో కొరవడిందని తాజా ఉదంతం చెబుతోంది. హింసాత్మక ఘటనలకు పాల్పడటం వల్ల ప్రభుత్వాలు మరింత కఠినంగా వ్యవహరిస్తాయే తప్ప దానివల్ల కలిగే మార్పేమీ ఉండదని పదే పదే రుజువవుతోంది. మావోయిస్టులు ఏదో ఒక చర్యకు పాల్పడగానే సమీప ప్రాంతాల్లోని ఆదివాసీ ప్రాంతాలపై పోలీసులు విరుచుకుపడటం, అమాయకులు సైతం బాధితులుగా మారడం చాన్నాళ్లుగా కనబడుతూనే ఉంది. అరెస్టులు, కేసులు, ఏళ్ల తరబడి జైళ్లపాలు కావటం పర్యవసానంగా ఆదివాసీ కుటుంబాల జీవనం అస్తవ్యస్తమవుతోంది. పోషించేవారు లేక ఎన్నో కుటుంబాలు చెప్పనలవికాని ఇబ్బందులు పడుతున్నాయి. గతంతో పోలిస్తే మావోయిస్టుల ప్రభావంలో ఉన్న ప్రాంతాలు తగ్గిపోవడానికి ఇదొక ప్రధాన కారణం. కనీసం ఈ పరిణామమైనా తమ హింసాత్మక చర్యల్లోని నిరర్థకతపై పునరాలోచన కలిగిస్తే బాగుండేది. కానీ ఆ మాదిరి మార్పు రాలేదని ఈ ఉదంతం నిరూపించింది. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను ప్రకటించటానికీ, ప్రభుత్వ విధానాల్లో లోపాలున్నాయనుకున్నప్పుడు వాటికి వ్యతిరేకంగా ప్రజానీకాన్ని కూడగట్టడానికీ ఎప్పుడూ అవకాశాలుంటాయి. అలాంటి ఉద్యమాలను ప్రభుత్వాలు అణచివేయటానికి ప్రయత్నించినప్పుడు ప్రతిఘటన కూడా అదే స్థాయిలో వస్తున్నది. సాగు చట్టాలపై ఏడాదిపైగా సాగిన రైతు ఉద్యమాన్ని నయానా భయానా నియంత్రించాలనుకున్న కేంద్రం చివరకు వారి డిమాండ్లకు తలొగ్గి ఆ చట్టాలను వెనక్కి తీసుకోకతప్పలేదు. వీటన్నిటినీ మావోయిస్టులు పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజా ఉద్యమాలను నిర్మించే ప్రయత్నం చేయాలి. తమ హింసాత్మక చర్యలవల్ల సాధించేదేమీ లేకపోగా ఆదివాసులే కష్టనష్టాలు అనుభవించాల్సి వస్తున్నదని గుర్తించాలి.

డాన్లు–గాడ్‌ఫాదర్ల లంకె ఛేదించాలి!

విశ్లేషణ



ప్రకాశ్ సింగ్

ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ నేతల పోషణలో, ప్రభుత్వ సంస్థల సంబంధంలో ఉంటూ మాఫియా ఇంతకాలం పెరుగుతూ వచ్చింది. పోలీసు శాఖ, బ్యూరోక్రసీ దశాబ్దాలుగా మాఫియాతో పరస్పర ప్రయోజనకరమైన సహజీవనంలో భాగమైపోయాయి. ఈ సంబంధం దేశంలోని పలు ప్రాంతాల్లో కాలానుగుణంగా పేరుమోసిన డాన్లను సృష్టిస్తూ వచ్చింది. చేదు వాస్తవం ఏమిటంటే– నేరస్థులు, రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారుల మధ్య గల ఈ సంబంధాన్ని ఛేదించనట్లయితే... చట్టసభల్లోకి నేరస్థుల ప్రవేశాన్ని నిరోధించడానికి తగు చర్యలు చేపట్టనట్లయితే, నేర న్యాయవ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయనట్లయితే, బాహ్య ఒత్తిళ్ల నుంచి పోలీసులను బయటపడవేయనట్లయితే... పరిస్థితి మరింత ఘోరంగా దిగజారిపోతుంది.

పోలీసు శాఖలో కొనసాగిన నా 35 సంవత్సరాల సర్వీసులో, సరైనవిధంగా కానీ, తప్పు పద్ధతిలో కానీ ఒక మాఫియా డాన్‌ను చంపిన ఘటన సాధారణ ప్రజానీకంలో ఇంత ఆసక్తిని రేకెత్తించి, ఇంత వివాదాన్ని సృష్టించిన ఉదంతం నాకయితే గుర్తు లేదు. నిజానికి, సీన్ నుంచి కీలక పాత్రధారులను పక్కనబెట్టి, జరుగుతున్న సందడిని మాత్రమే ఎవరైనా గమనించినట్లయితే, ఆ శోధన ఒక పాపులర్ నేత హత్యకు గురయ్యాడన్న ముగింపునకు వచ్చి ఉండేది. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనల తీవ్రత కంటే ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని పట్టాలు తప్పించేందుకు ప్రతిపక్షం ప్రదర్శిస్తున్న కృతనిశ్చయాన్ని అది ఎక్కువగా ప్రతిఫలించి ఉండేది.

నిర్దిష్ట వివరాల్లోకి వస్తే, 1993 నాటికే... ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖులతో సంబంధాలను కలిగి, వారి రక్షణలో ఉంటున్న మాఫియా సంస్థల కార్యకలాపాల గురించిన సమాచారాన్ని పొందడానికి నాటి ప్రభుత్వం ఎన్.ఎన్. వోహ్రా కమిటీని నియమించింది. దీనిపై పని ప్రారంభించిన కమిటీ, 'ప్రభుత్వ యంత్రాంగానికి ప్రాసంగికత లేకుండా చేసి, మాఫియా నెట్‌వర్క్ వాస్తవానికి ఒక సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతోంది' అని తేల్చిచెప్పింది. ఈ కమిటీ అంతిమంగా కొన్ని సిఫార్సులను చేసింది. కానీ వాటిపై తదుపరి కార్యాచరణ లేకుండాపోయింది. పార్లమెంటులో దీనిపై తీవ్ర చర్చోపచర్చలు జరిగాయి. అయినా ఫలితం లేదు. క్రమంగా పోలీసు శాఖ, బ్యూరోక్రసీ ఈ పరస్పర ప్రయోజనకరమైన సహజీవనంలో భాగమైపోయాయి. ఈ అక్రమ సంబంధం దేశంలోని పలు ప్రాంతాల్లో కాలానుగుణంగా పేరుమోసిన మాఫియా డాన్లను సృష్టిస్తూ వచ్చింది. యూపీలో ముఖ్తార్ అన్సారీ, అతీఖ్ అహ్మద్, శ్రీ ప్రకాశ్ శుక్లా వంటి వారిని ఉదాహరణగా చెప్పవచ్చు.

ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మూలించాలి

ఈ సంబంధాన్ని ఎలా ఛేదించవచ్చు? మొదటగా, మాఫియాను రాజకీయ నాయకులు పోషిస్తూ, కాపాడటాన్ని తప్పకుండా నిలిపివేయాలి. రెండు, దాని ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మూలించాలి. మూడు, మాఫియా డాన్లను చట్టానికి జవాబుదారీగా చేయాలి. నాలుగు, ఈ అవినీతి సంబంధంలో భాగంగా ఉన్న పోలీసు అధికారులు, బ్యూరోక్రాట్ల రెక్కలు కత్తిరించాలి. ఈరోజు ఉత్తరప్రదేశ్‌లో మాఫియాకు అత్యున్నత స్థాయిలో ఎలాంటి రాజకీయ రక్షణా లేకుండా పోయింది. దాని ఆర్థిక సామ్రాజ్యాన్ని గణనీయంగా తగ్గించివేశారు. యూపీ పోలీసుల ప్రకారం– అతీఖ్ అహ్మద్, అతడి కుటుంబ సంపదలో రూ.1,169.20 కోట్లను జప్తు చేయడం, స్వాధీనపర్చుకోవడం లేదా నాశనం చేయడం జరిగింది. దీనికి తోడుగా, 12 మంది ముఠా నేతలు, వారి 29 మంది అనుయాయులకు శిక్ష పడేలా చేశారు.



ముఖ్తార్ అన్సారీకి పదేళ్ల జైలుశిక్ష పడగా, అతీఖ్ అహ్మద్‌కు యావజ్జీవం పడింది. ఎట్టకేలకు న్యాయచక్రాలు కదలడం ప్రారంభించాయి.

అయితే ఈ మార్గం సజావుగా లేదు. ఏప్రిల్ 15న అతీఖ్ అహ్మద్, అతడి సోదరుడు అశ్రఫ్‌ను తప్పనిసరి వైద్య పరీక్షలకు తీసుకువెళ్తుండగా ముగ్గురు గుర్తు తెలియని యువ నేరస్థులు వారిని కాల్చిచంపారు. నిందితులకు రక్షణగా ఉంటున్న భద్రతా సిబ్బంది చేష్టలుడిగి చూస్తుండిపోయారు. వారి స్పందన పేలవంగా ఉండిపోయింది. జరిగింది దురదృష్టకరమైనది. దాన్ని అధిగమించి ఉండవచ్చు. కానీ, ఈ సమయంలో రాష్ట్ర పోలీసులు ఆ నేరంలో భాగస్వాములయ్యారని ఆరోపించడం న్యాయం కాకపోవచ్చు.

న్యాయ విచారణ జరగాలి

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించింది. బాందా, హమీర్‌పూర్, కాస్‌గంజ్ నుంచి వచ్చిన ఈ ముగ్గురు యువకులు ఎలా ఒక్కటయ్యారు? వారిని ఈ పనిలోకి ఎవరు దింపారు? వారి ఉద్దేశం ఏమిటి? వారికి ఎవరు డబ్బులిచ్చారు? వారికి టర్కీ పిస్టల్స్ ఎవరు అందించారు? హత్యాఘటనలో వారు చేసిన నినాదాలను ఎవరైనా వారికి నేర్పించారా వంటి సంబంధిత విషయాలన్నీ న్యాయ విచారణ, పోలీసు దర్యాప్తులో తేలవలసి ఉంది. ఒక్కసారిగా ఫేమస్ అయిపోవాలన్న కోరికతోనే ఈ హత్యలకు పూనుకున్నామని ఈ ముగ్గురు హంతకులు ఇచ్చిన వివరణ నమ్మేలా లేదు.

అతీఖ్ కుమారుడు అసద్ అహ్మద్, అతడి అనుచరుడు గులామ్ హుస్సేన్‌లను ఏప్రిల్ 13న యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎన్‌కౌంటర్ అని చెబుతున్న దానిలో చంపేశారు. 2005లో జరిగిన రాజు పాల్, మరో ఇద్దరు పోలీసుల హత్యలో కీలక సాక్షి అయిన ఉమేష్ పాల్ హత్యతో వీరికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. తాజా ఘటనపై తప్పకుండా న్యాయ విచారణ జరిపించాల్సి ఉంది. ఈలోగా నిందాత్మక క్రీడ మొదలైపోయింది. న్యాయవిచారణ వెల్లడించాల్సింది ఇప్పటికే తెలిసి ఉన్న వాస్తవాలను కాదు. ఒక 'టాంగావాలా' వేలాది కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టేలా, అధికారులు సైతం మోకాళ్లపై వంగేంత అధికార కేంద్రంగా అతగాడిని మార్చేసిన రాజకీయ నేతలు, పార్టీలు ఏవి అనే విషయాన్ని న్యాయవిచారణ బయటపెట్టాల్సి ఉంది.

పాశ్చాత్య మీడియా సైతం ఈ హత్యలకు విశేష ప్రాముఖ్యతనిచ్చింది. కానీ ఈ సందర్భంగా వాటి కపటత్వం బయటపడుతోంది. ఒక మాజీ ఎంపీ హత్యకు గురయ్యాడని 'బీబీసీ' నివేదించడమే కాదు, అతడిని మాఫియా డాన్‌గా కాకుండా రాబిన్ హుడ్‌గా అభివర్ణించింది. 'న్యూయార్క్ టైమ్స్' అయితే, భారత్ చట్టవ్యతిరేక హింసవైపు దిగజారిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. కానీ అమెరికాలోనే ప్రతి సంవత్సరం సగటున వెయ్యి మంది పౌరులు (2022లో 1,096 మంది, 2021లో 1,048 మంది) పోలీసుల కాల్పుల్లో హత్యకు గురవుతున్నారనే విషయాన్ని మర్చిపోయింది.

ఇది సమష్టి బాధ్యత

మరోవైపున జరిగిన తప్పులన్నింటి భారాన్ని పోలీసులు మోయవలసి వస్తోంది. బహుశా అందుకు వారు అర్హులే కావచ్చు. రాజకీయ వర్గానికి కూడా కొంత జవాబుదారీతనం ఉండకూడదా? మాఫియాను పెంచి పోషించింది వారే మరి. ఈ విషయంలో న్యాయ వ్యవస్థకు కూడా జవాబుదారీతనం లేదా? మునుపటి అలహాబాద్ జిల్లాలో నేర న్యాయ యంత్రాంగానికి జిల్లా కలెక్టర్లు నేతృత్వం వహిస్తున్న సమయంలోనే అతీఖ్ అహ్మద్ పెరిగాడు. అతీఖ్, అతడి అనుయాయులపై ఉన్న 54 కేసులు ఇప్పటికీ విచారణ దశలోనే ఎందుకు ఉంటున్నాయి? అందులో 1979 నాటి పాత హత్య కేసు కూడా ఉందని గుర్తించాలి.

దేశంలో నేర న్యాయవ్యవస్థ వాస్తవానికి కుప్పకూలిపోతోందని జస్టిస్ వీఎస్ మలిమథ్ 2003 లోనే హెచ్చరించారు. మరి దిద్దుబాటు చర్యలు చేపట్టారా? పోలీసు సంస్కరణలపై సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడం గురించి ఎవరైనా పట్టించుకున్న పాపాన పోయారా? చేదు వాస్తవం ఏమిటంటే– నేరస్థులు, రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారుల మధ్య సంబంధాన్ని మనం ఛేదించనట్లయితే... శాసనసభలు, పార్లమెంట్‌లోకి నేరస్థుల ప్రవేశాన్ని నిరోధించడానికి మనం తగిన చర్యలు చేపట్టనట్లయితే, నేర న్యాయవ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయనట్లయితే, బాహ్య ఒత్తిళ్ల నుంచి పోలీసులను బయటపడవేయనట్లయితే పరిస్థితి మరింత ఘోరంగా దిగజారిపోతుంది!

వ్యాసకర్త మాజీ పోలీసు అధికారి;
పోలీసు సంస్కరణల కోసం పనిచేస్తున్నారు.
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అసలు సంగతి



ఆహార పరిశ్రమ కథనం ఇలా ఉంటుంది. మీకు పీచు కావాలా? ఓట్స్ తినండి. పాలీఫెనాల్స్ కావాలా? గ్రీన్ టీ తాగండి. యాంటీఆక్సిడెంట్లు కావాలా? డార్క్ చాకొలేట్ తినండి. ఈ పోషకాలన్నీ ఉండేదేమిటో తెలుసా? మామిడి. సమస్యల్లా రైతులు ప్రకటనలు ఇవ్వలేరు, సమావేశాలను నిర్వహించలేరు.

– రుజుతా దివేకర్, న్యూట్రిషనిస్ట్

సురక్షితం అనుకోలేం



క్యాబ్‌లో ప్రయాణిస్తున్నప్పుడు తమ భద్రత పట్ల ఏ ఆందోళనా లేకుండా నిద్రలోకి జారుకోవడం అనేది కేవలం మగవాళ్లకే సాధ్యం. అయినా జనం ప్రపంచమంతా సమానం అయిందని చెప్పి, అసలైనది విస్మరిస్తారు. ప్రతీక్షణం జాగ్రత్తగా ఉండటమనేది మనిషిని తినేస్తుంది.

– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

థాంక్యూ ఇండియా



ఖార్టూమ్ (సూడాన్) ఫ్రెంచ్ ఎంబసీలోని స్థానిక ఉద్యోగి, ఆమె కుటుంబాన్ని భారత విమానంలో తరలించినందుకు భారత్‌కు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇండో–ఫ్రెంచ్ సంఘీభావం ఎప్పుడూ తొట్రుపడదు.

– ఇమాన్యుయెల్ లెనైన్,
భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి

సానుభూతి లేదా?



తన సహ మహిళా అథ్లెట్లు ఏడ్చేలా చేసినందుకు పీటీ ఉషకు అభినందనలు. చెప్తుంటారు గదా, మహిళలకు పెద్ద శత్రువు మరో మహిళే!

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

సిగ్గుచేటు



లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా అంతర్జాతీయ అథ్లెట్లు వీధులకెక్కాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటు. అయినా నిందిత బీజేపీ ఎంపీని ప్రభుత్వం ఎప్పటికప్పుడు కాపాడుతోంది.

– స్వర భాస్కర్, నటి

ఇన్‌బాక్స్

తెలంగాణ జలయోధుడు

సాగునీటి రంగ నిపుణుడు రామరాజు విద్యాసాగర్ రావు తెలంగాణకు చేసిన సేవలు అమూల్యమైనవి. సాగునీటి రంగంలో జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్రం రాకముందు, వచ్చాక కూడా తన రచనలతో కళ్లకు కట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచించిన 'నీళ్ళు–నిజాలు' ఓ సంచలనం. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం పక్షపాత ధోరణితో తెచ్చిన జీవోలు, వాటితో జరిగే నష్టాన్ని వివరించారు. ఇవన్నీ నాడు వెలుగులోకి రావడంతో తెలంగాణ ఉద్యమం మరో మలుపు తిరిగింది.

ఆయన స్వగ్రామం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం. దేశ, విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం అనంతరం ఇరిగేషన్ శాఖలో ఇంజనీర్‌గా ఉద్యోగ జీవి తాన్ని మొదలుపెట్టారు. అనంతరం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లో 30 ఏళ్ళ పాటు సేవలందించారు. జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థలో చీఫ్ ఇంజనీర్ (సౌత్)గా రెండేళ్లు, కేంద్ర జల వనరుల శాఖ వాటర్ మేనేజ్మెంట్ కమిషనర్‌గా ఏడాది కాలానికి పైగా సేవలందించారు.



ఆర్. విద్యాసాగర్ రావు

అనంతరం నైరోబీ (కెన్యా), అడిస్ అబాబా (ఇథియోపియా)ల్లో ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్‌కు కన్సల్టెంట్‌గా పని చేశారు. ఈ సమయంలో నైలు, ఒకవాంగో నదీ బేసిన్ల నిర్వహణ అవసరాలు, పర్యావరణ అనుకూలతలు వంటి అంశాలపై నివేదికలు రూపొందించారు. వీటితో పాటు దేశంలో మహానది, కృష్ణా, గోదావరి, నర్మద, తపతి నదీ బేసిన్లకు సంబంధించి నీటి వనరుల వినియోగం, నదుల అనుసంధానం, భారీ ప్రాజెక్టుల నిర్మాణం వంటి అంశాలపై విశేషమైన అధ్యయనాలు చేసి కేంద్రానికి మార్గ నిర్దేశం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర సాగునీటి రంగ సలహాదారునిగా నియమితులైన ఈ జలయోధుడు 2017 ఏప్రిల్ 29 నాడు అనారోగ్యంతో కన్ను మూశారు.

– కొలనుపాక కుమారస్వామి । 99637 20669
(నేడు ఆర్. విద్యాసాగర్ రావు వర్ధంతి)

టూరిస్టులొస్తరు ఏమేమొ జెప్తరు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దుమీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల లైటు బుగ్గలు ఎల్గినయి. గా దినం ఎప్పటి లెక్కనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ. పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్ డబ్బ కాడ జమైతరు. గా దాని మీద గీ దాని మీద అన కుంట అన్నిటి మీద మాట్లాడుతుంటరు. గా దినం నేను బోక ముందు గాల్లు ఏం ముచ్చట బెట్టింగ్రో నాకెర్క లేదు. గాని నేను బోయినంక గాల్లు గీ తీర్గ మాట్లాడుకున్నరు.

"మంత్రి కుర్సి కోసం పానమియ్యమన్నా ఇస్తరు" అని యాద్గిరి అన్నడు.

"పానమిడ్సినోడు గూడ లేసి గూసుంటడు" అని సత్నారి అన్నడు.

"గదెట్ల?"

"అప్పల నర్సయ్య అనేటి ఒక లీడరున్నడు. గాయిన ఐదుపార్లు ఎమ్మెల్యే అయ్యిండు. గెల్సిన పతొక్క సారి గీపారి మంత్రి నైత అంటె గీపారి మంత్రి నైత అని గాయిన అనుకుండు."


"ఇంతకు గాయిన మంత్రి అయ్యిండా కాలేదా?"

"అనుకునుడే తప్పిడ్సి గాయినకు మంత్రి కుర్సి దొర్కలేదు. ఇగ దాంతోని ఐదోపారి గాయినకు హార్ట్ ఎటాకొచ్చింది. దవకానకు గొంచ బోతుండంగ నడ్మల గాయిన జీవిడ్సిండు. పీన్గను బొందల గడ్డకు దీస్క బో బట్టింగ్రు. దింపుడు కల్లెం కాడ పాడె దించింగ్రు. మిమ్ములను మంత్రిని జేసింగ్రు అని అప్పల నర్సయ్య పీన్గె చెవుల ఒక చెంచగాడు జెప్పిండు. దాంతోని సచ్చిన గాయిన జట్న లేసి గూసుండు."

"కర్నాటక అసెంబ్లి ఎలచ్చన్లు రాంగనే గోడదుంకుడు షురువైంది. బీజేపీ టికిట్ ఇవ్వకుంటె జగదీశ్ శెట్టర్ కాంగ్రెస్లకు దుంకిండు."

"గోడ దుంకుడు గిప్పటిది కాదు. రామాయన కాలమప్పటి సంది ఉన్నది. విబీషనుడు గోడ దుంకి రాముని దిక్కు బోయిండు. లంకకు రాజైండు. అందరు గాయినసుంటోల్లే ఉండరు. కర్నుని అసుంటోల్లు గూడ ఉంటరు. కిష్నుడు ఎంత గనం కోషిస్ జేసినా కర్నుడు గోడ దుంకలేదు. ఈశ్వరప్ప గూడ కర్నుని అసుంటోడే. బీజేపీ ఎమ్మెల్యే టికిట్ ఇయ్యకున్నా గాయిన కాంగ్రెస్లకు బోలేదు."

"బెంగులూర్ల మైసూర్ సిల్క్ శారీ సెంటర్ డిస్కౌంట్‌కు చీరెలు అమ్ముడు షురువు జేసింది. చీరెలను కొనెతందుకు ఆడోల్లు వొచ్చింగ్రు. ఇద్దరు ఆడోల్లకు ఒకే చీర నచ్చింది. గా చీర నాగ్కావాలంటె నాగ్కావాలని జుట్టు జుట్టు బట్టుకోని కొట్టుకున్నరు. కాంగ్రెస్ దిక్కు కెల్లి పోటీ జేస్తున్న సిద్దరామయ్య, డి.కె. శివకుమార్లకు ముక్యమంత్రి కుర్సి ఎక్కాలని ఉన్నది. ఆలు లేదు చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం



అన్న తీర్గ ఇంక కర్నాటక అసెంబ్లి ఎలచ్చన్లు గాలేదు. కాంగ్రెస్ పార్టి గెల్వలేదు. గని నేను ముక్యమంత్రిని అంటె నేను ముక్యమంత్రిని అనుకుంట కొట్లాట షురువు జేసింగ్రు."

"కర్నాటక అసెంబ్లి ఎలచ్చన్ల బిచ్చపోల్లు గూడ పోటి జేస్తున్నరట గదా."

"అవ్ జేస్తున్నరు. బిచ్చపోల్లకే ఓట్ల బిచ్చం బాగడుగొస్తది."

"అందుకేనా కొన్ని పార్టీలు ఓట్లు అడుగుట్ల బిచ్చపోల్లతోని గాల్ల లీడర్లకు ట్రేనింగ్ ఇప్పిస్తున్నది."

"అవ్ గంతేగాదు. నల్ల కాడ కొట్లాడే ఆడోల్లతోని తిట్టుట్ల ట్రేనింగ్ ఇప్పిస్తున్నరు. బైరూపు లోల్లతోని దినానికొక ఏసం గట్టుడు నేర్పిస్తున్నరు'."

"తడి బట్టలు గట్టుకోని ఏ గుడికి బోవాల్నో. ఎసువంటి ఒట్టు దినాల్నో రేవంత్ రెడ్డి నేర్పిస్తున్నడట గదా. గీ నడ్మ గాయిన ఎందుకు ఒట్టు దిన్నడు?"

"మునుగోడు ఎలచ్చన్లప్పుడు బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) కాంగ్రెసుకు ఇర్వై ఐదు కోట్లు ఇచ్చిందని ఈటెల రాజేందర్ అన్నడు. ఇగ దాంతోని నాకు ఎవ్వరు ఇర్వై ఐదు కోట్లు ఇయ్యలేదని రేవంత్ రెడ్డి అన్నడు. తడి బట్టలు గట్టుకోని బాగ్యలక్ష్మి గుడిల ఒట్టు దిన్నడు. ఒట్టు దినుడే గాకుంట పల్లపల్ల ఏడ్సిండు."

"రేవంత్‌కు కోట్ల రూపాయలు ఇచ్చినట్లు ఈటెల అనలేదు గదా. గాయిన అనంది గీయినకెందుకు బాద?"

"తెలంగాన కాంగ్రెస్ అంటెనే రేవంత్. రేవంత్ అంటేనే తెలంగాన కాంగ్రెస్."

"గట్లని ఎవ్వరంటున్నరు."

"ఎవ్వరంటలేరు. రేవంతే అనుకుంటున్నడు."

"గట్లెందుకనుకుంటున్నడు."

"గట్లనుకుంటెనే రేపొద్దుగాల్ల తెలంగానల కాంగ్రెస్ గిన గెలిస్తె గాయినకు ముక్యమంత్రి అయ్యేటి మోక దొరుకతది."

"రాస్ట్రంల ఇంటికొక కొల్వు ఇస్తమని బీఆర్‌ఎస్ సర్కార్ అన్నది. గని ఇచ్చిందా?"

"యాడిచ్చింది. ఇంటికొక కొల్వు గాదు. ఊరికొక కొల్వు గూడ ఇయ్యలేదు."

"ఒక్క ఇంటికే నాలుగు కొల్వులిచ్చింది. నీకెర్క లేదా? కేసీఆర్‌కు కొల్వు ఇచ్చింది. కేటీఆర్‌కు కొల్వు ఇచ్చింది. కవితకు కొల్వు ఇచ్చింది. హరీశ్ రావుకు కొల్వు ఇచ్చింది."

"మహారాష్ట్రల తెలంగాన మోడల్ సర్కార్ దెస్తం: కేసీఆర్. టూరిస్టులు వొస్తుంటరు, ఏమేమొ జెప్తుంటరు, గాల్ల మాటలు నమ్మొద్దు: కేటీఆర్. మొన్న గీ రొండు వార్తలు పత్రికల పక్క పక్కనే వొచ్చినయి."

గీ తీర్గ నాత్రి తొమ్మిది గొట్టెదాంక మా దోస్తులు ముచ్చట బెట్టింగ్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

ప్రజల మన్నన చూరగొంది!

సందర్భం



పురిఘళ్ల రఘురామ్

ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడినే ప్రజలు అనుసరిస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన కార్యక్రమాలు ఆయనను దేశ ప్రజల హృదయాల్లో తిరుగులేని నాయకుణ్ణి చేశాయి. ముఖ్యంగా మోదీ క్రమం తప్పకుండా, నెలకు ఒకమారు చొప్పున నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' ఆయనకు చిరకీర్తిని ఆర్జించి పెడుతోంది. ప్రజలతో తన మనోభావాలను పంచుకుంటూ... విభిన్న ప్రాంతాల ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తూ, వారికి దేశంపై ఉన్న విశ్వాసాన్నీ, సమాజం పట్ల ఉన్న అనురక్తినీ, అంకిత భావాన్నీ, బాధ్యతనూ గుర్తు చేస్తూ ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని ముందుకు సాగుతున్నారు. ఏప్రిల్ 30న ఈ కార్యక్రమ 100వ ఎపిసోడ్‌ను నిర్వహించడానికి ప్రధాని సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వాధినేత లేదా దేశాధినేత ఏదో ముఖ్యమైన సందర్భంలో తప్ప ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం మనం చూడలేదు. సాధారణంగా ఆ కార్యక్రమం వారి ప్రసంగంతోనే ముగిసేది. కానీ వారి ప్రసంగ కార్యక్రమంలో దేశ ప్రజలతో ముఖాముఖి మాట్లాడడం; ప్రజల అభిప్రాయాలు, సూచనలను తెలుసుకోవడం, స్వీకరించడం అనేది ఇంతకు ముందెన్నడూ చూడలేదు. సందర్భాన్ని బట్టి ప్రధాని ఆయా వర్గాలతో మాట్లాడి 'నేనున్నాన'నే భరోసా ఇవ్వడం ఈ కార్యక్రమం విజయం సాధించడంలో ప్రధాన కారకంగా నిలిచింది.



'మన్ కీ బాత్' ఇప్పటికి వంద కోట్ల మందికి పైగా శ్రోతలు వీక్షించినట్టు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), రోహ్‌తక్ నిర్వహించిన సమగ్ర అధ్యయనంలో తేలింది. ప్రోగ్రామ్ 100వ ఎడిషన్‌కు ముందు... ప్రసార భారతి విడుదల చేసిన ఐఐఎం గణాంకాల ప్రకారం... దేశ ప్రజల్లో 96 శాతం మందికి 'మన్ కీ బాత్' తెలుసునని రుజువయ్యింది. శ్రోతలు మోదీ... నాయకుడిగా జ్ఞాన వంతుడనీ, తమతో ఆయన భావోద్వేగ సంబంధాన్ని ఏర్పరుచుకున్నాడనీ భావిస్తున్నారు. ఆయన తన అభిప్రాయాలను ప్రభావవంతంగా, నిర్ణయాత్మకంగా, ప్రజలకు వివరించగలిగారన్న నమ్మకం కుదిరింది. 'మన్ కీ బాత్' వినడం వల్ల, బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రజల్లో మార్పు వచ్చినట్టు సర్వే ధృవీకరించింది. ఈ కార్యక్రమం ద్వారా 'భారత దేశ విజయాలు', 'సామాన్య పౌరుల గాథలు', 'సాయుధ బలగాల ధీరత్వం', 'యువత సమస్యలు' చర్చకు వచ్చాయి. ప్రతి నెలా చివరి ఆదివారం ఈ కార్యక్రమం ప్రసారమవుతోంది. 2014 అక్టోబర్ 3న ప్రారంభమైన ఈ కార్యక్రమం రేపు ఆదివారం వందవ ఎపిసోడ్‌ను పూర్తి చేసుకోనుండడం ముదావహం.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు
(రేపటికి 100వ ఎడిషన్‌లోకి ప్రవేశిస్తున్న 'మన్ కీ బాత్')

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.నవమి ప.4.58 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.11.46 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.1.03 నుండి 2.47 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.41 నుండి 7.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.01 నుండి 11.43 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.14.

టీచర్లుగా బీటెక్‌బాబులు వద్దా?

- కనిపించని బీటెక్ కాలమ్
- గురుకుల టీచర్ల దరఖాస్తులో కానరాని వైనం
- బీఈడీ చేసి, టెట్ పాసైన బీటెక్ అభ్యర్థుల వెతలు
- గతంలో టీజీటీ పోస్టుకు అర్హులేనంటూ హైకోర్టు ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీటెక్ చదివి టీచర్లు అవుదామనుకున్న వారి కలలు నెరవేరేలా లేవు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన పలువురు అభ్యర్థులు తాజాగా గురుకులాల్లో టీచర్ల కోసం దరఖాస్తు చేసుకుందామని ప్రయత్నించి విఫలమవుతున్నారు. కారణం .. ఓటీఆర్‌లో విద్యార్హతల వద్ద బీఎస్సీ, బీఏ, బీకామ్ వంటి డిగ్రీలు ఉంచిన వెబ్‌సైట్‌లో.. బీటెక్ అన్న కాలమ్ అసలు పొందుపరచనే లేదు. తాము ఎంతో కష్టపడి రెండేళ్ల బీఈడీ కోర్సు పూర్తి చేశామని, టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్ష కూడా పాసయ్యామని, తీరా ఇపుడు తమకు దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించకపోవడం అన్యాయమంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2019లో తెలంగాణ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో టీచర్ పోస్టులకు తమను అనుమతించడం లేదంటూ కొందరు బీటెక్‌తోపాటు, బీఈడీ చేసిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. అపుడు కూడా ఇదే తరహాలో దరఖాస్తులో తమకు బీటెక్ కాలమ్ కనిపించ లేదని చెప్పారు. దీనికి ప్రభుత్వం సమాధానమిస్తూ.. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) 2010 మార్గదర్శకాల ప్రకారమే తాము నోటిఫికేషన్ జారీ చేశామని తేల్చిచెప్పింది. దీనిపై స్పందించిన హైకోర్టు ఎన్‌సీటీఈ–2014 మార్గదర్శకాల ప్రకారం.. బీటెక్‌తోపాటు బీఈడీ చేసినవారంతా టీజీటీ పోస్టులకు అర్హులేనని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధిపతులను ఆదేశించింది.

మళ్లీ ఇప్పుడూ అదే సమస్య

గతంలో ఇదే వ్యవహారంపై హైకోర్టు వరకూ వెళ్లిన నేపథ్యంలో ఈసారి టీచర్ పోస్టులకు సంబంధించి వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అనుకున్నారు. కానీ, తీరా దరఖాస్తు ఫారం ఓపెన్ చేసే సరికి తిరిగి అదే సమస్య పునరావృతమవడంతో తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై పలువురు బీటెక్–బీఈడీ అభ్యర్థులు తొలుత గురుకుల కార్యాలయాలకు వరుసగా ఫోన్లు చేసినా.. ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. కొందరు అధికారులు అయితే.. బీటెక్ బీఈడీ వారికి అసలు అర్హతే లేదని, మీరు దరఖాస్తు చేసుకోవద్దని చెబుతున్నారని వారు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నైపుణ్య డిగ్రీలతో బంగారు భవిత

- అందుకే రాష్ట్రంలో స్కిల్ ఆధారిత డిగ్రీ కోర్సులకు శ్రీకారం చుట్టాం: ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి

సాక్షి, హైదరాబాద్: సంప్రదాయ డిగ్రీ కోర్సులకు నైపుణ్యాలు జోడిస్తే, మార్కెట్‌లో తిరుగులేని ఉపాధి లభిస్తుందని, ఈ దిశగానే రాష్ట్రంలో స్కిల్ ఆధారిత డిగ్రీ కోర్సులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించినట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు. ఉన్నత విద్యా మండలి, సెంటర్ ఫర్ రీసెర్చ్ స్కీమ్స్ అండ్ పాలసీస్ (సీఆర్ఎస్‌పీ) ఆధ్వర్యంలో శుక్రవారం 'ఉన్నత విద్యలో పారిశ్రామిక నైపుణ్యాల ఏకీకృత విధానం'పై వర్క్‌షాప్ జరిగింది. ఆర్ లింబాద్రి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచే స్కిల్ ఓరియెంటేషన్ డిగ్రీ కోర్సులను కొన్ని కాలేజీల్లో ప్రవేశపెట్టబోతున్నట్టు తెలిపారు. కాగా, ఈ వర్క్‌షాప్‌లో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు చెందిన విద్యారంగ నిపుణులు పాల్గొన్నారు. సాధారణ డిగ్రీ కోర్సులను నైపుణ్యాలతో అందించే దిశగా కేంద్రం కొన్ని స్కిల్ కోర్సులను అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై వర్క్‌షాపులో నిపుణులు చర్చించారు. కోర్సులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, పరిశ్రమల్లో నైపుణ్యాలు పొందే వెసులుబాటు అవకాశాలు, బోధన ప్రణాళికలో తేవాల్సిన మార్పులపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

మే 1న విద్యారంగనిపుణుల భేటీ

మే 1వ తేదీన ఈ కోర్సులకు సంబంధించి మరోసారి భేటీ అవ్వాలని నిర్ణయించారు. ఆ భేటీలో కార్యాచరణ చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు పాల్గొన్నారు. రిటైలర్స్ అసోసియేషన్ సీఈవో జేమ్స్ రాఫెల్, వివిధ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ సీఈవోలు అభిలాష, రవికాంత్, ప్రవీణ్ సక్సేనా, సిద్ధిఖీ, ఆశిష్ జైన్, ఈశ్వర్‌పూజార్, అమిత్‌సింగ్ పలు సెక్టార్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. పలు వర్సిటీల వీసీలు ప్రొఫెసర్ డీ రవీందర్, ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ మల్లేశ్, ప్రొఫెసర్ విజ్జులత, కాలేజీల ప్రిన్సిపాళ్లు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

జూన్ 5లోగా స్టేటస్ రిపోర్టు సమర్పించండి

▶ మొదటి పేజీ తరువాయి

విచారణ జరిపించాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తో పాటు మరో ఇద్దరు నిరుద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సిట్ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు.

హైదరాబాద్ సీపీ పర్యవేక్షణలోనే సిట్ విచారణ..

ఫోరెన్సిక్ రిపోర్టు కోసం వేచి చూస్తున్నామని, సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదిక రావాల్సి ఉందని ఏజీ తెలిపారు. దీని కారణంగానే కేసు దర్యాప్తు కొంత ఆలస్యం అవుతోందని వెల్లడించారు. ఇప్పటికే సిట్ సమర్పించిన స్టేటస్ నివేదికలను పరిశీలించామని.. సీనియర్ ఐపీఎస్ అధికారిని విచారణలో భాగస్వామిని చేయాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అయితే హైదరాబాద్ సీపీ పర్యవేక్షణలోనే సిట్ విచారణ సాగుతోందని ఏజీ బదులిచ్చారు. టీఎస్‌పీఎస్సీలో ఎంత మంది ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్నారు? రెగ్యులర్ ఉద్యోగులు ఎంత మంది? ఇందులో ఎంత మంది పరీక్ష రాశారు? వీరంతా నో ఆబ్లిగేషన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) తీసుకున్నారా? ఎంత మందికి 100 మార్కులకు కంటే ఎక్కువ వచ్చాయి అని న్యాయమూర్తి ప్రశ్నించారు. దీనికి ఏజీ బదులిస్తూ.. 18 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షలకు హాజరయ్యారన్నారు. అయితే వీరిలో ఒక్కరు మాత్రమే ఎన్ఓసీ తీసుకున్నారని చెప్పారు. మిగతా వారిని ప్రశ్నించామన్నారు. వీలైనంత త్వరలో సిట్ తుది నివేదిక సమర్పిస్తుందని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను జూన్ 5కు వాయిదా వేశారు. ఏజీ వెంట సిట్ సభ్యుడు ఏసీపీ నరసింగరావు కోర్టుకు హాజరయ్యారు.

సిట్ కస్టడీకి తండ్రీకొడుకులు

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో నిందితుల నుంచి ఏఈ పరీక్ష పేపర్ కొనుగోలు చేసిన ఆరోపణలపై అరెస్టు అయిన తండ్రీకొడుకులు మైబయ్య, జనార్దన్‌లను సిట్ అధికారులు శుక్రవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలానికి చెందిన వీరిని గత వారం అరెస్టు చేసిన విషయం విదితమే. తన కుమారుడి కోసం డాక్యా నాయక్ నుంచి రూ.6 లక్షలకు పేపర్ కొనేందుకు ఒప్పందం చేసుకున్న మైబయ్య రూ.2 లక్షలు చెల్లించాడు. ఈ పేపర్ ఆధారంగా సిద్ధమైన జనార్దన్ ఏఈ పరీక్ష రాశాడు. వీరి నుంచి ఈ పేపర్ మరెవరికైనా చేరిందా అనే కోణంలో సిట్ అధికారులు ఇరువురినీ విచారించనున్నారు.

తెలంగాణ వర్సిటీ వీసీ అక్రమాలపై విచారణ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ రూసా భవనంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, ఆ శాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ పాలకమండలి సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ముందుగా ఈ సమావేశానికి హాజరైన వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. అనంతరం వీసీ అక్రమాలపై విచారణ కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రకళ, నలుగురు ఈసీ మెంబర్లతో కలిపి పాలకమండలి కమిటీని ఏర్పాటు చేసింది. అనంతరం ఈ నెల 26న జరిగిన పాలకమండలి సమావేశంలో ఏ విధంగా విచారణ జరపాలనే విషయమై కమిటీ సభ్యులకు మార్గనిర్దేశనం చేశారు.

ఈసీ నిర్ణయాలు తాత్కాలికంగా రద్దు చేసిన హైకోర్టు

ఈ నెల 19న జరిగిన తెలంగాణ యూనివర్సిటీపాలక మండలి(ఈసీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు మధ్యంతరంగా రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వీసీ ప్రొఫెసర్ రవీందర్ తెలిపారు. ఈ సమావేశంలో వీసీ అధికారాలు తగ్గించడం, ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా విద్యావర్ధినిని తొలగించి ప్రొఫెసర్ యాదగిరిని నియమించడం, వీసీపై వచ్చిన ఆరోపణల విచారణకు ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు వంటి నిర్ణయాలను ఈసీ తీసుకున్న విషయం తెలిసిందే. ఈసీ నిర్ణయాలపై తాను హైకోర్టును ఆశ్రయించగా, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని వీసీ తెలిపారు. అయితే, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కోర్టులో కౌంటర్ దాఖలు చేస్తుందని ప్రొఫెసర్ యాదగిరి తెలిపారు.

దరఖాస్తులు 3.20 లక్షలు

- ఎంసెట్‌కు అప్లికేషన్ల వెల్లువ
- గతేడాది కన్నా 20 శాతం ఎక్కువ
- ఏపీ నుంచి 72 వేలకు పైగా దరఖాస్తులు
- కోవిడ్ కాలంలో అందరూ టెన్త్ పాస్.. వాళ్లే ఇప్పుడు ఎంసెట్‌కు
- రాష్ట్ర కాలేజీల్లో కంప్యూటర్ కోర్సులపై విద్యార్థుల దృష్టి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌కు ఈసారి భారీగా దరఖాస్తులొచ్చాయి. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, మెడికల్‌లోనూ ఇదే ట్రెండ్ కన్పిస్తోంది. ఇప్పటివరకూ రెండు విభాగాలకు కలిపి 3,20,310 అప్లికేషన్లు అందాయి. ఇందులో తెలంగాణకు చెందినవి 2,48,146, ఏపీవి 72,164 ఉన్నాయి. గత సంవత్సరం (2022) మొత్తం 2,66,714 దరఖాస్తులే రావడం గమనార్హం. కాగా ఈ ఏడాది అనూహ్యంగా 53,224 దరఖాస్తులు (20%) పెరగడంతో ఆ మేరకు పరీక్ష కేంద్రాల పెంపుపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. దేశవ్యాప్తంగా 2019 చివరలో కోవిడ్ విజృంభించడం, రెండేళ్ళ పాటు విద్యా సంస్థలు సరిగా నడవకపోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2021లో టెన్త్ వార్షిక పరీక్షలు నిర్వహించకుండా అందరినీ పాస్ చేశారు. ఎప్పటిలాగే పరీక్షలు జరిగితే 20 శాతం వడపోత అక్కడే జరిగేది. కానీ పరీక్షలు లేకపోవడంతో విద్యార్థులు చాలావరకు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు తీసుకున్నారు. వీళ్ళే ఇంటర్ పూర్తి చేసుకుని ఇప్పుడు ఎంసెట్ రాస్తున్నారు. అంటే ఎంసెట్ దరఖాస్తులు పెరగడానికి 'అంతా పాస్' దోహదపడిందన్న మాట.

2018 నుంచి ఎంసెట్‌కు దరఖాస్తులు ఇలా..

సంవత్సరం	ఇంజనీరింగ్	అగ్రి, మెడికల్
2018	1,47,912	73,078
2019	1,42,210	74,981
2020	1,43,265	78,981
2021	1,64,963	86,641
2022	1,72,238	94,476
2023	2,04,734	1,14,832

(రెండు కోర్సులకు అందిన దరఖాస్తులు వీటికి అదనం. కాగా ఈ ఏడాది ఎంసెట్‌కు ఫైన్‌తో దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా గడువు ఉంది)

ఏ రాష్ట్రం నుంచి ఎన్ని దరఖాస్తులు?

రాష్ట్రం	ఇంజనీరింగ్	అగ్రి, మెడికల్
తెలంగాణ	1,53,676	94,470
ఆంధ్రప్రదేశ్	51,430	20,734

'కంప్యూటర్' క్రేజ్ కూడా కారణమే..



జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి జేఈఈ రాయాల్సి ఉంటుంది. ఇందులో ర్యాంకు రావాలంటే బాగానే కష్టపడాలి. ముమ్మర కోచింగ్ తీసుకోవాలి. ఇంతా చేసి సాధారణ ర్యాంకు వస్తే కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో సీట్లు లభించడం కష్టం. ఈ కారణంగానే ఇంటర్ ఉత్తీర్ణుల్లో సగానికిపైగా జేఈఈ వైపు వెళ్ళడం లేదు. ఎలాగైనా కంప్యూటర్ సంబంధిత ఇంజనీరింగ్ కోర్సు చేయాలనుకుంటున్న వారు ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎంసెట్‌కు 3 లక్షల మంది దరఖాస్తు చేస్తే, జేఈఈకి 1.40 లక్షల మందే దరఖాస్తు చేయడం గమనార్హం. మరోవైపు విద్యార్థుల అభిమతానికి అనుగుణంగా రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలు కూడా ట్రెండ్ మార్చాయి. సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో సీట్లు తగ్గించుకుంటున్నాయి. వీటి స్థానంలో సీఎస్‌సీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సుల్లో సీట్లు పెంచుకుంటున్నాయి. దీంతో ఎంసెట్‌లో అర్హత సాధిస్తే ఏదో ఒక కాలేజీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు అనువైన కంప్యూటర్ కోర్సు సీటు వస్తుందని విద్యార్థులు భావిస్తున్నారు.ఎంసెట్‌కు దరఖాస్తులు పెరగడానికి ఇది కూడా ఒక కారణమని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రాజధాని చుట్టే ఎంసెట్

ఎంసెట్ కోసం మొత్తం 21 జోన్లు ఏర్పాటు చేశారు. ఇందులో 16 జోన్లు తెలంగాణలో, 5 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. తెలంగాణలో ఉన్న జోన్లలో ఐదు హైదరాబాద్ కేంద్రంగానే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,48,146 ఎంసెట్ దరఖాస్తులొస్తే, హైదరాబాద్ కేంద్రంగానే 1,71,300 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాల్లోనే జూనియర్ కాలేజీలు ఎక్కువగా ఉన్నాయి. కార్పొరేట్ కాలేజీల దృష్టీ ఇక్కడే ఉంటోంది. టెన్త్ పూర్తవ్వగానే ఇంటర్ విద్యాభ్యాసానికి, ఎంసెట్ శిక్షణకు హైదరాబాదే సరైన కేంద్రమని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ కారణంగానే పిల్లల్ని హాస్టళ్ళలో ఉంచి మరీ చదివిస్తున్నారు. ఫలితంగా హైదరాబాద్ కేంద్రంగానే ఎంసెట్ రాసేవారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

రెండు రాష్ట్రాల్లోనూ పరీక్ష కేంద్రాల పెంపు!



ఎంసెట్ దరఖాస్తులు అనూహ్యంగా పెరగడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు ప్రాంతాల్లోనూ పరీక్ష కేంద్రాలు పెంచాలనే ఆలోచనతో ఉన్నాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరీక్ష నిర్వహించే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. తెలంగాణలో ఇంటర్ వెయిటేజ్ ఎత్తివేయడంతో ఈసారి ఏపీ నుంచి దరఖాస్తులు పెరిగాయి.

– ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి (వీసీ, జేఎన్‌టీయూహెచ్)

హెచ్‌సీయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు ప్రకటన

- దరఖాస్తు గడువు మే 25
- జూన్ 17, 18 తేదీల్లో పరీక్షలు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 2023–24 విద్యా సంవత్సరానికిగాను పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆలిండియా ప్రవేశ పరీక్ష (నెట్/జేఆర్ఎఫ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు పీహెచ్‌డీకి అర్హులు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. మే 1 నుంచి మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. జూన్ 10 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 17, 18 తేదీల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పీహెచ్‌డీ కోర్సులు, అర్హత ప్రమాణాలు, నిర్ణీత రుసుము, రిజర్వేషన్ విధానం, ప్రాస్పెక్టస్ 2023–24తో సహా మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని అధికారులు సూచించారు.

పేస్కేల్‌కు ఉపాధి ఉద్యోగుల వినతి

సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలని ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఎ.లింగయ్య, కో–చైర్మన్లు అంజిరెడ్డి, విజయ్ వెంకటరామిరెడ్డి, మోహన్‌రావు, రఘు కలిసి వినతి పత్రం సమర్పించారు. విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారని జేఏసీ నేతలు తెలిపారు.

క్లుప్తంగా

మనీ లాండరింగ్ కేసులో సిసోడియాకు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ నాయకుడు మనీశ్ సిసోడియాకు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ కోర్టు లనిరాకరించింది. కుంభకోణంలో ఆయన పాత్రపై స్పష్టమైన ప్రాథమిక ఆధారాలున్నాయని ప్రత్యేక జడ్జి ఎం.కె.నాగపాల్ అన్నారు. భార్యకు అనారోగ్యం బెయిల్ ఇచ్చేందుకు ఆధారం కాబోదన్నారు.

తైవాన్ సమీపంలో భారీగా చైనా విమానాలు, నౌకలు

తైపీ: చైనా మరోసారి ప్రతీకార చర్యలకు దిగింది. గురువారం అమెరికా నేవీకి చెందిన పి–8ఏ పొసెడాన్ యాంటీ సబ్‌మెరీన్ గస్తీ విమానం చైనా– తైవాన్‌లను విడదీసే తైవాన్ జలసంధి మీదుగా చక్కర్లు కొట్టడం ఆ దేశానికి మింగుడుపడటం లేదు. దీంతో, శుక్రవారం యుద్ధ విమానాలను, నేవీ షిప్‌లను పెద్ద సంఖ్యలో తైవాన్ సమీపంలోకి పంపించి, బెదిరింపు చర్యలకు దిగింది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్‌ఏ)కి చెందిన 38 ఫైటర్ జెట్లు, ఇతర యుద్ధ విమానాలు తమ భూభాగానికి అత్యంత సమీపంలోకి వచ్చినట్లు తైవాన్ రక్షణ మంత్రి శుక్రవారం తెలిపారు. ఈ నెలారంభంలో భారీగా సైనిక విన్యాసాలు చేపట్టిన తర్వాత పెద్ద సంఖ్యలో విమానాలు, నౌకలను తైవాన్ సమీపంలోకి తరలించడం ఇదే మొదటిసారి.

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు.. 22 మంది దుర్మరణం



కీవ్: రష్యా దాడుల్లో శుక్రవారం 22 మంది ఉక్రేనియన్లు దుర్మరణం పాలయ్యారు. ఉమాన్‌లో 9 అంతస్తుల నివాస భవనంపై క్షిపణి దాడిలో ముగ్గురు చిన్నారులతో పాటు 20 మంది చనిపోయారు. ఇప్పటిదాకా యుద్ధ ఛాయలు కనిపించని ఈ నగరంపై రష్యా తొలిసారి లాంగ్‌రేంజ్ క్షిపణులను ప్రయోగించింది. మరోవైపు 2 నెలల తర్వాత రాజధాని కీవ్‌లోని ఓ నివాస భవనంపై క్షిపణి దాడి జరిగింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన 21 క్రూయిజ్ మిస్సైళ్లను, రెండు డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ అధికారులు ప్రకటించారు. నీప్రో నగరంలోని నివాస ప్రాంతాలపై రష్యా బలగాల దాడిలో రెండేళ్ల చిన్నారి, ఆమె తల్లి చనిపోగా మరో నలుగురు గాయపడినట్లు గవర్నర్ చెప్పారు. ఈ దాడులతో ఉద్దేశపూర్వకంగా బెదిరించేందుకు రష్యా ప్రయత్నిస్తోందని ఉక్రెయిన్ అంటుండగా తమ దీర్ఘ శ్రేణి క్షిపణులు లక్ష్యాలను ఛేదించినట్లు రష్యా చెబుతోంది. రష్యా ఆక్రమిత డొనెట్స్క్‌పై ఉక్రెయిన్ బలగాల రాకెట్ దాడిలో ఏడుగురు పౌరులు దుర్మరణం చెందినట్లు నగర మేయర్ చెప్పారు.

బైడెన్.. బైడెన్.. బై బై

ఎందుకు చెప్పలేదు?

చట్టం తన పని తాను చేసుకుపోతున్నట్టే కాలమూ తన మానాన తాను పరిగెడుతూనే ఉంటుంది. ఎవరి కోసమూ ఆగదు. ఈ పరుగెత్తే కాలమే ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కాళ్లకు అడ్డం పడుతోంది. అయినా సరే, 80 ఏళ్ల బైడెన్ ఆగేదే లేదంటున్నారు. 'అప్పుడేనా...!' అంటూ మరో విడత అధ్యక్ష పదవికి సిద్ధమయ్యారు. 2024 అధ్యక్ష ఎన్నికల బరిలో డెమొక్రాట్ల అభ్యర్థిని తానేనని మొన్న మంగళవారం ఆయన అధికారకంగా ప్రకటించేశారు. ఎదురు పడేది టెంపరి డొనాల్డ్ ట్రంపే కదా, ఇంకోసారి ఓడించలేనా అన్నది ఆయన ధీమా. 'ఆయనకు 76, నాకు 80... అంతే కదా' అన్నది ఆయన ధైర్యం. అంతేగానీ, ఇక కొత్త తరానికి వదిలేద్దామన్న భావన మాత్రం ఇద్దరిలోనూ లేకపోవడం గమనార్హం. డొనాల్డ్ ట్రంప్ విషయంలో చట్టం, ప్రెసిడెంట్ బైడెన్ విషయంలో కాలం తమ మానాన తమ పని చేసుకుంటూ వెళ్లిపోతూనే ఉంటాయి. గిర్రున ఏడాది తిరిగేసరికి ఎన్నికల నగారా మోగుతుంది. గెలుపెవరిదో, ఓడేదెవరో మళ్లీ కాలమే చెబుతుంది...

ఎస్.రాజమహేంద్రారెడ్డి

రెండో ప్రపంచ యుద్ధం భీకరంగా సాగుతున్న కాలంలో, అమెరికా ఆ యుద్ధ మైదానంలోకి దిగిన ఏడాదికి 1942లో బైడెన్ జన్మించారు. కాలచక్రం మరో 30 ఏళ్లు తిరిగేసరికి 1973లో తొలిసారి సెనేటర్ అయ్యారు. అప్పటికి వైట్‌హౌస్‌లో రిచర్డ్ నిక్సన్ కొలువుదీరి ఉన్నారు. అత్యంత పిన్న వయసు సెనేటర్‌గా చరిత్ర సృష్టించిన బైడెన్‌కు, 15 ఏళ్లు విరామం లేకుండా ఆ పదవిలో కొనసాగాక 'నేనెందుకు శ్వేతసౌధంలో అడుగుపెట్టకూడదు?' అన్న ఆలోచన వచ్చింది. 1988లో ఆ ముచ్చటా తీర్చుకుందామనుకున్నా పరిస్థితులు అనుకూలించలేదు. డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి రేసులో ముందు వరుసలో నిలిచి ముచ్చటగా మూడు నెలలు ముమ్మరంగా ప్రచారం కూడా చేసుకున్నాక అనివార్యంగా, అర్ధంతరంగా వైదొలగాల్సి వచ్చింది. ఆ సమయానికి అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్నయుద్ధం ఇంకా ముగియలేదు. ఇక్కడ సీన్ కట్ చేస్తే, 2020లో బైడెన్ 78 ఏళ్ల వయసులో వైట్‌హౌస్ మెట్లెక్కి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆ వయసులో అధ్యక్షుడు కావడం కూడా అమెరికా చరిత్రలో రికార్డే. తన రికార్డును తానే బద్దలు కొట్టేందుకు ఈ డెలావర్ పెద్దాయన బరిలో దిగుతున్నారు. గెలిచి తీరతానన్న ఆత్మవిశ్వాసమే ఆయనను ముందుకు నడిపిస్తోంది. ఈ ధీమా వెనక పలు కారణాలున్నాయి.



మళ్లీ ట్రంపే ప్రత్యర్థి అవుతారని...

దూకుడుకు కాసింత దుందుడుకుతనం కలిపితే డొనాల్డ్ ట్రంప్. అదే ఆయన స్వభావం. అదే ఆయన పెట్టుబడి కూడా. ఒకసారి తన చేతిలో ఓడిన ఈ ట్రంపే ఈసారి కూడా తన రిపబ్లికన్ ప్రత్యర్థి అని బైడెన్ ఫిక్సయిపోయారు. రిపబ్లికన్ పార్టీ తమ తుది అభ్యర్థిని ఇంకా ప్రకటించకపోయినా, ట్రంప్‌కే చాన్స్ దక్కే సూచనలు పుష్కలంగా ఉన్నాయి. సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నికీ హేలీ, టెక్ దిగ్గజం వివేక్ రామస్వామి, రేడియో హోస్ట్ లారీ ఎల్డర్, అర్కన్సాస్ మాజీ గవర్నర్ అసా హచిన్సన్ ప్రధానంగా ఆయనతో పోటీ పడుతున్నారు. వీరిలో నికీ హేలీ నుంచే ట్రంప్‌కు కొంచెం గట్టి పోటీ ఎదురవ్వచ్చు. ట్రంప్‌ను పక్కకు నెట్టి బరిలోకి దిగుతాడనుకున్న ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించే యోచనలో ఉన్నట్టు లేరు. మొత్తమ్మీద బైడెన్ ప్రత్యర్థిగా ట్రంప్ దాదాపుగా ఖాయమైనట్టే. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓడినా తానే గెలిచానని డాంబికాలు పలికి, కేపిటల్ హిల్‌పై దాడికి తన అభిమానులను, రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలను ఉసిగొల్పడంతో ట్రంప్ గ్రాఫ్ దారుణంగా పడిపోయిందన్నది బైడెన్ అంచనా. అపప్రథ మూటగట్టుకున్న ట్రంప్‌ను ఓడించడం ఈసారి మరింత తేలికని ఆయన భావిస్తున్నారు. మీద పడుతున్న వయసును లెక్కచేయకుండా బైడెన్ ముందుకురకడానికి ఇదే ప్రధాన కారణం. పోర్న్ నటికి డబ్బుల చెల్లింపు విషయంలో ట్రంప్‌ను కోర్టు ముద్దాయిగా ప్రకటించడమూ తనకు లాభిస్తుందని ఆశపడుతున్నారు. అయితే ట్రంప్‌ను అన్యాయంగా ఈ కేసులో ఇరికించారని రిపబ్లికన్లలో చాలామంది నమ్ముతుండటంతో ఆ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ఆయన అవకాశాలు మరింత మెరుగయ్యాయన్నది విశ్లేషకుల అంచనా. రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుల్లో ట్రంప్ హవా కొనసాగుతున్నా ప్రజల్లో మాత్రం ఆయన పట్ల అసంతృప్తి పెరిగిందన్నది డెమొక్రాట్ల వాదన. 2018 నుంచీ ట్రంప్ పయనం ఓటమి బాటలోనే సాగుతుండటం గమనార్హం. 2018 మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు సెనేట్‌ను, హౌజ్‌ను రెండింటినీ కోల్పోయారు. 2020లో అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి చవిచూశారు. 2022 మిడ్ టర్మ్ ఎన్నికల్లోనూ ట్రంప్ సారథ్యం వల్ల పార్టీ అనూహ్య పరాజయం చవిచూసింది. మొత్తమ్మీద రిపబ్లికన్లకు ట్రంప్ గుదిబండగా తయారవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోర్టు కేసులు ట్రంప్‌కు కొత్త ఊపిరిలూదినా ఆయనను ఓడించడం తనకొక్కడికే సాధ్యమని బైడెన్ నొక్కివక్కాణిస్తున్నారు. ఇప్పటికే ఒకసారి ఓడించి చూపించానని పదేపదే చెబుతున్నారు. వయసుదేముంది, అదో అంకె మాత్రమేనన్నది ఆయన భావన. వచ్చే ఏడాది బరిలో దిగే సమయానికి ట్రంప్‌కు 78 ఏళ్లొస్తాయి. తనకన్నా నాలుగేళ్లే చిన్న కదా అంటారు బైడెన్. ఒకవేళ అంచనాలన్నీ తారుమారై ట్రంప్‌కు రిపబ్లికన్ అభ్యర్థిత్వం దక్కకున్నా ఆయన స్వతంత్రుడిగా బరిలోకి దిగడం ఖాయం. రిపబ్లికన్ మద్దతుదార్ల ఓట్లు చీలడం తథ్యం. అదే జరిగితే బైడెన్ పని మరింత సులువవుతుంది.

ఓటు 'విచ్ఛిత్తి'

అబార్షన్ల (గర్భవిచ్ఛిత్తి) చట్టబద్ధత చెల్లదని రిపబ్లికన్స్ అనుకూల సుప్రీంకోర్టు తేల్చిచెప్పడం కూడా డెమొక్రాట్లకు రాజకీయంగా లాభించింది. అబార్షన్లు అనైతికమని రిపబ్లికన్లు బాహాటంగా ప్రచారం చేసి స్వేచ్ఛావాదులు, స్త్రీవాదుల ఆగ్రహానికి గురయ్యారు. తన దేహం మీద స్త్రీకే పూర్తి హక్కుంటుందని, అబార్షన్ చేయించుకోవాలా, వద్దా అన్నది ఆమె ఇష్టాయిష్టాల మీదే ఆధారపడి ఉంటుందనేది బైడెన్ టీమ్ వాదన. సనాతనవాదులు, మతవాదులకు ఇది రుచించకపోయినా ప్రజల్లో అధిక భాగం బైడెన్‌తో ఏకీభవించారు. ఈ పరిణామం వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుంది. అబార్షన్ల చట్టబద్ధతను తిరస్కరిస్తూనే, ఆయా రాష్ట్రాలు తమ అభీష్టం మేరకు దాన్ని అమలు చేసే వెసులుబాటును సుప్రీంకోర్టు కల్పించడం గమనార్హం. అమెరికావ్యాప్తంగా ఈ తీర్పుకు అనుకూల, ప్రతికూల ప్రదర్శనలు మిన్నంటాయి. రిపబ్లికన్ పాలిత కాన్సాస్, కెంటకీ, మోంటానా రాష్ట్రాలు ఆగమేఘాల మీద అబార్షన్లపై ఉక్కుపాదం మోపాయి. డెమొక్రటిక్‌పాలిత కాలిఫోర్నియా, మిషిగన్, వెర్మోంట్ అబార్షన్ హక్కుల పరిరక్షణకు ప్రతినబూనాయి. ఈ పరిణామాలు ఓటర్లనూ రెండు వర్గాలుగా చీల్చాయి. సుప్రీం తీర్పు తర్వాత జరిగిన మిడ్ టర్మ్‌లో రిపబ్లికన్ల ఓటు బ్యాంకు చెల్లాచెదురు కావడానికి ఇదే ప్రధాన కారణమైంది. అబార్షన్ వ్యతిరేకతను రాజకీయ నినాదంగానే భావించిన రిపబ్లికన్ పార్టీ, ప్రజలు ఇంతగా ప్రభావితమవుతారని అంచనా వేయలేకపోయింది. పరోక్షంగా డెమొక్రాట్లకు అదనపు లాభం చేకూరింది. అబార్షన్లపై రిపబ్లికన్ల వైఖరే తన విజయానికి రెండో మెట్టు అవుతుందని బైడెన్ గట్టిగా నమ్ముతున్నారు.

అనుకూల ఓటు పదిలం

బైడెన్ విజయావకాశాలను ప్రభావితం చేసే పై రెండు అంశాలు ట్రంప్ వ్యతిరేక ఓటుతో ముడిపడి ఉన్నాయి. సగటు ఓటరును తమవైపు తిప్పుకునే మంచి పనులు కూడా బైడెన్ గత రెండేళ్లలో చాలానే చేశారు. అనుకూల ఓటు, కొత్త ఓటును పదిలం చేసుకోవడానికి ఇవి అండగా నిలుస్తాయి. ట్రంప్ పాలనలో అమెరికాను ఉక్కిరిబిక్కిరి చేసిన కరోనాను బైడెన్ సమర్థంగా అరికట్టి పార్టీలకతీతంగా ప్రజల మన్ననలు అందుకున్నారు. దిగుమతుల మీద ఆధారపడకుండా స్వదేశీ తయారీ 'మేడిన్ అమెరికా' భావానికి బహుళ ప్రచారం కల్పించారు. ఆ దిశగా మాన్యుఫాక్చరింగ్ యూనిట్ల స్థాపనకు బిల్లు తెచ్చారు. వైద్య చికిత్స ఖర్చులను తగ్గించడంతో పాటు ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకున్నారు. విదేశీ వ్యవహారాల్లోనూ చెప్పుకోదగ్గ ప్రగతి సాధించారు. నాటోకు వెన్నుదన్నుగా, ఉక్రెయిన్‌కు అండగా నిలిచి రష్యాను నిలువరించడం గమనించదగ్గవి. ప్రపంచంపై తన పెత్తనాన్ని నిలుపుకోవాలంటే చైనాపై ఓ కన్నేసి ఉంచాలనే సూక్ష్మాన్ని కూడా బైడెన్ గుర్తించడం విశేషం. వచ్చే ఎన్నికల్లో ఈ అంశాలన్నీ తనకు అనుకూలంగా ఓటుబ్యాంకును సుస్థిరం చేస్తాయనే నమ్మకమే బైడెన్‌ను ఎన్నికలవైపు నడిపిస్తోంది.

కొస మెరుపు

బైడెన్‌కు ఇన్ని అనుకూలతలున్నా ట్రంప్‌కు 2020 ఎన్నికల్లో 7.4 కోట్ల ఓట్లు వచ్చాయన్నది తోసిపుచ్చలేని అంశం. రిపబ్లికన్లు ట్రంప్‌ను పక్కన పెట్టి అనూహ్యంగా తమ తురుపు ముక్క డిసాంటిస్‌ను తెరపైకి తెస్తే మాత్రం బైడెన్ వయసు చర్చనీయాంశంగా మారుతుంది. అన్నీ మంచి శకునములేనని బైడెన్ భావిస్తున్నా ఆర్థిక నిర్వహణ వంటి వ్యవహారాల్లో ఆయన పనితీరుపై విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. వెక్కిరిస్తున్న ద్రవ్యోల్బణం వంటివాటిని ఉదాహరణగా చూపుతున్నారు. అనుకూల, ప్రతికూల పవనాలెలా ఉన్నా వయసు విషయంలో మాత్రం బైడెన్, ట్రంప్ దొందూ దొందే అన్నది తటస్థుల అభిప్రాయం. 2024 నవంబర్‌లో జరిగే ఎన్నికల్లోగా ఏమైనా జరగొచ్చు. చివరికి గెలుపు ఎవరిదైనా వరించవచ్చు. ఇప్పటికైతే బైడెన్ ఆత్మవిశ్వాసాన్ని కొట్టిపారేయలేం. అయినా రాజకీయాల్లో వయసుతో పనేముంది? అధికారమే ముఖ్యం! బైడెన్‌కైనా, ట్రంప్‌కైనా లక్ష్యం అదే!

"రాజకీయం ఒక రంగులలోకం అధికారమొక తీరని దాహం"

జియాఖాన్ ఆత్మహత్య కేసు..
సూరజ్ పంచోలీకి విముక్తి



ముంబై: పదేళ్ల నాటి బాలీవుడ్ నటి జియాఖాన్ ఆత్మహత్య కేసు కీలక మలుపు తిరిగింది. సాక్ష్యాధారాల్లేవంటూ ఆమె బాయ్‌ఫ్రెండ్, నటుడు సూరజ్ పంచోలీని ఈ కేసులో నిర్దోషిగా సీబీఐ కోర్టు ప్రకటించింది. అమెరికా పౌరురాలైన జియా 2013 జూన్ 3న ముంబై జుహూ ప్రాంతంలోని తన ఇంట్లో ఉరేసుకుని కనిపించారు. ఆమె రాసినట్లు చెబుతున్న లేఖ లభ్యమైంది. సూరజ్‌తో సంబంధాలు, అతడి వేధింపులు, చిత్రహింసలను అందులో ప్రస్తావించారు. కుమార్తెకు న్యాయం జరిగే వరకు పోరాడతానని జియా తల్లి రబియా ఖాన్ అన్నారు.

సోనియా గాంధీ ఓ విషకన్య

బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్య మండిపడ్డ కాంగ్రెస్

కొప్పల్/న్యూఢిల్లీ: ప్రధాని మోదీని విషసర్పంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అభివర్ణించిన కొద్ది గంటల్లోనే బీజేపీ ప్రతి దాడికి దిగింది. ఆ క్రమంలో కాంగ్రెస్ నేత సోనియాగాంధీపై కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ''అమెరికా ఒకప్పుడు మోదీకి వీసా ఇవ్వను పొమ్మంది. ప్రపంచ నేతగా ఎదిగాక ఎర్ర తివాచీ పరిచి మరీ స్వాగతం పలికింది. అలాంటి మోదీజీని విషసర్పం అంటారా? మరి సోనియా కాంగ్రెస్ పార్టీలో నాట్యం చేసే విషకన్యా? ఆమె చైనా, పాకిస్తాన్ తరఫున పనిచేసే ఏజెంట్' అన్నారు. వీటిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సుర్జేవాలా మండిపడ్డారు. ''కర్ణాటక బీజేపీ నేతలకు మతి భ్రమించింది. యత్నాల్‌ను తక్షణం పార్టీ నుంచి బహిష్కరించాలి'' అని డిమాండ్ చేశారు. నెహ్రూ గాంధీ కుటుంబాన్ని గతంలోనూ ఇలాగే కించపరిచారన్నారు.

వారికి మతి పోయింది

మోదీపై ఖర్గే విమర్శలపై అమిత్ షా

సాక్షి, బళ్లారి: ప్రధాని మోదీ విషసర్పమన్న ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి, వారి నేతలకు మతి భ్రమించిందనేందుకు రుజువని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దుయ్యబట్టారు. శుక్రవారం కర్ణాటకలో గదగ్, ధార్వాడ జిల్లాల్లో ఆయన పలు సభల్లో మాట్లాడారు. ''మోదీని విషసర్పంతో పోల్చడం ఆ పార్టీ ఎంతగా దిగజారిందనేందుకు రుజువు. వారెంతగా విమర్శిస్తే అంతగా ఆయనకు ప్రజల్లో మద్దతు పెరుగుతుంది'' అన్నారు. 'తీవ్రవాద భావజాల పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)ను నిషేధించినందుకు నాపై కేసు పెట్టారు. పీఎఫ్ఐను కాంగ్రెస్ నెత్తిన పెట్టుకుంది. దానిపై నిషేధం తర్వాత కర్ణాటక సురక్షితంగా ఉంది'' అన్నారు. ''సీఎం తానంటే తానని పీసీసీ చీఫ్ డీకే శివకుమార్, సిద్దరామయ్య వాదులాడుకుంటున్నారు. అవసరం లేదు. సీఎం బీజేపీ వ్యక్తే అవుతారు. కన్నడ ఓటర్లు బీజేపీనే గెలిపిస్తారు. ఓటర్ల నమ్మకం కోల్పోయిన కాంగ్రెస్ వాగ్దానాలను ఎవరు విశ్వసిస్తారు?. కొన్ని విషయాల్లో మాత్రం కాంగ్రెస్ ఇచ్చే గ్యారెంటీని ఖచ్చితంగా నమ్మవచ్చు. అవి.. అబద్ధాలు, అవినీతి, కులతత్వం, వంశ పాలన, బుజ్జగింపు రాజకీయాలు' అంటూ అమిత్ షా ఎద్దేవా చేశారు.

ఉగ్రవాదాన్ని పెకిలిద్దాం

కలిసికట్టుగా పనిచేద్దాం ● ఎస్సీఓ సదస్సులో రాజ్‌నాథ్



ఎస్సీఓ దేశాల రక్షణమంత్రులతో రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: ప్రపంచానికి పెనుముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించి వేయాల్సిన అవసరం ఉందని రక్షణ శాఖ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఈ విషయంలో షాంఘై కో–అపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్సీఓ) సభ్యదేశాలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రభూతం ఏ రూపంలో ఉన్నా ప్రమాదకరమేనని, దాన్ని అంతం చేయాల్సిందేనని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఎస్సీఓ సభ్యదేశాల రక్షణ శాఖ మంత్రుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదానికి అండదండలు అందించేవారి పీచమణచాలని చెప్పారు. కూటమిలోని సభ్యదేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరస్పరం గౌరవించుకొనేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయాలని అన్నారు. చైనా, పాకిస్తాన్ తీరును పరోక్షంగా ఆయన తప్పుపట్టారు. ఎస్సీఓ సదస్సుకు రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. సభ్య దేశాల నడుమ విశ్వాసం, సహకారం మరింత బలోపేతం కావాలని తాము కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం శాంతి, భద్రతకు ఊతం ఇవ్వాలన్నదే తమ ఆశయమని వివరించారు. ఎస్సీఓ సదస్సుకు చైనా, రష్యా తదితర సభ్య దేశాల రక్షణశాఖ మంత్రులు హాజరయ్యారు. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి హాజరు కాలేదు. ఆయన బదులుగా పాకిస్తాన్ ప్రధానమంత్రి ప్రత్యేక సహాయకుడు మాలిక్ అహ్మద్ ఖాన్ వర్చువల్‌గా పాల్గొన్నారు. షాంఘై సహకార కూటమి 2001లో షాంఘైలో ఏర్పాటయ్యింది. ఇందులో భారత్, రష్యా, చైనా, కిర్గిస్తాన్, కజకిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ సభ్యదేశాలుగా ఉన్నాయి. 2017లో పాకిస్తాన్ శాశ్వత సభ్యదేశంగా మారింది.

సరిహద్దులో సాధారణ స్థిరత్వం: చైనా విదేశాంగ మంత్రి

బీజింగ్: భారత్–చైనా సరిహద్దులో ప్రస్తుతం సాధారణ స్థిరత్వం నెలకొని ఉందని చైనా విదేశాంగ మంత్రి జనరల్ లీ షాంగ్‌ఫు చెప్పారు. ఇరు దేశాల సైనిక, దౌత్య మార్గాల్లో కమ్యూనికేషన్ కొనసాగిస్తున్నాయని వివరించారు. ఎస్సీఓ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన లీ షాంగ్‌ఫు శుక్రవారం భారత విదేశాంగ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత్–చైనా సరిహద్దు వద్ద ప్రస్తుత పరిస్థితి, ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలు 45 నిమిషాలపాటు మాట్లాడుకున్నారు. సరిహద్దు ఒప్పందాలను ఉల్లంఘిస్తే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఉన్న మొత్తం ఆధారం చెరిగిపోతుందని చైనాకు రాజ్‌నాథ్ సింగ్ తేల్చిచెప్పారు. సరిహద్దుకు సంబంధించిన ఏ వివాదమైనా ప్రస్తుతం అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారమే పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ నేపథ్యంలో జనరల్ లీ షాంగ్‌ఫు ఆచితూచి స్పందించారు.

సాంకేతిక ప్రజాస్వామ్యం దిశగా

అందుకోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం

టెక్నాలజీ ప్రజలందరికీ అందితేనే దేశాభివృద్ధి	ఆలిండియా రేడియో బృందంలో నేనూ భాగమే	ప్రధాని మోదీ వెల్లడి	91 ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్లు ప్రారంభం



న్యూఢిల్లీ: ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్(ఎఫ్ఎం) రేడియో సేవలను గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించే దిశగా 91 ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రేడియో పరిశ్రమలో ఇదొక విప్లవాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. సాంకేతిక(టెక్నాలజీ) ప్రజాస్వామీకరణ కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. తమ తరానికి రేడియోతో భావోద్వేగ అనుబంధం ఉందని తెలిపారు. తాను రేడియో హోస్ట్‌గా వ్యవహరిస్తున్నానంటూ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రస్తావించారు. 100వ ఎపిసోడ్ వచ్చే ఆదివారం ప్రసారం కాబోతోందని వివరించారు. దేశ ప్రజలతో భావోద్వేగపూరిత బంధం పెంచుకోవడం రేడియో ద్వారానే సాధ్యమని ఉద్ఘాటించారు.

అందరికీ ఆధునిక టెక్నాలజీ

స్వచ్ఛ భారత్ అభియాన్, బేటీ బచావో, బేటీ పడావో, హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాలు మన్ కీ బాత్ ద్వారా ప్రజా ఉద్యమాలుగా మారాయని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆలిండియా రేడియో బృందంలో తాను కూడా ఒక భాగమేనని వెల్లడించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే 91 ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్లను ప్రారంభించామని తెలియజేశారు. దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడానికి ఆధునిక టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడం కీలకమన్నారు. డిజిటల్ ఇండియా వల్ల రేడియో శ్రోతల సంఖ్య పెరగడమే కాదు, కొత్త ఆలోచనా విధానం ఉద్భవిస్తోందని వివరించారు. ప్రతి ప్రసార మాధ్యమంలో విప్లవం కనిపిస్తోందని చెప్పారు. డీడీ ఉచిత డిష్ సేవలను 4.30 కోట్ల ఇళ్లకు అందించినట్లు తెలిపారు. ప్రపంచ సమాచారం ఎప్పటికప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు, దేశ సరిహద్దుల్లోని కుటుంబాలకు చేరుతోందని హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలకు సైతం విద్యా, వినోద సమాచారం చేరుతోందన్నారు.

డిజిటల్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

గ్రామీణ ప్రాంతాలకు ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణతో మొబైల్ డేటా చార్జీలు భారీగా తగ్గిపోయాయని, సమాచారం పొందడం ప్రజలకు సులభతరంగా మారిందని అన్నారు. దేశం నలుమూలలా డిజిటల్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పుట్టుకొస్తున్నారని వెల్లడించారు. చిరువ్యాపారులు కూడా యూపీఐ సేవలు బ్యాంకింగ్ సదుపాయాలు వాడుకుంటున్నారని గుర్తుచేశారు. ప్రధానమంత్రి ప్రారంభించిన 91 ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్ల ద్వారా దేశవ్యాప్తంగా 85 జిల్లాల్లో రెండు కోట్ల మందికి పైగా ప్రజలు ఎఫ్ఎం రేడియో ప్రసారాలు వినవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అస్సాం, మేఘాలయా, నాగాలాండ్, హరియాణా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని పలు మారుమూల జిల్లాలతోపాటు లద్దాఖ్, అండమాన్, నికోబార్ దీవుల్లో ఎఫ్ఎం రేడియో సేవలు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి.

రికమండేషన్లకు చరమగీతం

ఆలిండియా రేడియో వంటి కమ్యూనికేషన్ చానళ్లు మొత్తం దేశాన్ని, దేశంలోని 140 కోట్ల మందిని అనుసంధానించాలన్నదే తమ విజన్, మిషన్ అని ప్రధాని మోదీ వివరించారు. గతంలో రికమండేషన్ల ఆధారంగా పద్మా పురస్కారాలు ప్రదానం చేసేవారని, ఆ పద్ధతికి తాము చరమగీతం పాడేశామని అన్నారు. దేశానికి, సమాజానికి అందించిన విలువైన సేవల ఆధారంగానే ఈ పురస్కారాలు అందజేస్తున్నామని చెప్పారు. ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్ల ప్రారంభోత్సవంలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పలువురు పద్మ పురస్కార గ్రహీతలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ వారికి స్వాగతం పలికారు.

ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.కోటి

- మొత్తం కల్యాణ కర్ణాటకకు రూ.5,000 కోట్లు
- కర్ణాటక ప్రచారంలో రాహుల్ హామీల వర్షం



ఫలూదా రుచి చూస్తున్న రాహుల్

సాక్షి, బళ్లారి: కర్ణాటకలో అధికారంలోకి వస్తే ప్రతి గ్రామ పంచాయతీకి రూ.కోటి, కళ్యాణ కర్ణాటక ప్రాంతాభివృద్ధికి రూ.5,000 కోట్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. శుక్రవారం కలబురిగి జిల్లాలోని జేవర్గి సభలో హోరు వానలోనూ రాహుల్ ప్రసంగించారు. 'బళ్లారిలో రూ.5,000 కోట్లతో వస్త్ర పరిశ్రమను తెస్తాం. జిల్లాను ప్రపంచ జీన్స్ హబ్‌గా, జీన్స్ రాజధానిగా మారుస్తాం. 50 వేల ఉద్యోగాల భర్తీని పూర్తిచేస్తాం' అని అన్నారు. 'ప్రతీ పనికి కాంట్రాక్టర్ల నుంచి మంత్రులు 40 శాతం కమిషన్ గుంజారు. ఈ ప్రభుత్వ దోపిడీతో బళ్లారి ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోయారు'' అని ఆరోపించారు. తాము 150 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తంచేశారు.

సూడాన్ నుంచి మరో 754 మంది రాక

న్యూఢిల్లీ/కైరో: సూడాన్‌లో చిక్కుకుపోయిన మరో 754 మంది భారతీయులు 'ఆపరేషన్ కావేరి'లో భాగంగా శుక్రవారం స్వదేశం చేరారు. ఈ మేరకు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ట్వీట్ చేశారు. ఇప్పటిదాకా 1,360 మందిని తీసుకొచ్చినట్టు చెప్పారు. వీరిలో 17 మంది తెలంగాణ వాసులు కూడా ఉన్నట్లు ఢిల్లీలోని తెలంగాణ భవన్ తెలిపింది. మరోవైపు సూడాన్‌లో హింస ఆగడం లేదు. 72 గంటల కాల్పుల విరమణకు రెండు పక్షాలు అంగీకరించి గంటలైనా కాకుండానే రాజధాని ఖార్టూమ్, ఒండుర్మన్, కఫోరీల్లో పోరు తీవ్రమైంది.


నా కూతురు వల్లే రిషి ప్రధాని అయ్యారు

సుధా నారాయణ మూర్తి ఆసక్తికర వ్యాఖ్య



న్యూఢిల్లీ: ప్రముఖ మహిళా రచయిత, దాతృత్వశీలి, భారతీయ టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకులు నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి.. తన అల్లుడు రిషి సునాక్‌నుద్దేశిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బంధువులతో మాట్లాడుతూ ఆమె చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. ' నా కూతురు అక్షతామూర్తి కారణంగానే రిషి సునాక్ బ్రిటన్ ప్రధాన మంత్రి కాగలిగారు. నా అల్లుడు నిజానికి పంజాబీ. 150 ఏళ్ల క్రితమే వాళ్ల పూర్వీకులు భారత్‌ను వీడారు. వారు తమ మతాన్ని విశ్వసిస్తారు. రిషి వాళ్ల అమ్మగారు సోమవారం ఉపవాసం ఉంటారు. అయినాసరే అక్షతతో వివాహం తర్వాత రిషి ప్రతి గురువారం ఉపవాసం పాటించడం అలవాటుచేసుకున్నారు. భార్య 'పలుకు'బడి ఎంతగా పనిచేస్తుందో చూశారుగా. నేను నా భర్తను గొప్ప వ్యాపారవేత్తగా మార్చాను. అక్షత తన భర్తను ఏకంగా బ్రిటన్ ప్రధానమంత్రి స్థాయికి తీర్చిదిద్దింది. చూశారా.. భర్తను భార్య ఎంతగా మార్చివేయగలదో !. ఇదంతా అర్ధాంగి ఘనత' అంటూ సుధామూర్తి సరదాగా వ్యాఖ్యానించారు. మంత్రాలయలోని గురు రాఘవేంద్రను నారాయణమూర్తి కుటుంబం ఎంతగానో ఆరాధిస్తుంది. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను మొదలుపెట్టింది కూడా గురువారమే. అక్షతను రిషి 2009లో వివాహం చేసుకున్నారు. తండ్రి నారాయణమూర్తి ద్వారా సంక్రమించిన ఆస్తుల కారణంగా అక్షత పేరిట దాదాపు రూ.7,500 కోట్ల స్థిర,చరాస్తులున్నాయి. ఇప్పటికీ ఆమెకు ఇన్ఫోసిస్‌లో అత్యంత కనిష్ట స్థాయిలో వాటాలున్నాయి.

ఊరేగింపుగా ఎందుకు తీసుకెళ్లారు ?




- పోలీసుల సమక్షంలోనే అతీక్ హత్యకు ఎలా తెగించారు?
- నివేదిక ఇవ్వాలని యూపీ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతని సోదరుడు అష్రాఫ్ కస్టడీలో ఉండగా పోలీసుల కళ్లెదుటే హత్యకు గురైన ఘటనపై సుప్రీంకోర్టు శుక్రవారం ప్రశ్నల వర్షం కురిపించింది. దీనిపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా పోలీసులు, యూపీ సర్కారుకు పలు ప్రశ్నలు సంధించింది. ' అతీక్‌ను ఆస్పత్రికి తీసుకొస్తారని నిందితులకు ముందే ఎలా తెలుసు ? మేం కూడా టీవీలో చూశాం. ఆస్పత్రి గేటు నుంచి వారిని లోపలికి అంబులెన్స్‌లో ఎందుకు తీసుకెళ్లలేదు. మీడియా సమక్షంలో వారిని ఎందుకు ఊరేగింపుగా నడిపిస్తూ తీసుకెళ్లారు?. అతీక్ పోలీసు కస్టడీలో ఉండగా మీడియా చూస్తుండగా షూటర్లు హత్యకు ఎలా తెగించగలిగారు?' అని యూపీ సర్కార్ తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహత్గీని జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ప్రశ్నించింది. దర్యాప్తు పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

విద్వేష ప్రసంగాలపై కేసులు నమోదుచేయండి

న్యూఢిల్లీ: దేశంలో మత సామరస్యానికి తీవ్ర భంగం వాటిల్లేలా విద్వేష ప్రసంగాలు చేసే వారిపై సుమోటో కేసులు నమోదుచేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. లేదంటే కోర్టు ధిక్కార చర్య తప్పదని డీజీపీలను హెచ్చరించింది.



ఈ ఆరేళ్ల పిల్లి ఏకంగా 18 కేజీలుంది! ప్రపంచంలోనే అత్యంత బరువైన పిల్లి ఇదేనని భావిస్తున్నారు. అమెరికాలో ఫోర్డ్ అనే ఈవిడ దీన్ని పెంచుకుంటోంది. బరువు తగ్గించి ఆరోగ్యంగా తయారు చేస్తానంటోంది.

DMart®
Daily Discounts Daily Savings



ఇప్పుడు బడ్జెట్‌లో సెలవుల షాపింగ్

DMart ready
యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోండి
లేదా విజిట్ www.dmart.in

రోజువారీ అవసరాలు

కొనండి 1 పొందండి 1 ఉచితంగా — బి నాచురల్ జామ జ్యూస్ టెట్రా 1 లీ, ఎంఆర్‌పి ₹ 130

₹150* మాత్రమే — రూహ్ అఫ్జా షర్బత్ 700 మి.లీ, ఎంఆర్‌పి ₹ 170

₹190* మాత్రమే — టాంగ్ ఆరెంజ్ ఇన్‌స్టంట్ డ్రింక్ మిక్స్ 750 గ్రాములు, ఎంఆర్‌పి ₹ 250

₹20* మాత్రమే — దొడ్ల ఫ్లేవర్డ్ మిల్క్ 180 మి.లీ, ఎంఆర్‌పి ₹ 30

₹330* మాత్రమే — గ్లూకాన్ డి టాంగ్ ఆరెంజ్ 1 కిలో, ఎంఆర్‌పి ₹ 380

₹79* మాత్రమే — థమ్స్ అప్/స్ప్రైట్ బాటిల్ 1.75 లీ, ఎంఆర్‌పి ₹ 99

₹80* మాత్రమే — మాజా మ్యాంగో డ్రింక్ 1.75 లీ, ఎంఆర్‌పి ₹ 105

₹110* మాత్రమే — సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ చోకో ఫిల్స్ 300 గ్రాములు, ఎంఆర్‌పి ₹ 170

₹399* మాత్రమే — కల్బావి జీడిపప్పు 500 గ్రాములు, ఎంఆర్‌పి ₹ 699

₹349* మాత్రమే — నట్‌రాజ్ క్యాలిఫోర్నియా బాదంపప్పు 500 గ్రాములు, ఎంఆర్‌పి ₹ 599

₹165* మాత్రమే — ఫాగ్ మార్కో 1000 స్ప్రే/ నెపోలియన్ డియో స్ప్రే 150 మి.లీ, ఎంఆర్‌పి ₹ 275

₹75* మాత్రమే — షవర్ టు షవర్ కూలోస్ టాల్క్ 150 గ్రాములు, ఎంఆర్‌పి ₹ 125

₹105* మాత్రమే — డెర్మి కూల్ మెంథాల్ రెగ్యులర్ ప్రిక్లీ హీట్ పౌడర్ 150 గ్రాములు, ఎంఆర్‌పి ₹ 130

₹245* మాత్రమే — పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్క్ 400 గ్రాములు, ఎంఆర్‌పి ₹ 345

₹120* మాత్రమే — జో లైమ్ సోప్ 4x150 గ్రా ఒక్కొక్కటి, ఎంఆర్‌పి ₹ 172

₹195* మాత్రమే — గోద్రెజ్ సింథాల్ లైమ్ డియో సోప్ 4x150 గ్రా ఒక్కొక్కటి, ఎంఆర్‌పి ₹ 230

₹120* మాత్రమే — కోల్‌గేట్ స్వర్ణ వేదశక్తి టూత్‌పేస్ట్ 400 గ్రాములు, ఎంఆర్‌పి ₹ 220

₹195* మాత్రమే — లైజోల్ సిట్రస్ సర్ఫేస్ క్లీనర్ 1 లీ, ఎంఆర్‌పి ₹ 220

ఇల్లు మరియు వంటగది

₹99* మాత్రమే — ఎరా 6 పీసుల గ్లాస్ సెట్ 210 మి.లీ ప్రతి, ఎంఆర్‌పి ₹ 230

₹79* నుంచి — ఐస్ ట్రే 2N

₹349* మాత్రమే — నీటి కూజా 1N 5 లీ, ఎంఆర్‌పి ₹ 959

₹329* మాత్రమే — బకెట్ 1N 25 లీ, ఎంఆర్‌పి ₹ 380

₹1,699* మాత్రమే — పీజియన్ అన్నీ ఒకే కుక్కర్‌లో 1N 3 లీ, ఎంఆర్‌పి ₹ 3,445

₹1,099* నుంచి — సీలింగ్ ఫ్యాన్ 1N

ప్రయాణం మరియు క్రీడలు

₹299* నుంచి — బ్యాడ్మింటన్ రాకెట్లు 2N

₹349* మాత్రమే — ఫుట్‌బాల్ 1N, ఎంఆర్‌పి ₹ 470

₹199* నుంచి — స్టీల్ బాటిల్ 1N

₹699* మాత్రమే — హైకింగ్ బ్యాగ్ 1N, ఎంఆర్‌పి ₹ 995

₹2,199* మాత్రమే — వి.ఐ.పి - అరిస్టోక్రాట్ నెక్సస్ ట్రాలీ బ్యాగ్ 1N, ఎంఆర్‌పి ₹ 5,990

₹3,162* మాత్రమే — వి.ఐ.పి - అరిస్టోక్రాట్ విటారా 4 వీలర్ ట్రాలీ బ్యాగ్ 1N, ఎంఆర్‌పి ₹ 9,010

దుస్తులు

₹299# నుంచి — గర్ల్స్ ఫ్రాక్

₹229# నుంచి — గర్ల్స్ జీన్స్

₹199# నుంచి — గర్ల్స్ టాప్

₹79# నుంచి — బాయ్స్ మరియు గర్ల్స్ టీ-షర్ట్

₹199# నుంచి — అబ్బాయిల చొక్కా

₹249# నుంచి — బాయ్స్ జీన్స్

పాదరక్షలు ఎంఆర్‌పిపై కనీసం 7% తగ్గింపు — Paragon, walkmate, Bata

కనీసం 6%^ డిస్కౌంట్

₹199# నుంచి — లేడీస్ ఎథినిక్ షార్ట్/ లాంగ్ కుర్తా

₹99# నుంచి — లేడీస్ దుపట్టా/ స్టోల్

₹199# నుంచి — లేడీస్ యాంకిల్ కాటన్ స్ట్రెచింగ్ లెగ్గింగ్

₹499# నుంచి — లేడీస్ డ్రస్సులు

₹99# నుంచి — లేడీస్ క్యాజువల్ లోయర్

₹99# నుంచి — లేడీస్ టీషర్ట్

₹149# నుంచి — లేడీస్ టాప్

₹349# నుంచి — లేడీస్ డెనిమ్/ జెగ్గింగ్

₹169# నుంచి — లేడీస్ లాంగ్ నైటీ

₹199# నుంచి — లేడీస్ పైజామా

₹99# నుంచి — పురుషుల ఫ్యాన్సీ టీషర్ట్

₹199# నుంచి — పురుషుల సాధారణం ఫార్మల్ షర్ట్

₹349# నుంచి — పురుషుల ఫార్మల్ ట్రౌజర్/జీన్స్

₹399# నుంచి — పురుషుల కాటన్ చినోస్

₹199# నుంచి — ఫ్యాషన్ సమ్మర్ క్యాప్

₹149# నుంచి — పురుషుల ఫ్యాషన్ షర్ట్

ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు — అన్ని బ్రాండెడ్ పురుషుల అండర్ గార్మెంట్స్

రామంతపూర్: 040-33457200 • ఉప్పల్ భాగ్: 9154846426 • మేడిపల్లి: 7337325489 • ఉప్పల్ రంగారెడ్డి : 040-29331007 • బండ్లగూడ : 040-29556703 • సనత్‌నగర్: 040-33235100 • బాలానగర్: 040-23075362
మూసాపేట్: 040-23866770 • కొంపల్లి: 0841-8332100 • అంబర్‌పేట: 040-30853500 • హైదర్‌గూడ(హిమాయత్ ఎన్‌జిఆర్): 040-23298560 • కాచిగూడ: 040-29550956 • మదీనాగూడ (మియాపూర్): 040-23047281 • ఆర్‌సి పురం: 08455-297917
నల్లగండ్ల: 040-29568265 • హాఫీజ్‌పేట: 040-48540013 • కూకట్‌పల్లి (ఎన్‌ఎస్‌ఎల్): 040-39911700 / 29568182 • షేక్‌పేట (టోలి చౌకి): 040-30102100/ 7207851378 • కావేరి హిల్స్: 040- 23119921 • ఉప్పర్‌పల్లి (అత్తాపూర్): 040-29705890 • బోవెన్‌పల్లి: 040-46014924
ఎస్.డి. రోడ్ (సికింద్రాబాద్): 040 27718045 • కుషాయిగూడ: 040-29707831 • సఫీల్‌గూడ: 040-27130120 • వనస్థలిపురం: 040-29882486 • చంపాపేట్: 040-39911800 • మలక్ పేట: 040-33503900 • ఎల్ బి నగర్: 040-33203801 • ఘట్కేసర్: 7382054232

చిత్రాలు ప్రాతినిధ్య ప్రయోజనాల కోసం మాత్రమే • ఉత్పత్తి ఆఫర్‌లు స్టాక్‌లు ఉండే వరకు చెల్లుబాటు అవుతాయి • స్థానాలను బట్టి ధరలు మరియు ఆఫర్‌లు మారవచ్చు
• ప్రదర్శించబడే బ్రాండ్‌లు సంబంధిత బ్రాండ్ యజమానుల స్వంతం • ^ నిర్వహణ తన అభీష్టానుసారం ధరలను మార్చడానికి మరియు ఉత్పత్తులను విక్రయించే హక్కును కలిగి ఉంది. • నియమ నిబంధనలు వర్తిస్తాయి • * రిటైల్ విక్రయ ధర • # రిటైల్ విక్రయ ధర 1N

Impulse/04/23

హంతకుడి శిక్ష పూర్తికాక ముందే విడుదలా?



సాక్షి, హైదరాబాద్: బీహార్‌లో గోపాల్ గంజ్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న పాలమూరు బిడ్డ కృష్ణయ్యను చంపిన హంతకు డు ఆనంద్ మోహన్‌ను శిక్షాకాలం పూర్తికాకముందే నితీశ్ కుమార్ ప్రభు త్వం విడుదల చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంపిన హంతకుడే హైదరాబాద్ వచ్చి కృష్ణయ్య కుటుంబ సభ్యులను కలవబోతున్నారన్న వార్త కలిచివేస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణయ్యను చంపిన హంతకులను ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్‌లో అడుగుపెట్టనీయమని, లేనిపక్షంలో ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదు ర్కోవాల్సి ఉంటుందని బండి సంజయ్ హెచ్చరించారు. నితీశ్ వైఖరిపై సీఎం కేసీఆర్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ప్రజలను కాల్చి చంపి పేదల రక్తం తాగిన యూపీ గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్‌ను చంపితే ఖండించిన బీఆర్ఎస్ నేతలు కృష్ణయ్య హంతకుల రాకపై ఎందుకు నోరు మెదపడం లేదని అడిగారు. నితీశ్ కుమార్, కేసీఆర్ మధ్య నున్న దోస్తీని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

ఆ హంతకుడిని ఎలా విడుదల చేస్తారు



సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్య బిహార్‌లో విధులు నిర్వహిస్తున్నప్పుడు 1994లో హత్య చేసిన ఆనంద్ మోహన్‌ను జైలు నిబంధనలు మార్చి విడుదల చేయడం దారుణమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన కృష్ణయ్య సతీమణి ఉమాదేవిని పరామర్శించారు. బిహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తమ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఖండించారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. కృష్ణయ్య కుటుంబానికి జరిగిన అన్యా యానికి వ్యతిరేకంగా, బీఎస్పీ పోరాడుతుందని తెలిపారు. దళిత వర్గానికి చెందిన ఐఏఎస్ అధికారిని హత్య చేసిన దోషిని జైలు నుంచి విడుదల చేస్తుంటే సీఎం కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. దీనిని వ్యతిరేకిస్తూ బిహార్ సీఎంకు ఎందుకు లేఖ రాయడం లేదని నిలదీశారు.



చెలిమ నీళ్లే ఇంకా..

కుమురంభీం జిల్లా తిర్యాణి మండలం గోవెన పరిధిలో ఐదు గూడేలకు విద్యుత్ వెలుగే లేదు. ఇందులో నాయకపుగూడ, కుర్సీ గూడాల పరిస్థితి మరీ దారుణం. ఇక్కడ మిషన్ భగీరథ కోసం నిర్మించిన వాటర్ ట్యాంకులు అలంకారప్రాయమే. దీంతో నాయకపుగూడ గిరిజనులకు వాగులోని చెలిమ నీళ్లే గొంతు తడుపుతున్నాయి. గోవెన పరిధిలోని ఐదు గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఐటీడీఏ ఎప్పుడో ఏర్పాటు చేసిన సోలారు లైట్లు ఆరేళ్ల క్రితమే పనిచేయకుండా పోయాయి. పోలీసులు ఏర్పాటు చేసిన నాలుగు సోలారు వీధి లైట్లు మాత్రం వెలుగుతున్నాయి.



కారు చీకటి బతుకులు

నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని చాకిరేవు గ్రామానికి చేరాలంటే ఆరు కిలోమీటర్లు నడిచివెళ్లాలి. సరైన దారే లేని అలాంటి ఊరికి కరెంటు కూడా లేదు. పెంబిమండల కేంద్రం నుంచి 25 కి.మీ. దూరంలో ఉండే ఈ పల్లెలో 35 ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయి. ఇంకా పెద్దరాగిదుబ్బ, సోముగూడ, కడెం మండలంలోని మిద్దెచింత, రాంపూర్ గ్రామాలవీ చీకటి బతుకులే.

అంతరం అలాగే!

ఆదిలాబాద్, పాలమూరును వదలని పేదరికం

ప్రత్యేక రాష్ట్రంలోనూ అందని ఫలాలు.. ఇంకా 13.74% పేదలు

ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జాతీయ సగటును మించి పేదరికం

ఇప్పటికీ విద్య, వైద్యం, పౌష్టికాహారం పూర్తిగా అందని వైనం

వెనుకబాటుపై కనిపించని ప్రత్యేక కార్యాచరణ


నీతి ఆయోగ్ బహుముఖ పేదరిక సూచిక వెల్లడి

శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి

వెనుకబాటుపైనే తిరుగుబాటు చేసి పుట్టిన రాష్ట్రం తెలంగాణ. ప్రత్యేక రాష్ట్రం వస్తే అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి జరుగుతుందని, అందరికీ సమాన అవకాశాలు వస్తాయన్న నినాదమూ తెలంగాణదే. అయితే ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించి ఇన్నేళ్లవుతున్నా.. రాష్ట్రంలో ఇంకా 13.74% పేదలు ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జాతీయ సగటు (25.01%)ను మించి పేదరికం ఉందని నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన బహుముఖ పేదరిక సూచిక (మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్-2021) వెల్లడించడం గమనార్హం.

విద్య, వైద్యం, విద్యుత్ ప్రాతిపదికగా..

విద్య, వైద్యం, పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్, పక్కా ఇళ్లు, సొంత ఆస్తులు, బ్యాంక్ ఖాతా తదితర పన్నెండు అంశాలను పరిగణనలోకి తీసుకుని నీతి ఆయోగ్ నివేదిక రూపొందించింది. దేశ జనాభాలో 25.01% పేదలుండగా, తెలంగాణలో ఇది 13.74%గా ఉంది. అయితే ఆదిలాబాద్ (27.43%), మహబూబ్‌నగర్ (26.11%) జిల్లాల్లో మాత్రం పరిస్థితి మరీ నిరాశాజనకంగా ఉంది. ఆయా జిల్లాల్లో 25% మందికి ఇప్పటికీ విద్య, వైద్యం, పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందటం లేదని నివేదిక తేల్చింది. కొత్తగా ఏర్పడిన కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోనూ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ లేకపోవడం, రాజకీయ అవసరం, ప్రాబల్యం ఉంటేనే నిధుల వరద పారుతున్న వైనం.. వెనుకబడిన ప్రాంతాల్లో మరోసారి అసహనానికి కారణం కాబోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా అన్ని ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించటం, రాజకీయ సిఫారసులు, అవసరాలు లేని ప్రత్యేక కార్యాచరణ అమలుతోనే సమ అభివృద్ధి సాధ్యమని ప్రొఫెసర్ సి.నాగేశ్వర్ పేర్కొన్నారు.



ప్రత్యేక ప్రాధాన్యం ఏదీ?



తెలంగాణ వచ్చినా కూడా పాలమూరు వెతలు తీరటం లేదు. మా జిల్లాలో సహజ వనరుల దోపిడీ పెరిగింది. వలసలు ఇంకా ఆగనే లేదు. గుంపు వలసల స్థానే వ్యక్తిగత వలసలు కొనసాగుతున్నాయి. జీవన ప్రమాణాలు పెంచే ఉపాధి, విద్య, వైద్య రంగాల్లో పాలమూరుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇదే కొనసాగితే పాలమూరు పేదల జిల్లాగానే మిగిలిపోతుంది.
-ఎం.రాఘవాచారి, పాలమూరు అధ్యయన వేదిక

ప్రణాళికా బద్ధమైన కేటాయింపులు ఉండాలి



సంక్షేమ రాజ్యం ప్రధాన సూత్రం..అందరికీ సమన్యాయం. అంటే వెనుకబడిన ప్రాంతాల్లో సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేకంగా ఒక ప్రణాళిక రూపొందించి దానిని నిర్ణీత కాలంలో అమలు చేయాలి. కానీ ఇప్పుడు తెలంగాణలో ప్రణాళిక - కేటాయింపులు-సమీక్షలు అంత అర్థవంతంగా లేవు.అందుకే ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో దేశ సగటును మించి పేదరికం నమోదైంది. - ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ ఎకనమిక్ అసోసియేషన్

పేదలే లేని కొట్టాయం

కేరళలోని కొట్టాయం జిల్లాలో పేదలే లేరు. ఎర్నాకులం జిల్లాలో 0.1%, కోజికోడ్‌లో 0.26% ఉన్నారు. దేశంలోనే పేదరికం తక్కువగా ఉన్న రాష్ట్రంగా కేరళ (0.71) నిలిచింది. ఇక అత్యధిక పేదరికం బిహార్‌లో (51.91%) ఉంది. దేశంలో అత్యధిక పేదరికం యూపీలోని శ్రావస్తి జిల్లాలో (74.38%) నమోదైంది. బహరైచ్‌లో 71.81%, మధ్యప్రదేశ్‌లోని అలిరాజ్‌పూర్‌లో 71.31% పేదరికం ఉంది.



మా జీవితాలకు వెలుగెప్పుడో..!

అడవిలో మూడు కిలోమీటర్లు నడిస్తేనే.. బయటి ప్రపంచానికి మేమంటూ ఉన్నామని తెలుస్తుంది. నేను పుట్టినప్పటి నుంచి చెప్తున్నరు కరెంటు వస్తదని. కానీ రాలే.. సోలారు లైట్లు పెడుతున్నా.. అవి కొన్నిరోజులే వెలుగుతున్నయి. మా పిల్లల జీవితాల్లోనైనా వెలుగు వస్తుందో లేదో..!
- ఆత్రం శ్రీరాములు, మిద్దెచింత, నిర్మల్

బడి లేక..కూలీకి..

అమ్మా నాయిన ముంబైకి వలస వెళ్లిండ్రు. నేను మా తండా బడిలోనే 5వ తరగతి వరకు చదివిన. 6వ తరగతి చదవాలంటే రోజూ 14 కి.మీ వెళ్లిరావాలి. రోడ్డు బాగా లేదు, ప్రయాణ సౌకర్యం కూడా లేదు. దీంతో రోజూ నడుచుకుంటూ వెళ్లలేక గత ఏడాది బడి మానేసిన. ఇప్పుడు మా అవ్వ ఇంట్లో ఉంటూ అప్పుడప్పుడు కూలీ పనులకెళ్తున్న. మా అమ్మా నాయిన లాగే తండాలో 95 కుటుంబాలు ముంబైకి వలస వెళ్లాయి. నాలా చానామంది నడుచుకుంటూ బడికి వెళ్లలేక కూలీ పని చేస్తుండ్రు.
- సోనమ్మ, పాతతండా, నారాయణపేట జిల్లా



‘దళితబంధు’ దొంగల పేర్లు బయటపెట్టండి : మానవతారాయ్



సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకంపై బీఆర్ఎస్ నేతలు బందిపోట్ల మాదిరిగా దాడిచేస్తున్నారని, లబ్ధిదారుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారుకొండ వెంకటేశ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత బంధు లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యేలు కమీషన్లు తీసుకుంటున్నట్టు స్వయంగా సీఎం కేసీఆర్ ఒప్పుకున్నారని, వారి పేర్లను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్‌తో పాటు ఏసీబీ, సీబీఐలకు ఫిర్యాదు చేస్తామని మానవతారాయ్ తెలిపారు.

ఆ ఎమ్మెల్యేలపై అట్రాసిటీ కేసు పెట్టాలి: కొప్పు భాషా

సాక్షి,హైదరాబాద్: దళితబంధు పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల నుంచి వసూళ్లకు పాల్పడిన ఎమ్మెల్యేలపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా డిమాండ్ చేశారు. దళితబంధు పథకం లబ్ధిదారుల వద్ద నుంచి వసూళ్లు చేసిన ఎమ్మెల్యేల జాబితా తన వద్ద ఉందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బహిరంగంగా ప్రకటించారని, పూర్తి ఆధారాలున్నప్పుడు కేసులు ఎందుకు నమోదు చేయరని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. దళితబంధు అక్రమాలపై సీఎం కేసీఆర్ మొసలికన్నీరు కార్చి ఎస్సీల సానుభూతి కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దళితబంధు అక్రమాల అంశంపై ఇదివరకే బీజేపీ హెచ్చరించినప్పటికీ కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదన్నారు. ముందుగానే అవినీతిని నిలువరిస్తే లబ్ధిదారులకు మేలు జరిగేదన్నారు.

ఆ చిట్టా బయటపెట్టు దొరా!

సీఎంకు వైఎస్ షర్మిల బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకంలో రూ.3 లక్షలు తీసుకున్న ఎమ్మెల్యేల జాబితాను బయట పెట్టాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ‘ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారు. ఆ చిట్టా మా దగ్గర ఉంది’ అని చెప్పిన సీఎం చర్య ఎందుకు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. ఆ ఎమ్మెల్యేల పేర్లు సీఎం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆమె శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. అవినీతి ఎమ్మెల్యేల జాబితా బయటపెడితే తెగిస్తారనా? లేక కాళేశ్వరంలో రూ.70 వేల కోట్లు మీరు తినలేదాని అడుగుతారని భయమా? అని షర్మిల ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధులో వెయ్యి కోట్లు ఎమ్మెల్యేలు తిన్నారన్న విషయం తన పాదయాత్ర సమయంలోనే తేటతెల్లమైందన్నారు.

మూడురోజులపాటు పంటనష్టం పరిశీలన..

రాష్ట్రంలో అకాలవర్షాల వల్ల రైతులు నష్టపోయిన పంటలను వైఎస్ షర్మిల నేడు పరిశీలిస్తారని వైఎస్సార్టీపీ పీఏసీ సభ్యులు పిట్ట రాంరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా జనగాం, డోర్నకల్ నియోజకవర్గాల్లో, 30న ఉమ్మడి ఖమ్మం జిల్లా మధుర, వైరా, ఇల్లందుల్లో, మే 1న పాలేరులో పర్యటిస్తారని చెప్పారు.

రాష్ట్రం ఇచ్చింది కమీషన్లు దండుకోవడానికి కాదు

- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశారని ధ్వజం

జనగామ: నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్లు దండుకునే పని చేపట్టిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర శుక్రవారం జనగామ జిల్లా కొమ్ముగుట్టలో ప్రారంభమై అబ్దుల్‌నాగారం గ్రామానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ వేరుపడిన సమయంలో మిగులు బడ్జె ట్ రాష్ట్రంగా ఉందని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చాక, రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేటు కంపెనీకి 30 ఏళ్లకు లీజుకు ఇవ్వడం, ఒప్పందం కుదుర్చుకున్న డబ్బులను సైతం ముందుగానే తీసుకోవడంలో ఆంతర్యం ఏమి టో ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశం మొత్తం తెలంగాణ మోడల్ అంటూ ఊదరగొడుతున్న కేసీఆర్.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకుంటే మంచిదన్నారు. దేశంలోని అన్ని పార్టీలకు ఎన్నికల ఖర్చు తానే భరిస్తానని కేసీఆర్ అన్నారంటే తెలంగాణ సంపదను ఆయన ఎంతమేర దోచుకున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. గజ్వేల్‌లో ఓడిపోతానని కేసీఆర్ భయపడుతున్నారని, అందుకోసమే ఇతర నియోజకవర్గాలపై దృష్టిసారిస్తున్నట్టు తెలుస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో 100 అసెంబ్లీ సీట్లు గెలుచుకుంటామని కేసీఆర్ పదేపదే అనడం ఆయనలోని పిరికితనానికి నిదర్శనమన్నారు. భట్టి వెంట టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తదితరులు ఉన్నారు.



అబ్దుల్‌నాగారంలో భట్టి పాదయాత్ర. చిత్రంలో పొన్నాల లక్ష్మయ్య

భట్టి యాత్రలో పొన్నాల, కొమ్మూరి వర్గాల ఘర్షణ

భట్టి విక్రమార్కకు అబ్దుల్‌నాగారంలో స్వాగతం పలికే క్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అనుచరులు బలప్రదర్శనకు దిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాటతో ఉద్రిక్తత నెలకొంది. భట్టి ప్రెస్‌మీట్ సమయంలో కొమ్మూరిని లోనికి రాకుండా పొన్నాల వర్గం అడ్డుకుంది. దీంతో మరోసారి ఇద్దరు నేతల అనుచరులు ఘర్షణకు దిగారు. అనంతరం భట్టి విక్రమార్క కొమ్మూరికి ఫోన్ చేసి.. పాదయాత్రలో కలసి రావాలని కోరడంతో వివాదం సద్దుమణిగింది.

కేసీఆర్ వ్యాఖ్యలపై ఏసీబీ డీజీ సుమోటోగా కేసు దర్యాప్తు చేస్తారా ?

బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ సూటి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దళిత బంధులో కమీషన్ తీసుకున్నారని, ఆ మేరకు తన వద్ద చిట్టా ఉందని సీఎం కేసీఆర్ అన్న వ్యాఖ్యలపై ఏసీబీ డీజీ సుమోటోగా తీసుకుని కేసు దర్యాప్తు చేస్తారా అని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ ప్రశ్నించారు. కేసీఆర్‌కు చిత్త శుద్ధి ఉంటే ఏసీబీ డీజీకి ఆ అవినీతి చిట్టా పంపించాలని డిమాండ్ చేశారు. కమీషన్ తీసుకున్న ఎమ్మెల్యేల పై దర్యాప్తు చేయించాలని కోరారు. హైదరాబాద్‌లో శుక్రవార ఆయన మీడియాతో మాట్లాడారు. దళిత బంధులో ఎమ్మెల్యేలు కమీషన్లు తీసుకుంటున్నారంటూ స్వయంగా సీఎం చేసిన వ్యాఖ్యలపై న్యాయమూర్తులు సుమోటోగా తీసుకొని విచారించాలని కోరారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలతో పాటు తప్పు చేసిన మంత్రులను తప్పు చేసిన మంత్రులను కేసీఆర్ వెనకేసుకొస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రిపై ఆధారసహితంగా ఆరోపణలు చేసినా, బాధ్యతగల ఎమ్మెల్యేగా ఫిర్యాదు చేసినా ఎందుకు విచారణ చేపట్టలేదని నిలదీశారు. గతంలో దారిన పోయే దానయ్యలు ఫిర్యాదు చేస్తే బీసీ బిడ్డని మంత్రి వర్గం నుంచి తొలగించిన కేసీఆర్ ఇవాళ సీనియర్ మంత్రిపై ఆరోపణలు వస్తే ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. బీసీలకు, దళితులకో న్యాయం ,అగ్రవర్ణ మంత్రికి ఇంకో న్యాయమా అని అన్నారు. దళిత బంధులోనే కాదనీ, డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో, మిషన్ భగీరథలో కూడా లెక్క లేని అవినీతి రాజ్యమేలుతోందని రఘునందన్‌రావు ధ్వజమెత్తారు.

ఆహ్వానం అందింది కానీ వెళ్లను

30 తేదీన సచివాలయం ప్రారంభానికి ఆహ్వానం వచ్చింది కానీ అదే రోజు తన నియోజకవర్గంలో పనులు ఉన్నాయనీ, అందుకే తాను వెళ్ళడం లేదని రఘునందన్‌రావు చెప్పారు. సీఎం కేసీఆర్ సచివాలయానికి వస్తే మే ఒకటిన మొదటి దరఖాస్తు తీసుకొని తానే తీసుకుని వెళ్లి ఇస్తానని చెప్పారు.

టెక్స్‌టైల్ పార్కుల పనుల్లో వేగం పెంచండి

అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశాలు.. చేనేత మిత్ర కార్యక్రమాలపై ఆరా..

- టెక్స్‌టైల్ శాఖపై సుదీర్ఘ సమీక్ష చేపట్టిన మంత్రి
- నేతన్నల సంక్షేమాభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడి
- ఆదాయం, వృత్తి నైపుణ్యం పెంచేందుకు కార్యాచరణ



జౌళి శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎల్. రమణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నేతన్నల సంక్షేమం, ఆదాయ, వృత్తి నైపుణ్యం పెంచేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కె. తారకరామారావు స్పష్టం చేశారు. బీఆర్‌కే భవన్‌లో ఆయన జౌళి శాఖపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. టెక్స్‌టైల్ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వాటి అమలు తీరుపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న చేనేత మిత్ర లాంటి కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు అత్యంత సులభంగా నేతన్నలకు అందేలా అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నేతన్నల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం విభిన్న కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మినీ టెక్స్‌టైల్ పార్కులు, అప్పారెల్ పార్కుల అభివృద్ధిని చేపట్టిందన్నారు. గుండ్ల పోచంపల్లి అప్పారెల్ పార్క్, గద్వాల్ హ్యాండ్లూమ్ పార్క్ కార్యక్రమాలపై మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా సమీక్షించారు. ఆయా పార్కుల్లో ఇంకా మిగిలిపోయిన పనులుంటే వెంటనే వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో బ్లాక్ లెవెల్ క్లస్టర్ల పని తీరుపైన, వాటి పురోగతి పైన వెంటనే నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

చేనేత కార్మికులు అధికంగా ఉన్న నారాయణపేట, గద్వాల్, దుబ్బాక, కొడకండ్ల, మహదేవపూర్, కొత్తకోట వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనకు అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఆ రంగంలోని అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్న నేతన్నలకు గుర్తింపునిచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హైదరాబాద్ నగరంలో చేనేత మ్యూజియాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పవర్‌లూమ్‌పై కూడా...

రాష్ట్రంలో ఉపాధి కోసం నేతన్నలు విస్తృతంగా ఆధారపడిన పవర్‌లూమ్ రంగం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైన కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇందుకోసం దేశంలోనే ఆదర్శంగా ఉన్న తమిళనాడులోని తిర్పూర్ క్లస్టర్ మాదిరి ఒక సమీకృత పద్ధతిన,అత్యున్నత ప్రమాణాలతో కూడిన పవర్ లూమ్ క్లస్టర్లను తెలంగాణలో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ఇందుకోసం తిర్పూర్‌లో పర్యటించి అనేక అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేయాలన్నారు. సమావేశంలో చేనేత, పవర్ లూమ్ కార్పొరేషన్ల చైర్మన్లు ఎల్.రమణ, గూడూరి ప్రవీణ్, టెక్స్ టైల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శివసేన తెలంగాణ అధ్యక్షునిగా శివాజీ

సాక్షి, హైదరాబాద్: శివసేన పార్టీ తెలంగాణ అధ్యక్షునిగా సింకారు శివాజీ నియమితులయ్యారు. ఈమేరకు శివసేన జాతీయ అధ్యక్షుడు, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే ఉత్తర్వులు జారీ చేశారు. షిండే నివాసంలో శుక్రవారం నియామక ఉత్తర్వును శివాజీ అందుకున్నారు.

రేపు స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభ

సాక్షి, హైదరాబాద్: దళితులకు రాజ్యాధికారమే లక్ష్యంగా తలపెట్టిన స్వరాజ్య పాదయాత్ర 10 వేల కిలోమీటర్లకు చేరుకోనుంది. దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ గతే డాది మార్చి 15న ఈ యాత్రను నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణం నుంచి ప్రారంభించారు. ఈనెల 30న రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియం వద్దకు చేరుకోవడంతో 10 వేల కిలోమీటర్ల యాత్ర ముగియనుంది. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ జరగనున్నట్టు దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర కార్యదర్శి ఎ.లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు.



పరిశ్రమల్లో యోగా, జిమ్ సెంటర్లు

పరిశ్రమల శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ప్రతి కంపెనీలో కార్మికుల కోసం జిమ్, యోగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి మల్లారెడ్డి సూచించారు. -10లో



అల్లరి చెయ్యొద్దన్నందుకు..

అల్లరి చెయ్యొద్దన్నందుకు ఓ సినీ డ్యాన్సర్ వాచ్‌మెన్‌ను కిందకు తోసేసిన సంఘటన బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లోని రాఘవ లాడ్జిలో చోటు చేసుకుంది. -10లో

విచారణలో థర్డ్ డిగ్రీ అవసరం లేదు

సెల్‌ఫోన్ చోరీ కేసు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్న నిందితుడి అనుమానాస్పద మృతిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నగర పోలీస్ కమిషనర్, నార్త్ జోన్ డీసీపీ, గోపాలపురం ఏసీపీ, తుకారాంగేట్ ఎస్‌హెచ్‌ఓలకు నోటీసులు జారీ చేసింది. 'విచారణలో థర్డ్ డిగ్రీ అవసరం లేదు. థర్డ్ డిగ్రీ కారణంగానే వ్యక్తి మరణించాడు' అని ధర్మాసనం అభిప్రాయపడింది. -10లో

పచ్చల హారం!



పచ్చదనంతో కొత్త సచివాలయం కళకళ

- సచివాలయానికి ఎదురుగా.. సందర్శకులు వీక్షించేలా..
- ఆహ్లాదం ఉట్టిపడే విధంగా సుందరీకరణ
- వేగంగా కొనసాగుతున్న పనులు..
- మ్యూజికల్ ఫౌంటెన్ తరలింపునకు ముమ్మర ఏర్పాట్లు



అంబేడ్కర్ సాక్షిగా..

సాక్షి, సిటీబ్యూరో: విశాలమైన సాగర తీరాన ఆ మహాసౌధం ధవళ కాంతులను విరజిమ్ముతోంది. నాలుగు వందల ఏళ్లకు పైగా మహోన్నతమైన చరిత్ర కలిగిన హైదరాబాద్ కీర్తికిరీటంలో నూతన సచివాలయం ఒక అందమైన మణిహారంలా ఒదిగింది. ఆదివారం ప్రారంభం కానున్న సచివాలయాన్ని వీక్షించేందుకు కొంతకాలంగా సందర్శకుల తాకిడి పెరిగింది. నగరవాసులకే కాకుండా దేశ, విదేశాలకు చెందిన సందర్శకులు సైతం తప్పనిసరిగా సందర్శించవలసిన జాబితాలో నెక్లెస్‌రోడ్డు, ట్యాంక్‌బండ్ చేరాయి. ఒక వైపు తెలంగాణ అమరుల స్మారకం..మరోవైపు సచివాలయం, కొద్ది రోజుల క్రితమే ఆవిష్కరించిన బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహంతో అంతర్జాతీయ హంగులను సంతరించుకున్న నెక్లెస్‌రోడ్డు మార్గాన్ని మరింత ఆహ్లాదభరితం చేసేందుకు చేపట్టిన సుందరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సచివాలయం ప్రారంభోత్సవ సమయం ఆసన్నం కావడంతో దానికి ఎదురుగా పేవ్‌మెంట్ ఎత్తును పెంచి సందర్శకులు కూర్చొనేందుకు అనుకూలంగా ఆధునీకరించారు. సచివాలయానికి పచ్చల హారం అద్దినట్లు ఎదురుగా ఉన్న రోడ్డు పొడవునా నిలువెత్తు వృక్షరాజాలను నాటారు. సుమారు రూ.9 కోట్లతో హెచ్ఎండీఏ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ బ్యూటిఫికేషన్ పనులను కొనసాగిస్తోంది. మరోవైపు రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌కు ఎదురుగా చేపట్టిన ల్యాండ్‌స్కేప్ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి.

పీపుల్స్ ప్లాజాకు మ్యూజికల్ ఫౌంటెయిన్....

సచివాలయానికి సమీపంలో పెద్దఎత్తున వాహనాల రద్దీకి కారణంగా మారిన మ్యూజికల్ ఫౌంటెయిన్ తరలింపును కూడా వేగవంతం చేశారు.ఈ ఫౌంటెయిన్ వల్ల ఒకవైపు వాహనాలు నిలిచిపోవడంతో పాటు, మరోవైపు హుస్సేన్‌సాగర్‌లోని కలుషిత జలాలు రోడ్డుపైన పడడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం అలుముకుంది. తాజాగా సచివాలయం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ మార్గంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, తదితర ప్రముఖుల రాకపోకలు పెరగనున్నాయి. దీంతో వాహనాలు సాఫీగా సాగిపోయేందుకు వీలుగా ప్రస్తుతం లుంబినిపార్కు సమీపంలో ఉన్న మ్యూజికల్ ఫౌంటెయిన్‌ను పీపుల్స్‌ప్లాజా వైపు తరలిస్తున్నారు. త్వరలోనే ఈ తరలింపు ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

వ్యూ పాయింట్‌కు చేరువలో...

సాగర్ జలాశయాలపైన నడుస్తున్న అనుభూతిని కలిగించేవిధంగా సంజీవయ్య పార్కుకు సమీపంలో ఏర్పాటు చేస్తున్న వ్యూపాయింట్‌కు దగ్గర్లోనే ఇప్పుడు మ్యూజికల్ ఫౌంటెయిన్ కూడా చేరనుంది. పీపుల్స్‌ప్లాజా మార్గంలోనూ వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా దీని పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. సుమారు రూ.17.02 కోట్లతో దేశంలోనే అతి పెద్దదైన మ్యూజికల్ ఫౌంటెన్‌గా దీనిని ఫార్ములా–ఈ పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.10 మీటర్ల వెడల్పుతో, 90 మీటర్ల ఎత్తుతో, 180 మీటర్ల పొడవుతో ఎగిసిపడే నీటిధారలు ఎంతో అందంగా కనిపిస్తాయి. అలలపై మంచుతెరలు కమ్ముకున్నట్లుగా ఫౌంటెన్ ఉవ్వెత్తున చిమ్ముతూంటుంది.

న్యూస్‌రీల్

నేడు గోల్కొండలో 'మన్ కీ బాత్' ముఖ్య ఘట్టాల ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని చారిత్రక గోల్కొండకు అరుదైన గౌరవం దక్కింది. మన్ కీ బాత్ వందో ఎపిసోడ్ సందర్భంగా ఇక్కడ ప్రత్యేక ప్రదర్శన కోసం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కోటను ఎంపిక చేసింది. ఈ మేరకు కోటలో ప్రత్యేక సౌండ్ అండ్ లైట్ షో శనివారం సాయంత్రం 7 గంటలకు నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శనతో పాటు కొన్ని ప్రత్యేక థీమ్‌లు కూడా నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ప్రసారమైన మన్ కీ బాత్ 100 ఎపిసోడ్‌లలోని ప్రత్యేక ఘట్టాలతో రూపొందించిన వీడియోను ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో పాటు పాఠశాల విద్యార్థులు కూడా పాల్గొననున్నారు.

మ్యూజియంలో 'ఖానా ఖజానా'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇంటాక్ కన్వీనర్ అనురాధరెడ్డి

బహదూర్‌పురా: మారిన కాలంలో మారుతున్న ఆహారం గురించి నేటి తరానికి తెలియజెప్పేందుకు శుక్రవారం సాలార్‌జంగ్ మ్యూజియంలో 'ఖానా ఖాజానా' పై ఫుడ్ హెరిటేజ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ సాబేర్, ముజఫర్ ఖాన్‌లు మాట్లాడుతూ..షీర్ ఖుర్మా, డబల్ కా మీఠా, ఉస్మానియా బిస్కెట్‌తో పాటు బిర్యానీ తదితర ఆహార పదార్థాలు మన అనుదిన ఆహారంలో భాగమయ్యాయన్నారు. వాటి విశిష్టతను, చరిత్రను వివరించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరై వ్యాసరచన, పోస్టర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఇంటాక్ చాప్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌లో ఖానా ఖజానా నిర్వహించినట్లు ఇంటాక్ కన్వీనర్ అనురాధా రెడ్డి అన్నారు.

వీధికుక్కల కట్టడి



హైలెవల్ కమిటీ సిఫారసుల అమలు దిశగా జీహెచ్ఎంసీ

- 26 సిఫారసులు చేసిన కమిటీ
- ఎనిమిదింటి అమలుకు చర్యలు ప్రారంభం
- మిగతావాటి కోసం ప్రయత్నాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో వీధికుక్కల బెడద తగ్గించేందుకు హైలెవల్ కమిటీ సిఫారసుల అమలుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. 26 సిఫారసుల్లో ఎనిమిదింటి అమలుకు చర్యలు ప్రారంభించింది. మిగతా వాటిని అమలు చేసేందుకు అవసరమైన పనుల్లో నిమగ్నమైంది.

అమలు మొదలైనవి..

- వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్సలకు (స్టెరిలైజేషన్లకు) జీహెచ్ఎంసీలో ప్రస్తుతమున్న 16 మంది వెటర్నరీ డాక్టర్లకు తోడు 8 మంది ప్రైవేట్ డాక్టర్లను నియమించాలని సిఫారసు చేయగా వీరిలో ముగ్గురిని నియమించారు. మిగతా వారిని నియమించే చర్యలు చేపట్టారు.
- ప్రజలకు.. ముఖ్యంగా పాఠశాలల విద్యార్థులకు కుక్కలు కరవకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే చర్యల్లో భాగంగా 1,111 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్లమ్‌లెవల్ ఫెడరేషన్లకు, 1,066 పాఠశాలల్లోని 2,28,614 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు.
- స్టెరిలైజేషన్లు పెరిగేందుకు రెండు స్వచ్ఛంద సంస్థల సహకారంతో రోజుకు 45 కుక్కలకు స్టెరిలైజేషన్లు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ నిర్వహించే స్టెరిలైజేషన్లకు ఇవి అదనం.
- వేసవిలో వీధికుక్కల దాహార్తి తీర్చేందుకు నీటి సదుపాయం కల్పించే చర్యల్లో భాగంగా 2,453 ప్రాంతాల్లో ఈ ఏర్పాట్లు చేశారు.
- మాంసాహార వ్యర్థాలను బహిరంగంగా పారవేయరాదని పేర్కొంటూ 4,001 హోటళ్లు, దుకాణాలకు నోటీసులు జారీ చేశారు.
- తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కుక్కల పెంపకం సంస్థలు, పెట్‌షాపులకు జరిమానాలు విధిస్తున్నారు.
- కుక్కలను పట్టుకునే వాహనాల పేరును డాగ్ క్యాచింగ్ స్క్వాడ్ బదులుగా డాగ్ బర్త్ కంట్రోల్ యూనిట్‌గా మార్చారు.
- జీహెచ్ఎంసీ పరిసర మున్సిపాలిటీల్లోనూ స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- ఇవీ ఇప్పటి వరకు అమల్లోకి వచ్చిన సిఫారసులు కాగా, మిగతావాటి అమలుకు జీహెచ్ఎంసీ కమిషనర్ నుంచి సర్క్యులర్లు జారీ అయినా ఇంకా అమలుకు నోచుకోలేదు. వాటిలో ముఖ్యమైనవి.
- ఫిర్యాదులకు స్పందిస్తూ రాత్రివేళల్లోనూ వీధికుక్కలను పట్టుకోవడం. వీధికుక్కలకు సంబంధించి సినిమాలు, టీవీల్లో స్లైడ్‌షోలు,షార్ట్ ఫిల్మ్ వీడియో కాంటెస్ట్. కుక్కల సంరక్షణ కోసం అదనపు కేంద్రాల ఏర్పాటు.
- వీధికుక్కల దత్తత కార్యక్రమాలు. కుక్కలకు ఆహారం అందుబాటులో ఉండేలా కనీసం పది కేంద్రాల ఏర్పాటు. బార్కాస్, జంగమ్మెట్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్కకాటు బాధితులకు పోస్ట్ ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్‌లే, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచడం. తక్కువ సమయంలో ఎక్కువ స్టెరిలైజేషన్లు చేసేందుకు లాప్రోస్కోపిక్ విధానం.

త్వరలో చర్యలు..

- బహిరంగ ప్రదేశాల్లో మాంసాహార వ్యర్థాలు వేసే హోటళ్లు, దుకాణాలను ప్రాసిక్యూట్ చేయడంతో పాటు అలాంటి వాటిని మూసివేసేందుకూ వెనుకాడబోమని వెటర్నరీ అధికారులు పేర్కొన్నారు.
- కుక్కల సంరక్షణ కోసం భవన నిర్మాణాలు ఆలస్యం కావడంతోపాటు కొన్ని ప్రాంతాల్లో స్థలాలు గుట్టలుగా ఉన్నందున ప్రీ ఫ్యాబ్రికేటెడ్ భవనాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటిలో కుక్కల సంరక్షణతో పాటు రోజుకు 20 స్టెరిలైజేషన్లు చేసేందుకు వీలుగా ఏసీ తదితర సదుపాయాలూ ఉంటాయన్నారు.

కుత్బుల్లాపూర్‌లో 'డబుల్' లొల్లి

అర్హులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలనే డిమాండ్‌తో నిరసన దీక్షలకు బీజేపీ పిలుపునివ్వడంతో కుత్బుల్లాపూర్ పరిధిలో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. ముందస్తుగా పోలీసులు బీజేపీ నేతలను గృహనిర్బంధం చేశారు. స్థానిక నేతల నివాసాల వద్ద మఫ్టీ, స్థానిక పోలీసులు పెద్దఎత్తున మోహరించినా..మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పోలీసుల దృష్టి మళ్లించి ఓ కార్యకర్త కారులో బహదూర్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లవద్దకు చేరుకుని నిరసన దీక్షకు దిగారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అలాగే దేవేందర్ నగర్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించడం..అక్కడికి వస్తున్న నేతలను అరెస్టు చేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక శ్రీశైలంగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారన్న వార్త తెలిసి బీజేపీ కార్యకర్తలు పలు ప్రాంతాల్లో ఆందోళనకు దిగారు.

– కుత్బుల్లాపూర్





'ఎర్లీబర్డ్' చెల్లింపులు 'బ్లాక్'!

లింక్ ఓపెన్‌కు ఎర్రర్ ప్రాబ్లమ్

- విదేశాల నుంచి చెల్లించేవారికి ఎదురవుతున్న ఇబ్బందులు
- ముఖ్యంగా గల్ఫ్ దేశాల వారికి..
- సైబర్ సెక్యూరిటీ కోసమే సీజీజీ చర్యలంటున్న జీహెచ్ఎంసీ
- సంప్రదించిన వారికి చెల్లించే సదుపాయం



సాక్షి, సిటీబ్యూరో: విదేశాల నుంచి ఆన్‌లైన్ ద్వారా జీహెచ్ఎంసీ ఆస్తిపన్నును చెల్లించేవారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుంచి చెల్లింపులకు ప్రయత్నించిన వారికి ఈ ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. గ్రేటర్ నగరంలో భవనాలున్న..విదేశాల్లో నివసిస్తున్న వారితోపాటు విదేశీ పర్యటనలకు వెళ్లినవారు ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీనిచ్చే 'ఎర్లీబర్డ్' సదుపాయాన్ని వినియోగించుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా ప్రయత్నించగా సైట్ ఓపెన్ కాకుండా 'ఎర్రర్' అని చూపిస్తోంది. ఎన్ని పర్యాయాలు ప్రయత్నించినా అలాగే కనిపిస్తుండటంతో ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా జీహెచ్ఎంసీ సర్వర్ పని చేయడం లేదంటూ ఫిర్యాదులు చేశారు. అవి దృష్టికొచ్చిన జీహెచ్ఎంసీ ఐటీ విభాగం ఆరా తీయగా.. ఆస్తిపన్ను చెల్లింపులకు సంబంధించిన ఆన్‌లైన్ లింక్‌ను కొన్ని దేశాలు వినియోగించుకోకుండా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ బ్లాక్ చేసినట్లు తెలిసింది. కొన్ని దేశాల నుంచి ఆన్‌లైన్ లింక్‌ల ద్వారా సైబర్‌నేరాలు జరుగుతుండటంతో సైబర్ సెక్యూరిటీ కోసం అనుమానాలున్న దేశాల నుంచి ఈ లింక్ పనిచేయకుండా సీజీజీ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. విషయం తెలిసిన జీహెచ్ఎంసీ ఐటీ విభాగం..సంబంధిత యజమాని ఆస్తిపన్ను చెల్లించేందుకు సదుపాయం కల్పించడంతోపాటు ఎర్లీబర్డ్ సదుపాయానికి గడువున్న 30వ తేదీ వరకు తగిన జాగ్రత్తలతోనే లింక్ పనిచేసేలా సీజీజీని కోరినట్లు తెలిసింది.

నెట్‌వర్క్ మొత్తం సీజీజీ కంట్రోల్‌లో...

- జీహెచ్ంఎసీ నెట్‌వర్క్ మొత్తాన్ని సీజీజీ కంట్రోల్‌చేస్తుంది. ఆస్తిపన్ను నుంచి జీహెచ్ఎంసీకి సంబంధించిన సమస్త సమాచారం సీజీజీ వద్దే ఉంది. జీహెచ్ఎంసీ అధికారులు సైతం తమకు ఏదైనా సమాచారం కావాల్సి వస్తే.. సదరు విషయాన్ని సీజీజీకి మెయిల్ ద్వారా తెలియజేస్తే.. సమయం తీసుకొని అందజేస్తుంది.
- సీజీజీ వద్ద కేవలం జీహెచ్ఎంసీ సమాచారమే కాకుండా ఇంటర్మీడియట్ బోర్డు, టీఎస్‌పీఎస్‌సీ వంటి మరికొన్ని ప్రభుత్వ విభాగాల సమాచారం కూడా ఉన్నట్లు తెలిసింది. ఒకవేళ సీజీజీ సర్వర్ల సమాచారం వేరేవారి చేతుల్లోకి వెళ్తే ఎన్నో ప్రభుత్వ విభాగాల సమాచారం ప్రమాదం బారిన పడే అవకాశం ఉండటంతో ఐపీ అడ్రస్‌లను బట్టి కొన్ని అనుమానాస్పద దేశాల నుంచి ప్రయత్నించేవారికి లింక్ ఓపెన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది.

ఒకే డెబిట్ కార్డుపై ఎక్కువ ట్రాన్సాక్షన్లు చేసినా..

ఒకే డెబిట్ కార్డు ద్వారా వరుసగా 10 భవనాలకు సంబంధించిన ఆస్తిపన్ను చెల్లించిన యజమాని ఒకరు ఆ తర్వాత డెబిట్‌కార్డు పనిచేయకుండా పోవడంతో జీహెచ్ఎంసీ సర్వర్ పనిచేయడం లేదని ఫిర్యాదు చేశారు. సెక్యూరిటీ చర్యల్లో భాగంగానే ఒకే డెబిట్ కార్డుద్వారా వరుసగా ఎక్కువ చెల్లింపులు జరిగితే పది ట్రాన్సాక్షన్లు ముగియగానే ఆటోమేటిక్‌గా పనిచేయకుండా సీజీజీ రక్షణ చర్యలు చేపట్టినట్లు జీహెచ్ఎంసీ వర్గాల ద్వారా తెలిసింది.

5 శాతమే అయినా.. ఎంతో స్పందన

- ఎర్లీబర్డ్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించేవారికి జీహెచ్ఎంసీ ఇస్తున్నది కేవలం 5 శాతం రాయితీయే అయినా దానికి ఎంతో స్పందన ఉంటోంది. ఎర్లీబర్డ్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.750 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలనేది జీహెచ్ఎంసీ టార్గెట్ కాగా, శుక్రవారం మధ్యాహ్నం వరకు రూ.600 కోట్లకు పైగా వసూలైనట్లు తెలిసింది. గడువు ముగిసేలోగా టార్గెట్ చేరుకునే అవకాశాలున్నాయని జీహెచ్ఎంసీ భావిస్తోంది.
- న్యూఢిల్లీలో మొదటి త్రైమాసికంలో ఆస్తిపన్ను చెల్లించే వారికి 15 శాతం రాయితీ ఉందని తెలిసింది. జీహెచ్ఎంసీ 5 శాతం రాయితీకే నెలరోజుల గడువు మాత్రమే ఇచ్చింది.

ఎవరేంటి?

పని మనుషుల వివరాలపై కార్ఖానా పోలీసుల ఇంటింటి సర్వే

ముంబై నుంచి నగరానికి వచ్చి ఎస్సార్‌నగర్‌లోని బి.రామ్ నారాయణ ఇంట్లో పని మనిషిగా చేరిన మహాదేవి రాజేష్ కలాల్ అదును చూసుకుని 120 తులాల బంగారు, వజ్రాభరణాలు దోచుకుపోయింది. యజమాని వద్ద ఈమె వివరాలు లేకపోవడంతో కేసు దర్యాప్తు కష్టసాధ్యమైంది. నగరంలో తరచూ చోటు చేసుకుంటున్న ఇలాంటి ఉదంతాలను దృష్టిలో పెట్టుకున్న ఉత్తర మండల పరిధిలోని కార్ఖానా పోలీసులు అప్రమత్తమయ్యారు. తన పరిధిలో ఉన్న ఇళ్లల్లో పని చేస్తున్న కుక్స్, సర్వెంట్స్, డ్రైవర్స్ తదితరుల వివరాలతో డేటా బేస్ రూపొందించడానికి రంగంలోకి దిగారు. దీనికోసం ఇంటింటి సర్వే ప్రారంభించారు. – రసూల్‌పురా

ఇంటింటి సర్వేపై వినూత్న ఆలోచన చేసిన కార్ఖానా ఇన్‌స్పెక్టర్ బి.రవీందర్ అమలులో పెట్టడానికి సబ్-ఇన్‌స్పెక్టర్ అవినాష్ బాబు నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఇవి ప్రణాళికబద్ధంగా కాలనీల్లో సంచరిస్తూ సమాచారం సేకరిస్తున్నాయి. ఓ పక్క పనిమనుషుల ఏర్పాటు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్లక్ష్యం చేస్తే కలిగే నష్టాలను వివరిస్తూ కాలనీవాసుల్లో అవగాహన కల్పిస్తున్నారు. మరోపక్క వారి ఇళ్లల్లో ఇప్పటికే పనిచేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ తదితరాలతో పాటు ఫొటో కూడా తీసుకుని డేటాబేస్ రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ బృందాలు దాదాపు 20 కాలనీల్లో 750 ఇళ్లల్లో పని చేస్తున్న వారి వివరాలు సేకరించింది.

నేరాలకు తావు లేకుండానే..



విజిబుల్ పోలీసింగ్, బీట్ వ్యవస్థ పటిష్ట నిర్వహణతో నేరాలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. అలాగే అసలు నేరాలకే తావులేకుండా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగానే ఈ ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టాం. గతంలో పనిమనుషులుగా ఓ ఇంట్లో చేరిన నేపాలీలు భారీ సొత్తు చోరీ చేసిన ఉదంతాలు ఉన్నాయి. వారి ఆచూకీ ఇప్పటికీ లభించక కేసు కొలిక్కి రాలేదు.

– బి.రవీందర్, ఇన్‌స్పెక్టర్

ఈ సర్వే ఎంతో ఉపయుక్తం



నమ్మకంగా పనిచేస్తూనే కొందరు పనిమనుషులు, డ్రైవర్లు ఇంటి యజమాని లేని సమయంలో చోరీ చేసిన సంఘటనలు ఉన్నాయి. అలాంటి నేరాలు మరోసారి జరగకుండా కార్ఖాన పోలీసులు చేస్తున్న ఈ సర్వే ఎంతో ఉపయుక్తం. ఇలాంటి సర్వేలు నగర వ్యాప్తంగా జరగాలి.

– ధీరజ్ అగర్వాల్, విక్రంపురి

యాప్ ద్వారానూ 'వెరిఫికేషన్'

సాక్షి, సిటీబ్యూరో: పనివాళ్లే పగవాళ్లుగా మారి యజమానుల ఇళ్లల్లోనే చోరీలు, దోపిడీలు, బందిపోటు దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరిని ఉద్యోగాల్లో నియమించుకుంటున్న వాళ్లు పూర్తి వివరాలనూ సేకరించట్లేదు. వీటిని పరిగణలోకి తీసుకున్న హైదరాబాద్ పోలీసు విభాగం ఎవరినైనా ఇంట్లో పనిలో పెట్టుకునే ముందు వారి పూర్వాపరాలు సరి చూసుకోమని కోరుతోంది. కార్ఖానా పోలీసులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఇది అన్ని ఠాణాల్లోనూ అమలు సాధ్యం కాదు. వెరిఫికేషన్ చేయించడానికి పోలీసుస్టేషన్ వరకు వెళ్లాల్సి వస్తుందనే ఉద్దేశంతో యజమానుల్లో చాలా మంది వెనుకడుగు వేస్తూ ముప్పును కొనితెచ్చుకుంటున్నారు. దీనికి పరిష్కారంగా ఉన్నతాధికారులు పోలీసు అధికారిక యాప్ 'హాక్ ఐ'లో దీనికి సంబంధించి ప్రత్యేక ఆప్షన్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా తమను సంప్రదించి సహాయం పొందవచ్చని స్పష్టం చేస్తున్నారు. దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేయడానికి సిటీ పోలీసు ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హాక్ ఐ యాప్ యాక్టివేట్ చేసుకున్న వాళ్లు అందులోని 'రిజిస్టర్ విత్ పోలీసు' ఆప్షన్ ద్వారా ఈ సదుపాయం పొందవచ్చు. ఆ ఆప్షన్‌లోకి ప్రవేశించిన తర్వాత పనిలో పెట్టుకోబోయే వ్యక్తి పేరు, ఫొటో ఇతర వివరాలతో పాటు అతడికి తెలిసిన (రిఫరెన్స్) మరో వ్యక్తి పేరునూ పొందుపరచాలి. ఈ వివరాలన్నీ యజమానులు సదరు ఉద్యోగార్థి నుంచే తీసుకోవాలి. ఇలా వచ్చిన అంశాలను క్రోడీకరించే అధికారులు యజమానులు నివసించే ప్రాంతానికి చెందిన స్థానిక పోలీసుస్టేషన్లకు పంపిస్తారు. ఈ ఠాణాలోని సిబ్బంది వాటిని భద్రపరచడంతో పాటు ఆ వ్యక్తిపై గతంలో ఏవైనా నేరాలు ఉన్నాయా? అనే అంశాన్నీ ఆరా తీస్తారు. రిఫరెన్స్‌గా ఇచ్చిన వ్యక్తినీ పోలీసులు సంప్రదించి వివరాలు సేకరిస్తారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో యజమానులు బాధితులుగా మారే అవకాశం 95 శాతానికి పైగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ఇళ్లల్లో అద్దెకు దిగుతున్న వాళ్లు యజమానుల పట్ల, బయట నేరాలకు ఒడిగడుతున్నారు. ఉగ్రవాద చర్యల కోసం సిటీకి వచ్చిన వాళ్లు అద్దె ఇళ్లల్లో ఉన్న ఉదంతాలు గతంలోనూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇళ్ల యజమానులు అద్దెకు వచ్చిన వారి వివరాలను ఈ ఆప్షన్‌లో పొందుపరిచి వారి పూర్వాపరాలు సరిచూసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. హాక్ ఐలో ఉన్న రిజిస్టర్ విత్ పోలీసు సదుపాయాన్ని ఇప్పటి వరకు 605 మంది వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.



కాలనీల్లో పనిమనుషుల సర్వే నిర్వహిస్తున్న పోలీసులు

ఇప్పటి వరకు వెరిఫై అయినవి

సహాయకుడు	17
వంట వాళ్లు	9
డ్రైవర్లు	66
ఎలక్ట్రీషియన్	3
మహిళా సర్వెంట్	37
పురుష సర్వెంట్	19
సెక్యూరిటీ గార్డు	21
అద్దెకు వచ్చిన వాళ్లు	28
ఇతరాలు	405
మొత్తం	605

పరిశ్రమల్లో యోగా, జిమ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి

గన్‌ఫౌండ్రీ: పరిశ్రమల శాఖ అధికారులు కంపెనీల పనితీరుపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారని ఇది సరికాదని తనిఖీల విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ, జాతీయ భద్రతా మండలి తెలంగాణ శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య భద్రత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ కంపెనీల నిర్వాహకులు ఉద్యోగుల భద్రత, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి కంపెనీలో కార్మికుల కోసం జిమ్, యోగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఇందుకు సంబంధించి అధికారులు తక్షణమే కంపెనీలకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ప్రతి కంపెనీని తనిఖీ చేసి కాలం చెల్లిన వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీలు తమ లాభాల్లో కొంతభాగం ఉద్యోగుల వేతనాలు పెంచేందుకు కేటాయించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ ప్రపంచంలోనే నెంబర్–1 వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పలు కంపెనీల ప్రతినిధులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అంతకు ముందు కంపెనీలలో భద్రత, కార్మికుల రక్షణ తదితర అంశాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ సంచాలకులు రాజగోపాల్‌రావు, అధికారులు సదానంద గౌడ్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

నేనే నెంబర్: 1

ఇంజినీరింగ్, మెడికల్, పీజీ కళాశాలలను స్థాపించి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన తాను తెలంగాణలో నెంబర్– 1 స్థాయిలో ఉన్నానని మంత్రి మల్లారెడ్డి అన్నారు. 1976 లో పాల వ్యాపారంతో జీవితాన్ని ప్రారంభించిన తాను క్రమశిక్షణ, కఠోర శ్రమ కారణంగానే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. కార్మికులు తమ పిల్లలకు మంచి విద్యను అందించాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. పరిశ్రమలు సైతం సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అల్లరి చెయ్యొద్దన్నందుకు..
కిందకు తోసేశాడు

వాచ్‌మెన్‌ను హత్య చేసిన సినీ డ్యాన్సర్



యాదగిరి (ఫైల్) నిందితుడు విజయ్‌కుమార్

బంజారాహిల్స్: అల్లరి చెయ్యొద్దన్నందుకు ఓ సినీ డ్యాన్సర్ వాచ్‌మెన్‌ను కిందకు తోసేసిన సంఘటన బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లోని రాఘవ లాడ్జిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా, మీదికొండ గ్రామానికి చెందిన సానబోయిన యాదగిరి(52) బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని రాఘవలాడ్జిలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబంతో సహా అక్కడే ఉంటున్నాడు. అదే లాడ్జిలో ఈ నెల 20 నుంచి చెన్నై, మేటికుప్పం కాలనీకి చెందిన విజయ్‌కుమార్ మణికంఠన్ అనే సినీ డ్యాన్సర్ మరో 15 మందితో కలిసి ఉంటున్నాడు. గురువారం సాయంత్రం షూటింగ్ ముగించుకుని లాడ్జికి వచ్చిన మణికంఠన్ ఓ వైపు గంజాయి, మరో వైపు మద్యం సేవిస్తూ అల్లరి చేస్తుండటంతో పలుమార్లు వాచ్‌మెన్ యాదగిరి వారిని హెచ్చరించాడు. రాత్రి 10 దాటుతున్నా మణికంఠన్ అరుపులు కేకలతో వేస్తుండటంతో పక్క గదుల్లో బస చేసినవారు వాచ్‌మెన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో యాదగిరి మూడో అంతస్తుకు వెళ్లి మణికంఠన్‌ను ప్రశాంతంగా ఉండాలని మిగతా గదుల్లో ఉన్న వారు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీంతో ఆగ్రహానికి లోనైన మణికంఠన్ నన్నే హెచ్చరిస్తావా అంటూ యాదగిరి చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని నేలకేసి కొట్టాడు. ఇదేమిటని యాదగిరి ప్రశ్నిస్తుండగానే మరింత ఆగ్రహానికి లోనైన అతను యాదగిరిని మూడోఅంతస్తు నుంచి కిందికి తోసేశాడు. తీవ్రంగా గాయపడిన యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ముందే భర్త విగతజీవిగా మారడంతో అతడి భార్య ఉమ రోధనలు మిన్నంటాయి. దీనిపై సమాచారం అందడంతో వెస్ట్‌జోన్ డీసీపీ జోయెల్ డేవిస్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు మణికంఠన్‌ను అరెస్ట్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విచారణలో థర్డ్ డిగ్రీ అవసరం లేదు

- ఆటోడ్రైవర్ చిరంజీవి మృతిపై వివరణ ఇవ్వాలి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సెల్‌ఫోన్ చోరీ కేసు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్న నిందితుడి అనుమానాస్పద మృతిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నగర పోలీస్ కమిషనర్, నార్త్ జోన్ డీసీపీ, గోపాలపురం ఏసీపీ, తుకారాంగేట్ ఎస్‌హెచ్‌ఓలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 5కు వాయిదా వేసింది. సెల్‌ఫోన్ చోరీ కేసు విచారణ నిమిత్తం తుకారాంగేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆటో డ్రైవర్ చిరంజీవి అనుమానాస్పద మృతి ఘటన గురించి పత్రికల్లో వచ్చిన వార్తను హైకోర్టు సుమోటో పిటిషన్‌గా పరిగణించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. 'పోలీసు డిపార్ట్‌మెంట్‌లోని కింది స్థాయి అధికారులకు సున్నితత్వంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాం. విచారణలో థర్డ్ డిగ్రీ అవసరం లేదు. థర్డ్ డిగ్రీ కారణంగానే వ్యక్తి మరణించాడు. ఈ విషయాన్ని రికార్డులోకి తీసుకురావాలి' అని ధర్మాసనం అభిప్రాయపడింది. ఆటోడ్రైవర్‌పై దాదాపు 6 కేసులు ఉన్నాయని ఏజీ బీఎస్ ప్రసాద్ నివేదించారు. ఈ క్రమంలో సీజే కల్పించుకుని.. 'ఇది అసంబద్ధం. సదరు వ్యక్తి పోలీస్ కస్టడీలో ఉన్నప్పుడు మరణించాడు. ఎలా అయినా ఇది ఆమోదయోగ్యం కాదు' అని చెప్పారు. వాదనలు విని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. చిరంజీవి భార్యతో పాటు మరొకరు దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ పిల్‌కు అటాచ్ చేసి కలిపి విచారణ చేస్తామన్నారు.

క్లుప్తంగా...

పైప్‌లైన్ నిర్మాణ పనుల పరిశీలన



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ బ్రహ్మకుమారీస్ వెనుక చిల్లా లైన్‌లో జరుగుతున్న సీవరేజి పైప్‌లైన్ నిర్మాణ పనులను శుక్రవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పరిశీలించారు. రూ. 31 లక్షల వ్యయంతో 300 ఎంఎం డయా పైప్‌లైన్ పనులు ఇక్కడ ప్రారంభం అయ్యాయి. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి తట్టికానా సెక్షన్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు బ్యాగుల పంపిణీ



బంజారాహిల్స్: పారిశుద్ధ్య కార్మికులు రోడ్లపై ఊడ్చిన వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని సేకరించి గతంలో ప్లాస్టిక్ సంచుల్లో నింపి ఆటో రిక్షాలకు అందజేసేవారు. వాటి వల్ల ప్లాస్టిక్ వినియోగంతో పాటు అవి చినిగిపోవడం, పర్యావరణ పరంగా హానికరంగా ఉండటంతో వాటి స్థానంలో పర్యావరణహిత క్లాత్ టార్పలిన్ బ్యాగులను అందుబాటులోకి తీసుకొచ్చారు. జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్ ఈ క్లాత్ టార్పలిన్ బ్యాగులను వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని నందినగర్, నూర్‌నగర్ ప్రాంతాల్లో స్వీపింగ్ గ్రూపులకు పంపిణీ చేశారు. తొలి దశలో సర్కిల్‌కు 100 బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటి వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని ఆమె తెలిపారు. మళ్లీమళ్లీ వినియోగించేలా ఈ బ్యాగులు దృఢంగా ఉన్నాయని ఆమె వెల్లడించారు.

నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి



శ్రీనగర్‌కాలనీ: నాయీబ్రాహ్మణులకు అండగా ఉంటానని టీ హోప్ సంస్థ చైర్మన్ టి.ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీ కమలాపురికాలనీలోని కార్యాలయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయీబ్రాహ్మణ నాయకులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను విని తనవంతు సహాయాన్ని ఎప్పటికీ అందిస్తానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనకు సహకరించాలని ఉపేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ స్వామినాయీ, గౌరవాధ్యక్షులు సత్యానారాయణ, చంద్రశేఖర్, దత్తు, గాలయ్య, రాంచందర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

కామెట్ ఈవీ కారు లాంచ్



ఈవీ కారును ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: అర్బన్ మొబిలిటీ కోసం ఎంజీ మోటార్ ఇండియా తన ఎంజీ కామెట్ ఈవీ–ది స్మార్ట్ ఎలక్ట్రిక్ వెహికిల్‌ను ఆవిష్కరించింది. రూ. 7.98 లక్షల ఆకర్షణీయమైన ప్రారంభ ధరలో కామెట్ ఈవీ లభిస్తుందని, నెలకు రూ. 519 ఎకనామికల్ చార్జింగ్‌తో ఇది పని చేస్తుందన్నారు. ఇది పూర్తిగా ఎలక్ట్రిక్ వాహన ప్లాట్‌ఫామ్‌పై తయారు చేశారని ఎంజీ మోటర్ ఇండియా అధ్యక్షుడు, ఎండీ రాజీవ్ చాబా తెలిపారు. 17.3 డ్రైవ్ మోడ్‌లు, మూడు కేవీఆర్ఎస్ మోడ్‌లు ఉంటాయని, డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్‌బ్యాగులు ఉన్నాయన్నారు. డైనమిక్ ఐలాండ్ నోటిఫికేషన్లు, స్మార్ట్ స్టార్ సిస్టమ్, డిజిటల్ బ్లూటూత్ కీ షేరింగ్ ఫంక్షన్ అదనపు ఆకర్షణలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ ఈవీ విక్రయాల మార్కును చేరుకుందన్నారు.

మందుబాబులకు జరిమానా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పీకల దాకా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 11 మందికి న్యాయస్థానం జరిమానా విధిస్తూ తీర్పుచెప్పింది. వివరాలివీ... మద్యం సేవించి వాహనాలు నడుపుతూ వీరందరినీ శుక్రవారం నాంపల్లిలోని 6వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఒక్కొక్కరికి రూ. 2100 ప్రకారం జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వీరంతా ద్విచక్ర వాహనదారులు కాగా వీరి నుంచి రూ. 23,100 జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో...

చిన్నారులకు ఆధార్ నమోదు

- ప్రతి చిన్నారికీ ఆధార్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- నిత్యం కొనసాగుతున్న నమోదు ప్రక్రియ



అయిదేళ్లలోపు చిన్నారులకు ఆధార్‌ను నమోదు చేస్తున్న పోస్టల్ సిబ్బంది

వెంకటేశ్వరకాలనీ: షేక్‌పేట మండల పరిధిలోని గౌతంనగర్, వినాయకనగర్, దుర్గా భవానీకాలనీలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఒకే రోజు గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆధార్ నెంబర్లు చేయించారు.

- ఒక్కో కేంద్రంలో 20 నుంచి 25 మంది చిన్నారులు చదువుకుంటుండగా వీరందరి ఆధార్ నెంబర్లు తప్పనిసరి చేశారు. రోజూ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఆయా అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో చేపడుతున్నట్లు ఐసీడీఎస్–2 ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్ లోవకుమారి తెలిపారు.
- ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ప్రతి చిన్నారి ఆధార్ నమోదుపట్ల తల్లిదండ్రులు శ్రద్ధచూపాలని ఆమె కోరారు. ఈ మేరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆదేశాలు జారీచేసినట్లు కూడా వెల్లడించారు.
- ఇదిలా ఉండగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసే ముందు వారం ముందుగానే తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తున్నారు. తప్పనిసరిగా చిన్నారుల నమోదుకు ముందుకు రావాలని అంగన్‌వాడీ టీచర్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందుకోసం ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులకు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. రోజూ మూడు అంగన్‌వాడీ కేంద్రాల చొప్పున ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 141 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ నమోదును చేపడుతున్నారు.

- బస్తీల్లో ఆధార్ నమోదు కేంద్రాలు లేనందున చాలా మంది ఆధార్ నమోదుకు ముందుకు రావడం లేదు. దీంతో అధికారులే కేంద్రాలను బస్తీల చెంతకు తీసుకొస్తున్నారు.

పారదర్శకంగా...

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంత మంది చిన్నారులు చదువుతున్నారు. ఎంత మంది హాజరవుతున్నారు, నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ అవుతున్నదా లేదా అన్న వివరాలు పారదర్శకంగా ఉండేందుకే చిన్నారుల ఆధార్ నమోదు తప్పనిసరి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ చిన్నారుల ఆధార్ నమోదు తప్పనిసరి చేస్తూ తగిన సూచనలు జారీ చేస్తున్నది. ఇందుకోసం ప్రత్యేక నిధులు కూడా కేటాయిస్తున్నది.
- ఇక నుంచి ప్రతి విద్యార్థి ఆధార్ నెంబర్ సహా పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు.
- ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు ట్యాబ్‌లు కూడా పంపిణీ చేశారు.
- ప్రతి టీచర్ తన వద్ద ఉన్న ట్యాబ్‌లో ఆ విద్యార్థి ఆధార్ నెంబర్, పూర్తి చిరునామా, ఎత్తు, బరువు, ఇస్తున్న ఆహారం తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



పనులను పరిశీలిస్తున్న మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: రిజర్వాయర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జలమండలి అధికారులను ఆదేశించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో నిర్మాణంలో ఉన్న 3 ఎంఎల్ రిజర్వాయర్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... రిజర్వాయర్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి వినియోగంలోని తీసుకురావాలని సూచించారు. కొత్త రిజర్వాయర్ ఏర్పాటుతో రెండు డివిజన్లలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జలమండలి జీఎం హరిశంకర్ మాట్లాడుతూ... మూడు నెలలలోపు రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మేనేజర్ రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, రహమత్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు కొండాపురం నాగరాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు విజయ్‌కుమార్, రవిశంకర్, నజీర్, జాఫర్ హుస్సేన్, ఫయాజ్, గఫూర్, నందునాయక్, జబ్బార్‌ఖాన్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

పార్కులో వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: 'ఓపెన్ బార్‌లా ఉద్యానవనం' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు, బంజారాహిల్స్ పోలీసులు స్పందించారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు కార్మికులతో పార్కులో ప్లాస్టిక్ కవర్లతో పాటు వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. లారీ చెత్త ఈ ఉద్యానవనంలో బయటపడింది. మరో వైపు పార్కులో, ఫుట్‌పాత్‌పై మందుబాబులకు మద్యం సరఫరా చేస్తున్న ఘటనలో ఇక్కడే ఉన్న వెన్నెల వైన్ షాప్ మేనేజర్ మహేష్ నాయక్‌ను బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. గుట్టల కొద్దీ ప్లాస్టిక్ కవర్లు, మద్యం సీసాలు, పార్కులో వెలుగుచూడగా పోలీసులు సదరు వైన్‌షాపు యజమానిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



పార్కులో వ్యర్థాలను తరలిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

సినిమా మేనేజర్ కిడ్నాప్‌నకు యత్నం

ముగ్గురు నిందితుల అరెస్ట్

పంజగుట్ట: డబ్బుల కోసం ఓ సినిమా మేనేజర్‌ను కిడ్నాప్ చేయించేందుకు యత్నించిన వ్యక్తితో పాటు మరో ఇద్దరిని పంజగుట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌కాలనీ యాక్సిస్ బ్యాంకు సమీపంలో ఓ ఇంట్లో సినిమా మేనేజర్ హరీష్ నివాసం ఉంటున్నాడు. అతడికి రహమత్‌నగర్‌కు చెందిన సినీ ఫొటోగ్రాఫర్ యార్లగడ్డ మురళీకృష్ణతో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో మురళీకృష్ణకు డబ్బులు అవసరం కావడంతో హరీష్ వద్ద డబ్బులు ఉంటాయని తెలుసుకున్న అతను హరీష్‌ను కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకుగాను జగద్గిరిగుట్టకు చెందిన కె.హరిప్రసాద్, వినాయక్‌నగర్‌కు చెందిన బి.శివకుమార్‌తో కలిసి పథకం పన్నాడు. ఈ నెల 26న రాత్రి హరిప్రసాద్, శివకుమార్ హరీష్ ఇంటికి వచ్చారు. ఒకరు కత్తి, మరొకరు బ్లేడ్ చూపించి అరిస్తే చంపేస్తామని అతడిని బెదిరించారు. బయట ఉన్న మురళీకృష్ణ వారికి బీర్ బాటిల్స్ తెచ్చివ్వగా హరీష్‌కు బలవంతంగా బీరు తాగించారు. అనంతరం రెండు చేతులు కట్టేసి 2 తులాల బంగారు గొలుసు, రెండు ఉంగరాలు, 15 గ్రాముల బ్రాస్‌లెట్, రెండు సెల్‌ఫోన్లు లాక్కున్నారు. అంతటితో ఆగక హరీష్‌ను ఆటోలో బలవంతంగా ఎక్కించి ఎస్సార్ నగర్ వైపు తీసుకెళ్లారు. బిర్యానీ తినేందుకు దక్కన్ హోటల్ వద్ద ఆగిన వారు సిగరెట్ తాగుతుండగా హరీష్ ఆటోలోంచి బయటకు దూకిన హరీష్ కేకలు వేస్తూ అక్కడినుంచి పరిగెత్తాడు. దీంతో భయపడిన నిందితులు అక్కడ నుంచి పరారయ్యారు. గురువారం రాత్రి బాధితుడు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక ఉంగరం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

చెట్ల కొమ్మలను తొలగించండి

రహమత్‌నగర్: ఈదురు గాలులు, భారీ వర్షాలకు విరిగి పడిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించి, వాహనదారులకు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జీహెచ్ఎంసీ సర్కిల్–19 డీఎంసీ రమేశ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. బ్రహ్మశంకర్‌నగర్ ఆలయం వద్ద కొనసాగుతున్న చెట్ల కొమ్మల వ్యర్థాల తొలగింపు పనులను ఆయన శక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ... భారీ వర్షం, ఈదురు గాలులకు విరిగి పడిన చెట్ల కొమ్మలను, మట్టిని, రాళ్లను సత్వరమే తరలించాలని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఆలయ ఆవరణలో కూలిన మహావృక్షం మొదలును తొలగించేందుకు జేబీసీని వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, ఆలయ చైర్మన్ అడవయ్య, బస్తీ అధ్యక్షుడు ఓర్సు వసంత్‌కుమార్, ఎస్ఎఫ్ఏలు రాజశేఖర్, అజయ్‌బాబు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

శ్రీనగర్‌కాలనీ: నిమ్స్‌మే ఆధ్వర్యంలో ఏటీఐ పథకం ద్వారా బ్యూటీ అండ్ వెల్‌నెస్, బేకింగ్ సెక్టార్‌లో శిక్షణ పొందిన ఔత్సాహికులకు శుక్రవారం నగరానికి చెందిన బ్యూటీ, బేకింగ్ సంస్థలు జాబ్ మేళాను నిర్వహించారు. 80 మంది హాజరుకాగా సుమారు 60 మందిని తదుపరి ఇంటర్వ్యూకి ఎంపిక చేశారు. నిమ్స్ మే ప్రతినిధులు, పలు కంపెనీలు పాల్గొన్నాయి.

అంబేడ్కర్ వర్సిటీ ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్‌గా బానోతు ధర్మ



ధర్మకు నియామక పత్రం ఇస్తున్న వీసీ సీతారామారావు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్‌గా డాక్టర్ బానోతు ధర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన విద్యార్థి సేవల విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు లైజన్ ఆఫీసర్‌గా ఉన్న డాక్టర్ ప్రమీలా కేతావత్ నుంచి ధర్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ కె.సీతారామారావు, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీఆర్ఎస్.రెడ్డి తదితరులు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనను అభినందించారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

బంజారాహిల్స్: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మంగళ్‌హాట్, ధూల్‌పేట్‌లలో నివసించే వి.సుశీల్(27)కు స్టేషనరీ షాపు ఉంది. వెంకటగిరిలో దుర్గా స్టేషనరీలో బుధవారం రాత్రి బెంగళూరు, కోల్‌కతా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి క్రికెట్ లైన్ డాట్‌కామ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. అదే సమయంలో బెటింగ్‌కు పాల్పడుతూ సుశీల్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఆయన నుంచి రూ. 25 వేలతో పాటు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్ ద్వారా తేలికగా డబ్బు సంపాదించవచ్చనే ఆలోచనతో కొంత కాలంగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా జగ్గయ్య బస్తీ మార్కెట్ గల్లీలో నివసించే షేక్ సల్మాన్(23) వాల్‌పెయింటర్‌గా పని చేస్తూ కొంత కాలంగా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఆ యువకుడి నుంచి రూ. 11 వేలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం–14లోని తెలంగాణ స్టడీ సర్కిల్‌కు సమీపంలో జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా అదనంగా వేసిన అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చేశారు. స్థానికంగా సయ్యద్ సిద్ధిఖ్ మొహియుద్దీన్‌తో పాటు అతడి సోదరుడికి చెందిన 264 గజాల స్థలంలో ఇటీవల భారీ భవనాన్ని నిర్మించారు. జీహెచ్ఎంసీ నుంచి కేవలం జీ ప్లస్ 3కి అనుమతి మాత్రమే ఉండగా కొంతమంది నేతల దన్నుతో ఏకంగా ఐదు అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టారు. ఎలాంటి సెట్ బ్యాక్స్ వదలకపోవడంతో పాటు స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగేలా నిర్మాణాలు చేపట్టారు. దీంతో అక్రమ నిర్మాణాలను కూల్చాలంటూ స్థానికులు ఇటీవల మంత్రి కేటీఆర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. కొంతమంది స్థానిక నాయకులు, బడా రాజకీయ నాయకులు అక్రమ నిర్మాణాలను వెనకుండి నడిపిస్తున్నారంటూ మరోసారి ఫిర్యాదులు చేయడంతో స్పందించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం అదనంగా నిర్మించిన రెండు అంతస్తులను కూల్చేశారు.

జీబ్రా క్రాసింగ్ వద్దే రోడ్డు దాటాలి

బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం 3లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు ఆధ్వర్యంలో ఇక్కడి ఉద్యోగులు, విద్యార్థులకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టాప్‌లైన్, రాంగ్‌రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఏర్పడే అనర్థాలను కళ్లకుకడుతూ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కాలేజీ విద్యార్థులు తప్పనిసరిగా జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటడం ద్వారా మిగతావారికి అవగాహన కలిగించిన వారవుతారన్నారు. రోడ్డు పక్కన నడుస్తున్నప్పుడు, వాహనం నడిపేటప్పుడు దృష్టి పూర్తిగా రోడ్డు మీదే ఉండాలని సూచించారు. వాహనం నడిపించేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇతర రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. కారు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించడం ద్వారా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు పోకుండా చూసుకోవచ్చన్నారు. కళాశాల విద్యార్థులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ లేకుండా నడపడం మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధం అన్నారు. కార్యక్రమంలో వంద మంది కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. కళాశాల సీనియర్ ఏవో మేరీ ఎలియట్, బేగంపేట టీటీఐ సీఐ నాగరాజు, ఎస్ఐ జ్యోతి, హీరో మోటార్ క్యాప్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు తదితరులు

నీటిని కలుషితం చేస్తే సహించం

వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



కార్పొరేటర్, అధికారులకు సమస్యను వివరిస్తున్న నూర్‌నగర్ బస్తీవాసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నూర్‌నగర్‌తో పాటు చుట్టూ ఉన్న నంది నగర్, వెంకటేశ్వరనగర్, గురుబ్రహ్మనగర్, ఇబ్రహీంనగర్ బస్తీవాసులతో పాటు సమీపంలోని ఇన్‌కంట్యాక్స్ క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్‌లో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. నూర్‌నగర్‌లో ఇష్టానుసారంగా పార్కింగ్ ప్లేస్‌లు, మెట్ల కింద స్థలాలు కూడా ఇటీవల కాలంలో అద్దెలకు ఇస్తూ డయింగ్ షాపులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ డయింగ్ కోసం వినియోగిస్తున్న రసాయనాలు భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. బోర్లతో పాటు మంచినీటి పైప్‌లైన్లు కూడా ఈ డయింగ్‌లో వాడుతున్న రసాయనాలతో కలుషితం అవుతూ స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం నూర్‌నగర్‌లో పర్యటించారు. స్థానికులు ఆమెకు, జీహెచ్ఎంసీ అధికారులకు, పోలీసులకు నీళ్లు ఎలా కలుషితం అవుతున్నాయో చూపించారు. ఇక్కడి వ్యాపారాలు రసాయనాలు కలిసిన నీళ్లను బోరల్లో పోసిన దృశ్యాలు చూసిన కార్పొరేటర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ నీటి కలుషితంపై స్థానికులంతా కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. రోజూ కలుషిత నీటిపై స్థానికులకు, వ్యాపారులకు మధ్య, గొడవలు సాధారణం అయ్యాయి. కొంత మంది వ్యాపారులు డయింగ్ తర్వాత వచ్చే నీటిని రోడ్లపైకి, డ్రెయినేజీ పైప్‌లైన్లలో పోస్తున్నారు. ఫలితంగా రసాయన వాయువులు స్థానికులకు మరో సమస్యగా మారాయి. ఇకనైనా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి ఇక్కడ షాపులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్పీఆర్‌హిల్స్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

రహమత్‌నగర్: ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీలోని కనకదుర్గా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న వడ్డె ఓబన్న విగ్రహం వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, బస్తీ వ్యవస్థాపకుడు వేముల యాదయ్య మాట్లాడుతూ... ఎస్పీఆర్ హిల్స్‌లో పాదచారులు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్, చెన్నయ్య, ఆలయ పూజారి ప్రశాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సత్వరమే పూర్తి చేయాలి

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని గౌతంనగర్ చౌరస్తా నుంచి వినాయకనగర్ బస్తీ వరకు భూగర్భ డ్రెయినేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు నూతనంగా చేపట్టగా ఈ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసీ ఈఈ విజయ్ కుమార్, ఏఈ వెంకటేష్, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులతో కలిసి పరిశీలించారు. డ్రెయినేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తయిన నేపథ్యంలో రోడ్డు పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ఇంజినీర్లను కోరారు. స్థానికులకు ఇబ్బందులు లేకుండా పక్కా ప్రణాళికతో రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

సోని కాకతీయవైన్స్‌లో లోకాయుక్తా అధికారుల విచారణ



విచారణ చేపడుతున్న మాథ్యూవ్ కోషి

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని సోని కాకతీయ వైన్స్‌లో తెలంగాణ లోకాయుక్త ప్రత్యేక అధికారి మాథ్యూవ్ కోషి శుక్రవారం విచారణ చేపట్టారు. పర్మిట్ రూంను, వైన్స్ లోపల పరిసరాలను ఆయన పరిశీలించారు. స్థానికులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోకాయుక్త న్యాయస్థానం ఆదేశాల మేరకు తాము విచారణ ప్రారంభించామన్నారు. వైన్స్‌లో సిబ్బంది వివరాలు నౌకర్‌నామా లేదని తమ విచారణలో స్పష్టమైందన్నారు. అలాగే రోడ్డు మీదనే మందు తాగుతున్నట్లు స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వైన్స్‌లో నిల్వ ఉన్న మద్యం బాటిళ్లపై దుమ్ము, ధూళి పేరుకుపోయిందన్నారు. వైన్స్ ముందు వాహనాలు నిలపడంతో మహిళల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. బ్రాందీ షాపు పరిసరరాల్లో శానిటేషన్ సరిగా లేదని తెలిపారు. తదుపరి విచారణలో వైన్స్‌కు పాఠశాలలు, ఆలయాలు ఎంత దూరంలో ఉన్నాయనే విషయాలపై విచారణ జరుపుతామన్నారు. తమ విచారణలో బయటపడ్డ నిజాలను లోకయుక్త న్యాయస్థానానికి సమర్పిస్తామన్నారు. జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ... మద్యం షాపులు వద్ద తాము బందోబస్తు నిర్వహిస్తామని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

బస్తీవాసుల హర్షం...

టి.అంజయ్యనగర్ బస్తీలో మద్యం షాపును కొనసాగించరాదని తాము పది సంవత్సరాలుగా చేస్తున్న న్యాయ పోరాటం ముగింపు దశకు రావడం పట్ల ఫిర్యాదుదారులు శివ అతని బృందం హర్షం వ్యక్తం చేసింది. 2012తో ఎక్సైజ్ శాఖ అధికారుల తోపాటు 2021లో లోకయుక్తా న్యాయస్థానాన్ని ఆశ్రమించామన్నారు. విచారణలో భాగంగా లోకయుక్తా న్యాయస్థానం ప్రత్యేక అధికారిని పంపడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతం నుంచి మద్యం షాపును తొలగించే వరకూ న్యాయ పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

ఆభరణాల దొంగ అరెస్టు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 72లో నివసించే విశ్రాంత డీజీపీ ఆనందయ్య ఇంట్లో గత నెల 25వ తేదీన వజ్రాభరణాలు, వెండి సామాన్లు దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న దొంగను నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం చిన్నపొర్ల గ్రామానికి చెందిన చాపల అంజప్ప అలియాస్ అంజలప్ప(24) బార్కాస్ బిస్మిల్లా కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతుంటాడు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో విలువైన ఆభరణాలు దొంగిలించి చిక్కడం లేదు. ఈ నెల 27న అల్కాపురి కాలనీలో విక్రమ్ కుమార్ ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, వెండి వస్తువులు దొంగిలించి పరారయ్యాడు. నార్సింగి పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దీంతో జూబ్లీహిల్స్ దొంగతనం కేసులో కూడా నిందితులను విచారించేందుకు ఇక్కడి పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా అంజలప్ప గత ఏడాది నవంబర్ 21వ తేదీన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో శమంతక డైమండ్స్‌లో కూడా భారీగా వజ్రాభరణాలు దొంగిలించి పరారవగా పోలీసులు అరెస్ట్ చేసారు. జైలు నుంచి రాగానే జూబ్లీహిల్స్‌లో దొంగతనానికి పాల్పడ్డారు. ఎట్టకేలకు అంజలప్పను పట్టుకోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్టీఆర్ యుగపురుషుడు

- ఆయన నటన నాకు స్ఫూర్తి
- ఎన్టీఆర్ శతజయంతి సభలో నటుడు రజనీకాంత్



సాక్షి,అమరావతి/పెనమలూరు/గన్నవరం: ఆంధ్రుల అభిమాన నటుడు నందమూరి తారకరామారావు యుగపురుషుడని, ఆయన నటనే తనకు స్ఫూర్తిగా నిలిచిందని సూపర్ స్టార్ రజనీకాంత్ చెప్పారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకిలో శుక్రవారం జరిగిన ఎన్టీఆర్ శతజయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ నటన తనపై ఎంతో ప్రభావం చూపిందని, తనను నటుడిని చేసిందని చెప్పారు. ఎన్టీఆర్‌తో తాను టైగర్ సినిమాలో నటించానని గుర్తుచేసుకున్నారు. నటుడుగా ఎన్టీఆర్ ఎంతగానో రాణించి ఎందరో అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. తెలుగువారి ఆత్మాభిమానం కోసం ఆయన రాజకీయాల్లోకి వచ్చి సమాజంలో అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు. తాను ఆరేడేళ్ల వయసులో చూసిన తొలిసినిమా పాతాళభైరవి అని గుర్తుచేసుకున్నారు. తర్వాత 'లవకుశ' సినిమా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎన్టీఆర్‌ను చూశానని, శ్రీకృష్ణపాండవీయంలో ఎన్టీఆర్‌ను చూసి మైమరిచిపోయానని తెలిపారు. కండక్టర్ అయ్యాక ఎన్టీఆర్‌ను అనుకరిస్తుంటే సన్నిహితులు సినీరంగంలోకి రావాలని ప్రోత్సహించారని ఆయన చెప్పారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ వ్యక్తి కాదని, ఒక శక్తి అని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయిన ఎన్టీఆర్ ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేవరకు తెలుగుజాతి పోరాడాలన్నారు. నటుడు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం, తెలుగుకు వెలుగు తీసుకొచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులను సన్మానించారు. సీనియర్ జర్నలిస్టు ఎస్.వెంకటనారాయణ రచించిన 'అసెంబ్లీలో ఎన్టీఆర్ ప్రసంగాలు', 'ప్రజల చైతన్యం కోసం ఎన్టీఆర్ చారిత్రాత్మక ప్రసంగాలు' పుస్తకాలను రజనీకాంత్ ఆవిష్కరించారు. ఎన్టీఆర్ కుటుంబసభ్యులు, కార్యక్రమ కన్వీనర్ టి.డి.జనార్దన్, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయంలో రజనీకాంత్‌కు బాలకృష్ణ, టి.డి. జనార్దన్, అభిమానులు స్వాగతం పలికారు.

మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇక నేరుగా ప్రజలతో కనెక్ట్ అయి ఉంటారు

- ప్రభుత్వ సేవల్లో సమస్యలు, సలహాలను నేరుగా తెలియజేయవచ్చు
- 1902 హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా గ్రీవెన్స్‌లు నమోదు
- నిర్దిష్ట సమయంలోగా నాణ్యతతో పరిష్కరించడమే లక్ష్యం
- ఐవీఆర్ఎస్, ఎస్సెమ్మెస్‌లతో అప్‌డేట్స్.. ఆ తరువాత ఫీడ్ బ్యాక్ కూడా
- కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం దిశా నిర్దేశం



సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజల సమస్యలను నిర్దిష్ట సమయంలోగా నాణ్యతతో పరిష్కరించడంతో పాటు నాణ్యమైన సేవలను అందించడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మే 9వతేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. నమోదైన సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరా తీయడం, ముఖ్యమంత్రి సందేశాలను నేరుగా చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. ముఖ్యమంత్రి నేరుగా ప్రజలతో కనెక్ట్ అయి ఉంటారని, సేవల్లో సమస్యలు, సలహాలను నేరుగా తెలియచేయవచ్చని వెల్లడించారు. ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కార్యాలయం అయా సమస్యలు నిర్దేశిత సమయంలోగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ఉద్దేశం, ఆశయాలు, లక్ష్యాలపై అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు.

■ హెల్ప్‌లైన్ నంబర్ 1902

మే 9న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. అందుకోసం 1902 హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రవేశ పెడుతున్నాం. ఇప్పటికే పలుమార్లు సమీక్షలు చేశాం. జగనన్నకు చెబుదాం పేరులో ముఖ్యమంత్రి అయిన నా పేరు జోడించారంటే ఈ కార్యక్రమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఎంత ఉందో అర్థం అవుతోంది. ఇది చాలా ప్రతిష్టాత్మక కార్యక్రమం. మనం ఇప్పటికే స్పందన నిర్వహిస్తున్నాం. స్పందనకు మరింత మెరుగైన రూపమే 'జగనన్నకు చెబుదాం'.. నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే 'జగనన్నకు చెబుదాం..'! సమస్యలను అత్యంత నాణ్యంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి సమస్యను నమోదు చేసుకుంటే అత్యంత నాణ్యతతో పరిష్కరించాలి.

■ సీఎంవో నుంచి మండలాల వరకూ పర్యవేక్షణ యూనిట్లు

సీఎంవో, ప్రభుత్వ శాఖల అధిపతులు, జిల్లా, డివిజన్ స్థాయి, మండల స్థాయిలో మానిటరింగ్ యూనిట్లు ఉంటాయి. వీటిని కలెక్టర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలి. సమస్య పరిష్కారంలో క్వాలిటీ పెంచడం అన్నది ప్రధాన లక్ష్యం కావాలి. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల ద్వారా పర్యవేక్షణ చేస్తేనే అది సాధ్యం. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల (పీఎంయూ)ను సీఎంవో కూడా పర్యవేక్షిస్తుంది.

సమస్యల పరిష్కారంపై ప్రజలకు అప్‌డేట్స్

తమ సమస్యల పరిష్కారంపై ఐవీఆర్ఎస్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ప్రజలకు క్రమం తప్పకుండా అప్‌డేట్స్ అందుతాయి. అంతేకాకుండా ఇదే హెల్ప్‌లైన్ ద్వారా సమస్యల పరిష్కారంపై అర్జీదారులనుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి 1902 హెల్ప్‌లైన్ గురించి అవగాహన కల్పిస్తారు. ఈ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకునేలా ప్రోత్సహిస్తారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభమయ్యేలోగా వలంటీర్లు ప్రతి గడపకూ 1902 గురించి చెబుతారు.

హెల్ప్‌లైన్ ద్వారా గ్రీవెన్స్ నమోదవుతాయి. వాటిని నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో పరిష్కరించాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తికి సంతృప్తి కలిగించడం అన్నది చాలా ముఖ్యమైన విషయం.

■ ప్రతేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్‌లు

సీనియర్ ఐఏఎస్ అధికారులు జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారు. క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకోసారి సంబంధిత జిల్లాలను సందర్శించి పర్యవేక్షిస్తారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలును కలెక్టర్లతో కలసి పర్యవేక్షిస్తారు. సమస్యల పరిష్కారాల తీరును ర్యాండమ్‌గా తనిఖీ చేస్తారు. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల పనితీరును గమనిస్తారు. ఎక్కడైనా సమస్య పరిష్కారం పట్ల సంతృప్తి చెందకుంటే తిరిగి ఓపెన్ చేస్తారు. ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా దాన్ని తిరిగి తెరుస్తారు. పరిష్కారం తీరుపై పూర్తిస్థాయిలో సమీక్ష చేస్తారు. చీఫ్ సెక్రటరీ, సీఎంవో, డీజీపీతో కలిసి రెగ్యులర్‌గా మానిటర్ చేస్తారు. ప్రతి 15 రోజులకోసారి పూర్తిస్థాయిలో సమీక్ష ఉంటుంది.

■ గ్రామ స్థాయిలో అన్ని అంశాలపై దృష్టి

కలెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, మానిటరింగ్ యూనిట్లు గ్రీవెన్స్‌తో పాటు గ్రామస్థాయిలో అన్ని అంశాలపైనా దృష్టి పెడతారు. దీనివల్ల వేగంగా గ్రీవెన్స్ పరిష్కారంలో డెలివరీ మెకానిజం ఉంటుంది. అంతేకాకుండా గ్రామ స్థాయిలోని సచివాలయాలు, ఆర్బీకేలు, అంగన్‌వాడీలు, విలేజ్ క్లినిక్స్.. అవన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా? అన్న అంశంపైన కూడా దృష్టిపెడతారు. గ్రామాలలో ఇళ్ల నిర్మాణంపైనా దృష్టి సారిస్తారు. ఇవి సక్రమంగా పనిచేస్తే గ్రామస్థాయిలో చాలావరకు సమస్యలు సమసిపోతాయి. అవి సమర్థంగా పనిచేయడం అన్నది చాలా ముఖ్యమైన విషయం. దీనికోసమే మానిటరింగ్ కమిటీలతో పాటు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తున్నాం.

అవినాశ్ పిటిషన్ జూన్ 5కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎంపీ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ జూన్ 5కు వాయిదా పడింది. జస్టిస్ సురేందర్ శుక్రవారం 4 గంటలకు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టారు. హైకోర్టుకు శనివారం నుంచి వేసవి సెలవులు ఉండటంతో విచారణను జూన్ 5కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో అవినాశ్ న్యాయవాది జోక్యం చేసుకుని.. సీబీఐ ఎలాంటి కఠిన చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇదే కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన ప్రకారం.. వాదనలు పూర్తికాకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని న్యాయమూర్తి చెప్పారు. కావాలంటే.. సీజే ధర్మాసనం ముందు ప్రస్తావించమని చెప్పారు. లేదా సెలవుల్లో ఉండే బెంచ్ ముందు హౌస్ మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేయవచ్చని సూచించారు. ఆ తర్వాత అవినాశ్ న్యాయవాది సీజే ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సీబీఐ కఠిన చర్యలు తీసుకునే పరిస్థితి ఉంటే.. సెలవుల్లో ఉండే బెంచ్‌ను ఆశ్రయించవచ్చని ధర్మాసనం సూచించింది.

విశాఖలో రూ.21,844 కోట్లతో అదానీ డేటా సెంటర్

మే 3న ఏపీ సీఎం చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో డేటా సెంటర్, ఐటీ పార్కుల అభివృద్ధి కోసం అదానీ గ్రూపు రూ. 21,844 కోట్ల భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. మొత్తం 300 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌తో పాటు బిజినెస్ ఐటీ పార్కు, స్కిల్ కాలేజీ, రిక్రియేషన్ సెంటర్లను అభివృద్ధి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖపట్నంలోని మధురవాడ సమీపంలో కాపులుప్పాడ వద్ద ఎకరం కోటి రూపాయలు చొప్పున 190.29 ఎకరాలను కేటాయించింది. ఈ డేటా సెంటర్ ద్వారా ప్రత్యక్షంగా 39,815 మందికి ఉపాధి లభించనుంది. తొలుత 130 ఎకరాల్లో 200 మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఈ సంస్థ ఆ తర్వాత మరో 100 మెగావాట్ల డేటా సెంటర్‌ను ఏర్పాటుచేయడానికి సంసిద్ధత వ్యక్తంచేసింది. దీంతో మరో 60.29 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదానీ గ్రూపు విశాఖ టెక్ పార్క్ లిమిటెడ్ (వీటీపీఎల్) పేరుతో ప్రత్యేక కంపెనీని ఏర్పాటుచేసింది. మే 3న అదానీ గ్రూపు అధికారుల సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డేటా సెంటర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేయనున్నారు. ఉద్యోగాల కల్పన ఆధారంగానే రాయితీలు, ప్రోత్సాహకాలను ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వీటీపీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు దశల్లో ప్రాజెక్టును ఏడు సంవత్సరాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇక ఈ ప్రాజెక్టు ద్వారా 39,815 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తామని వీటీపీఎల్ సమర్పించిన ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొంది.

అవినాశ్‌పై సీబీఐ అభియోగాలు నిరాధారం

- వివేకా హత్య కేసులో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన అవినాశ్ న్యాయవాది
- ఎవర్నీ విచారించకుండానే ఏకపక్షంగా సీబీఐ అభియోగాలు

సాక్షి, అమరావతి : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై సీబీఐ మోపిన అభియోగాలు నిరాధారమని, అహేతుకమైనవని అవినాశ్ తరపు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు తెలిపారు. సీబీఐ అత్యుత్సాహంతో ఎంపీ అవినాశ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుందని చెప్పారు. ఎంపీకి వ్యతిరేకంగా సీబీఐ మోపిన అభియోగాలు పూర్తిగా అవాస్తవమని ఆయన ఆధారాలతో సహా న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డి ఓటమికి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి కారణమని, 2019 ఎన్నికల్లో ఎంపీ టికెట్ కోసమే వివేకాని హత్య చేయించారన్న అభియోగాలు ఊహాజనితాలు, కల్పితాలేనని విస్పష్టంగా చెప్పారు. ఈ కోణాల్లో సీబీఐ దర్యాప్తు ఎంత అహేతుకంగా సాగిందో ఆయన సవివరంగా న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయస్థానం ముందు న్యాయవాది ఉంచిన ప్రధానాంశాలివీ..

- 2017లో కడప జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 800 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆ ఓటర్లు సమీప ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌లలో ఓటు వేశారు. పార్టీలకు వచ్చిన ఓట్లను రెవెన్యూ డివిజన్లు, ప్రాంతాల వారీగా వేరు చేసి పరిశీలించడం సాధ్యం కాదు. పోలైన అన్ని ఓట్లను కలిపి ఎన్నికల కమిషన్ లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తుంది. కాబట్టి వివేకానందరెడ్డికి ఏ అసెంబ్లీ నియోజకవర్గంలోని వారు ఓటు వేయలేదన్నది నిర్ధారించడం సాధ్యం కాదు. ఆ నేపథ్యంలో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రతినిధులైన ఓటర్లే వివేకానందరెడ్డికి ఓటు వేయలేదని, అందుకు అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి కారణమని సీబీఐ చెప్పడం పూర్తిగా అసంబద్ధం, నిరాధారం. పోనీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లయిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు 800 మందిని సీబీఐ విచారించిందా అంటే అదీ లేదు. అందువల్ల ఎంపీ, ఆయన తండ్రిపై సబీఐ చేస్తున్న అభియోగాలు పూర్తిగా అవాస్తవాలు. వైఎస్ వివేకానందరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తరువాత వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్‌భాస్కర్‌రెడ్డిల ఇంటికి వెళ్లి వారిని నిందించారన్న సీబీఐ అభియోగం కూడా పూర్తిగా అవాస్తవం. ఆయన వారిద్దరిపై ఆగ్రహం వ్యక్తం చేయలేదు. నిందించనూ లేదు.
- 2019 ఎన్నికల్లో ఎంపీ టికెట్ కోసమే వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయించారన్న సీబీఐ అభియోగం కూడా పూర్తిగా నిరాధారం. ఎందుకంటే అప్పటికే వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా నిర్ణయించారు. ఆయన ప్రచారం మొదలుపెట్టారు కూడా. వైఎస్ వివేకానందరెడ్డే ఎంపీగా అవినాశ్ రెడ్డి విజయం కోసం ప్రచార బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. హత్యకు ముందు రోజు కూడా వివేకానందరెడ్డి పార్టీ అభ్యర్థి అవినాశ్‌రెడ్డి తరఫున మైదుకూరు నియోజకవర్గంలో ప్రచారం చేశారు. మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డితో కలసి వివేకానందరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డిని, ఎంపీగా అవినాశ్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కానీ సీబీఐ ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోంది. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఆ విషయంపై విచారించనే లేదు. మైదుకూరు నియోజకవర్గంలో ప్రచారం చేసిన ఇళ్లకు వెళ్లి విచారించినా వాస్తవం తెలుస్తుంది. అటు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని గానీ ఇటు మైదుకూరు నియోజకవర్గంలో గానీ విచారించకుండా సీబీఐ ఎంపీ అవినాశ్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తోంది. కాబట్టి ఎంపీ టికెట్ కోసమే ఈ హత్య చేయించారన్న సీబీఐ అభియోగాలు పూర్తిగా నిరాధారం.

నగర వార్తలు

పోలీసుల చిత్రహింసల వల్లే చిరంజీవి మృతి

- మానవ హక్కుల వేదిక

సాక్షి, సిటీబ్యూరో: తుకారాంగేట్ పోలీసులు సెల్‌ఫోన్ చోరీ కేసులో అదుపులోకి తీసుకున్న ఆమూరి చిరంజీవిని ఈ నెల 25వ తేదీన తీవ్రంగా చిత్రహింసలకు గురిచేయడం వల్లనే మృతి చెందాడని మానవ హక్కుల వేదిక ఆరోపించింది. ఈ మేరకు తమ నిజనిర్ధారణలో వెల్లడైనట్లు మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.జీవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం అందజేయాలని, బాధ్యులైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి భార్య మంజులకు ఉద్యోగం కల్పించి పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

'నాటకాలు నా జీవితాన్ని ప్రభావితం చేశాయి'

- మాజీ స్పీకర్ మధుసూదనాచారి



సనత్‌నగర్: రంగస్థలంపై నాటకాలు తన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని కుందన్‌బాగ్‌లో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రసిద్ధ రంగస్థల నటుడు టి.రాజబాబు అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ... సురభి నాటకాలు అంటే తనకు చాలా ఇష్టమన్నారు. కళాకారుల జీవితాలు స్టేజీ మీద ధగధగలాడతాయని, నిజ జీవితంలో మాత్రం భగభగమంటూ ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాటక ప్రదర్శన తర్వాత వారిని ప్రశంసిస్తుంటే కోటి దీపాల కాంతి ఆయా కళాకారుల్లో కనిపిస్తుందన్నారు. నటుడు రాజబాబు గత 45 సంవత్సరాలుగా నాటక రంగానికి అంకితం అయ్యారంటూ ప్రశంసించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్ మాట్లాడుతూ... నాటక సమాజాన్ని దాతలు ఆదరించాలన్నారు. రాజబాబు పాడుతా తీయగా కార్యక్రమంలో పాల్గొనే గాయనీ గాయకులకు పద్యాలు నేర్పించి పాడించారన్నారు. మరో రంగస్థల నటుడు సంగీత రాజలింగం మాట్లాడుతూ... రంగస్థల నటులకు ప్రభుత్వం బాటసగా నిలవాలన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నాటక కళాకారులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న కలుషిత జలాల బాధితులు

దిద్దుబాటు చర్యలు చేపట్టిన జలమండలి

- చింతబావిబస్తీలో కలుషిత జలాల గుర్తింపునకు అత్యాధునిక యంత్రాలు



చింతబావిలో పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు, జలమండలి అధికారులు

చిలకలగూడ: కలుషిత జలాలు తాగి అస్వస్థతకు గురైన సికింద్రాబాద్ మెట్టుగూడ డివిజన్ చింతబావి బస్తీవాసులు క్రమంగా కోలుకుంటున్నారు. దిద్దుబాటు చర్యలు చేపట్టిన జలమండలి అధికారులు అత్యాధునిక యంత్రాలను వినియోగించి ఏ ప్రాంతంలో జలాలు కలుషితం అవుతున్నాయో గుర్తిస్తున్నారు. బాధితులకు స్థానిక బస్తీదవాఖానా వైద్యసిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తున్నారు. మెట్టుగూడ డివిజన్ చింతబావిలో నాలుగు రోజులుగా సరఫరా అవుతున్న కలుషిత జలాలు తాగి చిన్నారులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులతో పాటు సుమారు 350 మంది బస్తీవాసులు అస్వస్థతకు గురైన సంగతి విదితమే. జలమండలి అధికారులు, సిబ్బంది శుక్రవారం బస్తీలో పర్యటించి క్విక్ ఐడెంటిఫికేషన్ వాటర్ పొల్యూషన్ సోర్స్ (క్యూఐడబ్ల్యూపీఎస్) మిషిన్ సాయంతో వీరాంజనేయస్వామి ఆలయ సమీపంలోని ఓ ఇంట్లో మంచినీటి పైప్‌లైన్ ద్వారా కలుషితం అవుతున్నట్లు గుర్తించి సదరు కనెక్షన్‌ను తొలగించారు. మరోచోట ఇనుప పైప్‌లైన్ ద్వారా జలాలు కలుషితం అవుతున్నట్లు గుర్తించారు. రెండు రోజుల్లో సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని జలమండలి అధికారులు తెలిపారు. వాంతులు, విరోచనాలు తగ్గని బాధితులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని బస్తీదవాఖానా వైద్యురాలు డాక్టర్ రుచిక తెలిపారు.

స్పందించకుంటే చర్యలు తప్పవు: డిప్యూటీ స్పీకర్ పద్మారావు

కలుషిత జలాల సరఫరాను తీవ్రంగా పరిగణిస్తామని, సంబంధిత అధికారులు త్వరితగతిన స్పందించకుంటే చర్యలు తప్పవని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు హెచ్చరించారు. జలమండలి అధికారులు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి శుక్రవారం చింతబావిలో పర్యటించి బాధితులను పరామర్శించి, పనులను పరిశీలించారు. జలమండలి ఎండీ దానకిషోర్‌తో ఫోన్‌లో పలు అంశాలపై మాట్లాడారు. సివరేజీ సమస్యల పరిష్కారానికి రూ. 30 లక్షల వ్యయంతో నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని జలమండలి అధికారులకు సూచించారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. జలమండలి డైరెక్టర్ కృష్ణ, సీజీఎం రఘు, డీజీఎంలు కృష్ణ, సరిత, సెక్షన్ మేనేజర్ నిఖిత, కార్పొరేటర్లు సునీత, సామల హేమ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగానికి వాల్యూయర్ సేవలు ఎనలేనివి

యాక్సిస్ బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఫణీంద్ర



సెమినార్‌ను ప్రారంభిస్తున్న యాక్సిస్ బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఫణీంద్ర తదితరులు

ఖైరతాబాద్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాల్యూయర్స్ హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం వాల్యూయేషన్ ప్రిన్సిపల్స్ అనే అంశంపై నేషనల్ సెమినార్ నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని హరిత ప్లాజా హోటల్‌లో నిర్వహించిన నేషనల్ సెమినార్‌ను యాక్సిస్ బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బి.ఎస్.ఫణీంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ... బ్యాంకింగ్ రంగంలో వాల్యూయర్స్ పాత్ర ఎంతో కీలకమని, రాబోయే రోజుల్లో ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా వాల్యూయర్స్ సేవలను మెరుగుపర్చుకోవాలన్నారు. వాల్యూయర్స్‌కు ఇలాంటి నేషనల్ సెమినార్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాల్యూయర్స్ జాతీయ అధ్యక్షుడు పి.కె.త్యాగరాజన్, ప్రధాన కార్యదర్శి వినయ్ గోయల్ తదితరులు నవంబర్‌లో ముంబయిలో నిర్వహించే అంతర్జాతీయ గ్లోబల్ వాల్యూయేషన్ సదస్సు లోగోను ఆవిష్కరించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ గ్లోబల్ వాల్యూయేషన్ సదస్సు విజయవంతం చేసేందుకు నిర్వహించే ఎనిమిది సదస్సుల్లో భాగంగా మొదటి సదస్సు హైదరాబాద్‌లో నిర్వహించం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టెక్నికల్ సదస్సుల్లో బ్యాంకు వాల్యూయేషన్స్, క్లిష్టమైన కేసుల పరిష్కారం ఏవిధంగా చేయాలనే అంశాలపై సీనియర్ వాల్యూయర్స్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సదస్సులో హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ పి.మధు, సెక్రటరీ కె.చిరంజీవి, జి.వి.అప్పారావు శరత్‌చంద్ర శ్రీనివాస్, గణేష్‌గుప్తా, వివిధ రాష్ట్రాల నుంచి 125 మంది వాల్యూయర్స్ పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి విగ్రహానికి రేవంత్‌రెడ్డి నివాళి



మన్సూరాబాద్: నల్లగొండలో నిర్వహిస్తున్న నిరుద్యోగ నిరసన సభకు వెళ్తూ మార్గ మధ్యలో ఎల్‌బీనగర్‌లోని తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి విగ్రహానికి టీ పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డిలు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు. జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన భారీ గజమాలను శ్రీకాంతాచారి విగ్రహానికి వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని ప్రభాకర్ రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి భాస్కర్‌యాదవ్, కిషోర్‌గౌడ్, పన్యాల జైపాల్‌రెడ్డి, ఎండీ షరీఫ్, రమేష్‌నాయక్, సౌమ్య, భాను, వేణు యాదవ్, అరుణ్ పాల్గొన్నారు.

గర్భిణి అనుమానాస్పద మృతి



నందిని మృతదేహం

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు. పాండురంగానగర్ ప్రాంతానికి చెందిన నందిని(30), సునీల్ దంపతులు. వారికి ఇద్దరు సంతానం. ప్రస్తుతం నందిని మూడు నెలల గర్భిణి. గురువారం సాయంత్రం రక్తస్రావం కావడంతో నందిముస్లాయిగూడలోని సాయిరామ్ ఆస్పత్రికి వెళ్లింది. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు ఆమెను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. అర్థరాత్రి బ్లీడింగ్ తీవ్రం కావడంతో నందినితో పాటు ఆమె కుటుంబ సభ్యులు డాక్టర్, నర్సు దృష్టికి తీసుకెళ్లినా స్పందించ లేదన్నారు. శుక్రవారం తెల్లవారుజామున నందిని మృతి చెందిందని డాక్టర్లు చెప్పడంతో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అత్తాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నందిని కుటుంబ సభ్యులను సముదాయించారు. ఈ మేరకు మృతురాలి భర్త సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని... పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

ఎన్ఈఆర్ఎస్‌తో ఐటీ ఉద్యోగులు, సంస్థలకు మేలు

- ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్
- 'టీ హబ్'లో నేషనల్ రెగ్యులేటరీ సిస్టమ్ లోగో, వెబ్‌సైట్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న ఐటీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్


హఫీజ్‌పేట్: 'నేషనల్ ఎంప్లాయి రెగ్యులేటరీ సిస్టమ్' వల్ల ఐటీ ఉద్యోగులు, సంస్థలకు ఎంతో మేలని, ఇది ఒక చక్కటి ప్లాట్‌ఫామ్ అని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ ప్రాంతంలోని టీ హబ్‌లో నేషనల్ ఎంప్లాయి రెగ్యులేటరీ సిస్టమ్ లోగో, వెబ్‌సైట్‌ను ఎన్ఈఆర్ఎస్ సీఈఓ సుధాకర్ వర్మ ఎర్రంరాజు, నాని రాజులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ... పోస్ట్ కోవిడ్ వల్ల ఐటీ ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోమ్ చేయాలని తెలిపినప్పటికీ సదురు ఉద్యోగి ఒక సంస్థలోనే కాకుండా రెండు, మూడు సంస్థలలో ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. ఏకంగా ఒక వ్యక్తి 32 సంస్థలలో పని చేయడం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలా చేయడం వల్ల ఆ వ్యక్తికే కాకుండా సంస్థ ఇబ్బందుల్లో పడుతుందన్నారు. దానికి అనుగుణంగా ఈ నేషనల్ ఎంప్లాయిస్ రెగ్యులేటరీ సిస్టమ్ వారు వీటికి ఒక పరిష్కారం చూపడానికి సరికొత్త ప్లాట్‌ఫారంను ముందుకు తీసుకువచ్చారన్నారు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం సింగపూర్‌లో ఉండగా ఇప్పుడు హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించిందన్నారు. ఎన్ఈఆర్ఎస్ సీఈఓ సుధాకర్‌వర్మ మాట్లాడుతూ... ఎన్ఈఆర్ఎస్ రిక్రూటర్ ద్వారా హెచ్ఆర్‌కి దృశ్యమానతను అందించడం ద్వారా ఒక కంపెనీ నుంచి మరొక కంపెనీకి వనరుల పరివర్తనను పర్యవేక్షించి నివేదిక ఇస్తుందన్నారు.

విద్యుదీకరణలో అగ్రగామిగా తెలంగాణ

మాదాపూర్: తెలంగాణను దేశంలోనే అత్యంత విద్యుదీకరణ రాష్ట్రంగా మార్చడంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని తెలంగాణ రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్న రెన్యూవబుల్ ఎనర్జీ ట్రేడ్ ఎక్స్‌పో రెన్యూఎక్స్ 7వ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నోడల్ ఏజెన్సీగా రెన్యూఎక్స్‌కు మద్దతు ఇవ్వడానికి తెలంగాణ రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ముందంజలో నిలిస్తుందన్నారు. దేశ ఇన్ఫార్మ మార్కెటింగ్ మేనేజర్ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ... దేశ రీ పరిశ్రమ ఇటీవల గణనీయ వృద్ధిని సాధించిందన్నారు. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ మిశ్రా, పవర్, యూటిలిటీ ఆఫ్ పీడబ్ల్యూసీ డైరెక్టర్ భాగ్యతేజ్‌రెడ్డి, తెలంగాణ ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, టీఎస్ఆర్ఈడీసీఓ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.జానయ్య, ఎనర్జీ పోర్ట్ పోలియో గ్రూప్ డైరెక్టర్ రజనీస్ ఖట్టర్ పాల్గొన్నారు.

30న తెలంగాణ బీసీ న్యాయవాదుల సదస్సు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: సామాజిక న్యాయ సాధనకు బీసీ న్యాయవాదులు సంఘటితంగా ఉద్యమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ న్యాయవాదుల సంఘం తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో ఈ నెల 30న బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి బీసీ న్యాయవాదుల సదస్సును నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో శుక్రవారం బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదస్సు పోస్టర్‌ను కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'భారత రాజ్యాంగం-సామాజిక న్యాయం' అనే అంశంపై ఈ నెల 30వ తేదీన జరిగే సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ అడ్వకేట్స్ అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు, సుప్రీం కోర్టు జడ్జీల నియామకాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ కోటా ప్రవేశపెట్టాలని, జూనియర్ బీసీ అడ్వకేట్స్‌కు నెలకు రూ. 20 వేల స్టైఫండ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి అడ్వకేట్‌కు 250 గజాల ప్రభుత్వ స్థలం, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్‌లలో బెయిల్ ఇచ్చే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు గుజ్జ కృష్ణ, ఎస్.విజయప్రశాంత్, నాగుల శ్రీనివాస్ యాదవ్, బత్తుల కృష్ణ, రేపాకుల నాగేశ్వరరావు, జక్కం వంశీ కృష్ణ, రాఘవేంద్ర, సత్యనారాయణ, సంపత్ కుమార్, నీలం వెంకటేష్, నందగోపాల్, రామకృష్ణ, అనంతయ్య పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
29-4-2023

బాచుపల్లి భలే అభివృద్ధి!



- విల్లాలు, లగ్జరీ అపార్ట్‌మెంట్లకు నిలయం
- అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలకు కేంద్రం
- మెట్రో, ఓఆర్‌ఆర్‌లకు కూతవేటు దూరంలోనే
- ఏటా స్థిరాస్తి ధరలలో 20–30 శాతం వృద్ధి నమోదు

మెట్రోతో ప్రధాన నగరంలోకి, ఔటర్ రింగ్ రోడ్‌తో ఇతర జిల్లా కేంద్రాలకు ప్రయాణం సులువైన తర్వాత హైదరాబాద్ రియల్టీ రూపురేఖలే మారిపోయాయి. వీటి లాభాలను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకుంటున్న ప్రాంతం బాచుపల్లి. ఇప్పటికే ఎడ్యుకేషన్ హబ్‌గా పేరొందిన బాచుపల్లి.. మియాపూర్, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్లకు, ఓఆర్‌ఆర్‌తో అనుసంధానమై ఉంటుంది. దీంతో మియాపూర్, గచ్చిబౌలిలోని ఐటీ కంపెనీల ఉద్యోగులు, ఓఆర్‌ఆర్ మీదుగా జిల్లావాసుల చూపు బాచుపల్లి ప్రాంతంపై పడింది.

సాక్షి, హైదరాబాద్: లక్షలాది ఐటీ, ఐటీ ఆధారిత ఉద్యోగులకు ఉపాధి కేంద్రాలు మాదాపూర్, గచ్చిబౌలి. వీటికి సమీపంలో కొండాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, కేపీహెచ్‌బీ, ప్రగతినగర్, నిజాంపేట్, కూకట్‌పల్లిలో ఇప్పటికే పెద్ద ఎత్తున నివాస సముదాయాలు వెలిశాయి. ఆయా ప్రాంతాలు జనావాసాలతో కిక్కిరిసిపోయాయి. దీంతో ఇప్పుడు ఐటీ ఉద్యోగులు అందుబాటు ధరల్లో గృహాలను కొనుగోలు చేసేందుకు ముందుగా ఎంపిక చేసే ప్రాంతం బాచుపల్లి. ఐటీ కార్యాలయాలకు దగ్గరగా ఉండటం, స్థానికంగా అంతర్జాతీయ విద్యా సంస్థలు, వినోద కేంద్రాలు, ఆసుపత్రులు ఉండటం బాచుపల్లికి అదనపు అంశాలు.

ఏటా 20–30 శాతం వృద్ధి..

గత కొంతకాలంలో పశ్చిమ హైదరాబాద్‌లో ధరలు అబ్‌నార్మల్‌గా పెరుగుతున్నాయి. కానీ, బాచుపల్లి స్థిరాస్తి మార్కెట్ ఏటా 20–30 శాతం స్థిరమైన వృద్ధి నమోదవుతుందని ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కుమార్ కామరాజు తెలిపారు. తుది కొనుగోలుదారుల పెట్టుబడులకు సరైన విలువను అందించే మార్కెట్ ఇదేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక్కడ నిర్మాణ సంస్థ, ప్రాజెక్ట్ స్థాయిని బట్టి అపార్ట్‌మెంట్ ధరలు చ.అ. రూ.5 వేల నుంచి ప్రారంభమవుతున్నాయి. మధ్యతరగతి, సంపన్న వర్గాలకు అనుకూలమైన అపార్ట్‌మెంట్లు, లగ్జరీ విల్లా ప్రాజెక్టులు ఇక్కడ కొలువై ఉన్నాయి. ఇక్కడి మౌలిక, రవాణా సదుపాయాలు చూస్తుంటే సమీప భవిష్యత్తులో మియాపూర్, కేపీహెచ్‌బీ తరహాలో బాచుపల్లి ప్రాంతం శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.

ఈ ఏడాది రిజిస్ట్రేషన్ గణాంకాలు	
నెల	రిజిస్ట్రేషన్ల సంఖ్య
జనవరి	2,575
ఫిబ్రవరి	2,678
మార్చి	3,389
ఏప్రిల్ (28వ తేదీ)	2,500

మౌలిక వసతులతో..

నిజాంపేట్, బాచుపల్లి తదితర ప్రాంతాలను ఇది వరకు నీటి సమస్య వేధించేది. పూర్తిగా బోర్లపైనే ఆధారం. భూగర్భ జలాలు కలుషితమనే అపోహ ఉండేది. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. జల మండలి ప్రత్యేక లైన్లు వేయడంతో సమస్య తీరిపోయింది. పైగా గోదావరి, మిషన్ భగీరథ నీరు బాచుపల్లి ఏరియాకు వచ్చేశాయి. దీంతో గ్రౌండ్ వాటర్ మీద ఆధారం తగ్గింది. కాలుష్యం వెదజల్లే ఔషధ పరిశ్రమలు ఔటర్ బయటకు తరలిపోనుండటంతో ఈ ప్రాంతం నివాసాలకు మరింత ఆకర్షణీయంగా మారనుందని నిర్మాణదారులు పేర్కొంటున్నారు. భారీ భవంతులు, ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్నారు. పెట్టుబడి దృష్ట్యా గతంలో కొన్న భూములను చాలా మంది అభివృద్ధికి ఇస్తున్నారు.

అన్నీ చేరువే..

ఐటీ కారిడార్‌కు బాచుపల్లి సుమారు 15 కి.మీ. దూరం ఉంటుంది. మియాపూర్, కేపీహెచ్‌బీ వంటి వాణిజ్య కేంద్రాలు చేరువలో ఉన్నాయి. నిజాంపేట, ప్రగతినగర్, బౌరంపేట, మోమిన్‌పేట, గాజులరామారం ఇలా చుట్టూ అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు రహదారులున్నాయి. మియాపూర్ నుంచి గండిమైసమ్మ మీదుగా మేడ్చల్ వరకు జాతీయ రహదారి ఉంది. పైగా ఈ ప్రాంతం ఔటర్ రింగ్ రోడ్‌కు అనుకునే ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా సులభంగా దూర ప్రాంతాలకు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. పారిశ్రామిక కేంద్రం పటాన్‌చెరు, జిల్లా కేంద్రం మేడ్చల్‌కు ఓఆర్‌ఆర్ దగ్గరి దారి. మియాపూర్ మెట్రో స్టేషన్‌కు, హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌కు 10 కి.మీ. దూరం ఉంటుంది. జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్‌కు 8 కి.మీ. ఇక్కడి నుంచి మెట్రోలో సిటీలోని ఏ ప్రాంతానికైనా నిమిషాల్లోనే చేరుకునే వీలుంది.

భూమ్..!

- గత ఐదేళ్లలో హైదరాబాద్‌లో భూముల కొనుగోళ్ల జోరు
- ఢిల్లీ–ఎన్‌సీఆర్ తర్వాత అత్యధిక లావాదేవీలు నగరంలోనే
- 24 డీల్స్‌తో 970 ఎకరాల స్థలాల కొనుగోలు
- దేశంలోని ఏడు నగరాల్లో 5,450 ఎకరాల భూ లావాదేవీలు
- వీటి కోసం వెచ్చించిన మొత్తం 11.2 బిలియన్ డాలర్లు
- సీబీఆర్‌ఈ దక్షిణాసియా తాజా నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ కొనసాగుతుంది. గత ఐదేళ్లలో (2018-22) హైదరాబాద్‌లో 24 భూ ఒప్పందాలలో 970 ఎకరాల స్థలాల కొనుగోళ్లు జరిగాయి. ఇందుకోసం వెచ్చించిన మొత్తం అక్షరాలా 0.9 బిలియన్ డాలర్లు. ఢిల్లీ–ఎన్‌సీఆర్ తర్వాత దేశంలో అత్యధిక స్థల లావాదేవీలు జరిగిన నగరాలలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచిందని సీబీఆర్‌ఈ దక్షిణాసియా తాజా నివేదిక వెల్లడించింది.

ఖరీదు ఎక్కువ కాబట్టే..

ఇండియన్ రియల్ ఎస్టేట్: బెట్టింగ్ ఆన్ క్యాపిటల్ ఫ్యూచర్' పేరుతో విడుదలైన నివేదిక ప్రకారం.. దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో గత ఐదేళ్లలో 286 భూ ఒప్పందాలు జరిగాయి. రూ.11.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో 5,450 ఎకరాలను కొనుగోలు చేశారు. 26 శాతం వాటాతో ఢిల్లీ–ఎన్‌సీఆర్ తొలి స్థానంలో నిలిచింది. 14 శాతం వాటాతో హైదరాబాద్, ముంబై రెండో స్థానంలో ఉండగా.. బెంగళూరు 10 శాతం, చెన్నై 8 శాతం, పుణే 7 శాతం వాటాలతో ఉన్నాయి. భూమి లభ్యత, ధర విషయాలలో హైదరాబాద్‌తో పోలిస్తే ముంబైలో ఖరీదు కాబట్టి.. ముంబైలో 960 ఎకరాలకే రూ.3.8 బిలియన్ డాలర్లను వెచ్చించాల్సి వచ్చింది. అయితే ఆయా భూముల కొనుగోళ్లకు పెట్టుబడుల విషయానికొస్తే మాత్రం 3.8 బిలియన్ డాలర్లతో ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబైలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ఆ పెట్టుబడులతో 1,760 ఎకరాలు, ముంబైలో 960 ఎకరాల లావాదేవీలు జరిగాయి.

అత్యధికంఆ నివాసాల కోసమే..

గత ఐదేళ్ల కాలంలో ప్రధాన నగరాల్లో జరిగిన భూముల కొనుగోళ్లలో 30 శాతం నివాస సముదాయాల అభివృద్ధి కోసం కొనుగోలు చేయగా.. 29 శాతం మిశ్రమ భవనాలు, 19 శాతం కార్యాలయాలు, 9 శాతం పారిశ్రామిక మరియు గిడ్డంగులు, 7 శాతం డేటా సెంటర్లు, 3 శాతం రిటైల్, 3 శాతం ఇతరత్రా భవన నిర్మాణాల కోసం కొన్నారు.

గత ఐదేళ్లలో నగరాల వారీగా భూ లావాదేవీలు

నగరం	ఎకరాలు	పెట్టుబడులు
ఢిల్లీ–ఎన్‌సీఆర్	1,760	3.8
హైదరాబాద్	970	0.9
ముంబై	960	3.8
బెంగళూరు	700	1.1
చెన్నై	500	0.9
పుణే	450	0.6
కోల్‌కతా	110	0.1

(బిలియన్ డాలర్లలో)

పీఈ పెట్టుబడుల్లోనూ టాపే..

గత ఐదేళ్ల కాలంలో దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలోకి 31.8 బిలియన్ డాలర్ల ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ (పీఈ) వచ్చాయి. ఇందులో 2.24 బిలియన్ డాలర్ల పెట్టుబడులు హైదరాబాద్ స్థిరాస్తి రంగంలోకి వచ్చాయి. దేశీయ స్థిరాస్తి రంగంలో పీఈలలో హైదరాబాద్ వాటా 7 శాతంగా ఉంది. 8 బిలియన్ డాలర్ల (25 శాతం వాటా) పీఈలతో ముంబై తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లోకి 6.6 బిలియన్ డాలర్లు, బెంగళూరులో 5.2 బిలియన్ డాలర్లు, చెన్నైలో 2.9 బిలియన్ డాలర్లు, పుణేలో 1.4 బిలియన్ డాలర్ల ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు వచ్చాయి. వచ్చే రెండేళ్లలో దేశీయ స్థిరాస్తి రంగంలో పీఈ పెట్టుబడులు 16–17 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని సీబీఆర్‌ఈ ఇండియా చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ అంచనా వేశారు.

ద్వితీయ శ్రేణి పట్టణాలలో డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ద్వితీయ శ్రేణి పట్టణాలలోని ప్రాపర్టీలకు డిమాండ్ ఏర్పడింది. ప్రధాన నగరంలో ఇరుకిళ్ల మధ్యన ఉండటం బదులు శివారు ప్రాంతాలకు, హరిత భవనాలు, విస్తీర్ణం ఎక్కువగా ఉండే గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారని హౌసింగ్.కామ్ కన్స్యూమర్ సెంటిమెంట్ ఔట్‌లుక్ తెలిపింది. గతేడాది కరోనా రెండో దశ ఉధృతి నేపథ్యంలో సూరత్, జైపూర్, పట్నా, మొహాలీ, లక్నో, కోయంబత్తూరు వంటి ద్వితీయ శ్రేణి పట్టణాలలో ఆన్‌లైన్‌లో ప్రాపర్టీల శోధన వృద్ధిని నమోదు చేశాయి. నోయిడాలోని నోయిడా ఎక్స్‌టెన్షన్, ముంబైలోని మీరా రోడ్ ఈస్ట్, అంధేరి వెస్ట్, బోరివలీ వెస్ట్, బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ ప్రాంతాలు ఈ ఏడాది దేశీయ నివాస సముదాయ మార్కెట్‌ను లీడ్ చేస్తాయని తెలిపింది.

డేటా సెంటర్లకు గిరాకీ

సాక్షి, హైదరాబాద్: డేటా సెంటర్, సీనియర్ లివింగ్, స్టూడెంట్ హౌసింగ్, కోలివింగ్ వంటి ప్రత్యామ్నాయ రియల్ ఎస్టేట్ విభాగాలలో పెట్టుబడుల వరద పారుతోంది. సాంకేతిక వినియోగం పెరగడంతో డేటా భద్రత చట్టం అనివార్యమైంది. దీంతో డేటా సెంటర్లలో పెట్టుబడులు పెరిగాయని కొలియర్స్ ఇండియా డైరెక్టర్ పీయూష్ గుప్తా తెలిపారు. గతేడాది దేశీయ ప్రత్యామ్నాయ రియల్టీలో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని రిపోర్ట్ వెల్లడించింది. 2020తో పోలిస్తే ఇది 26 శాతం మేర వృద్ధి రేటని పేర్కొంది. అధిక నాణ్యత, సాంకేతికత, పాలన, కస్టమర్ సర్వీస్‌లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. డేటా వేర్‌హౌస్‌లు, షేర్డ్ స్పేస్ (రెసిడెన్షియల్ లేదా కమర్షియల్), ప్రాప్‌టెక్ వంటి కొత్త వ్యాపారాలు ఊపందుకున్నాయి. మెరుగైన పాలన, గడువులోగా డెలివరీలు, నగదు లభ్యతతో నివాస సముదాయాల మార్కెట్లో సానుకూలత తిరిగొచ్చింది. ఈ–కామర్స్ డిమాండ్‌తో గత ఐదేళ్లలో పారిశ్రామిక, గిడ్డంగుల విభాగంలో గరిష్ట స్థాయిలో 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. పెట్టుబడిదారులు, డెవలపర్లు, ప్రాపర్టీ యజమానులు స్థిరమైన అభివృద్ధి వైపు దృష్టిసారించారు. దేశంలో గ్రీన్ బాండ్లు, గ్రీన్ ఫైనాన్సింగ్ ఎక్కువ ఆమోదం పొందుతున్నాయి.



కొత్త సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సుదర్శనయాగానికి సిద్ధమవుతున్న హోమగుండం




ఇంకా.. ఇంకా ఎదగాలి

ఉన్న దానితో సంతృప్తి చెందాలి అందలాలు ఆశించకూడదు అనే సనాతన భావాలను నేటి తరం తోసిరాజంటున్నారు. నిలబడి తాగే నీళ్ల తమకు వద్దని పరుగెత్తయినా పాలే తాగుతామని చెబుతున్నారు. ఐదు, ఆరు అంకెల జీతాలు, హోదాలు అందుకున్నా అక్కడితో ఆగిపోవడం చేత కాదని, ఎదుగుదల అనేది నిర్విరామ ప్రయత్నమని స్పష్టం చేస్తున్నారు. అత్యుత్తమ ఆదాయాలు, హోదాలు ఆశిస్తూ తమ నైపుణ్యాలకు సానపట్టడంలో మన ప్రొఫెషనల్స్ అంతర్జాతీయంగా ముందున్నారని నగరంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రొఫెషనల్స్‌పై నిర్వహించిన ఓ అధ్యయనం తేల్చింది.

-సాక్షి, హైదరాబాద్

- ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ దూసుకెళ్లాలి
- పలు నగరాల వ్యాప్తంగా జరిపిన గ్రేట్ లెర్నింగ్ అధ్యయనం వెల్లడి
- అంతర్జాతీయంగా తొలిస్థానంలో మన ప్రొఫెషనల్స్

తమకున్న నైపుణ్యాలు, అవి తెచ్చిపెట్టిన ఉపాధి, ఆదాయాలతో ఐటీ సంబంధిత రంగాలకు చెందిన నిపుణులు సరిపుచ్చుకోవడం లేదు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ తమ సామర్థ్యాలను పదును పెట్టుకోవాలని మరింత మెరుగైన స్థితిని అందిపుచ్చుకోవాలనుకుంటున్నారు. ఈ విషయంలో అంతర్జాతీయంగా అన్ని దేశాల కన్నా మనవాళ్లు ముందే ఉన్నారని ప్రముఖ ఎడ్ టెక్ ప్లాట్ ఫామ్ అయిన గ్రేట్ లెర్నింగ్...తన 'అప్ స్కిల్లింగ్ ట్రెండ్స్ రిపోర్ట్'లో వెల్లడించింది. ఈ నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలివే...



అప్ స్కిల్ కావడంలో ప్రొఫెషనల్స్‌కు ప్రేరణ కలిగించే అంశాల్లో పని చేస్తున్న సంస్థలో పెద్ద హోదా ప్రధాన కారణం కాగా, వ్యక్తిగత ఆస్తులు రెండో కారణంగా నిలిచింది. కొత్త ఉద్యోగాన్ని పొందడం అనేది 3వ స్థానంలో నిలిచింది.

- కెరీర్లలో ఎదుగుదల కోసం మన దేశంలో 85% మంది ప్రొఫెషనల్స్ అప్ స్కిల్లింగ్ ఎంతో ముఖ్యమైందిగా భావిస్తుంటే, అంతర్జాతీయంగా ఈ సగటు 76%గా ఉంది. ఇక అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల ప్రొఫెషనల్స్‌లో 64% మంది మాత్రమే అప్ స్కిల్లింగ్‌కు సై అంటున్నారు.
- మన ప్రొఫెషనల్స్ లో 71 % మంది తమ ఉద్యోగాలను నిలబెట్టుకోగలమని ఆత్మ విశ్వాసంతో ఉండగా, ఈ విషయంలో అంతర్జాతీయ సగటు 59% మాత్రమే.
- ఈ ఏడాది తమ ఉద్యోగాలను నిలబెట్టుకునే విషయంలో అంతర్జాతీయంగా చూస్తే లాటిన్ అమెరికా అత్యంత తక్కువ ఆత్మ విశ్వాస శాతాన్ని (44%) కలిగి ఉంది.
- భారతదేశం, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికాలలో ఆఫీస్ వర్క్ అనేది ప్రొఫెషనల్స్ ఎదుగుదలకు అడ్డంకిగా మారుతోంది. అదే సమయంలో అమెరికా, పశ్చిమాసియాలలో కుటుంబ బాధ్యతలు అనేవి ప్రొఫెషనల్స్ అప్ స్కిల్ కావడంలో అడ్డంకిగా ఉన్నాయి.

క్లుప్తంగా...

సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తం

మావోయిస్టులపై నిఘా పెంచాలని డీజీపీ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: దంతెవాడలో మావోయిస్టుల ఘాతుకం నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో పోలీస్‌లు అప్రమత్తమయ్యారు. ఉమ్మడి అదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని అధికారులు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ఎస్పీలు ఆయా జోన్ల ఉన్నతాధికారులు మావోయిస్టు కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని డీజీపీ అంజనీకుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మావోయిస్టుల ఘటనలకు అవకాశం ఉండకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. సరిహద్దు జిల్లాల్లోని పోలీస్ ఉన్నతాధికారులు పరస్పర సహకారంపై రెండు మూడు రోజుల్లో సమీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. దంతెవాడలో మావోయిస్టుల దాడిని ఒక కేస్ స్టడీగా తీసుకుని మావోయిస్టులు వాడుతున్న ఆయుధాలు, ఐఈడీలు, వ్యూహాలపై దృష్టి పెట్టాలన్నారు.

మే 2న టీచర్స్ సంక్షేమ నిధి ప్రారంభం: టీఎస్‌యూటీఎఫ్

సాక్షి, హైదరాబాద్: వివిధ కారణాలతో అకస్మాత్తుగా మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ముందుకు వచ్చింది. దీని కోసం రూపకల్పన చేసిన సంక్షేమ నిధి పథకాన్ని మే 2న నల్గొండలో లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా చేపడతామని ఆయన వెల్లడించారు.

రాష్ట్రంలో కొత్తగా 46 కరోనా కేసులు నమోదు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 5,732 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 46 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది. ప్రస్తుతం 350 మంది ఐసొలేషన్‌లో చికిత్స పొందుతుండగా..55 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.

ధిక్కరణ కేసులో అజహరుద్దీన్‌కు హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అజారుద్దీన్‌కు హైకోర్టు ఫామ్ -1 నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే లీగ్ మ్యాచుల్లో పాల్గొనేందుకు నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను అనుమతించాలని హైకోర్టు 2021లో ఆదేశాలిచ్చింది. అయినా కోర్టు ఆదేశాలను హెచ్‌సీఏ అమలు చేయకపోవడంతో నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఉద్దేశపూర్వకంగానే కోర్టు ఆదేశాలను పాటించడం లేదని పేర్కొంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అజహరుద్దీన్‌కు నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 23కు వాయిదా వేశారు.

ఐటీ టవర్‌పై నుంచి పడి బాలుడి మృతి



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రం సమీపంలోని దివిటిపల్లి వద్ద నిర్మిస్తున్న ఐటీ టవర్‌పై నుంచి పడి బాలుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం భగవన్‌పల్లికి చెందిన గట్టు వెంకటమ్మ ఐటీ టవర్ దగ్గర కూలీగా పనిచేస్తోంది. ఈ క్రమంలో ఆమె కొడుకు శరత్‌కుమార్ (4) శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఐటీ టవర్ రెండో అంతస్తు లోపలి భాగంలో తల్లి ఫ్లోర్‌ను సర్ఫ్ నీటితో శుభ్రం చేస్తోంది. ఆ సమయంలో శరత్ అక్కడే ఆడుకుంటూ ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

తెలుగులోనూ రైల్వే టికెట్ బుకింగ్

- ఫోన్‌లో యూటీఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం
- అన్ రిజర్వుడ్ టికెటింగ్ సిస్టమ్‌లో సరికొత్త సేవలు
- ఆన్‌లైన్, యాప్‌ల్లో జనరల్ టికెట్ల బుకింగ్ ఇక సులువు
- రైల్వేస్టేషన్లలో క్యూలైన్ల బాధలకు చెక్



క్యూలైన్‌లో రైల్వే టికెట్ కోసం నిలబడి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: జనరల్ టికెట్ కోసం ఆదరాబాదరాగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. చాంతాడంత పొడవు ఉండే క్యూలైన్లలో నిలబడి.. ఈలోపు తాము ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందేమోనని ఆదుర్దా పడేవారే ఎక్కువ. ఇలా ఇబ్బందులు పడే ప్రయాణికుల కోసం రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వుడ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. యూటీఎస్ విధానంలో యాప్, వెబ్‌సైట్ ద్వారా రైలు టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇంగ్లిష్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దీన్ని ప్రాంతీయ భాషలకు కూడా రైల్వే శాఖ విస్తరించింది. దీంతో తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సాధారణ (జనరల్) రైలు టికెట్లను దిగువ శ్రేణి ప్రయాణికులు ఎక్కువగా తీసుకుంటారని.. వీరి కోసం ప్రాంతీయ భాషల్లో యాప్‌ని తీసుకొస్తే వినియోగం మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

ఎలాంటి శ్రమ లేకుండా యాప్ నుంచే..

యూటీఎస్ యాప్ ద్వారా ఎలాంటి శ్రమ లేకుండా మొబైల్ ఫోన్ నుంచే జనరల్ టికెట్ పొందొచ్చు. అయితే టికెట్ బుక్ చేసుకోవడానికి ఇంగ్లిష్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రామీణులు, పెద్దగా చదువుకోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సులభంగా యాప్ వినియోగించేలా ప్రాంతీయ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, కన్నడం, మళయాలం, మరాఠీ, ఒడియా, తమిళ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా జనరల్ టికెట్‌తో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్ కూడా కొనుగోలు చేయొచ్చు. అలాగే సీజన్ టికెట్ బుకింగ్, రెన్యువల్ సైతం చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్‌లో ప్రాంతీయ భాషల అప్‌డేట్ వెర్షన్‌ను ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటిలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. హార్డ్ కాపీ, పేపర్‌లెస్ టికెట్.. రెండు ఆప్షన్లు ఉన్నాయి.

యూటీఎస్ యాప్

ఎన్ని భాషల్లో: తెలుగు, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, హిందీ, తమిళం, ఒడియా, మరాఠీ

దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న రైల్వేస్టేషన్లు: 9,120

డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 10 మిలియన్లకు పైగా

యాప్ ద్వారా రోజుకు బుక్ అవుతున్న టికెట్లు: 2.34 లక్షలు

రోజూ వినియోగిస్తున్న ప్రయాణికులు: 14.21 లక్షల మంది

స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో..



మొబైల్‌లోని జీపీఎస్ ఆధారంగా యూటీఎస్ యాప్ పనిచేస్తోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలో మొబైల్ జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉండాలి. రైల్వేస్టేషన్ ఆవరణకు 30 మీటర్ల నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న ప్రయాణికులు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యాప్ ద్వారా 3 నెలలు, 6 నెలలు లేదా సంవత్సరానికి సీజన్ టికెట్లను తీసుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు యూటీఎస్ టికెట్ బుకింగ్ చెల్లుబాటు అవుతుంది.

– అనూప్‌కుమార్ సత్పతి, డీఆర్ఎం, వాల్తేరు

2వ శతాబ్దంలోనే పశ్చిమ యురేషియాతో మన వాణిజ్యం

- కేరళలోని 'పట్టణం'లో అస్థిపంజరాల్లో డీఎన్ఏ
- సీసీఎంబీ శాస్త్రవేత్తల పరిశోధనల్లో గుర్తింపు



సాక్షి, హైదరాబాద్/లాలాపేట: కేరళలోని ఎర్నాకులం జిల్లా 'పట్టణం'అనే ప్రాంతం ప్రధాన కేంద్రంగా పశ్చిమ యురేషియా ప్రాంతవాసులు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించినట్లు తాజా అధ్యయనం చెబుతోంది. ఇక్కడి నేలల్లో లభించిన అస్థిపంజరాల నుంచి సేకరించిన డీఎన్ఏ పరిశోధనతో ఈ విషయం వెలుగు చూసింది. సీసీఎంబీ(సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయోలజీ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కుమారస్వామి తంగరాజు, డాక్టర్ పీజే చరియన్ ఆధ్వర్యంలో పురాతన డీఎన్ఏ విశ్లేషణ చేపట్టారు. 'పట్టణం'పురావస్తు ప్రదేశంలో మానవ ఎముకలు, నిల్వ పాత్రలు, బంగారు ఆభరణాలు, గాజు, రాతి పూసలు, రాయి, రాగి, ఇనుముతో చేసిన రకరకాల వస్తువులు, కుండలు, నాణేలు, ఇటుక గోడ, ఉంగరాలను పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ పట్టణంలో క్రీస్తు పూర్వం 2వ శతాబ్దం నుంచి క్రీస్తు శకం 10వ శతాబ్దం వరకు మెగాలిథిక్(ఇనుపయుగం) ప్రజలు నివసించినట్లు గుర్తించారు. ఇక్కడి ప్రజల జన్యువును గుర్తించేందుకు మానవ అస్థిపంజరాల నుంచి డీఎన్ఏను సేకరించి, పరిశీలించారు. ఇక్కడి 12 పురాతన అస్థిపంజరాల నమూనాల మైటోకాన్డ్రియల్ డీఎన్ఏను విశ్లేషించగా దక్షిణాసియా, పశ్చిమ యురేషియా వంశాల గుర్తులున్నట్లు లక్నోకు చెందిన డీఎస్‌టీ-బీర్బల్ సాహ్నీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నిరాజ్ రాయ్ తెలిపారు. 'భారత వాతావరణ పరిస్థితులు డీఎన్ఏ పరిశోధనలకు ఎల్లప్పుడూ అనుకూలంగా ఉండవు. 'పట్టణం'ప్రదేశం నుంచి తవ్విన చాలా అస్థిపంజర అవశేషాలు ఉష్ణమండల, తేమ, ఆమ్ల నేల పరిస్థితుల కారణంగా చాలా పెళుసుగా ఉన్నాయి. అయినప్పటికీ అత్యుత్తమ పద్ధతులను అనుసరించి నమూనాలను విజయవంతంగా విశ్లేషించాం'అని నిరాజ్‌రాయ్ తెలిపారు. అయితే ఈ నమూనాల్లో పశ్చిమ యురేషియన్, మెడిటరేనియన్ ప్రత్యేక ముద్ర లభించిందని, దక్షిణ భారతానికి వ్యాపారుల నిరంతర రాకపోకలు, ఇక్కడి బహుళ సాంస్కృతిక సమ్మేళనానికి ఇదో ఉదాహరణని శాస్త్రవేత్త డాక్టర్ కుమారసామి తంగరాజ్ తెలిపారు. పట్టణం పురాతన మూలాలు, జన్యు ఆకృతి కోసం రూపొందించిన మొదటి జన్యు డేటా ఇదేనని, ఈ పరిశోధనలు దక్షిణ భారతంలో విభిన్న సమూహాల చారిత్రక ఆక్రమణ ప్రారంభాన్ని బలపరుస్తున్నాయని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కుమార్ నందికూరి అన్నారు.

ఆయనతోపాటే నాకూ నిప్పంటించండి..

మావోయిస్టుల దాడిలో మృతి చెందిన డీఆర్‌జీ జవాన్ భార్య యత్నం



భర్త చితిపై పడుకుని విలపిస్తున్న మడకం తులే

చర్ల: మావోల దాడిలో హతమైన భర్తను చూసి గుండెలవిసేలా రోదించిన భార్య.. ఆయనతో పాటే తానూ తనువు చాలిస్తానని చితిపై పడుకుంది. సర్దిచెప్పిన బంధువులు ఆమెను కిందకు దింపారు. దంతెవాడ జిల్లాలో ఈనెల 26న మావోయిస్టులు మందుపాతర పేల్చగా పది మంది డీఆర్‌జీ జవాన్లతో పాటు ఒక డ్రైవర్ మృతి చెందిన విషయం విదితమే. మృతి చెందిన డీఆర్‌జీ జవాన్లలో బీజాపూర్ జిల్లా నెర్రెం గ్రామానికి చెందిన లక్మా కూడా ఉన్నారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేసి, లక్మా చితికి నిప్పంటించే క్రమంలో ఆయన భార్య తులే ఒక్కసారిగా చితిపై పడుకుని తానూ భర్తతో పాటే తనువు చాలిస్తానని బోరున విలపించింది. బంధువులు ఎంత బ్రతిమాలినా చితి నుంచి దిగేందుకు ఆమె ససేమిరా అంది. పిల్లల కోసమైనా బతకాలని నచ్చచెప్పడంతో ఆమె కిందకు దిగింది.

వందేభారత్ సూపర్ సక్సెస్

- సికింద్రాబాద్- విశాఖ, తిరుపతి రెండూ కిక్కిరిసే..
- విశాఖ సగటు ఆక్యుపెన్సీ రేషియో 128%, తిరుపతి 131% నమోదు
- దేశంలోనే టాప్ ప్లేస్‌లోకి రైళ్లు
- త్వరలో తిరుపతి సర్వీసు కోచ్‌ల సంఖ్య రెట్టింపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా పట్టాలెక్కిన రెండు వందేభారత్ రైళ్లు సూపర్ సక్సెస్ అయ్యాయి. టికెట్ ధర ఎక్కువైనా ప్రయాణికులు వాటిల్లో వెళ్లేందుకు ఎగబడుతున్నారు. దీంతో సికింద్రాబాద్-విశాఖపట్నం, సికింద్రాబాద్-తిరుపతి రైళ్లు కిక్కిరిసి పరుగులు పెడుతున్నాయి. సికింద్రాబాద్-తిరుపతి రైలు సగటు ఆక్యుపెన్సీ రేషియో 131 శాతం ఉండగా, తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు వచ్చేటప్పుడు 134 శాతం నమోదవుతోంది. సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ సగటు ఆక్యుపెన్సీ రేషియో 128 శాతం ఉండగా, తిరుగు ప్రయాణంలో 106 శాతంగా నమోదవుతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు పట్టాలెక్కిన వందేభారత్ రైళ్ల ఆక్యుపెన్సీలో ఇవే టాప్‌లో నిలవటం విశేషం.

వేగమే ప్రధానం..

కాచిగూడ-తిరుపతి మధ్య 2017లో డబుల్ డెక్కర్ రైలును ప్రారంభించారు. అది మధ్యాహ్నం పూట ప్రయాణించేది కావటంతో బెర్తులకు బదులు చైర్ కార్ మాత్రమే ఉంటుంది. దీంతో దానికి ఏమాత్రం ఆదరణ లేక ఆక్యుపెన్సీ రేషియో 12 శాతానికి పడిపోయింది. ఫలితంగా దాన్ని రద్దు చేశారు. ఇప్పుడు దానిలాగే మధ్యాహ్నం వేళ, చైర్‌కార్‌తో ప్రయాణించే వందేభారత్‌ను ప్రవేశపెట్టినప్పుడు రైల్వే అధికారులకు డబుల్ డెక్కర్ రైలే గుర్తొచ్చింది. దీంతో తిరుపతి వందేభారత్‌కు కేవలం 8 కోచ్‌లను మాత్రమే ఏర్పాటు చేశారు. అయితే ప్రయాణికుల నుంచి అనూహ్య ఆదరణ లభించింది. అధిక ఛార్జీ, పగటి వేళ ప్రయాణం, బెర్తులు ఉండకపోయినప్పటికీ జనం ఎగబడుతున్నారు. విశాఖపట్నం వందేభారత్ విషయంలోనూ ఇదే జరిగింది. ఇందుకు వందేభారత్ వేగమే కారణమని స్పష్టమవుతోంది. విశాఖ, తిరుపతిలకు సాధారణ రైళ్లలో 12 నుంచి 14 గంటల సమయం పడుతుంటే వందేభారత్ కేవలం 8 గంటల్లో గమ్యం చేరుస్తోంది. ఉదయం బయలుదేరితే మధ్యాహ్నానికల్లా గమ్యం చేరుతుండటంతో ప్రయాణికులకు ఒక పూట ఆదా అవుతోంది. సికింద్రాబాద్-విశాఖ వందేభారత్‌లో.. విశాఖ వెళ్లేప్పుడు ఎక్కువ మంది ప్రయాణిస్తుండగా, సికింద్రాబాద్-తిరుపతి సర్వీసులో మాత్రం, తిరుపతి నుంచి వచ్చేటప్పుడు ఎక్కువ ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతోంది. తిరుపతిలో దర్శనాలు పూర్తి చేసుకున్నాక, మధ్యాహ్నం రైలెక్కి అదే రోజు రాత్రి కల్లా నగరానికి చేరుకోగలుగుతుండటం వారికి కలిసి వస్తోంది.

తిరుపతి రైలు ఆదాయం అదుర్స్

జనవరి 15న విశాఖ వందేభారత్ రైలు ప్రారంభమైంది. కాగా ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 19 వరకు దాని ద్వారా రైల్వేకు రూ.31 లక్షల ఆదాయం నమోదైంది. అయితే తిరుపతి సర్వీసులో 8 కోచ్‌లు మాత్రమే ఉన్నా, పది రోజుల్లో రూ.17.50 లక్షల ఆదాయం వచ్చింది. త్వరలో తిరుపతి రైలుకు కోచ్‌ల సంఖ్యను 16కు పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏప్రిల్ 1 నుంచి 19 వరకు సికింద్రాబాద్-విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ తీరు ఇలా..

సికింద్రాబాద్-విశాఖ:	సీట్లు	ప్రయాణికులు	ఆక్యుపెన్సీ రేషియో	ఆదాయం
	1128	1444	128 శాతం	రూ.16,74,222
విశాఖ-సికింద్రాబాద్	1128	1195	106 శాతం	రూ.13,97,825

ఏప్రిల్ 9 నుంచి ఏప్రిల్ 19 వరకు ...సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ వందేభారత్

సికింద్రాబాద్-తిరుపతి:	సీట్లు	ప్రయాణికులు	ఆక్యుపెన్సీ రేషియో	ఆదాయం
	530	695	131 శాతం	రూ.8,70,919
తిరుపతి-సికింద్రాబాద్:	530	645	134 శాతం	రూ.8,84,863

(నోట్: మార్గం మధ్యలోని స్టాపుల్లో ప్రయాణికులు దిగడం, మళ్లీ ఎక్కే వారిని పరిగణనలోకి తీసుకోవడం వల్ల సీట్ల సంఖ్య కంటే ప్రయాణికుల సంఖ్య (ఆక్యుపెన్సీ రేషియో) ఎక్కువగా కనిపిస్తుంది)

టీఎస్ఎస్పీ రక్షణలో కొత్త సచివాలయం

- 400 మంది సిబ్బంది కేటాయింపు
- కమాండెంట్ ర్యాంకు అధికారికి సీఎస్‌వో బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: కొద్ది రోజుల్లోనే కొలువుదీరనున్న తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం భద్రత బాధ్యతలను తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ)కు అప్పగించారు. గతంలో సచివాలయ భద్రత విధులను ఎస్పీఎఫ్ విభాగం చూసేది. తొలిసారిగా సచివాలయ భద్రత విధులకు ప్రభుత్వం టీఎస్ఎస్పీ సిబ్బందిని కేటాయించింది. ఈనెల 30 నుంచి సచివాలయం అందుబాటులోకి రానున్న నేపథ్యంలో మొత్తం 400 మంది టీఎస్ఎస్పీ సిబ్బందిని భద్రత విధుల కోసం కేటాయించినట్టు టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీ స్వాతి లక్రా 'సాక్షి'కి తెలిపారు. సచివాలయం లోపల పెట్రోలింగ్ విధులు, అన్ని ద్వారాల వద్ద తనిఖీలు, బయటి నుంచి వచ్చేవారిపై నిఘా తదితర అన్ని విధుల్లో టీఎస్ఎస్పీ సిబ్బందే ఉండనున్నారు. సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో)గా కమాండెంట్ ర్యాంక్ అధికారిని నియమించినట్టు తెలిపారు. సచివాలయం పూర్తి భద్రత ఇన్‌చార్జిగా సీఎస్‌వో వ్యవహరిస్తారని తెలిపారు.

కొత్త సచివాలయాన్ని సందర్శించిన మంత్రులు, అధికారులు

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర నూతన సచివాలయ భవనాన్ని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు శుక్రవారం సాయంత్రం సందర్శించారు. కొత్త సచివాలయ భవనంలోని మొదటి అంతస్తులో హోంశాఖకు కేటాయించిన కార్యాలయాన్ని హోం శాఖ మంత్రి మహమూద్ అలీ పరిశీలించిన అనంతరం మహమూద్ అలీ మాట్లాడుతూ...దేశంలో మొదటిసారిగా అద్భుతమైన సచివాలయ నిర్మాణాన్ని చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, డీజీపీ అంజనీకుమార్, టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీ స్వాతి లక్రా, శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌జైన్, సీపీ సీవీ ఆనంద్ తదితరులు కూడా కొత్త సచివాలయాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, నాగార్జున సాగర్ ఎమ్మెల్యేలు నోముల భగత్, బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ తదితరులతో నూతన సచివాలయ భవన నిర్మాణ విశిష్టతపై చర్చించారు. సచివాలయ నిర్మాణ సందర్శన అనంతరం మహమూద్ అలీ సచివాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ప్రార్థనామందిరాలను సందర్శించారు.

యాసంగిలో వేరుశనగ సాగుకు ప్రోత్సాహం




సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నాంపల్లి: వ్యవసాయ ఉత్పత్తుల్లో రాష్ట్రం అగ్రభాగాన నిలబడిందని, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఎగుమతులు పెంచడంతో రైతుల ఆదాయం బాగా పెరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. యాసంగిలో వేరుశెనగ సాగు చేసే రైతులకు అధిక ప్రోత్సాహం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా అఫ్లాటాక్సిన్ వేరుశనగకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఉచిత చేపపిల్లలతో మత్స్య పరిశ్రమ, సబ్సిడీ గొర్రెలతో గొర్రెల పెంపకం వల్ల రాష్ట్రంలో గణనీయంగా వాటి ఉత్పత్తి పెరిగిందన్నారు. శుక్రవారం లక్డీకాపూల్‌లోని ఫెడరేషన్ హౌస్ సురానా ఆడిటోరియంలో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో 'వ్యవసాయ, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి అవకాశాలు-తెలంగాణ'అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ కలిగిన ఉత్పత్తులు, వాటి ఎగుమతుల మీద దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. అత్యధిక మందికి ఉపాధి కల్పించే వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ ముందుచూపుతో ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచ ఆకలి తీర్చేందుకు భారతదేశం కేంద్రబిందువుగా నిలుస్తుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం మీద దృష్టిపెట్టిన వారికి భవిష్యత్తు ఉంటుందని, ప్రపంచ అవసరాలు, డిమాండ్ ఉన్న ఉత్పత్తుల మీద దృష్టిసారించాలన్నారు. మనకు అత్యంత ప్రతిభ కలిగిన పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నారని, ఒక మంచి పాలసీని ముందుకు తెస్తే అత్యంత తక్కువ సమయంలో దానిని అమల్లోకి తెచ్చే సత్తా ఆయనకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు నీరజాప్రభాకర్, టీఎస్టీపీసీ జేఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు మీలా జయదేవ్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు సినీ హీరోల కంటే ఎక్కువ క్రేజ్

మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు అపూర్వ ఆదరణ: మంత్రి మల్లారెడ్డి



మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం కోసం భూమిపూజ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సినిమా హీరో కంటే ఎక్కువ క్రేజ్ ప్రజలలో ఉందని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మహారాష్ట్ర తర్వాత బీఆర్ఎస్ కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా విస్తరిస్తామని అన్నారు. శుక్రవారం మేడ్చల్ మున్సిపాలిటీలోని మార్కెట్ కమిటీ గోదాం, కార్యాలయం భవనం, గౌడవెల్లి - కండ్లకోయ రోడ్డు నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. మేడ్చల్‌లో నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయ భవనం, గోదాం, దుకాణ సముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. బీఆర్ఎస్‌కు, సీఎం కేసీఆర్‌కు మహారాష్ట్రలో అపూర్వ ఆదరణ లభిస్తోందని తెలంగాణ చేపట్టిన రైతు పథకాలతో అక్కడి ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలిస్తున్నారని అన్నారు. ఆంధ్రా ప్రాంతంలో కూడా బీఆర్ఎస్‌కు ఆదరణ లభిస్తుందని, అక్కడ కూడా పార్టీ పటిష్టతపై దృష్టి పెడతామని అన్నారు. కుల రాజకీయాలతో ఆంధ్రాప్రాంతం అభివృద్ధి చెందడం లేదని అన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మరిచిపోయాయని, కేవలం పాలకపక్షాన్ని తిట్టడానికే అవి ఉన్నాయని మల్లారెడ్డి అన్నారు. తాము తిట్లకు బదులుగా అభివృద్ధి చేసి వాటికి సమాధానం చెబుతున్నామని పేర్కొన్నారు. తాము పంట నష్టపోయిన రైతులకు ఎకరంకు రూ.10 వేలు ఇస్తున్నామని, బీజేపీ ఎంపీలకు దమ్ముంటే ప్రధాని మోదీతో మాట్లాడి రూ.20 వేలు ఇప్పించాలని మంత్రి సవాల్ చేశారు.

పంటనష్టం పరిశీలనకు 4 కాంగ్రెస్ బృందాలు

- 7 ఉమ్మడి జిల్లాల్లో పర్యటన

సాక్షి, హైదరాబాద్: కొన్ని రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వడగండ్ల వల్ల నష్టపోయిన పంటల వివరాలను తెలుసుకుని రైతులను పరామర్శించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ రూపొందించింది. ఇందుకు రాష్ట్ర స్థాయిలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనుమతితో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ చైర్మన్‌గా టి.రామ్మోహన్‌రెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి సభ్యులుగా మెదక్, రంగారెడ్డి జిల్లాల పర్యటన కమిటీ, కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్, మాజీ మంత్రి కొండా సురేఖలతో కరీంనగర్, ఖమ్మం జిల్లాల కమిటీని ఏర్పాటు చేశారు. మాజీమంత్రి జీవన్‌రెడ్డి చైర్మన్‌గా మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల, సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీలు సభ్యులుగా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల కమిటీ, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఎస్.రాములు నాయక్‌లతో వరంగల్ జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. కిసాన్ కాంగ్రెస్ జాతీయ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర చైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డిలు ఈ బృందాలను సమన్వయం చేస్తారని తెలిపారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి, నష్టం వివరాలతో కూడిన నివేదికను అందజేయాలని పేర్కొన్నారు.

ట్రెజరీ అకౌంట్స్‌లో మరో వివాదం

- ఉద్యోగుల నేతలపై దుర్భాషలు
- మహిళా అధికారి ఫిర్యాదుపై విచారణకు ఆదేశించిన మంత్రి హరీశ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో మరో వివాదం నెలకొంది. డైరెక్టరేట్ ఉన్నతాధికారి తనను వేధిస్తున్నాడంటూ హైదరాబాద్ సమీప జిల్లాలో పనిచేస్తున్న ఓ మహిళా అధికారి ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన హరీశ్‌రావు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. ఈ వివాదం ఇలా ఉండగానే తమ సమస్యల పరిష్కారం కోసం డైరెక్టర్ వద్దకు వెళ్లిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులను 'చిల్లరగాళ్లు'అని సంబోధించిన అంశం ఇప్పుడు ట్రెజరీ అండ్ అకౌంట్ శాఖలో కొత్త వివాదానికి కారణమైంది. గతంలో అక్రమ డిప్యూటేషన్లు, కంప్యూటర్ కొనుగోళ్లు, జిల్లాల్లో ట్రెజరీ భవనాల కోసం అనుమతి లేకుండా రూ.23.8 కోట్ల వ్యయం తదితర అంశాలపై విచారణ సాగుతోంది. ఇదిలాఉంటే డైరెక్టర్ ఉద్యోగ సంఘాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఉద్యోగ సంఘాలు ఆందోళనకు దిగేందుకు సన్నద్ధం అవుతున్నట్లు సమాచారం.

నేనూ పాదయాత్ర చేస్తా

అధిష్టానం అనుమతి కోరిన జగ్గారెడ్డి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో మరో పాదయాత్ర ప్రారంభమవుతోంది. హాథ్‌సే హాథ్‌జోడో యాత్రల్లో భాగంగా తాను కూడా నాలుగు జిల్లాల్లోని 47 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తానని సంగారెడ్డి ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి మెదక్ (10), హైదరాబాద్(15), రంగారెడ్డి(8), మహబూబ్‌నగర్ (14) జిల్లాల్లో పాదయాత్ర చేసేందుకు అధిష్టానం అనుమతి కోరుతూ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. ఓవైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రెండో విడత పాదయాత్ర మరికొన్ని రోజుల్లో ప్రారంభం అవుతుండగా, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర కొనసాగుతుండగా ఇప్పుడు జగ్గారెడ్డి మరో పాదయాత్రకు సిద్ధమవుతుండడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

వారిద్దరూ తిరగని చోట్ల తిరుగుతా: జగ్గారెడ్డి

ఠాక్రేకు లేఖ రాసిన అనంతరం సీఎల్పీ కార్యాలయంలో తనను కలిసిన విలేకరులతో జగ్గారెడ్డి మాట్లాడారు. తన పాదయాత్రకు అధిష్టానం అనుమతినిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ రేవంత్, సీఎల్పీ నేత భట్టి చేస్తున్న పాదయాత్రలకు తోడు తాను కూడా పాదయాత్ర చేస్తానని, పార్టీ బలోపేతం కోసమే యాత్రకు సిద్ధమవుతున్నానని చెప్పారు. వారిద్దరూ తిరగని నియోజకవర్గాల్లో తాను యాత్ర చేయాలనుకుంటున్నానని వెల్లడించారు. కాగా, వచ్చే వారంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి జగ్గారెడ్డి యాత్ర ప్రారంభమవుతుందని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

డ్రైవింగ్ చేస్తుండగా గుండెపోటు

కారు పక్కకు ఆపి రిటైర్డ్ ఏఎస్సై మృతి



ఖమ్మం అర్బన్: ఖమ్మం జిల్లా కేంద్రంలో కారు నడుపుతూ వెళ్తున్న రిటైర్డ్ ఏఎస్సై యాసా వెంకటేశ్వర్లు(60)కు గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఖమ్మం 8వ డివిజన్ ఎల్‌బీ నగర్‌లో నివాసముండే వెంకటేశ్వర్లు కారులో శుక్రవారం ఖమ్మం బయల్దేరారు. ఖమ్మం–వైరా రహదారిపైకి వచ్చాక టర్న్ తీసుకునే క్రమంలో ఆయనకు గుండెపోటు వచ్చింది. దీంతో కారును పక్కకు ఆపగా అటుగా వెళ్తున్న కొందరు అక్కడకు చేరుకుని ఆయనకు సపర్యలు చేస్తుండగానే మృతి చెందాడు.

వాళ్ల ఉద్యోగాలు ఊడితేనే.. మనకు ఉద్యోగాలు

- అందుకు నల్లగొండ బిడ్డలు నడుం బిగించాలి.. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న అసమర్థ ప్రభుత్వాన్ని బండకేసి కొట్టాలి
- నిరుద్యోగ నిరసన సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



నల్లగొండ పట్టణంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీలో అభివాదం చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: లక్షలామంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటూ, పరీక్షలు సరిగ్గా నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వాన్ని బండకేసి కొట్టాలని, 100 మీటర్ల గోయ్యితీసి పాతిపెట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడబీకితే మన ఉద్యోగాలు మనకు వస్తాయని, అందుకు నల్లగొండ బిడ్డలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఇకపై కేసీఆర్‌ను ఉద్యోగాలు అడిగేదే లేదని చెప్పారు. శుక్రవారం నల్లగొండలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన సభలో ఆయన ప్రసంగించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి

'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసుకోవాలి. అందుకు నిరుద్యోగులు సిద్ధం కావాలి. నిరుద్యోగులను తల్లిదండ్రులు కూలీ పనిచేస్తూ కోచింగ్ సెంటర్లకు పంపిస్తే ఉద్యోగాలు ఇవ్వలేదు. 30 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక, ఇంటికి వెళ్లలేక అడ్డా మీద కూలీల్లా బతుకుతున్నారు. పరీక్షలు నిర్వహించాల్సిన సీఎం.. పార్టీ విస్తరణ పేరుతో రాష్ట్రాలు తిరుగుతున్నాడు..' అని రేవంత్ విమర్శించారు.

తాగుబోతుల సమ్మేళనాలు..

'బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు జనతా బార్‌లో పర్మిట్ రూమ్ అడ్డాల్లా మారాయి. పంటలు నష్టపోయి రైతులు ఏడుస్తుంటే బీఆర్ఎస్ నేతలు తాగుబోతుల సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. తొలి తెలంగాణ ఉద్యమంలో పదవులు త్యాగం చేసింది కొండా లక్ష్మణ్ బాపూజీ అయితే, మలి దశ ఉద్యమంలో మంత్రి పదవిని త్యాగం చేసిన నాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే.. రాష్ట్రం కావాలంటూ కాంగ్రెస్ పార్టీ తరఫున హోంమంత్రి చిదంబరానికి వినతిపత్రం సమర్పించింది ఉత్తమ్‌కుమార్‌రెడ్డేననేది చరిత్ర పుటల్లో ఉంది. దేవరకొండలో చదువుకున్న జైపాల్‌రెడ్డి తన రాజకీయ చతురతతో అందరినీ ఒప్పించి తెలంగాణ బిల్లు పాస్ చేయించారు. అలాంటి గొప్ప నేతలు ఉన్న నల్లగొండలో ఇప్పుడు ఎలాంటి నాయకులు ఎమ్మెల్యేలు అయ్యారు, మంత్రులు అయ్యారనేది గ్రహించాలి. నిజాం రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర ఉన్న ఈ జిల్లాలో ఈ రోజు చెప్పుకోవడానికి నాయకుడు లేరు..' అని పేర్కొన్నారు.

బంగారు తెలంగాణ ఎవరికి?

'బంగారు తెలంగాణ ఎవరికి అయ్యింది. బిడ్డను బిర్లాను, అల్లున్ని అంబానీని, కొడుకును టాటాను చేశారు. కేసీఆర్ చార్లెస్ శోభరాజ్ అయ్యారు. పేదోళ్లకు ఎక్కడ ఉద్యోగాలు వచ్చాయి? మొదటి శాసనసభలో ఎన్ని ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని అడిగితే 1.07 లక్షలు ఉన్నాయని చెప్పారు. ఏడాదిలో భర్తీ చేస్తామన్నారు. ఇప్పుడు 9 ఏళ్ల తరువాత 1,91,792 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని ప్రభుత్వ కమిషనే చెప్పింది. రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వచ్చాయా? నిరుద్యోగ సమస్య పెరిగిందా? అనేది ఆలోచన చేయాలి. పదో తరగతి పరీక్షలు పెట్టమంటే ప్రశ్నపత్రాలు వాట్సాప్‌లో కనిపించాయి. ఇంటర్ జవాబు పత్రాలు సరిగ్గా దిద్దకుండా 25 మంది విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం పొట్టనపెట్టుకుంది. టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ఉద్యోగాలు భర్తీ చేయమంటే ప్రశ్నపత్రాలు బస్టాండ్లు, జిరాక్స్ సెంటర్లలో అమ్ముకుంటున్నారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలను వందల కోట్ల రూపాయలకు కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్ అమ్ముకుంటున్నారు..' అని రేవంత్ ఆరోపించారు.

మేం చెబితే ఖండించారు..

'దళితబంధులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లంచాలు తీసుకుంటున్నారని మేం చెబితే ఖండించారు. నిన్న సీఎం కేసీఆర్ లంచాలు తీసుకున్న వారి చిట్టా తన దగ్గర ఉందన్నారు. రూ.10 లక్షల దళిత బంధు ఇవ్వడానికి రూ.3 లక్షలు అంటే 30 శాతం కమీషన్లు తీసుకునే సర్కారు మనకు అవసరమా? యాదవులు గొర్రెలు కాసేందుకు, ముదిరాజ్‌లు..గంగపుత్రులు చేపలు పట్టేందుకు, గౌడ్‌లు కల్లు గీసేందుకు, మాదిగలు చెప్పులు కుట్టుకునేందుకే తెలంగాణ తెచ్చుకున్నామా? పేదల బిడ్డలు కుల వృత్తులే చేసుకుని బతకాలా? అనేది ఆలోచించాలి..' అని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ బిడ్డ ప్రియాంక గాంధీ మే 8న వస్తున్నారని, సరూర్‌నగర్ సభకు వేలాదిగా తరలిరావాలని రేవంత్ పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరేద్దామని, 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసుకుందామని అన్నారు.

మోసపోతే బతకలేం: కోమటిరెడ్డి

కేసీఆర్ మాటలు రెండుసార్లు విని మోసపోయామని, మూడోసారి మోసపోతే బతకలేమని మాజీ మంత్రి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తే కేసీఆర్ మాటలు నమ్మి టీఆర్ఎస్‌కు రెండుసార్లు ఓట్లు వేస్తే నిధులు, నీళ్లు, నియామకాలు ఏవీ లేకుండా పోయాయని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని, నోటిఫికేషన్లు ఇచ్చి లీకేజీలకు పాల్పడిన దుర్మార్గుడు కేసీఆర్ అని ఆరోపించారు. రాష్ట్రంలో వైఎస్ హయాంలో తెచ్చిన శ్రీశైలం సొరంగ మార్గాన్ని పూర్తిగా ఎండగట్టారన్నారు. దళిత బంధు పథకంలో ఎమ్మెల్యేలు 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని తెలిసినప్పుడు ఎందుకు సస్పెండ్ చేయడం లేదని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

సాండ్..ల్యాండ్..మైన్..వైన్

టీఆర్ఎస్ నాయకులంతా ఇసుక, భూ కబ్జాలు, మైనింగ్, వైన్ వ్యాపారాలు చేస్తున్నారని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. యువకులు బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాధిస్తే కేసీఆర్ ప్రభుత్వం వారి త్యాగాలకు అర్థం లేకుండా చేస్తోందని అన్నారు. 9 సంవత్సరాల్లో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రెట్టింపైందన్నారు.

పోటీ చేయను.. కోరితే సీఎం అవుతా: జానారెడ్డి

'నేను వచ్చే ఎన్నికలో పోటీ చేయడం లేదు.. అధిష్టానానికి కోరిక ఉంటే పోటీ చేయకుండానే సీఎంను అవుతా..' అని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలో ఉత్తమ్‌కుమార్ గెస్ట్ హౌస్‌లో ఆయనతో జరిగిన సరదా సంభాషణ నేపథ్యంలో జానారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీ

ఎంజీయూ విద్యార్థులతో రేవంత్‌రెడ్డి

ఎంజీయూ (నల్లగొండ రూరల్): నాలుగు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, వెంటనే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వద్ద నిరుద్యోగులతో ఆయన మాట్లాడారు. ఎంజీయూ వద్ద విద్యార్థులు ప్రవళిక, మధు, శ్వేత తదితరులతో ముచ్చటించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడంతో మానసికంగా ఒత్తిడికి గురవుతున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్ మొండి వైఖరిపై నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాతుందని హామీ ఇచ్చారు. యువకులంతా ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు.

- ప్రభుత్వం, ప్రైవేటులో కలిపి జరుగుతున్న ఖర్చు ఇది
- ఆరోగ్య వ్యయంలో దేశంలో 8వ స్థానంలో తెలంగాణ
- అత్యధికంగా కేరళలో రూ.10,607 ఖర్చు
- ప్రజారోగ్య బీమాలో పదో స్థానంలో మన రాష్ట్రం
- ఆరోగ్యశ్రీ కింద రూ.300 కోట్లు మాత్రమే ఖర్చు
- రూ.1,305 కోట్ల వ్యయంతో దేశంలో ఏపీ రెండో స్థానం
- 2019–20 జాతీయ ఆరోగ్య ఖాతాల నివేదికలో వెల్లడి



రాష్ట్రంలో తలసరి ఆరోగ్య ఖర్చు రూ.5,110

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కలిపి ఆరోగ్యంపై చేస్తున్న తలసరి ఖర్చు రూ. 5,110గా ఉందని, ఈ అంశంలో తెలంగాణ దేశంలో ఎనిమిదో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆరోగ్య ఖర్చు రూ. 5,114గా ఉందని తెలిపింది. ఆరోగ్యంపై దేశంలో అత్యధికంగా కేరళ తలసరి రూ.10,607 ఖర్చుతో తొలిస్థానంలో నిలిచిందని వివరించింది. ఈ మేరకు జాతీయ ఆరోగ్య ఖాతాల అంచనాల నివేదిక-2019–20లో వివరాలను తాజాగా వెల్లడించింది. తెలంగాణలో ప్రభుత్వం, ప్రైవేట్ రంగం కలిపి ఆరోగ్యంపై రూ.18,908 కోట్లు వ్యయం అవుతోందని.. ఇది రాష్ట్ర జీఎస్‌డీపీలో 2 శాతమని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యయం రూ. 27,105 కోట్లు అని, ఇది ఆ రాష్ట్ర జీఎస్‌డీపీలో 2.8 శాతమని వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యంపై రూ.8,374 కోట్లు ఖర్చు చేస్తోందని.. రాష్ట్ర మొత్తం ఆరోగ్య ఖర్చులో ఇది 44.3 శాతమని పేర్కొంది. ప్రభుత్వం తలసరి చేస్తున్న ఖర్చు రూ.2,125గా ఉందని తెలిపింది. రాష్ట్ర బడ్జెట్‌లో 6.7 శాతాన్ని ఆరోగ్య రంగం కోసం వ్యయం చేస్తున్నారని.. దీనిలో దేశంలో తెలంగాణ ఏడో స్థానంలో ఉందని వెల్లడించింది. అత్యధికంగా కేరళ బడ్జెట్‌లో 8 శాతం ఖర్చు చేస్తోందని వివరించింది. ఏపీలో ప్రభుత్వం 9,005 కోట్లు ఆరోగ్యంపై ఖర్చు చేస్తోందని వెల్లడించింది.



ప్రజారోగ్య బీమాలో తెలంగాణ పదో స్థానం

తెలంగాణలో మొత్తం వైద్య ఖర్చులో 41.6 శాతం ప్రజలు సొంత జేబు నుంచి ఖర్చు చేస్తున్నారు. ఈ అంశంలో దేశంలో అతి తక్కువ ఖర్చు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానంలో ఉంది. అత్యంత తక్కువగా 31.8 శాతం ప్రజల ఖర్చుతో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది.

ప్రజలు తమ జేబు నుంచి పెట్టుకునే తలసరి ఖర్చు తెలంగాణలో రూ.2,263 కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో అంతకంటే తక్కువగా రూ.1,699 ఉంది.

ప్రజారోగ్య బీమాకు సంబంధించి.. తెలంగాణలో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.300 కోట్ల ఖర్చుతో పదో స్థానంలో నిలిచింది. అత్యధికంగా తమిళనాడు 'ముఖ్యమంత్రి ఆరోగ్య బీమా పథకం'కింద రూ.1,467 కోట్ల వ్యయంతో మొదటి స్థానంలో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.1,305 కోట్లు ఖర్చు చేస్తూ రెండో స్థానంలో నిలిచింది.

ఇక దేశంలో ప్రైవేట్ ఆరోగ్య బీమా కోసం ప్రజలు ఏటా చేస్తున్న వ్యయం రూ.45,838 కోట్లు. ఇందులో ఉద్యోగుల ఖర్చు రూ.25,881 కోట్లు. మిగతాది ఇతరులు ఖర్చు చేస్తున్నారు.

దేశంలో మొత్తంగా ఆరోగ్యంపై జరుగుతున్న వ్యయంలో.. కుటుంబాలు పెట్టే ఖర్చు 59.2 శాతంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలు 20 శాతం, కేంద్రం 12 శాతం, స్వచ్ఛంద సంస్థలు 8 శాతం, స్థానిక సంస్థలు 0.99% ఖర్చు చేస్తున్నాయి. మిగతా ఖర్చు ఇతర పద్ధతుల్లో జరుగుతోంది.

దేశంలో ప్రభుత్వం ద్వారా అందే వైద్యసేవలతో 25.5 శాతం, ప్రైవేట్ ద్వారా 33 శాతం, ఫార్మసీల ద్వారా 22 శాతం, లేబొరేటరీల ద్వారా 4 శాతం, ఇతర పద్ధతుల ద్వారా మిగతా ఖర్చు జరుగుతోంది.

ప్రజలు సొంత జేబు నుంచి చేస్తున్న ఖర్చులో భారత దేశం ప్రపంచంలో 67వ స్థానంలో ఉంది. దేశంలో ఒక్కొక్కరు సగటున ఏడాదికి 100 డాలర్లు (సుమారు రూ.8,200) ఖర్చు చేస్తున్నారు. అత్యంత తక్కువగా కిరిబతి దేశంలో ఏటా కేవలం 0.2 డాలర్లు (రూ.16) ఖర్చు చేస్తున్నారు.

ప్రజలు అత్యధికంగా ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తున్నది స్విట్జర్లాండ్‌లో.. అక్కడ ఏటా 2,201 డాలర్లు (సుమారు రూ.1.8 లక్షలు) ఖర్చు చేస్తున్నారు. అమెరికాలో ఏటా 1,163 డాలర్లు (సుమారు రూ.95 వేలు) ఖర్చు చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వెంటే..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడి

- గౌరవప్రదంగా సీట్ల పంపకం ఉంటుందని ఆశిస్తున్నాం
- ఎమ్మెల్యేలు అభద్రతకు లోనుకాకుండా ఉండటానికే 'సిట్టింగ్‌లకే సీట్లు'అనే ప్రకటనలు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితుల దృష్ట్యా.. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీలు బీఆర్ఎస్‌తో కలసి పనిచేసే అవకాశాలు ఉన్నాయని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ఇప్పటివరకు ఎవరు ఎక్కడ పోటీ చేస్తారన్న దానిపై నిర్దిష్ట నిర్ణయాలేమీ తీసుకోలేదన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న సీట్లను లెఫ్ట్ పార్టీలు కోరే అవకాశం ఉన్నప్పుడు.. ఎమ్మెల్యేలు అభద్రతా భావానికి లోను కాకుండా సిట్టింగ్‌లకే సీట్లు అనే స్టేట్‌మెంట్లు ఇవ్వడం సహజమని వ్యాఖ్యానించారు. ఆ స్టేట్‌మెంట్ల గురించి తాము పట్టించుకోవట్లేదన్నారు. సీట్లు అనేవి ఒకరు ఇచ్చేవి, ఇంకొకరు తీసుకొనేవి కాదని.. బలాబలాలను బట్టి గౌరవంగా సీట్ల పంపకం జరుగుతుందని ఆశిస్తున్నామని చెప్పారు. అలాంటి అవగాహనాఒప్పందం తమకు, బీఆర్ఎస్ నాయకులకు ఉందన్నారు. శుక్రవారం ఢిల్లీలోని సుర్జీత్‌భవన్‌లో సీపీఎం కేంద్ర కమిటీ సమావేశం అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కొంత ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నా బీఆర్ఎస్ పార్టీ ఆధిక్యంలో ఉందని, రెండోస్థానంలో ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్ ఉందన్నారు. ఎన్ని వేషాలు వేసినా, కుట్రలు చేసినా, సీఎం కూతురు సహా మంత్రులపై ఈడీ, సీబీఐ దాడులు చేయించినా.. రాష్ట్రంలో బీజేపీ పెరిగే అవకాశాలు కనిపించట్లేదన్నారు. అందుకే బీజేపీ నిరుత్సాహంలో ఉందని ఎద్దేవా చేశారు.

సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం

బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్‌తో కలుస్తున్నా, ఎన్నికల్లో పొత్తుకు అవకాశం ఉన్నా.. రాష్ట్రంలో పోడు భూములు, పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాల జీవో, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ పట్టాలు వంటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తమ్మినేని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్‌ను కలసి వినతిపత్రం ఇవ్వాలని కేంద్ర కమిటీ సమావేశంలో నిర్ణయించామన్నారు.

జూనియర్ పీఆర్ కార్యదర్శుల సమ్మె

- అధ్యక్షుడు రాజేశ్వర్‌రావును తొలగించిన 32 జిల్లాల సంఘాలు
- శుక్రవారం నుంచే మళ్లీ సమ్మె ప్రారంభించిన కార్యదర్శులు

సాక్షి, హైదరాబాద్, సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాట పట్టారు. గురువారం పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, శ్రీకాంత్ చర్చలు జరపడం, సమస్యల పరిష్కారానికి ఎలాంటి హామీ రాకుండానే సమ్మె వాయిదా వేస్తున్నట్లు ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. సమ్మె వాయిదా వేసినట్లు అధ్యక్షుడు రాజేశ్వరరావు చేసిన ప్రకటనపై 32 జిల్లాల్లోని కార్యదర్శుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆయనను పదవి నుంచి తొలగించాయి. అనంతరం సంఘాల నేతలంతా తమ డిమాండ్ల నెరవేర్చే వరకు సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా తాము 2019లో విధుల్లో చేరామని, నోటిఫికేషన్ ప్రకారం తమ ప్రొబెషన్ కాలపరిమితి 2022 ఏప్రిల్ 11వ తేదీతో ముగిసిందని వారు పేర్కొంటున్నారు. అయితే అసెంబ్లీలో సీఎం కేసీఆర్ తమ ప్రొబెషనరీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు ప్రకటించిన అనంతరం 15-07-2021లో జీవో 26ను జారీ చేశారని వెల్లడించారు. జీవో 26 ప్రకారం కూడా తమ ప్రొబేషనరీ కాలపరిమితి ఈనెల 11వ తేదీతో ముగిసిందని తెలిపారు. ప్రొబేషనరీ కాలపరిమితి ముగిసినా తమను రెగ్యులరైజ్ చేయకుండా కాలయాపన చేయడంపై వారు మండిపడుతున్నారు. తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ పిలుపు మేరకు సమ్మెలోకి వెళ్తున్నట్లు కార్యదర్శులు వెల్లడించారు. అధ్యక్షునితోపాటు రాష్ట్ర కమిటీ కూడా రద్దు అయిన నేపథ్యంలో కొత్త కమిటీని త్వరలో ఎన్నుకోనున్నట్లు వారు వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శులు రాత్రింబవళ్లు పనిచేయడం వల్లనే దేశ స్థాయిలో అనేక పంచాయతీలకు ఉత్తమ అవార్డులు వస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఇవీ డిమాండ్లు..: నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీసుగా పరిగణిస్తూ వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులందర్నీ ప్రమోట్‌చేస్తూ పనిచేసిన కాలాన్ని ప్రొబేషనరీలో భాగంగా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్‌ని నిర్ధారించి ప్రకటించాలి. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియమకాలు చేపట్టాలి. అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలి. 317 జీవో వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలి. పరస్పర బదిలీలు, స్పౌస్ బదిలీలకు అవకాశం కల్పించాలి. కాగా, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆందోళన, సమ్మెపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఆర్ కార్యదర్శులు విధుల్లో లేని చోట ఇన్‌చార్జీలుగా పంచాయతీరాజ్ శాఖ లోని ఫీల్డ్ అసిస్టెంట్లను, సెర్ప్ ఉద్యోగులను నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి, సందీప్ కుమార్ సుల్తానియా, డైరెక్టర్ హనుమంత రావు శుక్రవారం డీపీ వోలతో సమీక్ష జరిపారు. ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం రాత్రి జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు కూడా వెళ్లాయని తెలుస్తోంది. పీఆర్ కార్యదర్శుల ఆందోళన విరమించేదిశగా కూడా ప్రభుత్వం చర్య లు తీసుకుంటోందని, ఆ మేరకు శనివారం చర్చలు జరపనున్నట్టు సమాచారం.

మూడొంతులు గల్లంతు!

▶ మొదటి పేజీ తరువాయి

పర్మినెంట్ సిబ్బంది స్థానంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది.

నామమాత్రపు చర్యలే..

వక్ఫ్‌బోర్డు రికార్డుల ప్రకారం రాష్ట్రంలోని దర్గాలు, మసీదులు, ఆషూర్ ఖానాలు, చిల్లాలతోపాటు శ్మశానవాటికల (మొత్తం 33,929) కింద సుమారు 77,588.07 ఎకరాల భూమి ఉంది. అందులో మూడొంతులు.. 57,423.91 ఎకరాలు(74%) ఆక్రమణలో ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో అధిక శాతం భూములు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది. బోర్డు సుమారు 2,186 మంది ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినా చర్యలు ముందుకు సాగలేదు. ఇటీవల హైకోర్టు ఆదేశాలతో కబ్జాలపై ఉక్కుపాదం కోసం రెవెన్యూ, పోలీసు, వక్ఫ్ బోర్డు అధికారులతో కూడిన ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైనా చలనం మాత్రం లేదు. మరోవైపు రాష్ట్ర వక్ఫ్ బోర్డులోని రికార్డుల గదికి ఐదేళ్లుగా తాళం చెవ్వ వేలాడుతోంది. అవినీతి ఆరోపణలు దృష్ట్యా సీఎం ఆదేశాలతో రెవెన్యూ అధికారులు కీలక రికార్డులను స్వాధీనం చేసుకొని రికార్డు రూమ్‌ను సీజ్ చేశారు. అది ఇప్పటివరకు తెరుచుకోక పోవడంతో సుమారు 3,400 ఎకరాల భూమికి సంబంధించిన కోర్టు కేసులు సరైన ఆధారాలు లేక వీగిపోయాయి.

కబ్జాల పర్వం..

- → నల్లగొండ జిల్లా దేవరకొండలో 111 ఎకరాల 8 గుంటల వక్ఫ్ భూమిలో సుమారు 83 ఎకరాలు కబ్జా కోరల్లో చిక్కుకుంది.
- → మల్కాజిగిరిలో హజరత్ మీర్ మెహమూద్ సాహెబ్ పహాడి దర్గాకు సర్వే నంబర్ 659, 660లో సుమారు మూడు ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. తాజాగా ఒక వ్యక్తి ఈ భూమిపై తిష్ట వేశాడు. ఫెన్సింగ్ వేసి ప్లాటింగ్‌కు సిద్ధమవుతున్నాడు.
- → చిల్లా కోహ్–ఎ–మౌలా–అలీకి మల్లాపూర్, కీసర రాంపల్లిలో సుమారు 232 ఎకరాల్లో సగానికి పైగా భూబకాసురుల ఆక్రమణలో ఉంది.
- → మణికొండ దర్గాకు 1,654 ఎకరాల భూమి ఉన్నట్టు రికార్డులుండగా ప్రస్తుతం ఎకరం భూమి కూడా కన్పించడం లేదు.
- → హకీముల్ మునవీ అల్ మారూఫ్ హకీం బాబా దర్గాకు కుతుబ్‌షాహీల కాలంలో దర్గా నిర్మాణం కోసం 4,448 గజాలు, దర్గా నిర్వహణ కోసం 323 ఎకరాల 18 గుంటల భూమిని వక్ఫ్ చేయగా, ప్రస్తుతం దర్గా మినహా మిగతా భూమి ఉనికి లేకుండా పోయింది.

ధారాదత్తం ఇలా..

- → ఐదో నిజాం రాజు అఫ్జల్ దౌలా మణికొండ గ్రామ పరిధిలో హుస్సేన్ షావలి దర్గాకు 1,898 ఎకరాలు రాసిచ్చారు. 1959లో గెజిట్ కూడా విడుదల అయ్యింది. అయితే రికార్డుల్లో సర్కారీ పేరుతో ఉన్న వక్ఫ్ భూముల్ని రెవెన్యూగా పేర్కొంటూ ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టింది.
- → పహాడీషరీఫ్‌లో బాబా షర్ఫొద్దీన్ దర్గాకు మామిడిపల్లిలో 2,131 ఎకరాల భూమి ఉండగా, దీంట్లోంచి 1,051 ఎకరాల భూమిని వక్ఫ్‌బోర్డు అనుమతి లేకుండానే ప్రభుత్వం విమానాశ్రయానికి, మరో 91 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించింది.
- → సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్ల గూడెంలో ఈద్గాకు చెందిన 9.20 ఎకరాల భూమిని ప్రభుత్వం రోడ్డు విస్తరణలో భాగంగా ప్రభుత్వం జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు అప్పగించింది.

■ గద్వాలలోని హజరత్ సయ్యద్ షా మరూఫ్ పీర్ ఖాద్రీ దర్గాకు 39.8 ఎకరాల భూమి ఉంది. సంగాలలోని సర్వే నంబర్ 95, 96, 97, 98లోని 27.9 ఎకరాల భూమిని దర్గా ముతవల్లి ద్వారా స్థానిక రైతు ఒకరు సాగు కోసం లీజుపై తీసుకున్నారు. తర్వాత ఆ రైతు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటంతో అతని సోదరుడు రెవెన్యూ శాఖ ద్వారా యాజమాన్య హక్కు సర్టిఫికెట్ (ఓఆర్‌సీ) పొందాడు. తర్వాత తన పేరిట మార్పిడి చేసుకొని ప్లాటింగ్‌కు ప్రయత్నించాడు. దర్గాకు చెందినవారి ఫిర్యాదుతో జాయింట్ కలెక్టర్ కోర్టు ఓఆర్‌సీపై స్టే ఇవ్వగా దానిపై హైకోర్టు స్టే విధించింది.



వక్ఫ్ భూముల ఆక్రమణలు ఇలా.. (భూములు ఎకరాల్లో..)

ఉమ్మడి జిల్లా	సంస్థల సంఖ్య	రికార్డుల్లో భూములు	ఆక్రమణలో ఉన్న భూములు
ఆదిలాబాద్	1,734	10,119.33	9,189.12
హైదరాబాద్	2,706	1,785.17	1,469.28
కరీంనగర్	1,971	1,846.26	60.03
ఖమ్మం	1,174	534.10	143.31
మహబూబ్‌నగర్	4,561	11,500.18	7,864.38
మెదక్	6,325	23,910.11	23,782.03
నల్లగొండ	3,108	5,300.31	1,400.02
నిజామాబాద్	3,597	4,795.25	23.12
రంగారెడ్డి	5,724	14,785.17	13,480.25
వరంగల్	3,029	2,962.19	12.37

న్యాయాధికారాలు ఉండాలి



వక్ఫ్ బోర్డుకు ప్రత్యేక న్యాయాధికారాలు ఉండాలి. వక్ఫ్, రెవెన్యూ భూములపై స్పష్టత రావాలి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది స్థానంలో శాశ్వత ఉద్యోగులను నియమించాలి. రికార్డులు గల్లంతు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. అక్రమణలను తొలగించేందుకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సహకరించాలి.

– అబుల్ ఫత్తే బందగి బద్‌షా రియాజ్ ఖాద్రీ, పాలక మండలి సభ్యుడు, వక్ఫ్‌బోర్డు, హైదరాబాద్

రికార్డుల గదిని తెరిపించాలి



వక్ఫ్ భూముల రికార్డుల గదిని తక్షణమే తెరిపించాలి. కోర్టు వివాదాల్లోని భూములపై సమగ్ర ఆధారాలు సమర్పించే విధంగా చర్యలు అవసరం. అప్పుడే వక్ఫ్ భూముల పరిరక్షణ సాధ్యమవుతుంది. ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకోవాలి.

– సయ్యద్ ఇఫ్తేకర్ హుస్సేనీ, వక్ఫ్ భూముల పరిరక్షణ కమిటీ



టెస్టుల్లో శ్రీలంక 'సెంచరీ' విజయం

బౌలర్లు రమేశ్ మెండిస్ (5/64), ప్రభాత్ జయసూర్య (2/88), అసిథా ఫెర్నాండో (3/30) రాణించడంతో... ఐర్లాండ్‌తో గాలెలో జరిగిన రెండో టెస్టులో శ్రీలంక ఇన్నింగ్స్ 10 పరుగుల తేడాతో గెలిచింది. దాంతో కరుణరత్నే కెప్టెన్సీలోని శ్రీలంక రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. 1982లో టెస్ట్ హోదా పొందిన శ్రీలంక జట్టుకిది 100వ టెస్టు విజయం కావడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 54/2తో ఆట చివరిరోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 77.3 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది.

సెమీఫైనల్లో సుమిత్ నగాల్



రోమా గార్డెన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ సుమిత్ నగాల్ వరుసగా మూడో విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. రోమ్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సుమిత్ 7-5, 6-0తో మాక్స్ హూక్స్ (నెదర్లాండ్స్)పై గెలుపొందాడు. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

సాత్విక్-చిరాగ్ జోడీకి పతకం ఖాయం

సింధు, ప్రణయ్‌లకు నిరాశ



దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక పతకం ఖాయమైంది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-11, 21-12తో అహసాన్-హెంద్రా సెతియవాన్ (ఇండోనేసియా) జోడీని ఓడించింది. ఈ గెలుపుతో సాత్విక్-చిరాగ్ 1978 తర్వాత ఆసియా చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో ఫైనల్ చేరిన, పతకాన్ని ఖరారు చేసుకున్న భారతీయ జోడీగా గుర్తింపు పొందింది. 1978లో ప్రకాశ్ పదుకొనే-సయ్యద్ మోడీ జోడీ భారత్‌కు రజత పతకం అందించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ పీవీ సింధు 21-18, 5-21, 9-21తో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. కాంటా సునెయామ (జపాన్)తో జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి గేమ్‌ను 11-21తో కోల్పోయి, రెండో గేమ్‌లో 9-13తో వెనుకబడిన దశలో గాయంతో వైదొలిగాడు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 18-21, 21-19, 15-21తో దెజాన్-గ్లోరియా విడ్‌జాజా (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

రన్నరప్ కార్తీక్ వెంకటరామన్



చెన్నై: సన్‌వే ఫార్మెన్‌టెరా అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ రన్నరప్‌గా నిలిచాడు. స్పెయిన్‌లో ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 10 రౌండ్ల తర్వాత ఫెదోసీవ్ వ్లాదిమిర్ (రష్యా), కార్తీక్ వెంకటరామన్ (భారత్), ప్రణవ్ (భారత్), లియోన్ ల్యూక్ మెండోకా (భారత్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు ఈ నలుగురి మధ్య ప్లే ఆఫ్ గేమ్‌లను నిర్వహించారు. వ్లాదిమిర్, కార్తీక్ ఫైనల్ చేరగా.. ఫైనల్లో కార్తీక్‌పై నెగ్గి వ్లాదిమిర్ విజేతగా నిలిచాడు.

లక్నో పరుగుల సునామీ

- మేయర్స్, స్టొయినిస్, బదోని, పూరన్ మెరుపులు
- 56 పరుగులతో పంజాబ్‌పై జయభేరి



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్

మొహాలీ: వారంకిందట గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో చేతిలో బోలెడు వికెట్లున్నా తక్కువ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది లక్నో సూపర్ జెయింట్స్. ఇప్పుడిదే జట్టు పంజాబ్ కింగ్స్‌పై పరుగుల పంజా వేసింది. ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు చేసి మరీ 56 పరుగులతో ఘనవిజయం సాధించింది. మొదట లక్నో 20 ఓవర్లలో 5 వికెట్లకు 257 పరుగుల భారీస్కోరు చేసింది. స్టొయినిస్ (40 బంతుల్లో 72; 6 ఫోర్లు, 5 సిక్సర్లు), మేయర్స్ (24 బంతుల్లో 54; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), పూరన్ (19 బంతుల్లో 45; 7 ఫోర్లు, 1 సిక్స్), బదోని (24 బంతుల్లో 43; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. తర్వాత పంజాబ్ 19.5 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. అథర్వ (36 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

దంచుడే... దంచుడే...

మేయర్స్ రెండో ఓవర్లో పెట్టిన ధనాధన్ ముహూర్తం తర్వాత వచ్చిన వారంతా దంచేసేలా చేసింది. రాహుల్ (12) నిరాశపరచగా... గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్, రజా, రబడలు వేసిన పవర్‌ప్లేలో మేయర్స్ 'నాటు నాటు' కొట్టుడుతో 20 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. ఇంకో ఫోర్ కొట్టి జోరుమీదున్న అతన్ని రబడ బోల్తా కొట్టించాడు. కానీ పవర్‌ప్లేలో లక్నో 74/2 స్కోరు చేసింది. ఓపెనర్ల ఆట ముగిసినా... దూకుడైతే ఎంతకీ ఆగలేదు. బదోని, స్టొయినిస్‌ల బ్యాట్లు కూడా భారీ షాట్లపైనే గురి పెట్టడంతో 7.4 ఓవర్లలోనే స్కోరు 100 దాటింది. గుర్నూర్ వేసిన ఆ ఎనిమిదో ఓవర్లో ఇద్దరు చెరో 6, 4లతో 24 పరుగులు పిండారు. ఆటలోనే హైలైట్స్ చూపెట్టడంతో 10 ఓవర్లలో లక్నో 128/2 స్కోరు చేసింది. కాసేపటికి 6 కొట్టిన బదోని మరుసటి బంతికి అవుటైతే... తర్వాత వచ్చిన పూరన్ హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. ఇలా ఆకాశమే హద్దుగా సాగిన లక్నో స్కోరు 15.5 ఓవర్లలోనే 200 పరుగులు దాటింది. స్టొయినిస్ 31 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. డెత్ ఓవర్లలో స్టొయినిస్, పూరన్ అవుట్ కావడంతో ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు నమోదైంది. లేదంటే స్కోరు చరిత్ర మారేది! 2013లో పుణే జట్టుపై బెంగళూరు 263 పరుగులు చేసింది.

200 పైచిలుకు తీసుకొచ్చినా...

ధావన్ (1), ప్రభ్‌సిమ్రన్ (9) నిరాశపరిచినప్పటికీ అథర్వ, రజా (22 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టు స్కోరును 100 దాటించారు. ఆ తర్వాత లివింగ్‌స్టోన్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ (24; 3 సిక్స్‌లు), స్యామ్ కరన్ (11 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) షారుఖ్ (బి) రబడ 12; మేయర్స్ (సి) ధావన్ (బి) రబడ 54; బదోని (సి) చహర్ (బి) లివింగ్‌స్టోన్ 43; స్టొయినిస్ (సి) జితేశ్ (బి) కరన్ 72; పూరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 45; హుడా (నాటౌట్) 11; కృనాల్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 257. వికెట్ల పతనం:** 1-41, 2-74, 3-163, 4-239, 5-251. **బౌలింగ్:** గుర్నూర్ 3-0-42-0, అర్ష్‌దీప్ 4-0-54-1, రబడ 4-0-52-2, రజా 1-0-17-0, చహర్ 4-0-29-0, స్యామ్ కరన్ 3-0-38-1, లివింగ్‌స్టోన్ 1-0-19-1.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) సబ్-సామ్స్ (బి) నవీనుల్ 9; ధావన్ (సి) కృనాల్ (బి) స్టొయినిస్ 1; అథర్వ (సి అండ్ బి) బిష్ణోయ్ 66; రజా (సి) కృనాల్ (బి) యశ్ 36; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 23; స్యామ్ కరన్ (సి) బదోని (బి) నవీనుల్ 21; జితేశ్ (సి) రాహుల్ (బి) యశ్ 24; షారుఖ్ (సి) బిష్ణోయ్ (బి) యశ్ 6, చహర్ (సి) హుడా (బి) యశ్ 0; రబడ (బి) నవీనుల్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 201. వికెట్ల పతనం:** 1-3, 2-31, 3-109, 4-127, 5-152, 6-178, 7-192, 8-193, 9-197, 10-201. **బౌలింగ్:** స్టొయినిస్ 1.5-0-21-1, మేయర్స్ 1-0-4-0, బదోని 0.1-0-0-0, నవీనుల్ 4-0-30-3, అవేశ్ 2-0-28-0, మిశ్రా 2-0-23-0, బిష్ణోయ్ 4-0-41-2, యశ్ 3.5-0-37-4, కృనాల్ 1-0-13-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	8	5	3	10	0.939
లక్నో	8	5	3	10	0.841
గుజరాత్	7	5	2	10	0.580
చెన్నై	8	5	3	10	0.376
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	8	4	4	8	-0.510
కోల్‌కతా	8	3	5	6	-0.027
ముంబై	7	3	4	6	-0.620
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x గుజరాత్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)

ఢిల్లీ x హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్‌ఐఆర్' నమోదు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఢిల్లీ పోలీసుల చర్య
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన



"సుప్రీం కోర్టు ఆదేశాలను నేను స్వాగతిస్తున్నా. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం నాకూ మంచిదే. విచారణలో వారికి అన్ని విధాలా సహకరిస్తా. విచారణ కమిటీలు ఏర్పాటు చేసినప్పుడు కూడా నేను ప్రశ్నించలేదు. రెజ్లర్లు మరికొంత సమయం ఆగాల్సింది. కానీ వారు కోర్టుకు వెళ్లారు. ఎవరి పట్లా తప్పుగా వ్యవహరించలేదు. నాకు నాపై నమ్మకముంది.

–బ్రిజ్‌భూషణ్ సింగ్"

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు స్పందించారు. శుక్రవారం సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్‌ఐఆర్' నమోదు చేస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేశారు. బ్రిజ్‌భూషణ్‌పై కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. మైనర్ రెజ్లర్ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుంటూ 'పోక్సో యాక్ట్' ప్రకారం ఒక ఎఫ్‌ఐఆర్... ఇతర రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ప్రకారం మరో ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేశారు. రెండింటిపై సత్వర విచారణ చేపడతామని పోలీసులు చెప్పారు. ఈ అంశంపై మే 5న మరోసారి విచారిస్తామని, ఆలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిరసన చేస్తున్న రెజ్లర్లు, ఫిర్యాదు చేసిన వారి జాబితాలో ఉన్న ఒక మైనర్ రెజ్లర్ భద్రతకు సంబంధించి కూడా ఢిల్లీ పోలీసులు బాధ్యత తీసుకోవాలని కూడా సుప్రీం సూచించింది. 'మైనర్ రెజ్లర్‌కు ఉన్న ముప్పును దృష్టిలో పెట్టుకుంటూ తగినంత భద్రత కల్పించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశిస్తున్నాం. ఇతర రెజ్లర భద్రతను కూడా ఆయన సమీక్షించాలి. దర్యాప్తునకు సంబంధించిన డాక్యుమెంట్ల విషయంపై గోప్యత కూడా పాటించాలి' అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడా బెంచీ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు బజరంగ్, వినేశ్, సాక్షి తదితర రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద తమ నిరసన కొనసాగిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించడం పట్ల రెజ్లర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఎఫ్‌ఐఆర్ మాత్రమే కాదు, బ్రిజ్‌భూషణ్ అరెస్ట్ అయ్యే వరకు ఇది కొనసాగుతుందని బజరంగ్ స్పష్టం చేశాడు. 'విజయం దిశగా ఇది మొదటి అడుగు మాత్రమే. అయితే మా నిరసన ఇకపైనా కొనసాగుతుంది. ఆయనను అన్ని పదవుల నుంచి తప్పించడంతో పాటు జైలుకు పంపాల్సిందే. లేదంటే విచారణను ప్రభావితం చేస్తాడు' అని రెజ్లర్ సాక్షి మలిక్ పేర్కొంది.



వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్, సాక్షి

'కరెంట్ కట్'



'ఢిల్లీ పోలీసులు మా పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. ఎఫ్‌ఐఆర్ నమోదైంది కాబట్టి నిరసన ముగించమని ఒత్తిడి తెస్తున్నారు. కరెంట్ కట్ చేసి గేట్లు మూసేశారు. భోజనం, నీళ్లు కూడా లోపలికి రానివ్వడం లేదు. నేను ఏసీపీతో మాట్లాడాను. ఏం చేస్తారో చేసుకోండి అని ఆయన జవాబిచ్చాడు. వారు ఏం చేసినా మా ఆందోళన కొనసాగిస్తాం. మీ ఇంటి ఆడపిల్లలైతే ఇలాగే చేస్తారా. బ్రిజ్‌భూషణ్ చట్టంకంటే పెద్దవాడిగా మారిపోయాడు' (అర్ధ రాత్రి 12 గంటలకు పరిస్థితి).

సిసింద్రీలకు సమ్మర్ కేర్!





ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే వేసవి సెలవులు మొదలయ్యాయి. ఇక పిల్లల ఆటలు, పాటలు అంటూ ఎక్కువ సేపు బయటే తిరుగుతూ ఉంటారు. తిండీ, నిద్రనూ కూడా నిర్లక్ష్యం చేసి మరీ ఆటల్లో మునిగిపోతారు. సమ్మర్‌లో చిన్నపిల్లలను నిర్లక్ష్యం చేస్తే త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బ, చర్మ సమస్యలతో సహా మరెన్నో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే వాళ్లను ఈ కాలంలో మరింత జాగ్రత్తగా చూసుకోవాలి.

మధ్యాన్నం పూట బయటకు పంప వద్దు

వేసవిలో పిల్లలు ఎక్కువగా ఆటలు ఆడుకోవడానికి.. బయటకు వెళ్లిపోతారు. అయితే మధ్యాహ్న సమయం లో మాత్రం పిల్లలను బయటకు అనుమతించవద్దు. ఆ సమయంలో ఎండ ఎక్కువగా ఉంటుంది, రేడియేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. బయట వాతావరణం చాలా వేడిగా ఉండడం వల్ల పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరిగి.. చెమట ఎక్కువగా పడుతుంది. ఒంట్లో నీరు వేగంగా ఆవిరై... డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఇవి వడదెబ్బకు దారితీస్తాయి. ఉదయం, సాయంత్రం ఎండలేని సమయాల్లోనే పిల్లలను బయటకు అనుమతించాలి.

ఏం చేయాలి మరి?

మధ్యాహ్న సమయంలో పిల్లలకి కథలు చెప్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, ఇంట్లో ఆడుకునే ఆటలు ఆడుకునేలా చూడాలి.

పజిల్స్ ఇవ్వడం, అంత్యాక్షరి, వర్డ్ బిల్డింగ్ వంటివి ఆడించాలి. వారికి ఆసక్తి ఉన్న అంశంపై మరింత ఎక్కువ ఏకాగ్రత చూపేలా లేదా రాని సబ్జెక్టును నేర్చుకునేలా చేయాలి.

మసాలాలు, జంక్ ఫుడ్ జోలికి వెళ్లవద్దు..

వేసవిలో కారం, మసాలా, వేపుళ్లు, స్వీట్లు వంటి వాటికి దూరంగా ఉంచాలి. కారం, మసాలాలు తింటే మరింత వేడి చేసే ప్రమాదం ఉంది. పిజ్జా, బర్గర్, అలాగే నిల్వ ఆహారాన్ని ఇవ్వకూడదు. ఇవన్నీ దాహాన్ని మరింత పెంచుతాయి. ఎక్కువగా ఇంట్లో తాజాగా వండిన ఆహారాన్నే తీసుకునేలా చూడాలి. అలాగే లేస్, కుర్కురేలు వంటివి అసలు మంచిది కాదు. వీలయినంత వరకు ఇంట్లో వండిన చిరుతిళ్లే అలవాటు చేయాలి.

సాకర్యంగా ఉండే దుస్తులు

బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు చిన్నారులకు తేలికైన, కాటన్ వస్త్రాలను వేయాలి. ఇవి సింథటిక్, ఇతర ఫ్యాబ్రిక్స్ కంటే చెమటను ఎక్కువగా పీల్చేసుకుంటాయి కాబట్టి బేహజాలకు పోకుండా పిల్లలకు లేత రంగులలో ఉండే కాటన్ దుస్తులను వేయడం ఉత్తమం. అలాగే రెండుపూటలా స్నానం చేయించడం మంచిది. బయట ఆటలాడి వచ్చినా, ఇంట్లోనే ఉన్నా కూడా పిల్లలకు చెమట పడుతుంది. అలాగే వదిలేస్తే అలర్జీలు వస్తాయి. అందువల్ల గోరువెచ్చటి నీటితో రెండుపూటలా స్నానం చేయించాలి.

పండంటి ఆరోగ్యం కోసం..

సాధారణంగా వేసవిలో పిల్లల చర్మం పొడిబారి, దురద, మంట వంటి పలురకాల ఎలర్జీలు మొదలవుతుంటాయి. అటువంటి లక్షణాలు కనిపించినప్పుడు వారు డీహైడ్రేషన్‌కు గురైనట్లు గుర్తించాలి. యూరిన్‌కు అతి తక్కువగా వెళ్లడం, కడుపునొప్పి, తలనొప్పి, వికారంగా ఉన్నా.. జాగ్రత్తగా గమనించాలి. మామిడి, ద్రాక్ష, పైనాపిల్, పుచ్చ, కమలాజ్యూస్‌లు పట్టించాలి. రోజూ ఉదయం గ్లాసు కొబ్బరినీళ్లు ఇవ్వాలి. ఇందులోని పొటాషియం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. పిల్లలతో రోజుకి కనీసం రెండు లీటర్ల నీటిని తాగించడం అన్నింటికన్నా ముఖ్యం. సబ్జానీళ్లు ఇస్తే మరీ మంచిది.

చల్లటి పదార్థాలు ఇవ్వద్దు

వేసవిలో తాపం ఎక్కువగా ఉండటం సహజం. చల్లటివి ఏమైనా తినాలని, తాగాలనీ అనిపిస్తుంది. అలాగని ఫ్రిజ్‌లో పెట్టి.. తీసిన వెంటనే తిన్నా అవి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. పిల్లలు ఫ్రిజ్ నీళ్లు తాగితే.. జలుబు చేసే అవకాశం ఉంది. దానికన్నా కుండ నీళ్లు తాగించడం చాలా మంచిది.

మజ్జిగ ఇవ్వండి

మధ్యాహ్నం భోజనం తర్వాత పలుచటి మజ్జిగలో చిటికెడు జీలకర్ర పొడి, ఉప్పు, పావుచెక్క నిమ్మరసం కలిపి తాగిస్తే జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. మజ్జిగలో కాల్షియం, విటమిన్ బి 12, పొటాషియం అందుతాయి. ఇవి తలనొప్పి, వికారం వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని స్తాయి. క్యారెట్, కీర దోస ముక్కలపై కాస్త నిమ్మ రసం, చిటికెడు ఉప్పు చల్లి తినిపించడం మంచిది. ముఖ్యంగా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి.

సన్‌స్క్రీన్

మీ పిల్లలు బయటకు వెళ్లేప్పుడు.. అతిగా ఎక్స్‌పోజ్ అయ్యే భాగాలకు సన్‌స్క్రీన్ లోషన్ రాయడం మంచిది. సన్‌స్క్రీన్ పిల్లలను వడదెబ్బ, రాషెస్ నుంచి రక్షిస్తుంది. మీ పిల్లలు బయట ఉండే సమయం బట్టి.. సన్‌స్క్రీన్ రెండు సార్లు రాసినా పర్వాలేదు.

కూలింగ్ గ్లాసెస్

మీ పిల్లలు ఎండల్లో బయటకు వచ్చినప్పుడల్లా.. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకునేలా చూడండి. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే.. సూర్యుని కిరణాలు డైరెక్ట్‌గా కళ్లల్లో పడవు. కళ్లు సేఫ్‌గా ఉంటాయి. కుదిరితే.. క్యాప్ పెట్టుకుంటే ఇంకా మంచిది.. ఎండ డైరెక్ట్‌గా వారి తల మీద పడదు. ఎండ తలమీద పడితే.. తలనొప్పి, వినుగు, కళ్లు తిరిగే అవకాశం ఉంటుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన తర్వాత చల్లటి నీళ్లతో కళ్లు శుభ్రంగా కుడిగితే.. వారికి ప్రశాంతంగా ఉంటుంది.

వేసవి ఫ్లూ

5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఏడాది పొడవునా ఈ సమస్యలు తరచుగా వస్తాయి. కాబట్టి వారిని ఎండలో తిరగనీయకుండా ఉంచాలి. సాయంత్రం వేళ లేదా ఉదయం పూట వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఆడుకోవడానికి అనుమతివ్వండి. వారికి సరైన పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచవచ్చు.

కీటకాల బెడద

ఎండాకాలంలో దోమలు చిరాకు పుట్టిస్తాయి. దోమలే కాకుండా ఇతర కీటకాల కాటుకు పిల్లలు గురయ్యే అవకాశం ఉంది. ప్రభావిత ప్రాంతంలో దురద, వాపు వస్తాయి కాబట్టి వైద్యుల సూచన మేరకు పిల్లల కోసం ప్రత్యేకమైన దోమల నివారణ మందులను వాడేందుకు ప్రయత్నించండి.

ఈతకు వెళుతుంటే...

చెరువులు.. బావులకు సరదాగా ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. కొంత మంది పాత బావుల్లో కూడ ఈతకు వెళతారు. ఇలాంటి సమయంలో కొన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలు ఈత కొట్టే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు రోజంతా బయట ఆడుకుంటారు, ఈ సమయంలో వారు తినడం, తాగడం మర్చిపోతారు. అటువంటి పరిస్థితిలో, వారి ఆహారంపై మరింత శ్రద్ధ వహించడం మంచిది.

మామిడిపళ్లు తినేముందు...



మామిడి పండ్లను తినేముందు వాటిని కనీసం ఒక గంట పాటు నీటిలో నానబెట్టాలని అమ్మమ్మలు, నానమ్మలు సలహా ఇస్తూ ఉంటారు. కారణం ఏమిటంటే, మామిడిపండ్లలో ఫైటిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంటుంది. ఇలా అధికంగా ఉత్పత్తి అయ్యే ఈ యాసిడ్‌ను తొలగించడానికి నీళ్లలో నానబెట్టాలి. వివిధ కూరగాయలు, ధాన్యాలు, పప్పులు వంటి వాటిలో ఈ ఫైటిక్ యాసిడ్ ఉంటుంది. ఇలా నానబెట్టడం వల్ల అది విచ్ఛిన్నమైపోతుంది. ఈ ఫైటిక్ యాసిడ్ అదనపు వేడిని కూడా ఉత్పత్తి చేస్తుంది. నీటిలో నానడం వల్ల ఈ అదనపు వేడి తగ్గిపోతుంది.

టాక్సిన్లను తొలగిస్తుంది

మామిడి పండ్లను తినడానికి ముందు గంటపాటు నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి తొక్కపై ఉండే కనిపించని నూనె తొలగిపోతుంది. అది కొందరిలో ఎలర్జీలు కలిగించే అవకాశం ఉంది. అలాగే పాలీఫెనాల్స్, టానిన్లు వంటి సూక్ష్మ పదార్థాల మిశ్రమం తొక్క పైన ఉండే అవకాశం ఉంది. అవి శరీరంలో చేరితే దురద, బొబ్బలు రావడానికి కారణం అవుతుంది. మామిడిపండ్లు నానబెట్టడం వల్ల అవన్నీ తొలగి పండు తినడానికి అనువుగా సురక్షితం గా మారుతుంది.

మామిడి పండ్లను ఇలా నీటిలో నానబెట్టడం వల్ల వాటి రుచి కూడా బాగుంటుంది. ప్రత్యేకించి ఆ పండ్లను ఫ్రిజ్‌లో ఉంచినట్లయితే వాటిని కచ్చితంగా నీళ్ళల్లో నానబెట్టాలి. ఎందుకంటే ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఆ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు పండు వాసనను, రుచిని మార్చేస్తాయి. నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి సహజమైన తీపి, సువాసనను తిరిగి పొందవచ్చు.

నులి పురుగుల నివారణకు...



పిల్లలు కొన్నిసార్లు ఎంత రుచిగా చేసి పెట్టినా సరే, ఆకలి కావడం లేదంటారు. తరచూ విరేచనాలు చేసుకుంటారు. బరువు తగ్గిపోయి బలహీనంగా కనిపిస్తుంటారు. ఎందుకు ఇలా అవుతోందో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. నిజానికి ఇవి ప్రమాదకరమైన వ్యాధి లక్షణాలేమీ కాదు. కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయి. వాటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం...

తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు రక్తంలోకి చేరాల్సిన పోషకాలను నులిపురుగులే పీల్చుకోవడంతో చిన్నారుల్లో ఎదుగుదల నిలిచిపోయి రోగాల బారిన పడుతారు. ఆకలి మందగించి ఒక్కోసారి ప్రాణాల మీదికి కూడా వస్తుంది.

కడుపులో నులి పురుగులు పోవడానికి...

- వేప నూనె పది చుక్కలు చక్కెరలోవేసి లోపలకు తీసుకుంటే క్రిములు నశిస్తాయి
- గుప్పెడు లేత వేప చిగురు, అర చెంచా ఉప్పు, అర చెంచా పసుపు కలిపి మాత్రల్లా చేసుకొని రాత్రి నిద్రించే ముందు ఒక మాత్ర వేసుకుంటే నులిపురుగులు నశిస్తాయి.
- పచ్చి బొప్పాయి కాయకు గాట్లు పెట్టగా వచ్చిన పాలు చెంచా, ఆముదం చెంచా కలిపి తాగితే. పురుగులు పడిపోతాయి.
- ఎండించిన వేప పువ్వు 50 గ్రాములు. మిరియాల పొడి చెంచా, ఉప్పు చెంచా కలిపి ప్రతిరోజు భోజనంలో మొదటి ముద్దగా కలుపుకుని తినాలి, లేదా గ్లాసు నీటిలో ఒక చెంచా వేసి సగం అయ్యే వరకు మరిగించి కషాయం లాగా తాగినా కూడా నులిపురుగులు నశిస్తాయి.
- వీటన్నింటినీ చేయడం కష్టం అనుకుంటే ఆల్బెండిజాల్ ట్యాబ్లెట్‌ను పదిహేను రోజులకొకసారి చొప్పున నెలరోజులు వాడాలి. ఒక నెల గ్యాప్ ఇచ్చి అదే రిపీట్ చేయాలి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			బులియన్ రూ.లలో ముంబై	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲	నాస్‌డాక్	12,196	▲ 54	బంగారం (24 క్యారెట్)	
463	150	డోజోన్స్	34,059	▲ 232	60,168	▽ 347
61,112	18,065	ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,871	▲ 39	బంగారం (22 క్యారెట్)	
		డాక్స్	15,922	▲ 122	59,927	▽ 346
		షాంఘై	3,323	▲ 37	వెండి (కేజీ)	
		నికాయ్	28,856	▲ 399	73,868	▽ 547

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఎల్ఐసీ చైర్మన్‌గా సిద్ధార్థ మహంతి



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ కొత్త చైర్మన్‌గా సిద్ధార్థ మహంతి నియమితులయ్యారు. దీనితో మార్చి తొలి వారంలో ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) చేసిన సిఫారసుకు కేంద్రం నుంచి ఆమోదం లభించినట్లయ్యింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల చీఫ్‌లు, సారథుల ఎంపికను ఎఫ్ఎస్ఐబీ చూస్తుంటుంది. నిబంధనల ప్రకారం నలుగురు మేనేజింగ్ డైరెక్టర్ల నుంచి చైర్మన్‌ను ఎంపిక చేస్తారు. ప్రస్తుతం మహంతి ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. 2023 మార్చి 13న ఎంఆర్ కుమార్ పదవీవిరమణ తర్వాత సంస్థ తాత్కాలిక చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనుభవం, ఇతర అంశాల ఆధారంగా ఎల్ఐసీ చైర్మన్ పదవికి సిద్ధార్థ మహంతి ఎంపికయ్యారు. ఎఫ్ఎస్ఐబీ సిఫారసుకు ప్రధాని అధ్యక్షతన గల కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ఇందుకు సంబంధించి వెలువడిన సమాచారం ప్రకారం, ఎల్ఐసీ చైర్మన్‌గా మహంతి 62 ఏళ్లు వచ్చే వరకు అంటే 2025 జూన్ 7 వరకూ కొనసాగుతారు.

సోనీ బ్రావియా కొత్త టీవీలు

విజయవాడ: సోనీ ఇండియా కంపెనీ ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి సోనీ బ్రావియా ఎక్స్70ఎల్, బ్రావియా ఎక్స్75ఎల్ సిరీస్ టీవీలను విడుదల చేసింది. ఎక్స్1 4కే ప్రాసెసర్, లైవ్ కలర్, డాల్బీ ఆడియో, క్లియర్ ఫేస్ టెక్నాలజీ, 10వేలకి పైగా యాప్స్, గేమ్స్‌తో పాటు ఏడు లక్షలకు పైగా సినిమాలు, టీవీ సిరీస్‌లను కలిగిన గూగుల్ టీవీ ఫీచర్లు వీటిలో ఉన్నాయి.



ఎక్స్-ప్రొటెక్షన్ పీఆర్ఓ, వాయిస్ ఆధారిత రిమోట్-స్మార్ట్ రిమోట్‌లు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. ఎక్స్ 75ఎల్ సిరీస్‌లో మొత్తం నాలుగు మోడళ్లు ఉన్నాయి. వీటి ధరలు రూ.1.04 లక్షలు - రూ. 51,999 మధ్య ఉన్నాయి. ఇక ఎక్స్70ఎల్ సిరీస్‌లో రెండు మోడళ్లు ఉన్నాయి. ఇందులో కేడీ-43 ఎక్స్70ఎల్ ధర రూ.49,990, కేడీ-50 ఎక్స్70ఎల్ ధర రూ.61,990 గా ఉంది. పై రెండు సిరీస్‌లోని మోడళ్లు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సోనీ సెంటర్లు, ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షాపుల్లో, ఈ-కామర్స్ పోర్టళ్లలో లభిస్తాయని కంపెనీ తెలిపింది.

రెండింతలకు చేతక్ స్కూటర్ల ఉత్పత్తి

- జూన్ నాటికి సాధ్యం: బజాజ్
- ఫేమ్-2 కొనసాగించాల్సిందే



న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని జూన్ నాటికి రెండింతలకు చేర్చనున్నట్లు ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఫేమ్-2 పథకం పొడిగింపు విషయంలో నెలకొన్న అనిశ్చితిని దృష్టిలో పెట్టుకుని ఎక్స్‌క్లూజివ్ స్టోర్ల విస్తరణ చేపడుతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం నెలకు 5,000 యూనిట్లను తయారు చేస్తున్నట్లు కంపెనీ ఈడీ రాకేశ్ శర్మ తెలిపారు. 'విడిభాగాలు సరఫరా చేసే కొందరు వెండార్లపై పెద్ద ఎత్తున ఆధారపడ్డాం. వారు సకాలంలో సరఫరా చేయకపోవడంతో సమస్యలు ఎదుర్కొన్నాం. సరఫరా సమస్యల నుంచి గట్టెక్కాం. అది మాకు కొంత విశ్వాసాన్ని ఇస్తోంది. మే నెలలో ఉత్పత్తి 7,000 యూనిట్లకు, జూన్‌లో 10,000 యూనిట్లకు చేరనుంది. డిమాండ్‌నుబట్టి భవిష్యత్‌లో ఉత్పత్తి ఏ స్థాయిలో ఉండాలో నిర్ణయిస్తాం. ఎక్స్‌క్లూజివ్ ఔట్‌లెట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న 105 నుంచి సెప్టెంబర్‌కల్లా సుమారు 150 తాకనుంది. సరఫరా సమస్యలు తొలగిపోయి డిమాండ్ కొనసాగి, నెట్‌వర్క్ విస్తరణతో 2023-24లో బజాజ్ ఆటో చేతక్‌తోపాటు 'యూలుకు' సరఫరా చేసిన వాహనాలతో కలిపి విక్రయాలు ఒక లక్ష యూనిట్లకు ఎగుస్తుంది' అని వివరించారు.

సబ్సిడీ పొడిగించాల్సిందే..

ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని పెంపొందించే పథకం ఫేమ్-2 పొడిగింపుపై ఈ ఏడాది సెప్టెంబర్‌కల్లా స్పష్టత వచ్చే అవకాశం ఉందని బజాజ్ ఆటో అర్బనైట్ బిజినెస్ ప్రెసిడెంట్ ఎరిక్ వాస్ పేర్కొన్నారు. 'పొడిగింపు నిర్ణయానికి ముడిపడి చాలా అంశాలు ఉన్నాయి. సబ్సిడీని నిలిపివేస్తే ఎలక్ట్రిక్ వాహనాల ధరలు గణనీయంగా పెరుగుతాయి.' అని తెలిపారు.

మార్చిలో ఐదు నెలల కనిష్టానికి 'మౌలికం'

న్యూఢిల్లీ: ఎనిమిది రంగాల మౌలిక పరిశ్రమ మార్చిలో ఐదు నెలల కనిష్ట స్థాయిని నమోదుచేసుకుంది. వృద్ధి కేవలం 3.6 శాతంగా నమోదయ్యింది. ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిలో అసలు వృద్ధిలేకపోగా 2.8 శాతం క్షీణించింది. విద్యుత్ (-1.8 శాతం), సిమెంట్ (-0.8 శాతం) అదే నష్టాల బాటన నడిచాయి. ఇక బొగ్గు ఉత్పత్తి భారీగా 12.2 శాతం పెరిగింది. ఎరువుల విషయంలో వృద్ధి రేటు 9.7 శాతంగా ఉంది. స్టీల్ (8.8 శాతం), సహజ వాయువు (2.8 శాతం), రిఫైనరీ ప్రొడక్ట్స్ (1.5 శాతం) కూడా లాభాల బాటనే నడిచాయి. కాగా ఆర్థిక సంవత్సరం మొత్తంగా ఈ రంగాల వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వెయిటేజ్ దాదాపు 40.27 శాతం.



అల్ట్రాటెక్ సిమెంట్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 1,670 కోట్లు
- షేరుకి రూ. 38 డివిడెండ్



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 36 శాతం క్షీణించి రూ. 1,670 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,614 కోట్లు ఆర్జించింది. ముడివ్యయాలు లాభాలపై ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం 18 శాతం వృద్ధితో రూ. 18,562 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 15,767 కోట్ల ఆదాయం నమోదైంది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 38 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. ఈ క్యూ4లో మొత్తం వ్యయాలు సైతం 20% పెరిగి రూ. 16,293 కోట్లకు చేరాయి. ఇంధన వ్యయాలు 17%, పెట్ కోక్ ధరలు 18 శాతం చొప్పున పెరిగాయి. ఫ్లైయాష్, జిప్సమ్, స్లాగ్ ధరల ప్రభావంతో ముడివ్యయాలు 9%అధికమయ్యాయి. సిమెంట్ అమ్మకాల పరిమాణం 14 శాతం బలపడి 31.7 మిలియన్ మెట్రిక్ టన్నులను తాకింది.

పూర్తి ఏడాదికి సైతం

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి అల్ట్రాటెక్ సిమెంట్ నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 5,073 కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7,334 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 20 శాతంపైగా ఎగసి రూ. 63,240 కోట్లను తాకింది. 2021-22లో రూ. 52,599 కోట్ల టర్నోవర్ నమోదైంది. గతేడాది సిమెంట్ ఉత్పత్తి, డిస్పాచెస్, అమ్మకాలలో 100 మిలియన్ టన్నుల మార్క్‌ను అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో అల్ట్రాటెక్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం బలపడి రూ. 7,555 వద్ద ముగిసింది.

అయిదో రోజూ లాభాలే

- రెండు నెలల గరిష్టానికి సూచీలు
- ర్యాలీకి రిలయన్స్, ఐటీసీ షేర్ల అండ
- 61 వేల పైకి సెన్సెక్స్
- 18 వేల పైకి నిఫ్టీ



ముంబై: ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంక్, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో శుక్రవారం స్టాక్ సూచీలు రెండు నెలల గరిష్టానికి చేరుకున్నాయి. అధిక వెయిటేజీ ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ రెండుశాతం రాణించడం కలిసొచ్చింది. మే సిరీస్ మొదటి రోజున ఫ్లాటుగా ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 73 పాయింట్లు పెరిగి 60,722 వద్ద, నిఫ్టీ 35 పాయింట్లు పెరిగి 17,950 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు ఆఖర్లో ఐటీ షేర్లకు డిమాండ్ లభించడంతో ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 569 పాయింట్లు ఎగసి 61,209 వద్ద, నిఫ్టీ 174 పాయింట్లు దూసుకెళ్లి 18,089 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 463 పాయింట్లు పెరిగి 61 వేల స్థాయి పైన 61,112 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 150 పాయింట్లు బలపడి 18,065 వద్ద నిలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరి 17 తర్వాత సెన్సెక్స్ తొలిసారి 61 వేల స్థాయిపై.., నిఫ్టీ 18 వేల స్థాయిపై ముగియడం ఇదే తొలిసారి. కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.32%, 0.91 శాతం చొప్పున బలపడ్డాయి. సూచీలు అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో రూ. 2.66 లక్షల కోట్ల సంపద ఇన్వెస్టర్ల సొంతమైంది. అంచనాలకు మించి ఆర్థిక ఫలితాలు నమోదు కావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ''అంతర్జాతీయ ఈక్విటీల ట్రెండ్‌ను ప్రతిబింబిస్తూ దేశీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో పయనించాయి. దేశీయ ఈక్విటీలను కొనేందుకు ఎఫ్ఐఐలు ఆసక్తి చూపుతుండటం, ఇప్పటివరకు విడుదలైన కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు మెప్పించడం, క్రూడాయిల్ ధరలు పతనం తదితర అంశాలతో దేశీయ ఈక్విటీ మార్కెట్ వరుసగా అయిదోరోజూ ముందుకెళ్లింది. సూచీలు రెండు నెలల గరిష్టానికి చేరుకున్న నేపథ్యంలో లాభాల స్వీకరణకు అవకాశం లేకపోలేదు. ఈ కీలక తరుణంలో ట్రేడర్లు అప్రమత్తత వహించాలి'' అని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు..

- ఫలితాల సందర్భంగా రూ.12 వేల కోట్ల బైబ్యాక్ ప్రకటన తర్వాత విప్రో కంపెనీ 3% లాభపడి రూ.385 వద్ద స్థిరపడింది.
- యాక్సిస్ బ్యాంక్ షేరు 2.39% నష్టపోయి రూ.860 వద్ద ముగిసింది. వార్షిక ప్రాతిపదికన మార్చి త్రైమాసికంలో రూ.5,361 కోట్లు నికర నష్టాన్ని నమోదు చేయడం షేరు పతనానికి కారణమైంది.
- ఫైనాన్స్ సర్వీసెస్ రంగానికి చెందిన ఆరు కంపెనీల షేర్లు ఏడాది గరిష్టానికి తాకాయి. ఆదిత్యా బిర్లా క్యాపిటల్, ఇండియన్ బ్యాంక్, సీఎస్‌బీ బ్యాంక్, చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్, చాయిస్ ఇంటర్నేషనల్ షేర్లు ఇందులో ఉన్నాయి.

కేఎస్‌బీఎల్, ప్రమోటర్లపై ఏడేళ్ల నిషేధం..

కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు రూ. 13 కోట్లు...
పార్థసారథికి రూ. 8 కోట్లు జరిమానా



న్యూఢిల్లీ: క్లయింట్ల నిధులను దుర్వినియోగం చేసిన కేసులో కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్), దాని ప్రమోటర్ కొమండూర్ పార్థసారథి ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్‌లో లావాదేవీలు జరపకుండా సెబీ నిషేధించింది. కేఎస్‌బీఎల్‌కు రూ. 13 కోట్లు, పార్థసారథికి రూ. 8 కోట్లు జరిమానా కూడా విధించింది. అలాగే పార్థసారథి ఏ లిస్టెడ్ కంపెనీలోనూ కీలక మేనేజర్ హోదాల్లో పని చేయకుండా పదేళ్ల పాటు నిషేధించింది. కేఎస్‌బీఎల్‌కు చెందిన మరో ఇద్దరు డైరెక్టర్లయిన భగవాన్ దాస్ నారంగ్, జ్యోతి ప్రసాద్‌లకు ఇది రెండేళ్ల పాటు వర్తిస్తుంది. అటు కేఎస్‌బీఎల్ నుంచి తీసుకున్న రూ. 1,443 కోట్ల మొత్తాన్ని మూడు నెలల్లోగా వాపసు చేయాలంటూ కార్వీ రియల్టీ, కార్వీ క్యాపిటల్‌ను సెబీ ఆదేశించింది. లేని పక్షంలో ఆ మొత్తాన్ని రాబట్టేందుకు రెండు సంస్థల ఆస్తులను ఎన్ఎస్ఈ తన అధీనంలోకి తీసుకుంటుందని సెబీ స్పష్టం చేసింది. క్లయింట్లు ఇచ్చిన పవర్ ఆఫ్ అటార్నీలను దుర్వినియోగం చేసి వారి షేర్లను తనఖా పెట్టి, కార్వీ సొంత అవసరాల కోసం నిధులను సమీకరించిందని ఆరోపణలు ఉన్నాయి.

కేఐఎస్ఎల్‌పై ఆంక్షలు: నిబంధనల ఉల్లంఘన కేసులో కొత్త క్లయింట్లను చేర్చుకోకుండా కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ (కేఐఎస్ఎల్)పై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు వర్తిస్తుందని పేర్కొంది.

2021-22 మధ్య కాలంలో డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలకు సంబంధించి కంపెనీ పలు నిబధనలను ఉల్లంఘించినట్లు సెబీ విచారణలో తేలింది. మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించేందుకు ఉద్యోగులు గానీ, భౌతిక మౌలిక సదుపాయాలు గానీ కేఐఎస్ఎల్‌కు లేవని కూడా వెల్లడైంది. పైగా 2022 డిసెంబర్ నుంచి 2025 డిసెంబర్ వరకూ చెల్లుబాటయ్యేలా రెన్యువల్ ఫీజును కూడా కంపెనీ కట్టలేదని 13 పేజీల ఎక్స్‌పార్టీ మధ్యంతర ఉత్తర్వుల్లో సెబీ పేర్కొంది. ఇలాంటి సంస్థల కార్యకలాపాల వల్ల సెక్యూరిటీల మార్కెట్ సమగ్రత, ఇన్వెస్టర్ల ప్రయోజనాలు దెబ్బతింటాయని వ్యాఖ్యానించింది.

సినిమా

ఖుషీ ఖుషీగా...


• సమంత

హీరోయిన్ సమంత అభిమానులకు బర్త్ డే గిఫ్ట్ ఇచ్చింది 'ఖుషి' చిత్ర యూనిట్. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం (ఏప్రిల్ 28) సమంత బర్త్‌డే. ఈ సందర్భంగా 'ఖుషి' చిత్రంలో మెడలో ఐడీ కార్డ్, బ్యాగ్ తగిలించుకుని ఖుషీ ఖుషీగా చిరునవ్వులు చిందిస్తున్న సమంత కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. కాగా హీరో విజయ్ దేవరకొండ, 'ఖుషి' యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు సమంతకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ''ఖుషి' సినిమా ప్రస్తుతం చివరి షెడ్యూల్ జరుపుకుంటోంది. సెప్టెంబర్ 1న సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



ఇన్‌ఫెక్షన్ తగ్గడానికి...

సమంత మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడి సినిమాలకు కొద్ది రోజులు విరామం ఇచ్చిన సంగతి తెలిసిందే. మయోసైటిస్ నుంచి కోలుకుంటున్న ఆమె మళ్లీ షూటింగ్‌లతో బిజీ అయ్యారు. అయితే ముఖానికి ఆక్సిజన్ మాస్క్ ధరించి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న ఫోటోను సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో ఆమె ఫ్యాన్స్ ఆందోళనపడ్డారు. ''నేను హైపర్‌బేరిక్ థెరపీ తీసుకుంటున్నాను. ఈ థెరపీలో స్వచ్ఛమైన ఆక్సిజన్‌ని అందిస్తారు. దీని వల్ల ఎక్కువ ఆక్సిజన్ ఊపిరితిత్తుల్లో చేరి, ఇన్‌ఫెక్షన్లను తగ్గించడమే కాకుండా దెబ్బతిన్న కణజాలం తిరిగి కోలుకునేందుకు ప్రేరేపిస్తుంది'' అని సమంత పోస్ట్ చేశారు.

హ్యాపీగా.. జాలీగా...


• మహేశ్‌బాబు

ఇటీవల ఫ్యామిలీతో కలిసి ప్యారిస్, జర్మనీకి హాలిడే ట్రిప్‌కు వెళ్లొచ్చారు మహేశ్‌బాబు. తాజాగా మరో హాలిడే ట్రిప్‌ను ప్లాన్ చేసుకున్నట్లున్నారు. భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, సితారలతో కలిసి మహేశ్‌బాబు శుక్రవారం విదేశాలకు పయనమయ్యారు. హ్యాపీగా.. జాలీగా యూరప్ వెళ్లారని తెలిసింది. కాగా 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత దర్శకుడు త్రివిక్రమ్‌తో కలిసి మహేశ్‌బాబు మూడోసారి సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణను ఈ నెలాఖర్లో ప్లాన్ చేశారట. కానీ కొన్ని కారణాల వల్ల షూటింగ్ షెడ్యూల్ వాయిదా పడటంతో మహేశ్ హాలిడే ట్రిప్ ప్లాన్ చేసుకున్నారని సమాచారం. పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 13న విడుదల చేస్తామని చిత్ర యూనిట్ ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

కాంబినేషన్ సెట్?


• ప్రభాస్

హీరో ప్రభాస్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమాకు రంగం సిద్ధమవుతోందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రజాకారుల ఉద్యమం నేపథ్యంలో సుకుమార్ ఓ కథను రెడీ చేశారని, ఈ కథలో ప్రభాస్ హీరోగా నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ప్రభాస్ 'సలార్', 'ప్రాజెక్ట్ కె', 'రాజా డీలక్స్ '(ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రాల తర్వాత 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' మూవీ చేస్తారు. కాగా 'స్పిరిట్' షూటింగ్‌లో పాల్గొంటూనే, సుకుమార్ దర్శకత్వంలోని సినిమానూ సెట్స్‌పైకి తీసుకుని వెళ్తారట ప్రభాస్. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.


• సుకుమార్

ఆ తేడా చూడను


• ఐశ్వర్యా రాయ్

''**ఓ** సినిమాను నేనెప్పుడూ దక్షిణాది, ఉత్తరాది అని విభజించి చూడలేదు. ఏ సినిమా అయినా అది భారతీయ సినిమాగానే భావిస్తాను'' అన్నారు ఐశ్వర్యా రాయ్. 'ఈ మధ్య కాలంలో బాలీవుడ్ కంటే దక్షిణాది సినిమాల పాపులారిటీ ఎక్కువగా ఉందనీ, ఉత్తరాదిపై దక్షిణాది చిత్ర పరిశ్రమ ఆధిపత్యం చలాయిస్తుందనీ కొందరు అనుకుంటున్నారు. వీటిని మీరు అంగీకరిస్తారా?' అనే ప్రశ్నలు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్యకి ఎదురయ్యాయి. దీనిపై ఐశ్వర్యా రాయ్ స్పందిస్తూ- ''ఏ రంగంలో అయినా పోటీ ఉన్నట్లే చిత్ర పరిశ్రమలోనూ ఒక ఇండస్ట్రీకి మరొక ఇండస్ట్రీకి మధ్య పోటీ ఉంటుంది. అయితే కళాకారుల మధ్య అలాంటి భేదాలుండవు. నేనెప్పుడూ దక్షిణాది, ఉత్తరాది అని విడిగా చూడలేదు. ఏ సినిమా అయినా భారతీయ చిత్రంగానే భావిస్తాను. ఒక దానిపై మరొకటి ఆధిపత్యం చలాయిస్తుందనే అభిప్రాయాన్ని అంగీకరించను. ఒకచోట అవకాశాలు రాకపోతే మరొక చోట ప్రయత్నించవచ్చు. అక్కడ కూడా రాకపోతే వేరే ఇండస్ట్రీలోకి వెళ్లొచ్చు. కళాకారులకు ఎక్కడైనా గౌరవం ఉంటుంది. పని చేసే ప్రతి సినిమా నుంచి ఏదో ఒక విషయం నేర్చుకోవచ్చు. దక్షిణాదిలో మణిరత్నంగారు, శంకర్‌గారు.. వంటి పెద్ద దర్శకులతో మంచి సినిమాలు చేసే అవకాశం నాకు వచ్చింది'' అన్నారు ఐశ్వర్య.

మహారాణి పాత్రలో...


• రష్మికా మందన్నా

మహారాణిగా నిర్ణయాలు తీసుకోనున్నారట హీరోయిన్ రష్మికా మందన్నా. మరాఠీ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పెద్ద కుమారుడు శంభాజీ భోంస్లే జీవితం ఆధారంగా హిందీలో ఓ పీరియాడికల్ ఫిల్మ్ రూపొందనుంది. ఈ చిత్రానికి 'ఛావా' అనే టైటిల్ అనుకుంటున్నారట. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో శంభాజీ మహారాజ్ పాత్రను విక్కీ కౌశల్ పోషించనున్నారు. శంభాజీ భార్య మహారాణి ఏసుబాయి భోంస్లే పాత్రలో రష్మికా మందన్నా నటించనున్నారని సమాచారం. ఈ సినిమా కథ నచ్చి రష్మికా మందన్నా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఆ కాలపు యాక్సెంట్ నేర్చుకోవడం కోసం ఆమె ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారని భోగట్టా. యుద్ధాల కోసం శంభాజీ పక్క దేశాలకు వెళ్లినప్పుడు, రాజమహల్‌లో రాణిగా ఏసుబాయి ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? ఎలాంటి రాజకీయ వ్యూహాలను రచించారు? అనే కోణంలో కూడా ఈ సినిమా కథ ఉండేలా స్క్రిప్ట్‌ను రెడీ చేశారట లక్ష్మణ్. ఈ సినిమా షూటింగ్‌ను సెప్టెంబరులో ఆరంభించాలనుకుంటున్నారని టాక్. ఇక ఇప్పటికే హిందీలో 'గుడ్ బై', 'మిషన్ మజ్ను' సినిమాలు చేసిన రష్మికా మందన్నా ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్‌తో 'యానిమల్' సినిమా చేస్తున్నారు. అలాగే అల్లు అర్జున్ హీరోగా రూపొందుతున్న 'పుష్ప: ది రూల్'లో రష్మికా హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే.

సీక్రెట్ ఆపరేషన్


• విద్యుత్

విద్యుత్ జమాల్ హీరోగా సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ ఫిల్మ్ 'ఐబీ 71'. దలీప్ తాహిల్, అనుపమ్ ఖేర్, విశాల్ జెత్వా ప్రధాన పాత్రలు పోషించారు. టి-సిరీస్, రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై విద్యుత్ జమాల్ నిర్మించిన ఈ చిత్రం మే 12న రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఐబీ ఆపరేషన్1: ఇంటెలిజెన్స్ ఇన్ యాక్షన్' అనే వీడియోను విడుదల చేశారు. ''1971లో ఇండియా - పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరిగింది. అయితే ఈ వార్‌లో ఇండియా గెలవడానికి కారణమైన 'ఇంటెలిజెన్స్ బ్యూరో సీక్రెట్ మిషన్స్ ఆధారంగా, వాస్తవ ఘటనలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం'' అని యూనిట్ పేర్కొంది.

పవర్‌ఫుల్ జాస్మిన్

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆండ్రియా జెర్మియా నటించనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేసింది. బ్లాక్ అండ్ బ్లాక్ అవుట్ ఫిట్‌లో చేతిలో తుపాకీతో పవర్‌ఫుల్ లుక్‌తో కనిపిస్తున్నారు ఆండ్రియా. ''వెంకటేశ్ కెరీర్‌లో 75వ ల్యాండ్ మార్క్ మూవీ 'సైంధవ్'. ఈ చిత్రంలో జాస్మిన్ అనే ముఖ్యమైన పాత్రలో ఆండ్రియా నటిస్తున్నారు. 'సైంధవ్' షూటింగ్ ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. 'సైంధవ్'ని పాన్ ఇండియా చిత్రంగా తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడతో పాటు హిందీలో డిసెంబర్ 22న విడుదల చేస్తాం'' అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాత: కిషోర్ తాళ్లూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్).


• ఆండ్రియా



బుద్ధుడి జాతక కథల్లో మాతక భట్ట కథను తెలిపే ఫలకమిది. మేకను బలిచ్చేందుకు తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని చూసి 'తదుపరి నువ్వూ మేకగా పుట్టి ఇలాగే బలి పశువవుతావు' అంటూ మేక నవ్వటం.. అది పరమ సత్యమని, కర్మకు ఫలితం అనుభవించాల్సిందేనని, జీవ హింస కూడదని బోధిసత్త్వుడు చెప్పిన కథ ఇతివృత్తంగా దీనిని రూపొందించారు.

విదేశాల్లో మన శిల్ప ప్రదర్శన

అమెరికా, కొరియాకు తరలనున్న తెలుగు రాష్ట్రాల శిల్పాలు

బుద్ధుడి గాథ ఇతివృత్తంగా న్యూయార్క్, సియోల్ మ్యూజియంలలో ప్రదర్శన

జూలై నుంచి 2024 ఏప్రిల్ వరకు.. తెలంగాణ నుంచి 9, ఏపీ నుంచి 6 శిల్పాల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని న్యూయార్క్, కొరియా రాజధాని సియోల్ వేదికల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పురాతన శిల్ప సంపద కనువిందు చేయబోతోంది. మన పురావస్తు ప్రదర్శన శాలల్లోని శిల్పాలను ఆ రెండు దేశాలు ప్రత్యేక ప్రదర్శన కోసం తీసుకెళ్లబోతున్నాయి. ఈ జూలై నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు అవి విదేశాల్లో ప్రత్యేకతను చాటబోతున్నాయి. 'ఎవల్యూషన్ ఆఫ్ ది ఎర్లీ బుద్ధిజం ఇన్ ఇండియా' ఇతివృత్తంగా న్యూయార్క్‌లోని ప్రతిష్టాత్మక మెట్రోపాలిటన్ మ్యూజియం అంతర్జాతీయ ప్రదర్శన ఏర్పాటు చేస్తోంది. జూలై 17 నుంచి నవంబర్ 13 వరకు ఇది కొనసాగనుంది. భారత్ మీదుగానే ప్రపంచానికి బౌద్ధం విస్తరించినందున.. బుద్ధుడి చరిత్రతో ముడిపడి ఉన్న ఇక్కడి విభిన్న శిల్పాలను అక్కడి మ్యూజియం క్యూరేటర్ జాన్ గై ఎంపిక చేసుకున్నారు. తెలంగాణ నుంచి 9, ఆంధ్రప్రదేశ్ నుంచి 6 కళాకృతులు ప్రదర్శనకు ఎంపికయ్యాయి. న్యూయార్క్ ప్రదర్శన ముగిసిన తర్వాత సియోల్ నగరంలోని నేషనల్ మ్యూజియంలోనూ ఈ ఏడాది డిసెంబర్ 22 నుంచి వచ్చే సంవత్సరం ఏప్రిల్ 24 వరకు జరిగే అంతర్జాతీయ ప్రదర్శనలో ఆ శిల్పాలను ఉంచబోతున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి..

మనరాష్ట్రంలోని ఫణిగిరిలో లభించిన బుద్ధ సున్నపు రాతి తోరణం, మరో తోరణ భాగం, బుద్ధ జాతక కథల ప్యానెల్, బుద్ధ పాద, బుద్ధుడి విగ్రహం, బుద్ధుడి విగ్రహ తల భాగం నేలకొండపల్లిలో లభించిన సున్నపురాయి, కాంస్య విగ్రహాలు, ధూళికట్టలో లభించిన బుద్ధ స్తూప ప్యానల్ ఈ ప్రదర్శనలకు ఎంపికయ్యాయి. ఏపీ నుంచి బౌద్ధ స్తూపానికి సంబంధించి మూడు ప్యానల్స్, జాతక కథల ప్యానల్స్, ధర్మచక్ర పరివర్తనకు సంబంధించిన ప్యానల్స్ ఉన్నాయి. ఇందులో ఒకటి తెలంగాణలోని ధూళికట్టలో లభించింది కాగా, రెండు ప్రకాశం జిల్లా ధూపాడు, గుంటూరు జిల్లా కార్లపాలెం తదితర చోట్ల లభించినవి. ఇక అమరావతిలోని మ్యూజియంలోంచి ఐదు, గుంటూరు బౌద్ధశ్రీ మ్యూజియంలోంచి ఒకటి ఎంపిక చేశారు.



రూ. కోట్లలో బీమా..

అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ విగ్రహాలకు అత్యంత విలువ. ఇవన్నీ క్రీ.పూ.ఒకటో శతాబ్దం నుంచి క్రీ.శ.2వ శతాబ్దం మధ్య కాలానికి చెందిన అతి పురాతన శిల్పాలు. దీంతో వాటి పటుత్వం, విలువ ఆధారంగా జాగ్రత్తలు తీసుకున్నాకే విదేశాలకు తరలించాల్సి ఉంటుంది. అందుకే ఆయా పరీక్షల కోసం ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసి తనిఖీ చేశారు. ఎంపికైన వాటికి రూ.కోట్లలో బీమా చేసి పంపుతున్నారు. తొలుత ఢిల్లీ వరకు పంపేందుకు ఒక బీమా చేయగా, అక్కడి నుంచి ఢిల్లీలోని నేషనల్ మ్యూజియం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ అంతర్జాతీయ స్థాయిలో బీమా చేయించనుంది. శిల్పాలను ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి తరలిస్తారు.

"ప్రతి మనిషి బుద్ధుడు కావచ్చు. ఆ స్థాయికి చేరాలంటే ముందుగా బోధిసత్వ దశను దాటాలి". బౌద్ధంలో ఈ మాటను వాడుతుంటారు. బుద్ధుడిగా మారే ముందు బోధిసత్వుడి ఫలకమిది. ఆయన బుద్ధుడిగా మారనున్నాడని గుర్తించి ఆరాధిస్తున్న ఉపాసకులు. ఇది క్రీ.శ. 1 – 2 శతాబ్దాల మధ్యలో శాతవాహన కాలంలో రూపొందిన ఫలకమిది.

ఇప్పటికైనా ఫణిగిరిపై దృష్టి పెట్టాలి..

క్రీ.పూ.ఒకటో శతాబ్దం నుంచి క్రీ.శ. రెండో శతాబ్దాల్లో తయారైన బుద్ధుడి గాథతో ముడిపడ్డ ఎన్నో శిల్పాలు, ఫలకాలు ఫణిగిరిలో బయటపడ్డాయి. వాటి కోసం ఇప్పుడు వేరే దేశాలు ఇంతగా ప్రయత్నిస్తుంటే, మన దగ్గర ఓ ప్రదర్శనశాల లేకుండా చీకటి గుహలాంటి ఇంట్లో అవి బంధీగా ఉన్నాయి. వాటిని చూసే అవకాశం స్థానికులకు కూడా దక్కటం లేదు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపిక చేసిన తీరు చూసైనా.. పణిగిరి శిల్పాల కోసం మ్యూజియం నిర్మించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



బోధి వృక్షం.. దిగువ బుద్ధుడి ధాతువుతో ఉన్న పేటిక.. ఆయక స్తంభాలు.. ధర్మచక్రం.. ఆ మొత్తం ప్రాంగణాన్ని ఒడిసి పట్టుకున్న నాగరాజులు.. ఆ స్తూపాన్ని ఆరాధిస్తున్న బౌద్ధ ఉపాసకులు



ఇది బుద్ధ తోరణం. బౌద్ధ స్తూపాల ముందు నిలిపే ఈ తోరణాలు ఇలా దిక్కూ మొక్కూ లేక ఫణిగిరిలో ఇలా పడి ఉన్నాయి. వీటికి మ్యూజియం నిర్మించాలన్న ప్రతిపాదనకు గ్రహణం వీడటం లేదు.

గంగా పుష్కరాలకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: గంగా పుష్కరాలకు తరలివెళ్లే భక్తుల రద్దీకనుగుణంగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–బనారస్ (07303/07304) ప్రత్యేక రైలు ఈ నెల 29వ తేదీ రాత్రి 9.40 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మే 1 ఉదయం 6.30 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మే 1వ తేదీ ఉదయం 8.35 గంటలకు బయల్దేరి మే 2వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–బనారస్ (07305/07306) మరో ప్రత్యేక రైలు మే 3వ తేదీ రాత్రి 9.40 గంటలకు బయల్దేరి మే 5వ తేదీ ఉదయం 6.30 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మే 5వ తేదీ ఉదయం 8.35 గంటలకు బనారస్ నుంచి బయల్దేరి మే 6వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.